TALLAPAKA WORKS: Vol. XVIII.

# SRINGARA SANKIRTANALU

BY

TALLAPAKA ANNAMACHARYULU

EDITED BY

Dr. P. T. JAGANNADHA RAO,
TIRUPATI

Published under the Authority of
SRI B. NARASINGA RAO, B.A.,
Executive Officer,
T. T. DEVASTHANAMS, TIRUPATI.

PRINTED AT
TIRUMALA TIRUPATI DEVASTHANAMS PRESS,
TIRUPATI

1964

O. L. Janakiram

శ్రీ తాళ్ళపాకవారి గేయరచనలు — సంపుటము 18

# శృంగార సంకీర్తనలు

## అన్నమాచార్య విరచితములు

పరిష్కర్త:

డాక్టరు పి. టి. జగన్నాథరావు,

తిరుపతి.

తిరుమల తిరుపతి దేవస్థానముల బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌వారి అనుమతిని

ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు

శ్రీ బి. నరశింగరావు, బి. ఏ., బి. యల్., గారి అనుమతిని

ప్రకటింపఁబడినది.

**1964**

తిరుమల తిరుపతి దేవస్థానముల ప్రచురణ, తిరుపతి.

తిరుమల తిరుపతి దేవస్థానము
సర్వస్వామ్య సంకలితము

మొదటి ముద్రణము
300 ప్రతులు

ముద్రణము :
తి. తి. దే. ముద్రణాలయము,
తిరుపతి.

శ్రీ

# పీ ఠి క

— ★ —

నా బాల్యమునఁ జెన్నపురిలో నిరుగుపొరుగున నుంట శ్రీ వేటూరి ప్రభాకరశాస్త్రిగారిని నే నెఱుఁగుదును. నా పినతల్లి యైన శ్రీమతి కాంచనపల్లి కనకాంబగారికి సారస్వతమున వారు మిత్రులు, నా కాప్తులు. వారు తిరుపతిఁజేరి 1949-వ సంవత్సరమునఁ దిరుమల దిరుపతి దేవస్థాన ప్రాచ్యపరిశోధనాలయమున నుండి శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులవారి జీవితచరిత్రమును బ్రకటించిరి. అటుపైఁ దాళ్ళపాకవారి కవిత్వమును-తామ్రపత్రములలో మఱుఁగున నున్న దానిని-ఆవిష్కరించిరి. అన్నమాచార్యులవారి నిర్యాణదినమున ననఁగా ఫాల్గుణ బహుళ ద్వాదశినాఁడు, వారిపేరిట నుత్సవములు జరుగునట్టు లేర్పాటు జేయించిరి. తదాదిగాఁ దిరుమల తిరుపతి దేవస్థానమువారు తాళ్ళపాకవారి కవిత్వమును దామ్రఫలకములనుండి యుద్ధరించి ముద్రింపించుటయేగాక ఉత్సవములనుగూడ సక్రమముగా జరిపించుటవలన వారికి తాళ్ళపాక అన్నమాచార్యులపైఁగల యాదరాభిమానములు వెల్లడియగుచున్నవి. భాగవతులపైని భక్తి భగవంతునిపై భక్తికంటె శ్రేష్ఠమైనదని వైష్ణవ సంప్రదాయముచాటును. అట్టి భక్తిగల ధర్మకర్తలు (Board of Trustees) ప్రశంసనీయులు.

తిరుమల తిరుపతి దేవస్థాన యాజమాన్యమునఁ బ్రాచ్యపరిశోధనాలయ మున్నంతవరకుఁ దాళ్ళపాకవారి గేయములు రాగిరేకుల నుండి యుద్ధరింపఁబడి, పరిష్కరింపబడి, సంపుటములుగా ముద్రింపఁబడుచుండినవి. ప్రాచ్యపరిశోధనాలయమును శ్రీవేంకటేశ్వర విశ్వకళాపరిషత్తునకు దత్తము చేసినప్పటి నుండి తాళ్ళపాకవారి ప్రచురణములు కుంటుపడినవి. దేవస్థాన ప్రాచ్యపరిశోధనాలయము పక్షమున శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యుల వారిచేతను, శ్రీ రాళ్ళపల్లి

అనంతకృష్ణశర్మ వారిచేతను తాళ్ళపాకవారి కీర్తనలు పరిష్కరింపఁబడినవి. ప్రాచ్యపరిశోధనాలయముతో శ్రీ ఉదయగిరి శ్రీనివాసాచార్యులువారు శ్రీవేంకటేశ్వర విశ్వకళాపరిషత్తునకుఁ జెందుట వలనను, శ్రీ రాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారు వృద్ధులైనందు వలనను, వారిరువురు నీ కార్యక్రమము నుండి విరమించుకొనిరి. తాళ్ళపాక అన్నమాచార్యులవారి కీర్తనలపై నత్యంతాభిమానముగల శ్రీ చెలికాని అన్నారావుగారు - ఎగ్జిక్యూటివు ఆఫీసరు, తిరుమల తిరుపతి దేవస్థానములు-నన్నుఁ బిలిపించి, శ్రీరాళ్ళపల్లి అనంతకృష్ణశర్మగారి సలహాపై, ఈ బాధ్యత నాకప్పగించిరి. ఈరీతి స్వామికొకవిధమైన కైంకర్యముచేయు భాగ్యము లభింపఁజేసినందులకు నేను వారికెంతయుఁ గృతజ్ఞుఁడను.

ఇప్పటికి 17 సంపుటములైనవి. అందు నధ్యాత్మ కీర్తనలుగాక శృంగార కీర్తనలు 1 నుండి 400 వరకుఁ గల రాగిరేకులనుండి యుద్ధరింపఁబడి పరిష్కరింపఁబడినవి. ఈ 18-వ సంపుటమున 401 నుండి 500 వరకుఁ గల రాగిరేకులలోని కీర్తనలుద్ధరింపఁబడి పరిష్కరింపఁబడినవి. 451 నుండి 460 వరకుఁగల పదిరాగిరేకులు గానరావు. అచ్చటచ్చట పదిపది రేకులు మృగ్యములై శృంగార కీర్తనలు 2002 రేకుల వరకుఁ గలవు. పెద్దతిరుమలాచార్యులవారి కీర్తనలు, చిన్నతిరుమలాచార్యుల వారి కీర్తనలును గల రాగిరేకులు కొన్నిగలవు. ఇవి నూటికి మించవు.

శ్రీవేంకటేశ్వరానుగ్రహమున నీ యుద్యమము జయప్రదమగుఁగాక. ఇందుఁ బాల్గొను నధికారులు తమ యుత్సాహమును వెల్లడించుటవలన కార్యక్రమము సులభసాధ్యమగు చున్నది. నాకు సహకారులైన పేష్కారులు శ్రీ టి. దేవరాజులువారికిని, ముద్రణాధికారులైన శ్రీ పి. యు. సుబ్రహ్మణ్యంగారికిని కృతజ్ఞుఁడను.

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులవారు క్రీ. శ. 14-4-1424 తేదీన - శా. శ. 1346 క్రోధినామ సం॥ వైశాఖ పున్నమినాఁడు కడప

మండలమున జన్మించిరి. తమ జీవితమును శ్రీవేంకటేశ్వరున కంకితముఁ జేసి, స్వామివారిని సేవించుచుఁ దిరుమలపై స్వామి సన్నిధిలోనుండి దినమునకొక కీర్తన చొప్పున స్వామిపై భక్తితో గానముఁ జేసిరి. ఆకాలమున నా కీర్తనలు రాగిరేకులపైఁ జెక్కఁబడెను. ఆ రేకులు భద్రముగా స్వామిసన్నిధియందె యొక చిన్నయరయందుంచఁ బడినవి. ఏ యూరిపేరున నే దేవునిపేర సంకీర్తనము చేసినను నవి యన్నియు శ్రీవేంకటేశ్వరాంకితములుగనే పరిణమించినవి.

"యిల్లిదె పండరంగిని యిట శ్రీవేంకటాద్రిని
వుల్ల మలర నిలిచితో విఠలేశా" —సం. 17.కీ. 427.

"శ్రీవేంకటాద్రి మీఁదఁ జేరి కూడెఁ జెన్నుఁడు"
—సం. 17. కీ. 162.

"అందపు శ్రీవేంకటేశ అట్టె కోనచెన్నఁడవై"
—సం. 17. కీ. 423.

"తక్కక యహోబలానఁ దగ శ్రీవేంకటాద్రిని
వొక్కటై నిన్నుఁ బెండ్లాడి వొద్దికె చూపీని"
—సం. 18. కీ. 271.

"చిన్ని కృష్ణుఁడై పెరిగి చేరి కంసుఁ బోరిగొని
యెన్న శ్రీవేంకటేశుఁడై ఇందరిఁ గాచీ నిదె"
—సం. 18. కీ. 383.

"పీదు లెల్లఁ దానె శ్రీవేంకటాద్రి కృష్ణుఁడు"
—సం. 18. కీ. 384.

"నూని శ్రీవేంకటాద్రిపైఁ బొంచి సీతాసమేతుఁడై"
—సం. 18. కీ. 527.

"శ్రీవేంకటాద్రి కృష్ణుఁడ సిగ్గుతోడ మొక్కేమూ"
—సం. 18. కీ. 540.

పాండురంగ విఠలుని, కోన చెన్నరాయని, నహోబల నరసింహుని, కృష్ణుని శ్రీవేంకటేశ్వరునం దైక్యభావముతో నన్నమాచార్యులు గీర్తించిరి. వారి కీర్తనలలోఁ గొన్నింటి ప్రతులు పెద్ద పెద్ద రాగి రేకులపైఁ జెక్కింపఁబడి యహోబల నరసింహస్వామి దేవాలయము నందును. శ్రీరంగమున రంగనాథుని దేవాలయమునందును నుంచఁబడినవి. ఇట్టి కొన్ని కీర్తనల ప్రతులతో నితరుల కీర్తనలఁ గొన్నింటిని కలిపి వ్రాయఁబడిన వ్రాతప్రతులు తంజావూరు సరస్వతీ మహాల్ భండారమునను, తాళ్ళపాకవారి వంశస్థుల వద్దను లభించినవి. ఎచ్చట ఏ కీర్తనలు లభించినను నవి తిరుపతిలోని రాగిరేకుల నున్న వాని ప్రతులే యని భావించవలెను. సింహాచలమున నధ్యయనోత్సవ సందర్భమున నన్నమాచార్య సంకీర్తనలు పాడఁబడుచున్నవి. తిరుమలపై స్వామివారి సన్నిధియందు సుప్రభాతమున మేలుకొలుపులను, నేకాంత సేవాకాలమున లాలిపాటలను తాళ్ళపాక వంశస్థులు నేఁటికినిఁ బాడుచున్నారు. కల్యాణోత్సవమునఁ గన్యాదాతలు తాళ్ళపాకవారే.

శ్రీ తాళ్ళపాక అన్నమాచార్యులవారి కీర్తనలందలి విశేషాంశములు ముఖ్యమైనవి రెండు. (1) భక్తి. (2) భాష.

భక్తి: శృంగార రసము లౌకికమైనదియు లైంగికమైనదియు నైనను భక్తియుక్తమై దైవపరమైనపుడు పారమార్థికమును నాధ్యాత్మికము నగుచున్నది. అన్నమాచార్యులు తనకీర్తనల నన్నింట శ్రీవేంకటేశ్వరుని దివ్య నామమును జొప్పించి తత్పరముగాఁ గీర్తించుటయేగాక యలమేల్మంగను గూడ శృంగారరసమున స్తుతించెను. ఈ స్తోత్రము లైహికములు గావనుటకుఁ దార్కాణము గలదు. నాఁటి విద్యానగర సంస్థానాధీశ్వరుఁడైన సాళ్వ నరసింగరాయఁడు పెనుగొండ దుర్గమున నుండఁగా నన్నమాచార్యులవారి నాహ్వానించి సత్కరించి వారి కీర్తనలను విని యానందించి తనపైనికూడ నట్టి శృంగార కీర్తనల రచింపఁ బ్రార్థించెను. అందుల కన్నమాచార్యులు

ఖిన్నులై యది యపరాధమనియును, శ్రీవేంకటేశ్వరున కంకితమైన తన కవిత మానవమాత్రుల కందరాని దనియు నుడివి తానచట నుండ నిచ్చగించక శ్రీవేంకటాద్రికిఁ బయనమయ్యెను. తన కోరిక తిరస్కరింపఁబడుటచే రాయలు రాజసమున క్రోధావేశపరవశుఁడై యన్నమాచార్యుల బంధించి సంకెలలు వేయించెను. అన్నమాచార్యులు శ్రీవేంకటేశ్వరునిఁ బ్రార్థింపఁగా నవి తెగి పడిపోయినవి. నిలకడపై నిజ మెఱిఁగిన రాయలు పశ్చాత్తప్తుఁడై అన్నమాచార్యుల పాదముల కెఱఁగి కనక వస్తువాహనంబుల నుపాయనములుగా నొసఁగి, కొన్ని యగ్రహారములను దత్తము చేసెను. అన్నమాచార్యుల శృంగార భావము కేవల మానవమాత్రుల శృంగారముకాదు. అది దైవికమైన భక్తిపారవశ్యమున లభించు శృంగార భావము. కావుననే చిరకాలము నిలిచినది. బమ్మెర పోతన రచించిన భాగవతమునకుఁ గల విలువ యన్నమాచార్యుల కీర్తనలకుఁ గలదు. వారిరువురును సమకాలికులు.

పోతనామాత్యునిది భాగవత భక్తి, అన్నమాచార్యులది గోపికా భక్తి. భాగవత భక్తియందు గోపికాభక్తియును, గోపికా భక్తియందు భాగవత భక్తియును మిశ్రితమైయుండును. ఉత్తర హిందూస్థానమున శ్రీ చైతన్యస్వామి గోపికా భక్తిని ప్రచారముచేసిరి. శ్రీ రూపగోస్వామి గౌడీయుఁడు రాధామాధవ తత్త్వరూపమను బేర గోపికా భక్తిని దా రచించిన శ్రీహరి భక్తిరసామృత సింధువు, ఉజ్జ్వల నీలమణి యను గ్రంథముల ద్వారా ప్రచారముచేసిరి. శ్రీ జయదేవుఁడు తన గీతగోవిందమనే యష్టపదులను గ్రంథమున నిట్టి భక్తినే ప్రకటించెను. ఈ విధమైనగోపికా భక్తిని దక్షిణాపథమున గ్రంథ రూపమున గేయరచనలోఁ బ్రచారము చేసినవారీ యన్నమాచార్యులొక్కరే యని తోఁచుచున్నది.

"రాధా మాధవ రతి చరిత మితి
బోధావహం శ్రుతి భూషణం॥" —సంపుటము 12. కీర్తన 165.

అని తన భక్తితత్త్వము నొక్కచో నన్నమాచార్యులు వెలిబుచ్చిరి. మాధవునందు రాధికయు శ్రీ వేంకటేశ్వరునం దలమేల్మంగయుఁ బ్రదర్శించిన భక్తి యొక్కపోలికనున్నదే. తన సర్వస్వమును బ్రతిఫలాపేక్ష లేక విభుని ప్రీతికొఱకు సమర్పించుటయే యీ భక్తియొక్క స్వభావము. ఇది కామము కాదు. దీనిని పరమ ప్రేమ యందురు. కామమునందు స్వప్రయోజనము, స్వార్థము నుండును. ప్రేమయం దాత్మార్పణ ముండును. కామము క్షణికము ననిత్యము. ప్రేమ నిత్యమైనది. కామము దుఃఖాంతము. ప్రేమ నిత్యానందము. కామమున నింద్రియ లౌల్యముండును. ప్రేమ యింద్రియాతీతము.

ఈ ప్రేమయను భక్తి మధురమైనది. భక్తిరసములు సాధారణముగా నైదు విధములుగ నున్నవి. అవి శాంత, దాస, సఖ్య, వాత్సల్య, మధుర రసములు. మొదటి నాల్గింటి కంటె మధుర రసమే గొప్పది. ఈ మధుర రసమందు మిగిలినవి యంతర్లీనముగా నుండును. కాని యిది మిగిలిన వానియందు సంపూర్ణముగా నుండదు. దీనినే కాంతాభావభక్తి యనియునందురు. తనయొక్క సర్వస్వమును, ప్రతి యంగమును ప్రతి యింద్రియమును విభుని నానందపఱచుటకై యుపయోగపడవలెను. విభుని యానందమే తన యానందము. తనకై ప్రత్యేకమైన యానందములేదు. తన మనస్సు విభునియందు లగ్నమై యుండవలెను. విభుని యెడఁబాటు భరించరాని విరహమై యుండును. ఇట్టి భక్తిని మృదుమధుర పదములలో నతి శృంగారముగ నన్నమాచార్యులు గేయ రచన యందుఁ జొప్పించి యాంధ్రలోకమునకుఁ బ్రసాదించిరి. ఈ విధమైన భక్తురాలినిఁ నన్నమాచార్యులిట్లు వర్ణించియున్నారు:

ముఖారి

ఇదిగాక సౌభాగ్య మిదిగాక తపము మఱి
    యిదిగాక వైభవంబిఁక నొకటి కలదా ॥ పల్లవి ॥
అతివ జన్మము సఫలమై పరమయోగివలె
    నితర మోహాపేక్ష లన్నియును విడిచె

సతికోరికలు మహాశాంతమై యిదె చూడ
సతత విజ్ఞాన వాసనవోలె నుండె ॥ ఇదిగాక ॥

తరుణి హృదయము కృతార్థతఁబొంది విభుమీఁది
పరవశానంద సంపదకు నిరవాయ
సరసిజానన మనోజయమంది యింతలో
సరిలేక మనసు నిశ్చల భావమాయ ॥ ఇదిగాక ॥

శ్రీవేంకటేశ్వరునిఁ జింతించి పరతత్త్వ
భావంబు నిజముగాఁ బట్టెఁ జెలి యాత్మ
దేవోత్తముని కృపాధీనురాలై యిపుడు
లావణ్యవతికి నుల్లంబు దిరమాయ. ॥ ఇదిగాక ॥

—సంపుటం 12. కీర్తన 17.

మఱొకచోట

"సకరాపరాధము శమియించుకోవయ్యా
అకలంకమైన నీ యానతిలో దానను॥"---సం. 17. కీ. 85.

అని స్వార్థమెఱుఁగని యాత్మార్పణమును శరణాగతి రూపమున వర్ణించిరి.

మఱొక స్థలమున

"నీవు నాకుఁ జుట్టమవై నిలిచినాఁడవు గాన
నీవద్ది యింతులు నాకు నెమ్మిఁ జుట్టాలే
పూవులు ముడిచితేను పూవులలో వాసనలు
వేవేలు చెప్పినాను వేరులయ్యీనా॥

నీమనసు నామనసు నిక్కమూ నొక్కటే కాన
కామించిన నీపనులు కాదన నేను
దీమసాన సొమ్ములెల్ల దేహమున నించుకొంటే
వేమరు వాని కాంతులు వేరే వుండీనా॥

యెప్పుడూ నీ నా ప్రాణా లేకమయ్యే వుండుఁగాన
యిప్పటి నీ జాడలెల్లా నితవే నాకు
* * * * ॥'' — సం. 15. కీ. 153.

అని స్వార్థములేని యైక్యభావమును వర్ణించిరి. ఇంతకు మించిన భక్తి లేదు.

భాష : క్రీ. శ. 15-వ శతాబ్దమున విద్యానగర సామ్రాజ్యమున నాంధ్ర కర్ణాటక భాషలు సమాన ప్రతిపత్తి గలిగి యుండెడివి. నాఁటి రాజు లన్నమాచార్యులవారి కీర్తనములను రాగిరేకులపై వ్రాయించు నేర్పాట్లగావించి యుందురు. కన్నడలిపియొక్క సామ్యము లీరేకు లందలి తెలుఁగు లిపిలో నవగతమగుచున్నవి. తెలుఁగు అక్షరము క్ర కు బదులుగా కన్నడ అక్షరము ಕ ಸర్వత్ర వ్రాయఁబడి యున్నది. ఊ యను స్వర సంజ్ఞ తెలుఁగులో ూ అని యుండఁగా కన్నడ సంజ్ఞ ೂ సర్వత్ర యుపయోగింపఁ బడినది. ఈ స్వల్ప భేదములు లిపి కారునికైనను నాఁటి వాడుకకైనను నన్వయింపఁ దగును. ఇత్వము ఈత్వము నొక్క సంజ్ఞచేతను ఒత్వము ఓత్వము నొక్క సంజ్ఞచేతను ద్యోతకములగుచున్నవి. ఎత్వము ఏత్వము స్వల్ప భేదముతో నున్నను ననేకచోట్ల వ్యత్యస్తముగా వ్రాయఁబడియున్నవి. కన్నడ భాషలో వీనికి దీర్ఘములు లేవు. హ్రస్వ సంజ్ఞలకు ప్రక్కన ೯ యను దీర్ఘ సంకేతనమును చేర్చుదురు. అట్టి సంకేతనము లేనందువలన హ్రస్వ దీర్ఘములు వ్యత్యస్తము కలిగినది. అక్షరములు గుండ్రములై ముచ్చటగా నున్నవి. ఇట్టి లిపియే అహోబల శ్రీరంగ దేవాలయములందు లభించిన పెద్ద రేకులందును గలదు.

నాఁటి వ్యావహారిక భాషలో నచ్చతెలుఁగు నుడులను గ్రామ్యములుగులతో మేళవించి శృంగార రసమున భావనచేసి కమ్మని గేయములుగా నన్నమాచార్యులు శ్రీ వేంకటేశ్వరునిపై రచించి పండిత పామర రంజకముగా భక్తితోఁ గీర్తించిరి. వీరికి సంస్కృత

మందును పాండిత్యముగలదు. లక్షణ యుక్తమగు గేయములను రచించు సామర్థ్యము గలదు. శృంగార కీర్తనలుగల మొదటి 85 రేకుల లోను పది సంస్కృత కీర్తనలు గలవు. అవి 12-వ సంపుటమున 22, 39, 78, 114, 135, 165, 166, 251, 288, 373 సంఖ్యలు గల కీర్తనలై యున్నవి. మఱియు 17-వ సంపుటమున 588-వ కీర్తనయును సంస్కృతముననే యున్నది. వీనినిఁ బట్టి యన్నమాచార్యులకుఁగల సంస్కృతభాషా పరిచయము తెల్లమగుచున్నది. ఇఁక తత్సమ పదము లతో యతిప్రాసలేగాక యంత్యప్రాసతోఁ గూడ రచించిన పట్టులు కలవు. మచ్చునకు,

"అలిమేలుమంగా హరియంతరంగా
కలిత నాట్యరంగ కరుణాపాంగ

*  *  *  *

అలినీలవేణి యంబుజపాణి
వెలయఁగ జగదేక విభుని రాణి

*  *  *  *

సితచంద్రవదనా సింగారసదనా
చతుర దాడిమ బీజ చయరదనా

*  *  *  * —సం. 15. కీ. 16.

కాని అయిదు శతాబ్దములకుఁ బూర్వము చదువరు లల్ప సంఖ్యాకులగుట వలన, బహుళ జనోపయోగార్థముగా నుండుటకునై వ్యావహారిక భాషలో నన్నమాచార్యులవారు కీర్తనల రచించిరి. వ్యావహారిక భాషయే యైనను నచ్చ తెలుఁగు పదములనేకముల నా కీర్తనలలో నన్వయించి ప్రయోగించిరి. నాఁటికి నేఁటికిఁ బండిత పామరులు వ్యావహారికముగా యెక్కడ, యేమి, వునికి, వూరు అని యకార వకారములను బదాది నుపయోగించు చున్నారు. ఆయెను అనుటకుఁ బదులుగా నాయను అనుచున్నారు. ఇట్టి

మార్పులు వ్యాకరణ విరుద్ధములైనను వ్యావహారిక భాషయందు ఉచ్చారణా సౌలభ్యము (Economy of effort) కొఱకు ముఖ్యముగా గేయములందుఁ గాన్పించుచున్నవి. కావున నీ సంపుటమునఁ బదాదినిఁ గల యకార వకారములను 2, 3, సంపుటములలో వలెనే సవరించలేదు. ఇంతకుఁ బూర్వపు పరిష్కర్తలు పల్లవి మొదటి యక్షరమును మాత్రము సవరించి మిగులు పాదముల తొలియక్షరములను సవరించలేదు. అ. ఆ. ఔ. లు పదాదినట్లే కాన్పించుచున్నవి. ఇ. ఈ. ఎ. ఏ లు బహుళముగా యకారముతో చేరియున్నవి. చేరని పట్లునుఁ గొన్ని గలవు. ఉ. ఊ. ఒ. ఓ లు వకారముతో చేరియున్నవి. ఇవన్నియు నట్లే యథాతథముగా నుంచఁబడినవి. 'ఆయెను' కు బదులుగా 'నాయను' నట్లేయుంచబడినది. వ్రాయసకాండ్ర లోపము వలనఁ గలిగిన యక్షరదోషములు సవరింపఁ బడినవి.

ఇంచు మించుగా నెనుబది రాగములలో గానము చేసిన యన్నమాచార్యులవారికి ఆహిరి, దేసాళం, నాదరామక్రియ, పాడి, బౌళి, భైరవి, ముఖారి, రామక్రియ, శంకరాభరణం, శ్రీరాగం, సామంతమను రాగములలో నెక్కువ కీర్తనలు గానము చేయుటవలన నా రాగములపై మక్కువ యధికమని తోచుచున్నది. జయదేవుని యష్టపదులు, నారాయణతీర్థుల తరంగములు నాలుగు మాత్రలుగల గణములతో సాధారణముగాఁ బూరింపఁబడిన పాదములు గలిగి యున్నవి. తరంగములందు కొన్నిచోట్ల జంపె తాళమున కనువగు నట్లుగా నైదుమాత్రల గణము లుపయోగింపఁ బడినవి. అట్టి గణ సామ్యము తాళ్ళపాకవారి కీర్తనలందులేదు. త్యాగరాజకృతులకు వలె రాగము ప్రధానమై కన్పట్టుచున్నది. త్యాగరాజ కృతులు గ్రాంథిక భాషలోనుండుట వలన పామరులనోట సరిగా మెదుగుటలేదు. అన్నమాచార్యుల కీర్తనలు వ్యావహారిక భాషలో నుండుట వలన నందర కామోద యోగ్యములు కాఁగలవు.

## వ్యాకరణాంశములు :

1. ఆకాలములో నర్ధానుస్వారము లేదని భావించవలెను. అర్ధానుస్వారమునకు బదులు పూర్ణానుస్వారమే సర్వత్ర కానవచ్చుచున్నది.

| | | | |
|---|---|---|---|
| కాంక | (కాఁక) | మీందు | (మీఁదు) |
| తోంచు | (తోఁచు) | వాండు | (వాఁడు) |
| నేండు | (నేఁడు) | వీంగు | (వీఁగు) మొ॥ |

దీర్ఘము మీఁది బిందువు కాలానుగుణ్యముగా నర్ధానుస్వారమైనది. ప్రస్తుతము దీర్ఘముపైనుండుఁ బూర్ణానుస్వారము సాధువు కాదు.

2. బిందువునకుఁ బరముగా నుండు హల్లు ద్విరుక్తముగాఁ గాన వచ్చుచున్నది.

| | |
|---|---|
| ఇంత్తి | కొండ్డె |
| ఉండ్డు | చంద్దమామ |
| ఎంద్దు | పంత్తము |
| కుండ్డి | ముంచ్చు |
| కొంగ్గు | వింట్టె |
| కొంట్టె | నిండ్డు మొ॥ |

ప్రస్తుతమీ ద్విరుక్తము సాధువు కాదు.

3. అర్ధానుస్వారము లేని పదములు కొన్నింటఁ బూర్ణానుస్వారము గానవచ్చుచున్నది.

| | | | |
|---|---|---|---|
| గాంటపు | (గాటపు) | కీర్తన సంఖ్య | 355,379 |
| చేంగ | (చేగ - చేవ) | ,, | 8,25 |
| మాంట | (మాట) | ,, | 43,355 |
| మేంటి | (మేటి) | ,, | 379 మొ॥ |

ఇవి సాధువులు కావు.

4. ప్రాసలం దర్ధానుస్వార పూర్వాక్షరములును నర్ధాను స్వారములేని యక్షరములును చెల్లుబడియయినట్లు గాన్పించు చున్నది. 8, 14, 230, 379 కీర్తనలందుఁ జూడుడు.

[17 వ సంపుటమందలి 412, 513, 546, 570 కీర్తనలందు నిట్టివి గలవు.]

5. ద్రుతములేనిచోట నగాగమము కొన్ని చోట్లఁ గానుపించు చున్నది.

6. ఉత్తునకు విసంధితో యడాగమము కొన్ని చోట్లఁ గల్పింపఁ బడినది.

7. పదాదిని యకార వకారము లచ్చులతోఁ జేర్పఁబడినవి.

8. సకారము బహుళముగా శకారమైనది. ర, అ లు; ర, ల లు విరివిగా మార్పు నొందినవి.

9. వ్రాతలో కొన్ని పదములు మార్పు చెందినవి.

| వ్రాతపదము | సరియైనపదము |
|---|---|
| అ ఇత్తము | ఆయత్తము |
| అచ్చుత | అచ్యుత |
| ఉందాన | ఉన్న దాన |
| ఎర(అ)ంగు | ఎరు(అ)ఁగు |
| కలితే | కలిగితే |
| కాంగిలి | కౌఁగిలి |
| చిదుముడి | చిడిముడి |
| చేశినాను | చేసినాను |
| చేడెలాల | చేడెలార |

| వ్రాతపదము | సరియైనపదము |
| --- | --- |
| దయ్యము | దైవము |
| ధన్నాసి | ధన్యాసి |
| నంన్ను | నన్ను |
| నీకు మోహించి | నిన్ను మోహించి |
| నోరిలో | నోటిలో |
| మఱంగు | మఱుఁగు |
| మెలుంత | మెలఁత |
| వొద్దు | వద్దు |
| వొల | వల |
| సింహ్వాసనము | సింహాసనము మొ॥ |

ఇట్టి పదములు వ్యావహారికముగా వాడుకలో నుండియుండవచ్చును.

10. కొన్ని మారుమూలలనుండు నచ్చతెలుఁగు పదములు వాక్యములందు సమన్వయపరచి ప్రయోగింపఁబడినవి. కొందఱ కివి వాడుకలోనివై యుండవచ్చును.

| పదము | అర్థము |
| --- | --- |
| అంకె | అదను : సమయము |
| అప్పసము | సతతము |
| అరత | సమీపము |
| ఆడిక | దూఱు : నింద |
| ఆదికొను | కన్ను వేయు |
| ఆముకొను | క్రమ్ముకొను |

[ఆము=మదము : మదించు]

| పదము | అర్థము |
|---|---|
| ఉడివోవు | [ఉడిగి + పోవు] |
| ఉదియగొను | ఆరంభించు |
| ఉదుటు | సొగసు : గర్వము |
| ఎలుఁగించు | కూయు |
| ఏఁకరు | వాచిపోవు |
| ఏకు | దూఉు |
| ఏతు | గర్వము |
| ఒడికము | సొగసు : సొగసైనది |
| ఓవర | పడకటిల్లు |
| ఓసరించు | కడకొత్తు : త్యజించు |
| కచ్చు | గర్వము |
| కఱకటి | బలాత్కారము : ఆగ్రహము |
| కాంతాళము | ఈర్ష్య : కోపము |
| కాఁడు | నాటు |
| కావిరి(కావు) | ఒప్పిదమగు |
| కైపు | విజృంభణము : మత్తు |
| కొఱిమె | దోషము |
| క్రియ | విలాసము |
| గట్టువా | ధూర్తస్త్రీ |
| గుడికొను | క్రమ్ము |
| జమలి : జమిలి | జంట |
| జోక | ఉత్సాహము |
| జోఁక | సౌందర్యము |

| పదము | అర్థము |
|---|---|
| తచ్చన | పరిహాసము |
| తొట్టు | మెండుకొను |
| దొర్లాడు | అనుభవించు : కలియు |
| నప్పు | నడుపు : ప్రవర్తింపఁజేయు |
| నెప్పు | స్థైర్యము : ఉపాయము |
| నెర(అ)వు | హెచ్చు |
| పంగెనపు | మోసపు |
| పగటు | ప్రకాశము |
| పచరించు : పచారించు | ప్రసరించు |
| పన్ను | సిద్ధించు : స్మరించు |
| పిర | ప్రియ |
| పెంచు | పెంకు |
| పెరయు | పెనఁగు |
| పొనుగు | నిస్తేజము |
| పొరి | అత్యంతము |
| పొలయు | సంచరించు |
| పోలు | ఒప్పు |
| పౌజు | బారు |
| బగి | పార్శ్వము |
| బగ్గన | ప్రకాశముగా |
| బడి | క్రమము |
| బాఁతి | ప్రీతి |
| ముండాడు (వి. మండాట) | దైన్యముతో వేడుకొను |

| పదము | అర్థము |
|---|---|
| మక్కళించు | ఉబ్బించు |
| మనికితపడు | శోకించు |
| ముత్తర (ముత్తెర) | విన్నాణము |
| ముదళించు | అడుగు |
| మేడము | కూడికె |
| మొక్కలము | ఉత్సాహాము |
| రంతు | విలాసము, రవ |
| రపము | చనవు |
| రాకొట్టు | రారా, పోరా, యను |
| రేసు | చులకన |
| లాంగ | ధూర్తస్త్రీ |
| లాయు | విజృంభించు |
| వాకము | వాటము |
| వాసులు | తారతమ్యములు |
| వెగ్గలము | అధికము |
| సట | కపటము, అసత్యము |
| సడి | నింద, చప్పుడు |
| సరిత | సవితి |
| సలిగ | ప్రాపు |
| సిబ్బితి | సిగ్గు |
| సెలవు | పెదవితుది |

ఈ క్రింది పదములు నిఘంటువులోఁ గానరావు. అర్థము సందర్భాను సారముగాఁ జెప్పుకోవలెను.

| పదము | కీర్తన సంఖ్య | పదము | కీర్తన సంఖ్య |
|---|---|---|---|
| ఆనోదము | 116, 301, 325, 344, | జునుగు | 337 |
| | 429, 490, 499, 520, | జొత్తు | 38 |
| ఆఁకట | 229 | తచ్చి | 22, 80 |
| ఆఁకరు | 532 | తిమురు | 103 |
| ఉంగిట | 136 | తూరిపారు | 479 |
| ఉడివోని | 109 | తేవ | 60 |
| ఎచ్చరి | 13 | దైలువారు | 287, 357 |
| ఒళ | 38 | దోమటి | 83, 347, 473 |
| ఓజ | 49 | నేత | 242 |
| కడవర | 308 | పచ్చిసేయు | 20 |
| కాకరి | 129, 302 | పాలచాడు | 447 |
| కిమ్ముు | 27, 144 | పెంజమూటలు | — ? |
| కుచ్చి | 112, 360 | పూసగొండి | 445 |
| కొచ్చి | 46, 78, 111, 310, | పొడిఁబడు | 197 |
| | 372 | బేసబెల్లి | 445 |
| కొనబు | 449 | మేకులు | 7, 302 |
| కోదలుచు | 65 | మొక్కలాన | 481, 493 |
| కోరో | 61 | మోకదాకిరి | 312 |
| కోలు | 14 | మోనాన | 34 |
| గజరులు | 497 | మోఁపి | 279 |
| గుక్కి | 12 | రంటికి | 63 |
| గొరబు | 323 | వాడిక | 73 |
| చేముంచి | 13, 121, 327 | విగడాలు | 31 |

| పదము | కీర్తన సంఖ్య | పదము | కీర్తన సంఖ్య |
|---|---|---|---|
| చొల్లె | 139 | వెగ్గలింతు | 13 |
| జరసి | 71, 100, 122, 162, 165 | సదరాన | 132 |
| | | సలిగెలు | 169 |
| జవళి | 79, 118 | సుడికత్తె | 135 |
| జాజుకొను | 132 | సుసరాన | 159 |

నే నేర్చిన కొలఁది పరిష్కరించితిని. వ్యావహారిక భాషను పరిష్కరించు పద్ధతులలో (Principles of editing works in colloquial Telugu language) సలహాల నొసఁగు సహృదయులకుఁ గృతజ్ఞుఁడను.

తిరుపతి
11–11–63

ఇట్లు,
పి. టి. జగన్నాథరావు.

శ్రీరస్తు

శ్రీ వేంకటేశాయ నమః

శ్రీ తాళ్ళపాక

# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

* * *

## ౧౮-వ సంపుటము

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటి క్రోధి సంవత్సరమందు తాళ్ళపాక అన్నమాచార్యులు అవతరించిన, పదారు యేండ్లకు తిరువేంగళనాథుఁడు ప్రత్యక్షమైతేను. అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభి సంవత్సర ఫాల్గుణ బహుళ ౧౨ * నిరుధానకు, తిరువేంగళనాథునిమీఁదను అంకితముగాను తాళ్ళపాక అన్నమాచార్యులు విన్నపము చేసిన శృంగార సంకీర్తనలు.

401-వ రేకు. ధన్నాసి

యెక్కడనైనాఁ జేయి యెకసక్యాలు
తక్కినవారితోడ తచ్చన లెంచకయ్యా ॥ పల్లవి ॥

చెక్కులు గిల్లకు నన్నుఁ జేరి వేడుకొనే నంటా
నక్కడనుండే సరసమాడుదు గాక
నిక్కము నే నెఱఁగనా నీ మతకము లిన్నియు
మొక్కేము నీకు మాతో [1]మొఱఁగు లేటి కయ్యా ॥ యెక్క ॥

చెలఁగి తిట్టకు మమ్ము చెవిలో మాటాడే నంటా
సొలసి యెమ్మె లెందైనాఁ జూపుదు గాని
యెలమి నీ కపటము లెప్పుడుఁ గలవే కావా
పిలువకు మయ్యా నీతోఁ బెనఁగ నోప మయ్యా ॥ యెక్క ॥

---

* ఈ పదము నిరోధశబ్దమునకు సంబంధపడినది. నిర్యాణము వరకు ననునర్థమునఁ బ్రయోగింపఁబడినది. (నిరోధము = వినాశము) రేకులోని పాఠమునకు రే. పా. అని సంకేతమివ్వఁబడును.

1. రే. పా. – మొరఁగు.

కదు నన్నలయించకు కౌఁగిటఁ గూడే నంటా
వుడివోని పూవువలె నుందువు గాని
అదరి శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
తదవి కూడితి మాతోఁ దమక మేఁటి కయ్యా. ॥ యెక్క ॥ 1

భవుళి

చిత్తము నొచ్చేవు సుమీ చెలియచేఁతలకును
బత్తి నీపైఁ జేయుటకు పాదువలె నాయను ॥ పల్లవి ॥

పువ్వులచెండు వేసెఁ బొలఁతి నిన్నునూరు
రవ్వలుగ నవి నీ వురమునఁ దాఁకె
జవ్వని దనకు చాల సరి దాఁకించె నని
చివ్వన నీకుఁ జూపి చెప్పినయట్లాయను ॥ చిత్త ॥

రతికి దగ్గరఁగాను రాకు మని చేతఁ బట్టె
మతకాన నంతలోనీ మర్మము సోఁకె
సతిని చేయి వట్టి సరిఁ బెండ్లియాడుటకు
జతనాన నిదియే సూచనలై నిలిచెను ॥ చిత్త ॥

యెదురుమాట లాడి ఇంతి పాదానఁ జిమ్మఁగా
చెదరి నీవు మొక్కేటిశిరసు దాఁకె
అదన శ్రీవేంకటేశ అలమేలుమంగ యాకె
వుదుటునఁ గూడె నిదే వుంకువలై మెరసె. ॥ చిత్త ॥ 2

సామంతం

ఆన లేల పెట్టుకొనే వప్పటి నీవు
లోనై నే నీ కుండితే లోక మైనా మెచ్చునా ॥ పల్లవి ॥

మచ్చికతో నాపెయింట మాపుదాఁకా నుండి వచ్చి
నచ్చుల నా మన సెట్టు నమ్మించేవు
అచ్చపు మగవాఁడవు అంగనతో నొంటి నుంచే
నెచ్చెలులైనా నిన్ను నింద లాడకుందురా ॥ ఆన ॥

చేతులార నాపెచేత సేవ సేయించుకొంటానే
నాతో నిజా లెట్టు నడపించేవు
రాతి రొక్కమంచముపై రామా నీవు నుంటి రంటే
ఆతలీతలివారలు ఆడుకోక వుందురా ॥ ఆన ॥

గారవించే నంటా నాఁపెఁ గౌఁగిలించుకొంటానే
యేర శ్రీవేంకటేశ నా కెట్టు బొంకేవు
సారె నలమేల్మంగను సరికి సరిఁ గూడితి
వీ రీతికిఁ బొరుగువా రిటు నవ్వకుందురా. ॥ ఆన ॥ 3

## సాళంగం

దేవకామిను లాడరో దివ్యదుందుభులు మ్రోసే
దేవుఁడు కోనేటిదండఁ దిరువీధి మెరసే ॥ పల్లవి ॥

యెత్తిరి గరుడధ్వజ మిందిరాపతిపెండ్లికి
యిత్తల సురలు మును లిందరూ రారో
హత్తి సేనాపతి యిచ్చె నదె కప్పురవిడేలు
చిత్తగించి యాగసాల చేరె హనుమంతుఁడు ॥ దేవ ॥

కట్టిరి కలువడాలు కమలాపతి పెండ్లికి
యిట్టె పేరటాండ్లు నేఁ డిందరూ రారో
చుట్టి చుట్టి రక్షగాను సుదర్శనము మించి
కట్టలై తిరువాముడి ఘనులు వాదేరు ॥ దేవ ॥

వెలయ భాష్యకారులు విందుచెప్పెఁ బెండ్లికి
నెలవై బువ్వాలవారు నెమ్మది రారో
అలమి శ్రీవేంకటేశుఁ డలమేలుమంగఁ గూడె
వెలసేరు పెండ్లిచవికెలోన నదివో. ॥ దేవ ॥ 4

## సామంతం

అతని నిక్కడికే రమ్మనే మమ్మా
యేతులకు మరేమన్నా నెఱఁగ [1]మమ్మా ॥ పల్లవి ॥

1. తే. పా. – మయ్యా.

కన్నెరో విరహముతో కాంతునింటి కేఁగె నంటా
యెన్నుకొని యిల్లు వెళ్ళి యేఁగకు వమ్మా
వెన్నెల యెండలు దాఁకి వేసవి యెంత నేసునో
యిన్నేసి సాహసాలకు నెఱఁగ మమ్మా ॥ ఆతని ॥

ఆతఁడురానికాఁకలు ఆఁపలేక వాకతెవె
యీతల వనములోని కేఁగకు వమ్మా
పోతరించి కోవిలల భూతము లందుఁగలవు
యీ తలఁపు దలఁచేవు యెఱఁగ మమ్మా ॥ ఆతని ॥

అలమేల్మంగ శ్రీవేంకటప్పఁ డిట్టె నిన్నుఁ గూడె
యెలమి మేడమీఁదికి నేఁగకు వమ్మా
చిలుకలు మీ చేఁతలు సిగ్గులు దోఁచఁగ నాడీ
ఇలమీఁద నింత కాఁకు యెఱఁగ మమ్మా. ॥ ఆతని ॥ 5

ధవళ

నీకంటె నాపె మేలు నే మాపెసేవ సేసేము
మాకు దిష్టము నీ పొందు మమ్మ నింత సేసేనా ॥ పల్లవి ॥

యిచ్చకమే యాడ నైతి నింతి నీవు గూచుండఁగా
హెచ్చుకుందు లాడఁగాఁగా నిటురావైతి
అచ్చమై నీకు మొక్కక నాపెకే నే మొక్కనైతి
మచ్చరించఁగాఁగా నాపెమాటలే యాడేరెనూ ॥ నీకంటె ॥

పాదా లొత్త నైతి నీవుఁ బదఁతియుఁ బండుండఁగా
వా దడువఁగాఁగా నీవు వలవవైతి
పోదిసేసి ప్రియములు పొలఁతికి చెప్ప నైతి
నీ దెస చూడఁగాఁగా నెరపెను చలమూ ॥ నీకంటె ॥

ఆకు మడి చియ్య నైతి నలమేల్మంగకు నీ
కేకతము చెప్పఁగాఁగా నిట్టె నవ్వెను
ఆకె నడిగి శ్రీవేంకటాధిప నన్నుఁ గూడితి
చేకొలఁదికి రాఁగాఁగా చెలియే మన్నించెను. ॥ నీకంటె ॥ 6

402-వ రేకు. శ్రీరాగం

యేమి సేతు నీమీఁద నెంతైనా నాస మానదు
మామీఁదివలపు నీకు మరపాయఁగా ॥ పల్లవి ॥

చేరి నీతో మాటలాడి సేవలు సేసుకొంటా
యీరీతిసే నుండినది యిది చాలక
కారించి యిందుమీఁదను కాఁకలు చల్లఁ జూచేవు
గారవపు నీదయ కానవచ్చేఁగా ॥ యేమి ॥

కన్నులు చల్లఁగఁ జూచి కడు నీతో నవ్వుకొంటా
యెన్నికగా నే నుండిన దిది చాలక
మిన్నక నీ విందుమీఁద మేకులు సేయఁ జూచేవు
మన్నించెనన్న నీ మాటపట్టు మీరెఁగా ॥ యేమి ॥

అప్పటప్పటికి నిన్ను నట్టె కౌఁగిలించుకొంటా
యిప్పుడు గూడివుండిన దిది చాలక
అప్పఁడ శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
కప్పేవు పచ్చడము నీగతి గంటిఁగా. ॥ యేమి ॥ 7

దేసాళం

తలపించ కింక నది దరి చేరేను
కల గన్నట్ల నాయ కాఁక లేల చాలురా ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి వేఁడుకోఁగా జేరి యన్నీ మరచితి
వొక్కటై నీవు సేసేవి వోర్చ వచ్చునా
పుక్కిలి బంటియ నీతో పొందులమాటలు నాకు
పిక్కటిల్లె వలపులు పెక్కు లేల చాలురా ॥ తల ॥

పంత మిచ్చి నవ్వించఁగఁ బరిణమించుకొంటివి
యెంత లేదు నీసుద్దులు యెంచ వచ్చునా
దొంతులై యి ల్లెల్ల నిండె దొమ్మి నీ యానలు నాకు
సంతకెక్కె నివి సాలు సరసాలు చాలురా ॥ తల ॥

కౌఁగిలించి కూడఁగాను కన్నులనే తనిసితి
[1]చేగ దేరె నీ మన్నన చెప్ప వసమా
అఁగకు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
నాఁగువారి వేడుకలు నటనలు చాలురా. ॥ తల ॥ 8

గౌళ

మూసిన ముత్యమువలె ముంగిట *నున్నదాన నేను
యే సుద్దు [2]లెఱఁగ [3]దైవ మెరిఁగితేఁ జాలును ॥ పల్లవి ॥

బెట్టిమాట లాఁడఁగాను ప్రియ మౌనో కాదో యంటా
గుట్టున నూర *కున్నదానఁ గోపమా ఇది
అట్టి నావలపు నీతో నాడుకొందునా నేనే
ఇట్టి పనులెల్ల దైవ మెరిఁగితేఁ జాలును ॥ మూసి ॥

పీడెము నీచేతి కియ్య వే ళవునో కాదో యంటా
గోడమాటున *నున్నదానఁ గోపమా ఇది
యేడనైనా నిల్లాండ్లు యెదురుకట్ల నుందురా
యేడకేడ యిది దైవ మెరిఁగితేఁ జాలును ॥ మూసి ॥

యేచి నిన్నుఁ గూడి ఇంకా నెంత గర్వ మందు వంటాఁ
గూచుండేఁ బాదాలవద్దఁ గోపమా ఇది
కాచి యలమేల్మంగను కైకొంటె శ్రీవేంకటేశ
యీ చాయ నీవే దైవ మ దెరిఁగితేఁ జాలును. ॥ మూసి ॥ 9

నాగవరాళి

మఱవకువయ్య నీవు మాట లెన్నైనాఁ గలవు
తఱవాతఁ జేసేటితగవు నీ చేతిది ॥ పల్లవి ॥

మందలించి నీవు నన్ను మన్నించుకున్నాఁడవు
యెందాకా విన్నపాలు నీ కేమి నేసేది
యిందరివలెనే నేను యెరవుల దానఁ గాను
పొందినట్టి నా పాలిటి పుణ్యము నీ చేతిది ॥ మఱ ॥

---

1. తే. పా.—చేఁగ, * తే. పా.—త్రుందాన, 2. తే. పా.—లెరఁగ,
3. తే. పా.—దయ్యము.

నిచ్చలు నామతిలోన నీవె నాకుఁ గలవు
యెచ్చరించ సారె సారె నేటికి మాకు
బచ్చెనచేఁతల నిన్ను భ్రమయించేదానఁ గాను
పచ్చి దీర నా కిచ్చిన బాసలు నీ చేతివి ॥ మఱి ॥

కొత్తగాఁ గొఁగిట నన్నుఁ గూడితి విప్పుడే నీవు
యెత్తినచేతుల నీకు నేడ మొక్కేది
అత్తిన శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
పొత్తుల నుండిన నా భోగము నీ చేతిది. ॥ మఱి ॥ 10

శుద్ధవసంతం

నీయంత నీ వెఱఁగవు నేనా చెప్పితిఁ జుమ్మీ
చేయి నేసుకోఁ జాలక సిగ్గున *సున్నదానను ॥ పల్లవి ॥

ముట్టినఁ గందేటిమేను మొనవేలు దాఁక నీకు
మట్టుతో నల్లంత నుండే మాటాడరాదా
నెట్టన నాకుచములు నీ కంటేవాండ్లు నుమ్మీ
వొట్టి నే నంత సేయక వూరకున్న దానను ॥ నీయ ॥

నెఱఁ బులకచెక్కులు నీ చెక్కులు సోఁక నీకు
గుఱిగా సంగడి నిట్టే కూచుండరాదా
తఱి నాచూపు నీగుండె తమిఁ గరఁగించుఁ జుమ్మీ
మెఱమెచ్చులకు మితిమీరక *వున్నదానను ॥ నీయ ॥

మోవిపైఁ బలుసోఁకులు మోపకు నీ వంత మమ్ము
యీవేళ నన్నుఁ గూడితి వింత చాలదా
చేవ మా చేఁతలు నిట్టెఁ జిగుళ్ళై నిలుచుఁ జుమ్మీ
శ్రీవేంకటేశుఁడ ముందే చేకొనే *ఉన్నదానను. ॥ నీయ ॥ 11

పాడి

ఇందు కంటే నిప్పుడే నీ కెచ్చరించుటే మేలు
కందువ మఱచి వుంటేఁ గడుఁ బొద్దు వోదా ॥ పల్లవి ॥

---

* తే. పా. – ఉందానను.

హత్తి నాలో చింత వెళ్ళ నాడఁగా నీ వటమీఁద
చిత్తము వచ్చినయట్టు సేసేవు గాక
మొత్తాన నేను నిన్ను ముందు నేరా లెంచఁబోతే
మత్తిలి వెనక నీవు మనికితపడవా ॥ ఇందు ॥

ఇంటికి వచ్చి యెదుట నిట్టె నిలుచుండఁగాను
నంటువ వలసినట్టు నవ్వేవు గాకా
వొంటి నేను విరహాన నుమ్మగిలఁగాఁ జూచి
అంటి ప్రియపడి మొక్కి అంత సేయ కుందువా ॥ ఇందు ॥

గక్కన నేనే నిన్నుఁ గౌఁగిలించుకొనఁగాను
నిక్కి వలసినట్టు మన్నించేవు గాక
యెక్కువ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
గుక్కి నేను రాకుండితేఁ గొంకు నీకుఁ దీరునా. ॥ ఇందు ॥ 12

403-వ రేకు. భైరవి

యేమని విన్నవించె నీ విఁత సేసితివి నన్ను
చేముంచి మా బ్రతుకు నీ చేతిది సుమ్మయ్యా ॥ పల్లవి ॥

దగ్గరి నీవు రాకున్న తమకింతు నొకవేళ
సిగ్గుపడుదు నంతలో చేయి వేసితే
వెగ్గళింతు నీ వట్టె వేరే పరాకు సేసితే
బగ్గన నీమీఁది భ్రమ వట్టె నయ్య నాకూ ॥ యేమ ॥

చెంత నీవు చూచుదాఁకా చే యెత్తి మొక్కుదు నీకు
మంతనాన మాటాడితే మఱతు మేను
యింతలో గోర నంటితే యెచ్చరి నవ్వుదు నీతో
యెంత నీవలపు దలకెక్కెనో నాకూ ॥ యేమ ॥

వెలుపల నీ వుండితే వేగఁ బిలువ నంపుదు
చెలఁగి యిట్టే కూడితే చెక్కు నొక్కుదు
యెలమి శ్రీవేంకటేశ యిదివో కలసితివి
యిలలో నా జవ్వనమే యింత సేసే నాకూ. ॥ యేమ ॥ 13

## సామంతం

యేల నీవు వెరచేవు యింతలోనను
  కోలు ముం దాయఁ బనులు కొంక నేఁటి కయ్యా ॥ పల్లవి ॥

యేకతాన మీ రుండఁగా నెఱఁగక వచ్చితిని
  వాకిట నుండే నన్ను వద్దనకుమీ
  రాకుండీ నే నీచేతి రవ్వలఁ బడఁగ రాను
  నీ కతలు చెప్పఁబోతే నివ్వెరగు లయ్యా ॥ యేల ॥

మాటలు మీ రాడుకోఁగా మరచి గక్కన వింటి
  [1]నాఁటదాన మగుడ న న్నడుగకుమీ
  నీటున నే నూరకున్న నిండుగర్వి నే ననేవు
  యేఁటికిఁ గొసర నీ మేలిటువంటి దయ్యా ॥ యేల ॥

కూడిన మీ కూటముల గురుతు గక్కనఁ గంటి
  వీడె మిచ్చి సిగ్గువడి వీఁగకుమీ
  యీడనె శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
  పాడిఁ బంతములు నీవే పనిగొంటి వయ్యా. ॥ యేల ॥ 14

## శంకరాభరణం

కానీవే అందు కేమీ కనుకొనే పను లెల్ల
  యీ నాటకములు నే నెఱఁగనివా ॥ పల్లవి ॥

పంతము లాడిన తానే భ్రమసీఁ గాక నాకు
  యింతలోనె యేమి దప్పె నెందు వోయీని
  వింత యడవులవెంట వెదకఁడా సీతఁ దొల్లి
  యెంత లేదు తనగుండె యెఱఁగనిదా ॥ కానీ ॥

బిగియుచునున్న వాఁడే బిలిచీఁ గాక నన్ను
  తగవులే నెరపేను దాని కేమే
  వెగటయి రాధాదేవివెంటవెంటఁ దిరుగఁడా
  యెగువనె తనగుట్టు యెఱఁగనిదా ॥ కానీ ॥

---

1. అఁడదాన అని అర్థము.

కడలనున్న వాఁడే కలసీఁగాక నన్ను
తడవకు వాని నిట్టె తతి రానీవే
అడరి శ్రీవేంకటేశుఁడట్టె నన్నుఁ గలసె
యెదయకున్నాఁడు నే నిది యెఱఁగనిదా. ॥ కానీ ॥ 15

గుండక్రియ

చాలుఁ జాలు నిఁకను నీ సట లేఁటికే
యీ లీల నే మొక్కితేను యెగసక్కె మనవా ॥ పల్లవి ॥
అవలిమోమై మాటలాడ నంటా నలిగేవు
చవిగాని మాట లాడ సంగతా నాకు
తవిలి నీమోహ మొక్కతరుణిపై నుండఁగాను
వివరించి నామోహము వేడుకపుట్టీనా ॥ చాలు ॥
రంతుల నే నీయింటికి రానంటాఁ గొసరేవు
వింతవా రింటికి రాఁగా వేడుకయ్యీనా
కాంత వేరొకతె నీకు కనుసన్న సేయఁగాను
దొంతుల మా చూపులు తొడుసులై యుండవా ॥ చాలు ॥
అట్టె నీతో నవ్వ నైతి నంటా సిగ్గు వట్టేవు
వట్టి నవ్వు నవ్వఁబోతే వడిఁబడదా
గుట్టున శ్రీవేంకటేశ కూడితివే నన్ను నిట్టె
దిట్టతనపు మా రతి తెల్లవార కుండీనా. ॥ చాలు ॥ 16

లలిత

పరమపురుషుఁడు గోపాలబాలుఁ డైనాఁడు
మురహరుఁడు యెదుట ముద్దుగారీ నిదివో ॥ పల్లవి ॥
వేదపురాణములలో విహరించే దేవుఁడు
ఆదిమూలమైనట్టి అలబ్రహ్మము
శ్రీదేవిపాలిటఁ జెలఁగే నిధానము
సేద దేరి యశోదకు శిశు వాయ నిదివో ॥ పర ॥

మొక్కేటి నారదాదుల ముందరి సాకారము
అక్కజపు జీవులలో అంతర్యామి
గక్కన బ్రహ్మఁ గొడుకుఁగాఁ గన్న పరమము
అక్కరతో వెన్నముచ్చె యాటలాడీ నిదివో ॥ పర ॥

దేవతలఁ గాచుటకు దిక్కయిన విష్ణుఁడు
భావము లొక్కరూపైన భావతత్త్వము
శ్రీవేంకటాద్రిమీఁద [1]జేరున్న యా వరదుఁడు
కైవసమై గొల్లెతల కౌఁగిళ్ళ నిదివో. ॥ పర ॥ 17

రీతిగౌళ

వెఱవకువయ్య నిన్ను వేసరించను
కఱకులాడఁగ నేను గబ్బిదాననా ॥ పల్లవి ॥

మోము చూడఁగా నీకు మొక్కితి నింతే కాని
కామించి యేపనులకుఁ గాదు సుమ్మీ
చేముంచి యాపె నీ చేయి పట్టు కుండఁగాను
వేమరు నే నాసపడ వెట్టిదాననా ॥ వెఱ ॥

గక్కనఁ జేయి వేయఁగ కైదండ యిచ్చితిఁ గాని
లెక్కసేయ నంత పనిలేదు సుమ్మీ
మక్కళించి మక్కళించి మాట లాపె యాడఁగాను
యిక్కడ నీసేవ సేయ నెడ్డదాననా ॥ వెఱ ॥

బడలి రాఁగా నీకు పాదము లొత్తితిఁ గాని
యెదసిసందుకుఁ బంత మీయఁ జుమ్మీ
అదరి శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
కొదిమె లింకా నెంచ గొల్లదాననా. ॥ వెఱ ॥ 18

404-వ రేకు. శుద్ధవసంతం

చూచినవా రెల్ల నన్నే సొరిది [2]నుప్పతింతురు
మా చనవు చెల్లించి మన్నించరాదా ॥ పల్లవి ॥

1. తే. పా.–జేరొన్న, 2. తే. పా.–ఉప్పటింతురు.

యేమి వొడఁబరచేవు యేల నిలుచున్నాఁడవు
గోమున నావద్ద నిట్టే కూచుండరాదా
నీమాట మీరేనా నీవే నేఁ గానా
వాము లాయ వలపులు వడిఁబెట్ట కింకను ॥ చూచి ॥

కనురెప్పలు వేయవు కడుఁ జేయి చాఁచేవు
యెనసి యేపొద్దు నీకు నిదే పనా
పెనఁగినా నీతోను బెట్టిమాట లాడేనా
తనిసితి మాటలనే తమి యింకా రేఁచేవు ॥ చూచి ॥

సింగారించు కొంటివి చెక్కులనే నవ్వితివి
కొంగుపట్టి కూడితివి కొంకు దీరెను
యింగితాన శ్రీవేంకటేశ నీ రతి మెచ్చితి
సంగతాయఁ బనులెల్ల సతమాయ మనసూ. ॥ చూచి ॥ 19

## శ్రీరాగం

నీ చిత్త మెట్టుండినా నీ కుండెఁ గాని
చేచేత మావంటివారు చెనకక మానరూ ॥ పల్లవి ॥

[1] మొకమోట గల సతి మొక్కనే నేరుచుఁ గాని
వెకలియై యెంతైనా [2] వెంగె మాడదు
అకటా నావంటి మంకులైన చెలులైతే నిన్ను
పకపక నవ్వి నిన్నుఁ బచ్చిసేయ కుందరు ॥ నీచి ॥

పొంది పొరసిన యింతి పొదుగ నేరుచుఁ గాని
సందడించి వాదడిచి సాదించదు
మందలించి నావంటి మంకులైన వారైతే
నింద వేసి తమనేర్పు నెరపనే చూతురు ॥ నీచి ॥

గుట్టు దెలిసినవారు గుణాన నుందురు గాని
వట్టి నిష్ఠూరము లాడి వలఁబెట్టరు
యిట్టె శ్రీవేంకటేశ యెనసి నావంటివారు
నెట్టన నీ రతిఁ గూడి నిన్ను బైపై మెత్తురు. ॥ నీచి ॥ 20

---

1. మొగమోట అని అర్థము, 2. వ్యంగ్య మని యర్థము.

కాంబోది

యేమనున్నదో నీ చిత్త మెఱఁగ నేను
దీముగా నిం కామీఁదఁ దెలుసుకొమ్మీ ॥ పల్లవి ॥

యెగసక్కెనకు నిన్ను నేమైనా నందుఁ గాని
పగటు నీమీఁద నాకుఁ బ్రాణము సుమ్మీ
అగ దయ్యీనని నీతో నాడుకో వెఱతుఁ గాని
మిగుల వలచినట్టి [1]మెలఁతఁ జుమ్మీ ॥ యేమి ॥

నవ్వులకు నీతో మిన్నక యలుగుదుఁగాని
నివ్వటిల్ల నీటు నీవే నేఁ జుమ్మీ
జవ్వనమదాన నిన్ను జంకించి దూరుదుఁ గాని
పువ్వువలె నందరితోఁ బొగడుదుఁ జుమ్మీ ॥ యేమి ॥

దార కాన గట్టుతోడఁ దల వంచుకుందుఁ గాని
మేరతో నీపై తమి మిగులాఁ జుమ్మీ
యీరీతి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కోరికలు కోటానఁగోట్లు సుమ్మీ. ॥ యేమి ॥ 21

ఆహిరి

వేగినంతా నిన్ను నేల వేసరించను
నీగతి దప్పకు చాలు నిండుకుందే నేను ॥ పల్లవి ॥

తనివి దీరని నీదయ [2]గలిగితేఁ జాలు
వొనరి నే నొక కొండై వుండే నేను
మన సిచ్చి నీవు నాతో మాటలాడితేఁ జాలు
వెనుబలము సేసుక విఱ్ఱవీగే నేనూ ॥ వేగి ॥

నిచ్చలు నే నొకమారు నిన్నుఁ గనుఁగొంటేఁ జాలు
పచ్చిదీరే వేడుకల బతికే నేను
చెచ్చెర నా విన్నపము చెవి యొగ్గి వింటేఁ జాలు
తచ్చి నీ మే లెప్పుడుసుఁ దలఁచే నేనూ ॥ వేగి ॥

1. తే. పా.—మెలత, 2. తే. పా.—గలితే.

తల యెత్తి నామోము తప్పక చూచితేఁ జాలు
వెలిలేని వలపుల వెలసే నేను
యెలమి శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
చలివాసి యిఁక నిన్ను జట్టిగొనే నేనూ. ॥ వేగి ॥ 22

సామంతం

యెరవు సేసుక యీతఁడేల దూరెనే
యిరవై తా నున్నాఁడంటా నేమి సేసేదే ॥ పల్లవి ॥

ముచ్చట లాడె నంటా మోహము చల్లె నంటా
యిచ్చకానఁ దనకు నే నేమి సేసేదే
కచ్చుపెట్టి వుండె నంటా కడగోర గీరె నంటా
యిచ్చటఁ దనకు సేవ యేమి సేసేదే ॥ యెర ॥

పక్కనఁ దా నవ్వె నంటా పైఁ జేయి వేసె నంటా
యిక్కడఁ దన కతల కేమి సేసేదే
మిక్కిలి వలచె నంటా మేలి మిట్టె యాడె నంటా
యెక్కడ నైనా వేసా లేమి సేసేదే ॥ యెర ॥

కన్నులనే మొక్కె నంటా కౌఁగిటికిఁ జిక్కె నంటా
యెన్నిక గురుతులు మై నేమి సేసేదే
నన్ను శ్రీవేంకటేశుఁడు నయమునఁ గూడె నంటా
యెన్ని మెచ్చు లని మెచ్చి యేమి సేసేదే. ॥ యెర ॥ 23

భవుళి

బతుకు మనవే యింకాఁ బైపైఁ దాను
రతికేల పిలిచేవే రానీవే తాను ॥ పల్లవి ॥

ముచ్చటలే యాడి యాడి మొదల నను భ్రమించి
చెచ్చెరఁ బంతాన కింత సేసేఁగా తానూ
వచ్చి వచ్చి చేయి వేసి వాఁడు మోముకళ రేఁచి
పెచ్చురేఁగి యింత అట్టుపెట్టెఁగా తానూ ॥ బతు ॥

నంటు సేసి నవ్వి నవ్వి నాఁటకాలే పచరించి
యింటనే జాగరము సేయించెఁగా తాను
వెంట వెంటఁ దిరిగాడి వేమారుఁ గరఁగించి
దంట తనమున నాకు దక్కెఁగా తానూ ॥ బతు ॥

సొలపులఁ జూచి చూచి సొమ్ము లెల్లా నాకు నిచ్చి
కొలఁది మీరఁగ నన్నుఁ గూడెఁగా తాను
యెలమి శ్రీవేంకటేశుఁ డింత నన్ను మన్నించి
బలిమి నురమెక్కించి పైకొనెఁగా తానూ. ॥ బతు ॥ 24

405-వ రేకు. ముఖారి

యేమే మీసేరు పెల్ల నిఁక నెన్నఁడే
మోము చూచి గుట్టుతోనె మొక్కవలెఁ గాకా ॥ పల్లవి ॥

మాటలాడుకో రాదా మనసు లొక్కటి గాఁగ
గాఁటపు తొల్లిటి మీలో కపట మేలా
ఆఁటదాని కింతయేల ఆతఁ డేమి సేసినను
నాఁటిన చూపులఁ జూచి నవ్వవలెఁ గాకా ॥ యేమే ॥

బాసలు సేసుకోరాదా పంతములు సరిగాఁగ
వేసరని మీలోని వెరగు లేల
సేస వెట్టిన వారికి చింతించ నిఁక నేల
ఆసతో నాయము లెల్ల నంటవలెఁ గాకా ॥ యేమే ॥

కాఁగిలించుకోరాదా కాఁక మీలోఁ దీరఁగ
[1]చేగ దేరే మీలోని సిగ్గు లేల
వీఁగక న న్నపుడే శ్రీవేంకటేశుఁడు గూడే
మాఁగిన మోవులతో సమ్మతిల్లవలెఁ గాకా. ॥ యేమే ॥ 25

ధవళ

యీపాటికి పాటియేరా నీవు నే
నేపున మితి మీరితి నిఁక నెంత సేతువో ॥ పల్లవి ॥

1. తే. పా.—చేంగ.

మంకుదనమున నొక్కమాట నీతో నాడితేను
కొంకక ఆదొక పెద్ద కొండ సేసేవు
జంకించి నిన్నుఁ గనక చలమునఁ దిట్టితేను
అంకెలఁ బేరిచి పేర్చి అపు దెంత సేతువో ॥ యీపా ॥

చెనక రాఁగా నిన్నుఁ జేయి వట్టి నిలిపితే
కినిసి యిందరినీ సాకిరి వెట్టేవూ
పెనఁగి నిన్నుఁ గనక బెండుపడఁ జేసితేను
మనసు కాంతాళముతో మరి యెంత సేతువో ॥ యీపా ॥

రతివేళ నీతోను రాజసాన నుండితేను
తతిఁగాఁక రేఁగి రేఁగి తమకించేవు
యితవై నన్నుఁ గనక యేలయించి నవ్వితేను
సతమై శ్రీ వేంకటేశ సట లెంత సేతువో. ॥ యీపా ॥ 26

హిందోళవసంతము

యేలే నాకు వేగిరము యింక నేమిటికి చింత
తాలిమి నాతఁడే నాకు దక్కి వుండీఁగాకా ॥ పల్లవి ॥

ప్రియ మెంత గలిగినఁ బిలువక వత్తురా
నయముగల దంటాను నవ్వ వచ్చునా
క్రియ యెఱిఁగినయట్టి [1]కిమ్ముల యిల్లాలికి
దయగలదాఁకా పతిఁ దగులుట గాకా ॥ యేలే ॥

బలి మెంత గలిగినాఁ బైకొనఁగ వచ్చునా
చల మీదేరీ నంటాను జంకింతురా
కులకాంతలకుఁ దమ గుణముతోనే పతి
తలఁపులో మెలఁగుటే తగ వింతే కాకా ॥ యేలే ॥

మన్నించి యెంత గూడినా మందెమేలము చెల్లునా
మున్నిటి సుద్దులు నేడు [2]మొనసేతురా
యన్నిటా శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టే నన్నుఁ గూడే
కన్నెనైన నా కితఁడే గతి యంట గాకా. ॥ యేలే ॥ 27

---

1. కిము శబ్దమునకు బదులుగా ప్రయోగింప బడినది.
2. ఇది మొనచేయు యను పదము.

శంకరాభరణం

బలుములు చూపఁగఁ బని లేదు
ఫలభోగము లవి భాగ్యముకొలఁదీ ॥ పల్లవి ॥

వంతుకు నీ కిటు వలచిన మాకును
పంతము లాడఁగ ఁబని లేదు
కాంతుఁ డని వేళ గాచుకుండఁగా
బంతుల నీ కృప భాగ్యము కొలఁదీ ॥ బలు ॥

యిచ్చకురాలనై యి టుండ నాకును
పచ్చిసేయ నినుఁ బని లేదు
చెచ్చెర నీసేవ సేసు కుండఁగా
బచ్చెన ముదములు భాగ్యముకొలఁదీ ॥ బలు ॥

తగిలి నీ కౌఁగిట తనిసిన మాకును
బిగివాయఁగ నిఁకఁ బని లేదు
అగడుగ శ్రీ వేంకటాధిప కూడితి
పగటురతులు మాభాగ్యముకొలఁదీ. ॥ బలు ॥ 28

గుండక్రియ

యెంతైన నేను నీయింతి ననరా
సంతసాన నుండితేను చన వియ్యవలదా ॥ పల్లవి ॥

నీవంటి రమణుఁడు నిచ్చ నాకుఁ గలుగఁగ
యేవల నారాజసము లెక్కుడే కాదా
భావించి నీవు రాఁగా నేఁ [1]బవ్వళించి వుంటి నంటా
వేవేలు దూరు లేల నీ విభవమే కాదా ॥ యెంతై ॥

యింతటి వాఁడవు నా యిచ్చలోనే వుండఁగాను
యెంత లేదు నాగర్వ మేమి చెప్పేది
పంతమాడి నేను నీపైఁ జేయి వేసితి నంటా
వింతమాట లాడేవు నీ వేడుకే కాదా ॥ యెంతై ॥

1. తే. పా.–పవ్వళించి.

కరుణానిధివి నా కౌఁగిటిలో నుండఁగాను
యిరవైన సంపదకు నేది మేర
నిరతి శ్రీవేంకటేశ నిన్ను నేఁ గూడితి నంటా
గరిమెతో మెచ్చేవు [1]కఅతలే కాదా. ॥ యెంతై ॥ 29

శంకరాభరణం

యెట్టుండినా నీవే నన్ను నీడేరించుకొంట గాక
మెట్టిపట్టుకొని నిన్ను మెప్పించఁ గలనా ॥ పల్లవి ॥

మట్టుతోడ నీతో నేమాటకు మాటాడే నంటే
జట్టిగొని నీకు నేను సరిదాననా
వొట్టుక నీవద్దనుండి వూడిగాలు సేసే నంటే
నెట్టన నే నంతేసికి నేరుపరినా ॥ యెట్టు ॥

చనవు సేసుక నీతో సారెకు నవ్వే నంటే
యెనసిన నీ చిత్త మెరుఁగుదునా
పెనఁగి పెనఁగి నీకుఁ బ్రియాలు వుట్టించే నంటే
వెనక ముందు నేనంత వివేకినా ॥ యెట్టు ॥

కరఁగించి నే నిన్ను కౌఁగిటఁ జొక్కించే నంటే
సరవితో నే నంత చదివితినా
నిరతి శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గూడితివి
దొరఁ జేసితివి నీవే దొడ్డదాననా. ॥ యెట్టు ॥ 30

406-వ రేకు. మధ్యమావతి

యింటికి విచ్చేయ వయ్య యేమైనాఁజేసేఁ గాని
కంటువాసినందుమీఁద కడుఁ దడ వేఁటికీ ॥ పల్లవి ॥

నేర మెంచఁ బని లేదు నీకు నాకు నిఁకఁ బోదు
వారివీరివలె బొంక వైపు గాదు
వోరి యని పిలిచితి వోపనని బిగిసితి
కోరి నీకే మొక్కితిని కోప మిఁక నేఁటికీ ॥ యింటి ॥

---

1. తే. పా.—కరత.

చలము సాదించ నేల సరుస నీకు నే నాల
యెలయించ నీవు నన్ను నిదె వేళా
తొలుత నేఁ బదరితి దొమ్మి నిన్నుఁ జేసితిని
వలచి వచ్చితి నిఁక వట్టి పగ లేఁటికీ ॥ యింటి ॥

జగడము లింత గద్దా సరి [1]నున్నదాన నీవొద్ద
విగడా లిన్నియు నిఁక వినవద్దా
నిగిడి శ్రీవేంకటేశ నిన్నే నేఁ గూడితిని
తగులమయిన మీఁద తమకము లేఁటికీ. ॥ యింటి ॥ 31

## పాడి

ఆతనితో నీమాటే అనరమ్మ చెలులు చే
చేత నేనే అనే నంటే సిగ్గయ్యీ నాకూ ॥ పల్లవి ॥

వలపే నాకుఁ [2]గలిగితే వద్ద నాతఁ డుండఁడా
వెలయునా బత్తి యిదె వెట్టి గాఁబోలు
నలి నేనే ఆల నైతే నాతో నాతఁడు నవ్వఁడా
బలిమి నేఁ బిలిచేది భ్రమ గాఁబోలు ॥ ఆత ॥

నేనే తనకు నోమితే నిలిచి మాటాడఁడా
పూనిన నామేని కాఁక బొంకు గాఁబోలు
తానే నే నని యుంటే తల యెత్తి చూడఁడా
మాననీ నా యడియాస మంకు గాఁబోలు ॥ ఆత ॥

తను మెప్పించ నేర్చితే దయ నాపైఁ జేయఁడా
చనవరి నే నైనది సట గాఁబోలు
పనివడి శ్రీవేంకటపతి నన్ను నేఁడు గూడె
మనికైన యీ రతులు మన్నన గాఁబోలు. ॥ ఆత ॥ 32

## గుండక్రియ

మొక్కితి నని చెప్పరే మొదలనే తనకును
చెక్కుచేతితోడఁ దనసేవ సేసేవారము ॥ పల్లవి ॥

---

1. తే. పా.—నుందాన, 2. తే. పా.—గలితే.

జగడాలు దీరు మని సారె సారె మిమ్ము నంపె
మగవారికి బలువా మగువలమూ
బిగిసేవారమా తన ప్రియములోవారము
తగిలితే మరిఁ దన దయలోనివారము ॥ మొక్కి ॥

వేమరు నల్లంతనుండి విరుల నేల వేసీనే
కామునమ్ముల కెక్కుడా కాంతలమూ
రా మనేటివారమా రతిలోనివారము
ఆమీఁదటి పనులకు నఱచేతి వారమూ ॥ మొక్కి ॥

చలము సాదించి తాను సారెఁ బైఁ జేయి వేసి
వలపులకు వేళా వనితలమూ
అలరి శ్రీవేంకటేశుఁ డట్టె నన్నుఁ గూడె నిదె
మలసితే నింకాఁ దన మనసులోవారమూ. ॥ మొక్కి ॥ 33

లలిత

విసిగేవు సుమ్మీ నీవు విడువ నంటా నాపై
వసమైన దానఁ గాన వదల నే నిన్నును ॥ పల్లవి ॥

యీడా నాడా నుండి నన్ను నెంత విచారించకున్నా
నాడుకొందు నేను నీ యాల నంటాను
వోదక యిట్టె నీవు వొద్దికిఁ బిలువకున్నా
తోడునీడనై వుందు తొలఁగి పో నెపుడు ॥ విసి ॥

మొగము చూచి నీవు మోనాన నట్టె వుంటే
నగుదు నూరకయైన నవ్వు నేసుక
వొగరుఁ దీపుగా నీవు వోరగండ్లఁ జూచినా
మగటిమిఁ బూసగొండిమాట లెల్లా నాడుదూ ॥ విసి ॥

అంతలో నీవు విచ్చేసి ఆయములు ముట్టితేను
సంతసాన నీ మోవి చవిగొందును
కాంతుఁడ శ్రీవేంకటేశ కలసితి విట్టె నన్ను
పంతాన నిందుకే నిన్నుఁ బలుమారు మెత్తును. ॥ విసి ॥ 34

సామంతం

అటువంటివాఁడా అతఁడు మాయెడకు
ఘటన నిప్పుడే నన్నుఁ గరుణించ కుండునా ॥ పల్లవి ॥

వేల నంటి మా కెల్ల వేగిరించ వచ్చునా
యేలిన యాతని చిత్త మింతే కాక
తాలిమి నాతఁ దేఁమైనా దయలేనివాఁడా
వోలి నూర కేమిటికో వున్నాఁడు గాకా ॥ అటు ॥

పిర రేఁచి యాతనినేఁ బిలిపించవచ్చునా
మరిగిన రమణుని మన్ననే కాక
సర వెరిఁగినయట్టి సరసుఁడు గాఁడా
వొరసి యేమి దలఁచి వున్నాఁడో కాకా ॥ అటు ॥

పచ్చిసేసియాతని నే భ్రమయించవచ్చునా
యెచ్చటా శ్రీవేంకటేశు హితవే కాక
మెచ్చ నేరిచినయట్టి మేలువాఁడు గాఁడా
వొచ్చెము దీరుచఁ గాచుకున్నాఁడు గాకా. ॥ అటు ॥ 35

శ్రీరాగం

నీ చిత్తముకొలఁది నే నడచుట గాక
చూచి చూచి నీతోఁడిసూడు నాకుఁ జెల్లునా ॥ పల్లవి ॥

పంతము లాడఁగ నేల పైకొని మొక్కుట గాక
వంతు లేక వలచు నావంటి దానికి
అంతటి మీఁదట నీవు అన్నిటాను దొరవు
కొంతైన నీ మీఁదఁ గోపగించఁ జెల్లునా ॥ నీచి ॥

కపటము లిఁక నేల కన్నుల నవ్వుట గాక
యెపుడును నావంటి యిల్లాలికి
నెపమునఁ దొలుతనే నీయిచ్చ రాజవు
విపరీతముగ నిన్ను వెగ్గళించఁ జెల్లునా ॥ నీచి ॥

కావరించ నిఁక నేల కౌఁగిలించు కొంటగాక
కైవసపు నావంటి కాంతకును
శ్రీవేంకటేశ్వర నీవే చేరి నన్నుఁ గూడితివి
ఆవటించి యిఁక నిన్ను నలయించఁ జెల్లునా. ॥ నీచి ॥ 36

407-వ రేకు. రామక్రియ

చంచలగుణము నాది సరి ధీరుఁడవు నీవు
నించి నీ మేలే నాపై నెరపవయ్యా ॥ పల్లవి ॥

సరి నెఱుఁగుదు నాపై సారె బత్తి [1]గలుగుత
తరవాతికె రాకున్నఁ దమకింతును
కరఁగుదు నీవు నాపైఁగల మన్నన దలఁచి
తెరమరఁగైతే నే తెగువలె యాడుదు ॥ చంచల ॥

వా దడుతుఁ జెలులతో వడి నీవు బొంక వని
నా దెస చూడ కుండితే నమ్మకుండుదు
సాద వని పొగడుదు సరి నెదురాదకున్న
కా దందు నీవు పరాకై కడు నవ్వితేను ॥ చంచల ॥

చే యెత్తి మొక్కుదు నీవు చేసన్న సేసితేను
చాయ సేసుకుండితేను సాదింతును
యీయెడ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కాయజకేలికే నిన్నుఁ గమ్మరఁ బిలుతును. ॥ చంచల ॥ 37

గుండక్రియ

యీడగుఁ బెండ్లి యిద్దరిఁ జేసేము
చేడెలాల యిది చెప్పరుగా ॥ పల్లవి ॥

పచ్చికబయళ్ళఁ బడఁతి యాడఁగా
ముచ్చటఁ గృష్ణుఁడు మోహించి
వెచ్చపు పూదండ వేసి వచ్చె నట
గచ్చుల నాతనిఁ గానరుగా ॥ యీడ ॥

1. తే. పా.—గలుత.

ము త్తెపు ముంగిట ముదిత నడవఁగా
వుత్తముఁ దే చెలివురముననూ
చిత్తరువు వ్రాసి చెలఁగి వచ్చె నొక
జొత్తు మాని యిటు చూపరుగా ॥ యీద ॥

కొత్త చవికెలోఁ గొమ్మ నిలిచితే
పొత్తునఁ దలఁబాలు వోసెనటా
యిత్తల శ్రీవేంకటేశుఁడు నవ్వుచు
హత్తి సతి గూడె నని పాదరుగా. ॥ యీద ॥ 38

సౌరాష్ట్రం

యెఱపరికము లేల యెంత సేసేవూ
[1]తఱవాతి పనులకుఁ దడవు గాదా ॥ పల్లవి ॥

కన్నుల కలికి నీకుఁ గాచుకున్న దదివో
వెన్నెలబయట నీవు విచ్చేసు దాఁకా
న న్నేల యెలయించేవు నాతో నేల నవ్వేవు
యిన్నేసి మాయలకుఁ జో టీద నున్నదా ॥ యెఱ ॥

ఆసలఁ బొరుగుచెలి ఆలకించినదివో
వేసాల నీ మాట లెల్ల విన్నదాఁకాను
గాసిఁబెట్టకు నన్ను యేకతములు మాను నాతో
నీసటల కింతేసికల్లా నే నోపెనా ॥ యెఱ ॥

మునుపే ని న్నాపె గూడి మోము చూచినదివో
ననుపై సోరణగండ్ల నప్పు కొంటేను
యెనసితి విదె నన్ను యిప్పుడె శ్రీవేంకటేశ
వెనకే నీ చేఁతలకు చెప్ప నున్నదా. ॥ యెఱ ॥ 39

సామంతం

యిప్పుదే విచ్చేసితి విఁక నేలా
అప్పటప్పటి యాసల నలసె నా మనసూ ॥ పల్లవి ॥

---

1. తరువాతి యని యుండవలెను, ప్రాసకై ఱ వ్రాయబడినది.

పిలిపించే వనీ యట్టే ప్రేమతోఁ గాచు కుందితి
చెలుల నంపే వంటాఁ జెంగలించితి
అలరి నీవే వచ్చే వంటా నెదురుచూచితి
వెలలేని వేడుకల వేగెఁ బొద్దు నాకును ॥ యిప్పు ॥

యింటిలో నున్నాఁడ వంటా నింతటాను వెదకితి
కంటి నంటా నీడ చూచి గడె వెట్టితి
అంటఁ బారి పట్టఁబోయి ఆయములు మరచితి
వెంటనే నాభ్రమ తల వేగెఁ బొద్దు నాకును ॥ యిప్పు ॥

సారె సారె నిన్నుఁ బాడి జాగరాలు చేసితిని
నీ రూపు దలపోసి నివ్వెరగైతి
యీ రీతి శ్రీవేంకటేశ యిట్టెనన్నుఁ గూడితివి
వే రతికేలి మన్నన వేగె బొద్దు నాకును. ॥ యిప్పు ॥ 40

దేసాళం

యింక నేల మా విన్నపా లిన్నియు నిందే వున్నవి
[1]సంకు దీరె మాకు మీకు సారె మొక్కేమయ్యా ॥ పల్లవి ॥

యెప్పుడు చూతునో యంటా యింతి నిన్నుఁ దలపోసి
చిప్పిలఁ దన చెక్కులు చెమరించెను
అప్పుడే నీవు విచ్చేసి ఆపెమోము చూచి నవ్వి
విప్పుచు సురటిఁ గొని విసరితి వయ్యా ॥ యింక ॥

యేమాటో నిన్నాదే నని యెదుట నీవుండఁగాను
మోమోటానఁ బులకించి మోనాన నుండె
ఆమాటే నీవు నాడి అంగన మే నెల్లా నింద
చే ముట్టి గందవొడి నించితి గద వయ్యా ॥ యింక ॥

ఇట్టె నిన్ను నిలిపి ఇచ్చకము సేసే నంటా
దట్టమై శ్రీవేంకటేశ తమకించెను
అట్టి నీవూ నిలిచి అతివఁ గూడి మరియు
మట్టు మీరఁ జన విచ్చి మన్నించితి వయ్యా. ॥ యింక ॥ 41

1. తే. పా.—సంకె. జంకు యని యుండదగును.

సాళంగం

చేసిననేరమి నీతోఁ జెప్పక పోదు
దోసము లే దనవయ్య తొత్త నీకు నేను ॥ పల్లవి ॥

సడిఁ బెట్టినట్టి నా సవతి మచ్చరమున
తొడిఁబడ నూరకే దూరితి నిన్ను
జడిగొన్న ఆపెతోడి జగడపువేళ నిన్ను
వడి నాకాలు దాఁకినా వంగి మొక్క నైతిని ॥ చేసి ॥

గాఁటపుఁ బొరుగువారి కాంతాళపుఁ బరాకున
* మాటాడినా నీతోడ * మాటాడ నైతి
నాఁటఁగ నాపెఁ దిట్టుతా నా తమ్మ నీపైఁ బడితే
పాటించి తుడువ నైతిఁ బంత మియ్య నైతిని ॥ చేసి ॥

దిమ్మరేఁచే వారితోడఁ దిట్లాడే పరాకున
యెమ్మెతో నీవు వచ్చిన [1] దెఱఁగ నైతి
కమ్మక శ్రీవేంకటేశ గక్కున నన్నుఁ గూడితి
నెమ్మది నా సంతసాన నిన్ను మెచ్చ నైతిని. ॥ చేసి ॥ 42

408-వ రేకు. కేదారగౌళ

చేముట్టఁ జుమ్మీ నీవు సేసినందుకు
యే మొదు నే నీకు నేల మొక్కే వయ్యా ॥ పల్లవి ॥

నవ్వఁ జుమ్మీ నే నీతో నాఁడు నీవు రానందుకు
నవ్వులు నీ లోలోనే నవ్వుకో వయ్యా
అవ్వలి మోమైతిఁ జుమ్మీ ఆపె యింట నున్నందుకు
యెవ్వతెను నీకు నేను యేల పట్టే వయ్యా ॥ చేము ॥

మాటాడఁ జుమ్మీ నీవు మాయలు సేసినందుకు
[2] మాటలు నీలో నాడుకో మాతో నేలయ్యా
నీటునఁ దిట్టితిఁ జుమ్మీ నీ సుద్దులు విన్నందుకు
యేఁటికి బాఁతి మమ్ము నేల చూచే వయ్యా ॥ చేము ॥

* తే. పా.—మాఁటాడినా, 1. తే. పా.—దెరఁగ, 2. తే. పా.—మాఁట.

కౌఁగిలించఁ జుమ్మీ నీవు కాఁకలు సేసినందుకు
కౌఁగిట నీకు నీవె కైకొనవయ్యా
వీఁగక శ్రీవేంకటేశ వేగ నన్నుఁ గూడితివి
యేఁగుఁ బెండ్లి నేఁ డాయ నేల మెచ్చే వయ్యా. ॥ చేము ॥ 43

రీతిగౌళ

దగ్గరి నీ వున్నప్పుడే తలఁచఁ గాని
సిగ్గున నేకతవేళఁ జింతింతురా ॥ పల్లవి ॥

నీవే కావలెఁ గాక నిచ్చ నే నాదేమాటకు
వేవే లైనా నోఁతురా వే రొకరు
తావున నే నొకవేళ తలపోసి చూచుకొని
కావిరి నా లోలోనే కరఁగుదురా ॥ దగ్గ ॥

నీ మనసే కావలె నే సొలసే సొలపుల
వోమి(?) విరుగకుండునా వుండఁ బోఁటిది
ఆ మేలు నాకు నాకె అప్పటప్పటి కెంచుక
వేమరుఁ దల వూఁచుక వెర గౌదురా ॥ దగ్గ ॥

నీ నేరుపే కావలె నే బిగిసేయందు కెల్లా
పూనుక మరొకపైతే పొందు గూడునా
నే నిట్టె శ్రీవేంకటేశ నీ నా రతి నేఁడు చూచి
నానఁగాఁ గలకాలము నవ్వుకొందురా. ॥ దగ్గ ॥ 44

సామంతం

యెంత [1] జాణరో యీ కలికి
కాంతుఁడ నీ భోగములకే తగునూ ॥ పల్లవి ॥

చెలి నీకౌఁగిటిచెమటలఁ జేసెను
చలువగ నిప్పుడు జలకేలి
అలరుచుఁ గుచముల నదుముచుఁ జేసెను
పలుమరు ముదములఁ బర్వతకేలి ॥ యెంత ॥

1. తే. పా.—జాణకో.

పైపైఁ బెనఁగుచు బాహులతలనే
వైపుగఁ జేసెను వనకేలి
చూపుల నీపయి సొలయుచుఁ జేసెను
పూఁపవసంతము పూవులకేలి ॥ యెంత ॥

అరుదుగ నట్టివి యధరామృతముల
సరిఁ జేసెను భోజనకేలి
కరఁగుచు శ్రీవేంకటేశ సేసేను
పరగిన రతులనె పరిణయకేలి. ॥ యెంత ॥ 45

దేసాళం

అన్నియుఁ గనేఁ గాక అప్పటి నేను
యెన్నరాని వేడుకల నెందు వోయే నేనూ ॥ పల్లవి ॥

అతివేషముల నీవు ఆన లెల్లాఁ బెట్టుకోఁగా
పతి మాటలాడ నాకుఁ బంతమా నీతో
జతనాన నీ గుణము చక్క నుంచేఁ జాలుఁ గాక
గతి నీవే అది నా భాగ్యము గాదా ॥ అన్ని ॥

తగవు లుపచరించి తారుకాణకు రాఁగాను
జగడించ నాకు నేఁడు చలమా నీతో
వగదీర నీవె నావద్ద నుంచేఁ జాలుఁ గాక
తెగని నాపాలిటి దేవరవు గావా ॥ అన్ని ॥

మచ్చిక కౌఁగిటి నించి మంచ మెక్క మనఁగాను
హెచ్చి నిన్ను దోయఁగ నే నెదురా నీతో
అచ్చమై శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
కొచ్చి కొచ్చి నేఁ గోరినకోరి కిదే కాదా. ॥ అన్ని ॥ 46

ముఖారి

యేది నీ జాణతన మిందులోనను
సోదించి నీ యెమ్మె నన్ను సూడు వట్టీనా ॥ పల్లవి ॥

చేరి నీవు రాఁగాను సిగ్గువడి వొదిగితే
ఆ రీతి నూరకే తిట్టేవమ్మ మీఁదను
మారుకు మారు నిన్నంటే మరి యేమి సేసేవు
నీ రాజసము మా పయి నెపము వేసీనా ॥ యేది ॥

ముప్పిరి నీవు చూడఁగా ముసుఁగు నేఁ బెట్టుకొంటే
వొప్పుగఁ బూవుల వేసె వొళ్ళు దాఁకను
అప్పటి నే నిమ్మపంట నట్టె నిన్ను వేసితేను
కప్పి నీ నేరుపు నాపై ఘాత నేసీనా ॥ యేది ॥

నెట్టన నీవు పైకోఁగా నివ్వెరగుతో నుండితే
వొట్టి మదనముద్రలు వొళ్ళ నించితి
గుట్టుతో శ్రీవేంకటేశ కూడితి నేనే నిన్ను
దిట్ట నీ నవ్వులు మమ్ము దిమ్మరేచీనా. ॥ యేది ॥ 47

పాడి

నీ వెంత సేసినాను నీ చిత్త మింతే కాక
కైవసమైన యాతఁడు కాంతాళించీనా ॥ పల్లవి ॥

నెట్టుకొని యీడనుండి నీతోనే మాటలాడీ
పట్టిన చలము మాని పలుకరాదా
యిట్టె యెందో వుండె నంటా నింత సేతురా నీవు
గుట్టుతోడివాఁ డతఁడు కోపగించీనా ॥ నీవె ॥

అప్పటి నీ తిట్లకు నాతఁ డట్టే నవ్వీ
రెప్ప లెత్తి చూడరాదా రేసు లేఁటికే
చెప్పించుకొందురా నీవు చేతికి లోనైనందుకు
తప్పులేవివాఁ డతఁడు తమకించీనా ॥ నీవె ॥

కన్నులనే నీకు మొక్కి కౌఁగిలించీ నాతఁడు
యిన్నేసి మతకా లేల యెనయ రాదా
సన్నల శ్రీవేంకటేశుఁ జన విచ్చి కూడితివి
మన్నించి లోనై నతఁడు మారుకొనీనా. ॥ నీవె ॥ 48

409-వ రేకు. భౌళి

యెంతైన నా వోజ మానఁ దేమి సేతును
అంతరంగ మెల్లా నాతో నానతియ్యవయ్యా ॥ పల్లవి ॥

నీ మన్నన పట్టుకొని నే నిందరీ నవ్వుదును
వేమరు నా రాజసాన విఱ్ఱవీఁగుదు
చేమించి యిదెల్లా నీ చిత్తము వచ్చునో రాదో
ఆ మాట నాతో నీవానతియ్యవయ్యా ॥ యెంతై ॥

పెంచిన మందెమేళాన పెక్కు వెంగే లాడుదును
కొంచక సవతులను కోపగింతును
పంచల నీ వలపు లేపడఁతిపై నుండునో
అంచు మోవ నాకు నదే ఆనతియ్యవయ్యా ॥ యెంతై ॥

యెనసినసంతసాన యెవ్వరినిఁ గైకోను
చనవున బొమ్మలనే జంకింతును
వొనర శ్రీవేంకటేశ వొక్క ప్రేతి మిద్దరము
అనుమాన మెల్లఁ బాసె నానతియ్యవయ్యా. ॥ యెంతై ॥ 49

భవుళి

ననుపులేనిచనవు నా కేలయ్యా
యెనసినవారిమాటే ఇంపులు గాక ॥ పల్లవి ॥

తగవులఁ బెట్టి పెట్టి తమకించి నిన్నుఁ దిట్టి
నగి నిన్ను సాదించ నా కేలయ్యా
మొగము చూడఁగా నీ మోహపు మన్ననవారే
అగ డెంతసేసినాను అమరుఁ గాకా ॥ నను ॥

సటలకే మొక్కు మొక్కి సంగడి నీ కాలు దొక్కి
నటనలే పచరించ నా కేలయ్యా
ఘటన మందెమేళాన గద్దించేవారే నీకు
చిటుకన నీ సేవలు సేసేరు గాక ॥ నను ॥

కమ్మటి సన్నలు సేసి కాతరాన గురి వాసి
నమ్మ నంటా బా సడుగ నా కేలయ్యా
యిమ్మల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
యెమ్మెలు నీ వెవ్వరైనా నెఱిఁగేరు గాకా. ॥ నను ॥ 50

దేవగాంధారి

బడలి వున్నది మోము పచ్చి దేరీని
చిడిముడిఁ బన్నీరు చిత్తగించవయ్యా ॥ పల్లవి ॥
విందువలె మా యింటికి విచ్చేసితి విన్నాళ్ళకు
[1]కుందనపు పీఁటమీఁదఁ గూచుండవయ్యా
వొందిలి నిన్నంతేసి వుపచరించ నేరము
అందపు నా చిలుకప్రియము వినవయ్యా ॥ బడ ॥
నా మోమై నన్నుఁ జూచి నవ్వితి విన్నాళ్ళకు
కామించినా జవ్వనమేకా ని కేదయ్యా
యే మనవలెనో నీతో నెఱఁగము మాటాడ
ఆమని మా మోవితేనె లారగించవయ్యా ॥ బడ ॥
కోరి నాపైఁ జేయి వేసి కూడితి విన్నాళ్ళకు
కేరుచుఁ జుట్టమవు మొక్కిఁచుకోవయ్యా
యీ రీతి శ్రీవేంకటేశ యిత వేదో తెలియము
నేరుపు నీబుద్ధి నాకు నేఁడు గృపనయ్యా. ॥ బడ ॥ 51

సాళంగం

నీవేమి సేతువయ్య నీవు మంచివాఁడవు
ఆవల నీపాపము నిన్ననఁ జోచేది ॥ పల్లవి ॥
పాయపు నా వయసేకా పాసినప్పుడెల్ల నిన్ను
తోయపుమాటల నిన్ను దూరించెను
దాయి దండయినా తమకము లివియేకా
నేయరాని వినయాలు నేయించెను ॥ నీవే ॥

1. వే. పా. కుందణపు.

తెగని నామనసేకా ఉన దినమాసలనే
వెగటుగ నీ వెంటవెంటఁ దెప్పించె
మొగము చూచి నా మొగమోట మిదియేకా
నగుతానేమిటికైన నన్నేడి గట్టించెను ॥ నీవే ॥

పొంచిన నా జన్మమేకా పొందు సేసీ నీతోడ
లంచపు కౌఁగిట లోలో లంకె బెట్టెను
యెంచఁగ శ్రీవేంకటేశ యిట్టె నన్ను గూడితివి
మించిన నారతులెల్ల మెప్పించెనూ. ॥ నీవే ॥ 52

దేసాళం

యింకాఁ జిన్నకూఁతురా యింతేలమ్మా
పొంకపు జవ్వని కిట్టే బుద్ధి చెప్పరమ్మా ॥ పల్లవి ॥

నెలవి నవ్వులుదేరి సిగ్గులు మోమునఁ గారీ
అలివేణి నిదేలని యడుగరమ్మా
బలిమిసేసి యతఁడు పైఁజేయి వేయఁగాను
వులికి గోళ్ళఁ జిమ్మి నొద్దనరమ్మా ॥ యింకా ॥

కన్నులకుఁ గెంపులెక్కె కాయము లోలోఁజొక్కె
యిన్నేసి సుద్దులు దనకెక్కడి వమ్మా
సన్నలు సేసి విభుఁడు చనవు మెరయఁగాను
నిన్నటనుండి యలిగీ నేఁడు మొక్కరమ్మా ॥ యింకా ॥

తమకము మతి నిండెఁ దపము లన్నియుఁ బండె
సముకాన మోనములు చవి గావమ్మా
అమర శ్రీవేంకటేశుఁ డాదరించి కూడఁగాను
జమలి పంతము లిట్టే సరిఁ దూఁగినమ్మా. ॥ యింకా ॥ 53

దేశాక్షి

నే నున్నదాన నని నీ విటు లోఁగక
పూని యాపెనే పొగడుమీ విభుఁడా ॥ పల్లవి ॥

ఘనకుచగిరు లటు గదలఁగ వడిగా
వనిత నీ కెదురు వచ్చినదే
పెనఁగక నీ కాపె ప్రియములు చెప్పిన
చెనకి నీ వా పని సేయుమీ విభుఁడా ॥ నేను ॥

దవ్వుల మొక్కులఁ దతిగొని మాటల
జవ్వని వలపులు చల్లినదే
రవ్వగఁ గొఁగిట రతికిఁ దీసితే
నవ్వక కూడుమీ ననుపున విభుఁడా ॥ నేను ॥

మంతన మెఱఁగక మఱి నినుఁగూడుచు
కాంత పయ్య దటు గప్పినదే
యింతలో శ్రీవేంకటేశ ననుఁ గూడితి
వంతయు నాపెనే అడుగుమీ విభుఁడా. ॥ నేను ॥ 54

410-వ రేకు పిసాళం

మరిగి మూసి దాఁచ మన కేల
సొరిది నాతని కీపెఁ జూపరమ్మా ॥ పల్లవి ॥

చెక్కునఁ జేయి వెట్టుక చింతలఁ జిగురులమ్మీ
నిక్కువ విరహవేళ నీ లేమ
చొక్కపు విభుఁడు వేఁడె సుంకము దనకు వచ్చు
చిక్కెఁ దనపాలిటికిఁ జెప్పరమ్మ చెలులు ॥ మరిగి ॥

మనసునఁ గాంతాళించి మల్లెలఁ బువ్వులు గోసీ
యెనలేని తమకాన నీ యింతి
అనుగు విభుఁడు వాఁడె [1]అరిగోలు దనసొమ్ము
వెనక ముందర విన్నవించరమ్మ చెలులూ ॥ మరిగి ॥

ముంచిన కూటములనె మోవులఁ బండ్లు దాఁచీ
నెంచరాని యడియాస నీ లేమ
యెంచక శ్రీవేంకటేశుఁ డింతలోనే యీపెఁ గూడె
నంచెల నితనిఁ గొనియాడరమ్మ చెలులు. ॥ మరిగి ॥ 55

1. తే. పా.-అరెగోరు.

మంగళ కౌశిక

యెక్కడ వొయ్యేము మనమింతలోననూ
వెక్కసాలు సేయఁబోతే వెగటులై తోఁచవా ॥ పల్లవి ॥

వావులు దెలిపి నే నే వచ్చితే నవ్వేవు గాక
చే వట్టి తియ్యకువయ్య చెప్పేఁ గాని
మోవి చూపి మాటాడితే మోహము చల్లేవు గాక
యీవేళ వేగిరించితే నెగసక్కెము గాదా ॥ యెక్కడ ॥

చేతు లెత్తి మొక్కి చేఁతనేసితే మెచ్చేవు గాక
కాతరించ నేటికయ్యా కైకొనెఁ గాని
యీతల నేఁ గొసరితే యియ్యకొనె దప్పుతింతే
యేతులకుఁ బెనఁగితే నిచ్చకము లనరా ॥ యెక్కడ ॥

పంత మెచ్చి నీ కొంగు పట్టితేఁ గూడేవు గాక
అంతలోనె కలసితి వదేమో కాని
చెంతల శ్రీవేంకటేశ చెల్లు నీకు నాకు నివి
మంతనాలు నెరపితే మాయలై నిలువవా. ॥యెక్కడ॥ 56

శంకరాభరణం

చెప్పఁగఁ జాలర సిగ్గుననూ
అప్పుడే నవ్వుల నలసితిని ॥ పల్లవి ॥

పాయకురా ననుఁ బైకొని నీ
మాయల వలపుల మరిగితిని
చేయి వేసి యింకాఁ బెనకేవా నీ
కాయపు సోఁకులఁ గరఁగితిని ॥ చెప్పగ ॥

మానకురా యిటు మాటాడీని
నానుడిబాసలు నమ్మితిని
కానీ లే యెఱుఁగుదుఁ గత లేల
నేనే నీ పై నెగడితిని ॥ చెప్పగ ॥

విడువకురా వేయి వే యైనా
వుడివోని రతుల నొనరితిని
కడఁగిన శ్రీవేంకట విభుఁడా నీ
[1]గుడికొను కౌఁగిటఁ గూడితిని. ॥ చెప్పగ ॥ 57

మాళవిగౌళ

యెందుకైన వత్తువు ని న్నెవ్వఁ డెఱుఁగు
నిందలకు వెరవవు నిలవయ్య చాలును ॥ పల్లవి ॥

వాసు లెక్కించి యెక్కించి వద్దన్నా మానక
యీసులు రేఁచితివి మా యిద్దరిలోన
వోసరించి మమ్మప్పటి నొడఁబరచ వచ్చేవు
నీ సుద్దు లెంత లేదు నిలవయ్య చాలును ॥ యెందు ॥

సన్నలు చేసి చేసి చలాలకే పోనీక
యిన్నేసి చేసితివి మా యిద్దరిలోన
నన్ను నాపెఁ గూడు మంటా నాయముఁ జెప్ప వచ్చేవు
నిన్న నే యన్నిఁ గంటిమి నిలవయ్య చాలును ॥ యెందు ॥

నగవులు నగి నగి నాటకాలకోప మన్న
యెగసక్కెలు చేసితి విద్దరిలోన
జిగి నిద్దరిఁ గూడితి శ్రీవేంకటేశుఁడ మమ్ము
నిగిడె నీ మతకాలు నిలవయ్య చాలునూ. ॥ యెందు ॥ 58

సాళంగం

అందుకు నే వద్దనేనా అయ్యో నిన్ను
మందలించి యిదె నొకమాయ సేయవలెనా ॥ పల్లవి ॥

విరహవేద నేవేళ విసిగిన నా విసువు
అరసి యెగ్గులు వట్టె వది యేరా
పొరి నెవ్వతింటికైనాఁ బోవలసో యీపొద్దు
వొరసి నాపై నిదొక మాల వేసేవు ॥ అందుకు ॥

---

1. తే. పా.–గుడిగొను.

ననిచి యేకతవేళ నవ్వినట్టి నవ్వులు
యెనసి రచ్చలఁ బెట్టే విది యేరా
మనసురానివాఁడవు మతకాలు సేసి నేను
పెనఁగఁ గానె నాతో బిగువు లాడేవూ ॥ అందుకు ॥

భావపరవశమునఁ బలికిన పలుకులు
చేవల వాఁడిసేసేవు చెల్లఁ బోయెరా
యీవల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
నావద్ద నుండవలసి నన్నుఁ గొసరేవూ. ॥ అందు ॥ 59

హిందోళవసంతం

ఆపెతో నిన్నియుఁ జెప్పేద [1]దెఱఁగను
తేపగాఁ దనగుణాలు తెలిసెఁగా నాకునూ ॥ పల్లవి ॥

జగడాలు మానెఁగా సరుస వెనకటివి
యెగసక్కె లింక నెట్టయినఁ జేయనీ
నగితి నే నెఱఁగక నామగఁ డంటానే
పగవానివలె నింత [2]పఱచే [3]దెఱఁగనూ ॥ ఆపెతో ॥

మోములు చూచితిమిగా మోనాన నిద్దరమును
ఆమీఁదటిపనులు యెట్టయినాఁ గానీ
దోమటివీడె మిచ్చితిఁ దొల్లిటివలె నంటానే
వేమరు నేఁ దన కింత వేసటా [4]తెఱఁగనూ ॥ ఆపెతో ॥

మనసులు గరఁగేఁగా మదనకేలిలోన
ననుపు లన్నియును నే నడపేఁ గానీ
వొనరి శ్రీవేంకటేశుఁ దొక్కపైతి నంటానే
చెనకితి గోర నిదిసి గ్గవు [5]టెఱఁగనూ. ॥ ఆపెతో ॥ 60

411-వ రేకు సాళంగనాట

కోరో కోరో రారో కోరి విడేలు
సారె సారె నిందరికిఁ జాటితిమి సుండి ॥ పల్లవి ॥

1. తే. పా.—దెరంగను, 2. తే. పా.—పరచేదె, 3. తే. పా.—దెరంగనూ,
4. తే. పా.—తెరఁగను, 5. తే. పా.—టెరంగనూ.

పాలవారి పిన్నదాని బలిమిఁ బెండ్లి సేయఁగ
నాలఁ గాచే శ్రీకృష్ణునికే నడిగేరు
వోలివెట్టి అంతలోనె వుంగరముఁ బెట్టినారు
నీలవర్ణు సోబనము నేఁడే సుండి ॥ కోరో ॥

చందమామ తోఁబుట్టుగు సరి నందగోపుని
నందనునికినిఁ బొంతనాలు చూచిరి
డిందుపడ నిద్దరికి తెర ఇట్టె పట్టినారు
అందియ్యరో తలఁబాల [1]కాయిత్తము సుండి ॥ కోరో ॥

జలధిరాజు కూఁతురు సరి శ్రీవేంకటపతి
నెలమితో వీదు లెల్ల నేఁగించినారు
కొలము కొలముఁ గూడి కొంగులు ముడిచినారు
తలఁపఁ జక్కఁదనాలు తగుఁజుండి. ॥ కోరో ॥ 61

పాడి

యిప్పుడే నే నే మన్న నిత వయ్యీనా
ముప్పిరి నాపెమీఁద మోహము నీ కుండఁగా ॥ పల్లవి ॥

చాలుఁ జాలు దానిచేతి సణఁగు లెంతలేదు
పోలించి ఇంతలో నేల పొగడేవు
నాలికత్తె దానిమాట నమ్మితివా నీ వప్పుడె
మూలల ములిగే మేలు ముందరనె వున్నది ॥ యిప్పుడే ॥

నగకు నీ వంతదాని నాటకపుఁ జేఁతలకు
బిగిసి నీ వేల ఆనవెట్టుకొనేవు
మొగ మిచ్చలా పెడితే మొదలనే నిజమా
తగవులఁ బెట్ట నిన్ను దాఁచుకుండీ గాక ॥ యిప్పుడే ॥

కరఁగకు నీవు దాని కౌఁగిటి రతులకును
కెరలి ఇంతలోఁ దమకించే వేల
ఇరవై శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
తెరమరఁ గెల్లఁ బాసె తెలుసుకో ఇంకను ॥ యిప్పుడే ॥ 62

---

1. తే. పా.—కాఇత్తము.

గౌళ

రంటికి(?)నొక్కచే మాట రమణుఁడ నీతోను
నంటున నీ చిత్త మెట్టో నాకింకఁ దెలియదు ॥ పల్లవి ॥

నీవే మంచివాఁడ వైతే నెరి నెం దుండిన నేమి
భావించి నిన్నుఁ బొగడఁ బనిలేదు
యే వంక నీవే నాకు నెరవులవాఁడ వైతే
ఆవటించి నిన్ను దూర నంత పని లేదూ ॥ రంటికి ॥

మనసు లేక మైతే మారు [1]మాట లాడవద్దు
చనవుల విన్నపాలు చవి గావు
యెనయక జగడించి యిద్దర మిట్టే వుండిన
మనలోనే విన్నపాలు మరి చవిగావూ ॥ రంటికి ॥

గక్కనఁ గూడితి మిట్టే కైవసమైతివి నాకు
యెక్కువ తక్కువ పంతా లిఁక నేలా
చక్కని శ్రీవేంకటేశ చలానకే నీ వుండితే
మక్కువలు పయిఁ జల్ల మరి యిఁక నేలా ॥ రంటికి ॥ 63

సాళంగం

ఆనలు వెట్టకు నన్ను నంతేసి నీవు
కానీ లే నీమతి నింత [2]గలిగి తేనే చాలును ॥ పల్లవి ॥

నీ మాట నీకు వచ్చెనె ని న్నేమీ ననలేను
ఆమీఁదటిపను లిట్టె ఆడవలెనా
కామించి నేఁ బదరితే కక్కూరితిదాన నౌదు
యీ [3]మెలఁత లిద్దరును [4]యెఱఁగుంటెఁ జాలును ॥ ఆనలు ॥

నిన్ను నే మెప్పించితిని నే నే మంచిదాన నైతి
సన్నలవలపు నీపైఁ జల్లవలెనా
నన్ను నే నే మెచ్చుకొంటే నగుఁబాటుదాన నౌదు
నిన్న నేఁటి పంతములు నిలిచితేఁ జాలునూ ॥ ఆనలు ॥

---

1. తే. పా. మాఁట, 2. తే. పా. – గలితేనె, 3. తే. పా. – మెలుత,
4. తే. పా. – యెరిఁగుంటె.

నీవే నన్నుఁ గూడితివి నీ కౌఁగిట నున్నదాన
యీ వేళనే మోవితేనె యియ్యవలెనా
శ్రీవేంకటేశ నిన్నుఁ జెనకితే గబ్బి నౌదు
యీ విధాన నా పొందు నీ కిత వైతేఁ జాలునూ ॥ ఆసలు ॥ 64

## శ్రీరాగం

మొదల నేఁటికే మోనములూ
కొదలుచు(?) నైనా గొణఁగుదు గానీ ॥ పల్లవి ॥

వూరకయైనా నూఁకొనరాదా
చేరి విభుఁడు కత చెప్పినదే
ఆరయ నీ కోప మంతె [1]కలిగితే
బీరపు రతులలో పెంతువు గానీ ॥ మొదల ॥

మొగమోటనైన మొక్కఁగ రాదా
సొగిసి నిన్నతఁడు చూచినదే
తెగువ నీ మతిని తిరముగఁ [2]గలిగితే
చిగురుమోవులలోఁ జిలుకుదు గానీ ॥ మొదల ॥

ననుపు సేసుకొని నవ్వఁగ రాదా
ఘనుఁడు పచ్చడము గప్పినదే
యెనసెను శ్రీవేంకటేశుఁ డితఁడు నిను
కినిసి సరసములఁ గెరలుదు గానీ. ॥ మొదల ॥ 65

## శంకరాభరణం

చెప్పరే యీ తగవు చెలులాల ఆకెకు
కప్పి ముద్దరాలి కేలే గయ్యాళితనమూ ॥ పల్లవి ॥

జవ్వనము గలిగితే సరసమాడఁగఁ జెల్లు
నవ్వ నేర్చితే మాటాడ నాయ మగుసూ
రవ్వగా మొక్క నేర్చితే రతి జంకించఁగఁ దగు
దవ్వుల నేమీ నేరనిదాని కేలే పగటు ॥ చెప్పరే ॥

---

1. తే. పా.—కలితె, 2. తే. పా. గలితె.

వినయము గలిగితే వెస గర్వించఁగఁ జెల్లు
మనసు దెలిసితేను మచ్చిక చూప నగు
పెనఁగ నేరిచితేను బెరసి పైకొనఁ దగు
నను పెఱఁగని లలనకు నేలే పంతమూ ॥ చెప్పరే ॥

కూరిమి గలిగితేను గుట్టుతో నుండఁగఁ దగు
మేరతో నుండ నేర్చితే మించ నగును
యీ రీతి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
చేరి కూడె నిఁక నేలే చిత్తిణికిఁ దాలిమీ. ॥ చెప్పరే ॥ 66

412-వ రేకు ముఖారి

యేల రట్టు నేసుకొనే విందరిలో నీకు నీవే
ఆలరి నీ చేఁతలు నే నాడుకొనవచ్చునా ॥ పల్లవి ॥

మోము చూచితే నవ్వేవు మొదల నెవ్వతెవద్ద
యేమేమి సేసితివో యెఱఁగ నేను
చేముంచి ప్రియము లెల్లాఁ జెప్పే వప్పటినాకు
నీ మనసులో సుద్దులు నీకే తెలుసును ॥ యేల ॥

మొక్కితే సిగ్గు వదేవు [1]ముచ్చిలి యే వనితకు
అక్కడఁ బెండ్లికొడుకవై వచ్చితివో
చెక్కు నొక్కి వేఁడుకొని చేరి నన్నుఁ దగిలేవు
నిక్కపు నీ గుణములు నీకే తెలుసును ॥ యేల ॥

వట్టి తేనే యలికేవు పైపైనే సతిగురుతు
లిట్టె నీ మేనిమీఁద నెన్ని యున్నవో
అట్టె శ్రీవేంకటేశ అలమేలు మంగ నేను
నెట్టుకొని కూడితివి నీకే తెలుసునూ. ॥ యేల ॥ 67

పాడి

యెఱఁగనా తనసుద్దు లిన్నియు నే విననా
మఱి నాతో దొఱఁగుచు మందలించీఁగాక ॥ పల్లవి ॥

1. తే. పా. – ముంచ్చి = ముంచ్చి.

చెలిఁ జూచి పరాకు సేసుకొని నా ముందర
పొలసి నిన్న నెట్లాఁ బొందు సేసేను
యెలమి నావద్ద వచ్చి యెఱఁగనట్టే వున్నాఁడు
సొలసి ఇందాఁకా నెట్టు జూజాలందు నాడెనే ॥ యెఱఁగ ॥

చేరవచ్చితే నాపెతో సిగ్గులు వడేటివాఁడు
సారెకు నెట్లా సరసము లాడెనే
కూరిమి నన్నుఁ బాయక కూడినట్టే వున్నవాఁడు
గారవించి యెట్లా లేకలు వెట్టి అంపెనే ॥ యెఱఁగ ॥

మగువఁ దాను తెరమఱఁగుల నున్నవారు
తగిలి యెట్టాడ మెడఁ దాళి గట్టెనే
జిగి నలమేల్మంగను శ్రీవేంకటేశుఁడు దాను
పగటున నన్నుఁ గూడి పాయ కాపెఁ గూఁడెనే. ॥ యెఱఁగ ॥ 68

లలిత

మఱి యేల దాఁచేవూ మాకు నీ వలపులు
మెఱిఁగినపనులకు నేల వొద్దు వెఱపు ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి వేఁడుకొనెఁ జెలియ నిన్ను
గక్కున నీమోమునఁ గళ లెక్కెను
వొక్కటియై యాకె నీవొడి పట్టెను
మక్కువతో నీ మేనఁ జెమటలు నిండెను ॥ మఱి ॥

అనుక చన్నుల నొత్తె నంగన నిన్ను
మే నెల్లఁ బులకించె మిక్కిలి నీకు
నానఁబెట్టి యాకె నీతో నవ్వు నవ్వెను
కానుకగా నీ మనసు కరఁగి చొక్కితివి ॥ మఱి ॥

పొంచి నిన్నుఁ గాఁగిలించె భూరమణి
మించె నీకు నానందము మీఁదమీఁదనూ
యెంచఁగ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
అంచెల నన్నేలితివి ఆకె నిన్ను మెచ్చెనూ. ॥ మఱి ॥ 69

హిజ్జిజి

నే నే ప్రియము చెప్పే నేఁ డిందుకు రమ్మనవే
తానే [1]యెఱుఁగు నా తన సంది తగవు ॥ పల్లవి ॥

ఆఁటదియైనదానికి అణఁకువ వలెఁ గాక
యీటులేని మగవాని కేలే యిది
గాఁటమైన వినయమూఁ గాంతకే వలెఁ గాక
మాటులేని నాయకుఁడు మరి కడమ లేలే ॥ నేనే ॥

వనితయైనదానికి వంచనయు వలెఁ గాక
ఘనుఁడైనవాని కేలే కమ్మటినిది
పెనఁగుచుఁ గామినికి పిలువఁగవలెఁ గాక
యెనలేని పంతగాఁడు యిఁక నేలే తనకు ॥ నేనే ॥

దేవులైనదానికి వొద్దిక మొక్కవలెఁ గాక
శ్రీవేంకటేశ్వరు కేలే సిగ్గుతో నిది
కైవసమై అలమేల్మంగను తానే నన్నుఁ గూడె
చేవ మీరినట్టి జాణ చెప్ప నేలే తనకూ. ॥ నేనే ॥ 70

సామంతం

నీకును నివియే నేరుపులు
కైకొని యీ కాంతఁ గరుణ నేలుమూ ॥ పల్లవి ॥

చనవరి కాంతలు జరసి(?) పలికితే
మనసునఁ బెట్టఁడు మగవాఁడు
పనివడి వలపునఁ బైఁ జేయి వేసిన
వినయముగాఁ గొను వేడుకతోను ॥ నీకును ॥

ఆసతోడ సతి ఆయము లంటితే
వేసరఁగ రాదు విభునికిని
వోసరించ కటు వుదుటున నవ్విన
రాసి కెక్క సంతోసము నెరపు ॥ నీకును ॥

1. తే. పా. – యెరుంగు.

కడు నవిచిన చెలిఁ గౌఁగిట నించితే
విడు మని యెంచఁడు విభుఁ డెపుడూ
ఒడి నలమేల్మంగపతి శ్రీవేంకటేశ
అదరి యేలితివి ఆ తగ వాయ. ॥ నీకును ॥ 71

భైరవి

యిందుముఖిఁ గరుణించు మింతట నీవు
యెందాఁకా విన్నవించేము యింకా నీకూ ॥ పల్లవి ॥

మగువకు నీవిచ్చిన మాటపట్టు దలఁచుకో
తగినచుట్టరికము దలఁచుకో
మొగి నాపెయెదకు నీ మొగమోట దలఁచుకో
నగుతా సరసమాడే నసుపు దలఁచుకో ॥ యిందు ॥

పడఁతిపై నీవు నేసేబత్తి యైనాఁ దలఁచుకో
తడఁబడే రతిపొందు దలఁచుకో
కడు బుజ్జగించే నీకరుణ దలఁచుకో
బడివాయకుండేటి నీ భావము దలఁచుకో ॥ యిందు ॥

అలమేల్మంగకు రేఁచే యాస లిట్టే తలఁచుకో
తలకొన్న నీ వేడుక దలఁచుకో
యెలమి శ్రీవేంకటేశ యీాకె నిట్టే యేలితివి
పిలిచి మన్నించే నీ బిరుదు దలఁచుకో. ॥ యిందు ॥ 72

413-వ రేకు. సామంతం

నే నెంతదానను నీవే యెక్కుడు గాక
పూని యెంత సంతోషింతు పూఁచి పట్టి నిన్నునూ ॥ పల్లవి ॥

మగువల నీవెంత మన్నించి యేలినాను
నెగడు లోకములోన నీ కీరితి
తగిలి నీవెంత పెద్దరికము సేసినాను
పొగడుదురు నిన్ను నే పొలఁతు లిందరును ॥ నేనెంత ॥

వూడిగపువారి నెట్టు వుపచరించి మెచ్చినా
తోడ నీ వుదారత్వమే దొడ్డై వుండును
వేడుకతో నీ వెన్ని విధముల రక్షించినా
వాడికతో మెత్తురు నీ వాసివన్నె తెల్లాను ॥ నేనెంత ॥

నీవే గతి యనువారి నీ విట్టె మనిపినాను
భావించి చూడ నీ ప్రతాపమే నిండెను
వే వేలై యలమేల్మంగ విభుఁడ శ్రీవేంకటేశ
దైవమా యేలి తి దంతయును నీ సంపదే. ॥ నేనెంత ॥ 73

బౌళి

పదివేలు మొక్కులు నీ పాదాలకు మొక్కే విదే
యిదె నిన్ను వేడుకొనే నింటికి రావయ్యా ॥ పల్లవి ॥

పొత్తుల మాటలు నిన్నుఁ బొదిగి యే మాడితినో
చిత్తగించి నాపై దయ సేయవయ్యా
కొత్తలుగా నే నెంత గునిసి జంకించితినో
ఇత్తల నోరుచుకొని యింటికి రావయ్యా ॥ పదివేలు ॥

చెనకి నిన్నే మేమి సేఁతలు నేసితినో
మనవి చేకొని నన్ను మన్నించవయ్యా
తనివిదీరఁగ నిన్ను తప్పు లెట్టు వట్టితినో
యెనసి నవ్వు నేసుక ఇంటికి రావయ్యా ॥ పదివేలు ॥

కదుఁ దమకించి చనుఁగవ నిన్నె ట్టొత్తితినో
[1]చిదిముడితో నన్ను రక్షించుకోవయ్యా
అదరి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
యెదయ కేలితి విట్టే యింటికి రావయ్యా. ॥ పదివేలు ॥ 74

గౌళ

యెంత కాతరపు దని యెంచేవు గనక నీవు
సంతోసాన సారె నిన్ను జరతుఁ జుమ్మీ ॥ పల్లవి ॥

1. తే. పా.—చిదుముడి.

తలఁపులో నీవు నాపై దయగల [1] దెఱఁగుదు
వలపు మిక్కుటమై సొలతుఁ గాని
చలివాయ నీవు నాకు చన విచ్చు తెఱఁగుదు
పిలిచి నీతో నూరకె పెనఁగుదుఁ గాని ॥ యెంత ॥

చేరి నాతోఁ గాఁపురము సేసేది నే నెఱఁగుదు
కోరి నీపై బత్తితోడ గునుతుఁ గాని
గారవించి నీవు నన్నుఁ గలసేది నే నెఱఁగుదు
కేరి నీ వింతరతికి వేగిరింతుఁ గాని ॥ యెంత ॥

వురముపైన న్నిడుక వుండేది నే నెఱఁగుదు
సరసములకు నిన్ను సాదింతుఁ గాని
నిరతి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
పరగ నేలితి వింకాఁ బచారింతుఁ గాని ॥ యెంత ॥ 75

సాళంగనాట

యిట్టి భాగ్యము గంటిమి యిద్దరూ బదుకరయ్యా
పట్టము గట్టుకొంటివి పచ్చి దేరె నయ్యా ॥ పల్లవి ॥

చెలియ తోడే నీకు [2] సింహాసనపు గద్దె
అలరుఁ జూపులే రత్నాభిషేకము
చలువైన నవ్వులే ఛత్రచామరములు
కలిగె నీ కింక నేమి గావలె నయ్యా ॥ యిట్టి ॥

చనుఁగవలే నీకు సామ్రాజ్యదుర్గములు
నినుపు మోవితేనెలు నిచ్చబోనాలు
వొనరిన కాఁగిలే వుండెడి నీ నగరు
యెనయ నబ్బె నీ భాగ్య మీదేరె నయ్యా ॥ యిట్టి ॥

రతిచెనకులే నీకు రవణపు సొమ్ములు
సతతపుఁ గూటమే సర్వసంపద
యితవై శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సత మాయ మమ్ము నేలి జాణ వైతివయ్యా ॥ యిట్టి ॥ 76

1. తే. పా. - దెరెంగుదు, 2. తే. పా. – సింహ్వాసనపు.

సౌరాష్ట్రం

యీతఁడు దయగలఁడు యెప్పుడును నీమీఁద
చేతులార నీకు నీవే సేవ లెల్లాఁ జేయవే ॥ పల్లవి ॥

యిచ్చక మాడితేఁ జాలు నెదురు మాటాడ వచ్చు
పచ్చి దేర సతికి నీ పతితోను
చెచ్చెర మొక్కితేఁ జాలు నేఁత లన్నీఁ జేయవచ్చు
యిచ్చట నితనికేఁగా నేఁటికి లోఁగేవే ॥ యీతడు ॥

చెంది నవ్వితేఁజాలు చెనకులు నించవచ్చు
మందలించి వనితకు మగనితోను
పొందులు సేసితేఁజాలు బొమ్మలఁ జంకించ వచ్చు
అందరిముందరా నేల అనుమానించేవే ॥ యీతడు ॥

ప్రియము చెప్పితేఁ జాలు బిగ్గఁ గౌఁగిలించవచ్చు
నయగారికాంతకు నాథునితోను
దయ నలమేల్మంగ నితఁడు శ్రీవేంకటేశుఁడు
క్రియతోఁ గూడె నింక జయ [1]మయ్యె నిపుడూ. ॥యీతడు॥ 77

ధన్నాసి

చూచినారు దయ పుట్టె సొంపగు నీ చిత్త మెట్టో
కాచి నీకు మొక్కె కప్పుర గంది ॥ పల్లవి ॥

కూరిమి గొసరె నిన్నుఁ గొచ్చి కొచ్చి ఇందాఁకా
చేరఁదేసి కన్నుల చెలియ
నేరుపుల మాటల నీకుఁ బ్రియములు చెప్పె
సారె వినయముతో జవరాలూ ॥ చూచి ॥

వొట్టుక నీ కైలా గిచ్చి వూడిగా లెల్లాఁ జేసె
పట్టెఁదేసి గుబ్బల పడఁతి
నెట్టుకొన్న యాసతోడ నిండుసరసము లాడె
దట్టపు నవ్వులతోడ తగు ముద్దరాలు ॥ చూచి ॥

1. తే. పా.—మయ్యె.

సమ్మతించఁ జేసి నిన్ను సారె సారెఁ గాఁగిలించె
కమ్మిక మూరెఁడుగొప్పు కలికి
యిమ్ముల శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
నెమ్మి నీ రతి వెలసె నిచ్చ పెండ్లికూతురా ॥ చూచి ॥ 78

414-వ రేకు మధ్యమావతి

యిన్నిటా మన్నించితివి యీ [1]మే లెఱుఁగు నింతి
విన్నదాఁకా సుద్దులకు వేడుక సేసీని ॥ పల్లవి ॥

చిత్తమునఁ బట్టెనా చేసిన విన్నపములు
బత్తి నీపైఁ జేసినది భావించితివా
మత్తిలి నీ దేవులకు మారుమాట లేమంటివి
యిత్తల నాకె నీ రాక కెదురుచూచీని ॥ యిన్ని ॥

కంటి వాని కంపిన కానిక లెల్లాఁ గన్నుల
ఇంటికి రమ్మన్నందుకు నియ్యకొంటివా
అంటిన నీ తలఁపు లేమని వక్కాణింతు నేను
నంటున నీ కూటమికి నమ్మి కాచుకున్నది ॥ యిన్ని ॥

అవధరించితివా అదివో అలమేల్మంగ
జవళి శ్రీవేంకటేశ సతమైతివా
భువి నిట్టె సంతతము పొసఁగఁగ మన్నించేవా
వివరించు దాఁకా నన్ను వెసఁ జూచుకున్నది. ॥ యిన్ని ॥ 79

ఆహిరి

యేల తప్పించుకొనేవు యియ్యకోరాదా
వాలాయించిన పనులు వద్దనఁగ వచ్చునా ॥ పల్లవి ॥

మచ్చికైన సతి నిన్ను మలసి కౌఁగిలించితే
యిచ్చగించవలెఁ గాని యెదయరాదు
రచ్చఁబడ్డ వలపులు రమణ నణఁగునా
తచ్చి కస్తూరి పూసితే దాఁగునా వాసనలు ॥ యేల ॥

1. రే. పా. – మే లెఱుంగు.

వేడుకకత్తెయైనది వీడెము చేతి కిచ్చితే
తోడనే యందుటగాని తొలఁగరాదు
కూడిన తొల్లిటిపొందు గూటఁ బెట్టితే నుండునా
నీడగా మొయిలు వచ్చితే నీవు దొబ్బఁ గలవా ॥ యేల ॥
కలికియైనది నీపై గక్కన సేస వెట్టితే
పిలిచి యలమి యిఁకఁ బెనఁగరాదు
అలమేలుమంగపతివైన శ్రీవేంకటేశ్వర
యిల మేన వారి వావి యెంతైనాఁ బాసునా. ॥ యేల ॥ 80

**లలిత**

పేరటాండ్లు సోబాన బెరసి పాడేరు గాని
చేరి మాకు సంతోసము సేయఁడీ ఇప్పుడు ॥ పల్లవి ॥
చెంగలి చూపులఁ జూచెఁ జెలియ నిన్ను
అంగవించి నవ్వితివి అందుకు నీవు
సంగ తాయ నిద్దరికి సరిమోహము
సింగారపుఁ బెండ్లిపీటఁ జెంది కూచుండరయ్యా ॥ పేర ॥
సరసపుమాట లాడె సకియ నీతో
నిరవుగ సమ్మతించి ఇయ్యకొంటివి
అరుదుగఁ దారుకాణ లాయ మీ పొందు
సరవిగా మీరు సేసలు చల్లరయ్యా ॥ పేర ॥
అట్టె నీపైఁ జేయి వేసె నలమేల్మంగ
గట్టిగా శ్రీవేంకటేశ కాఁగిలించితి
గుట్టు దెలిసెను మీ మీ గుణము లెల్లా
నెట్టుకొని పాయక మీ నేర్పులు చూపరయ్యా. ॥ పేర ॥ 81

**మాళవిగౌళ**

కొమ్మ నిన్నుఁ బొగడె నీగుణము లెల్లా నెంచి
యిమ్ముల నీ విద్యలకు నెంత జాణవో ॥ పల్లవి ॥

కాఁపురము సేసేవారిఁ గరుణించా నేరుతువు
చేపట్టి లాలనము సేయనేర్తువు
తీపుల మాటలు నేర్పి తిద్దుకొనా నేరుతువు
యేపొద్దుఁ జెలుల మిఁక నేమి విన్నవించేము ॥ కొమ్మ ॥

కోరినట్టు రతులలోఁ గూడి యుండ నేరుతువు
కూరిమి సేవ సేయించుకొన నేర్తువు
సారె సారె నవ్వు నవ్వి సరసమాడ నేర్తువు
యీరీతిఁ జెలులము యేమి విన్నవించేము ॥ కొమ్మ ॥

చిత్తగించి పెండ్లాడి సేసవెట్ట నేరుతువు
కొత్తలుగా మన్నించి కూడ నేర్తువు
బత్తితో నలమేల్మంగపతివి శ్రీవేంకటేశ
యిత్తల చెలులము నే మేమి విన్నవించేము. ॥ కొమ్మ ॥ 82

రామక్రియ

మేలయ్య మన్నించితివి [1]మెలఁత నీ వేళఁ గాచి
తాలిమితో నిన్ను నిట్టే దక్కఁగొనవలెను ॥ పల్లవి ॥

ఆముకొన్న జవ్వనము అది యెంత గలిగినా
కామించి నీ కరుణ గలదే కాంత
నేమముతో నాకె యెంత నేరుపులు నేరిచినా
దోమటి నీ మోవితేనె దొరకుటే భాగ్యము ॥ మేల ॥

వే వేలు చక్కఁదనాల విఱ్ఱవీఁగుచుండినాను
నీవు చేపట్టినదే నెయ్యపుసతి
తావుకొని మరి యెన్ని తా నోములు నోఁచినాను
వోవరిలోని దేవులై వుండినదే భాగ్యము ॥ మేల ॥

సాదించి మిక్కిలి యెంత సంపద గలిగినా నీ
వాదరించి కూడినదే అలమేల్మంగ
మోదపు శ్రీవేంకటేశ ముంచి యీకె యెట్టుండినా
ఆది గొన్న నీ రతు లబ్బినదే భాగ్యము. ॥ మేల ॥ 83

1. వే. పా. — మెలుంత.

సాళంగనాట

సంతోసాన నుండరో సతులాల
మంతనాన నాతఁడే మన్నించీఁ గాని ॥ పల్లవి ॥

చెలులను దూఱవద్దు చిత్తము గలఁగవద్దు
మలసి యాతఁడే నన్ను మన్నించీఁ గాని
బలిమి సేయఁగ వద్దు పదరి పెనఁగ వద్దు
నెలకొన్న కాఁపురము నెరవేర్చీఁ గాని ॥ సంతో ॥

సన్నలు సేయఁగ వద్దు చలము సాదించవద్దు
యిన్నిటా నాతఁడే నన్ను నేలీఁగాని
విన్నఁ బోవ వద్దు మరి వెలవెలఁ బార వద్దు
పన్నుకొన్న వేడుకలు పచరించీఁ గాని ॥ సంతో ॥

కొంగువట్టి తియ్యవద్దు కొసరి సొలయవద్దు
యింగిత మెఱిఁగి తానే యెనసీఁ గాని
అంగపు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
చెంగటఁ గూడె నింకాఁ జిత్తగించీఁ గాని. ॥ సంతో ॥ 84

415-వ రేకు సాళంగనాట

నీ మన సెట్టు దెలుసు నే మెంతవారము
మోము చూచి నీ కిందుకే మొక్కేము నేము ॥ పల్లవి ॥

వొక్కతెపైఁ బరాకైన ట్టుందుదువు
గక్కన మా మోము చూచి కరుణింతువు
నిక్కపు రాజసములు నెరపుదువూ
మక్కువఁ జేయి చాఁచి మన్నింతువూ ॥ నీమ ॥

కుమ్మరింపు సిగ్గులతో గుట్టు సేతువు
సమ్మతించి యంతలోనే చన విత్తువూ
యెమ్మెలకు నింపు చల్లి యెలయింతువూ
కమ్మర నేపొద్దూ నా కౌఁగిటనే వుందువు ॥ నీమ ॥

వేడుకకు నీవు నెలవి నవ్వుదువూ
 జోడు గూడి నీ మహిమ చూపుదువూ
 యీడనే శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
 జాడ దప్పక నీ మోవిచవులు చూపుదువు. ॥ నీమ ॥ 85

శ్రీరాగం

వనితలు నీకే వలచు టేమరుదు
 వినయము చేకొని వెస నేలుదువూ ॥ పల్లవి ॥

సిగ్గులు దేర్తువు చెలుల [1]మన సెఱిఁగి
 యెగ్గులు వట్టక యెనయుదువూ
 దిగ్గన నలుకలు దేర్చి మన్నింతువు
 నిగ్గుల సతులకు నిధానమవూ ॥ వని ॥

సమ్మతి సేతువు చనవు లొసఁగుదువు
 నమ్మఁదిరిగి మరి నవ్వుదువూ
 తెమ్మలుగా మోవితేనె లొసఁగుదువు
 కొమ్మల పాలిటి కొంగుపసిఁడివి ॥ వని ॥

తగవు నడపుదువు దయలు దలఁతువు
 నిగిడి శ్రీవేంకటనిలయుఁడవూ
 జిగి నలమేలుమంగ నగు ననుఁ గూడితి
 మగువలపాలిటి మనోరథమవూ. ॥ వని ॥ 86

దేశాక్షి

యెవ్వరిఁ బోలుదు నే నీ యింతులలోన
 నివ్వటిల్ల వలచి మన్నించితివి గాక ॥ పల్లవి ॥

చిత్తము రా సేవ నీకుఁ జేసేటివారమా
 హత్తి నిన్నుఁ గొలిచేటి [2]యంతవారమా
 బత్తితోడ నిన్ను నంత భావించేటివారమా
 కొత్తలుగా నన్ను మెచ్చి కొనియాదేవు గాక ॥ యెవ్వ ॥

---

1. తే. పా. — మనసెఱింగి, 2. తే. పా. — యెంత.

నంటున నీతో సారెకు నవ్వేటివారమా
అంటి ముట్టి సరసము లాడేవారమా
జంటల నీ కిచ్చకము జరపేటివారమా
యింటనుండి నా రతుల నెనసేవు గాకా ॥ యెవ్వ ॥
సొలపుఁ జూపులఁ జూచి చొక్కించేటివారమా
పిలిచి యిచ్చలను మెప్పించేవారమా
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలు మంగను
కలసి నన్ను నిట్టే కరుణించేవు గాకా ॥ యెవ్వ ॥ 87

ముఖారి

మిక్కిలి జాణ వౌదువు మెచ్చి రిందరు నిన్ను
అక్కరతో నీ మహిమ అంతటాఁ జూపితివి ॥ పల్లవి ॥
నాకొఱకే వలచితి నన్ను నీ వింతేసి
చేకొని పెద్దరికము సేసేవు గాని
వాకమైన నీవు గుణవంతుఁడవు గన కిట్టె
మేకొని నీ కీరితి మెరయించు కొంటివి ॥ మిక్కి ॥
నా వేడుకకుఁగా నే నంటున నీతో నవ్వితి
నీ వూరకే కృప నాపై నించేవు గాని
భావించి యిన్నిటా నేరుపరివి గనక నేఁడు
వే వేగ నీప్రతాపమే వెలయించుకొంటివి ॥ మిక్కి ॥
నాలో నీ యాసలనే నమ్మి కొలువు సేసితి
పాలించి శ్రీవేంకటేశ యేలితి గానీ
మేలువాఁడవు గనక మించి యలమేల్మంగను
మేలిమి నీ మంచితనమే నిలుపుకొంటివి. ॥ మిక్కి ॥ 88

ధన్నాసి

నే నే మని విన్నవించే నీ మంచితనమునకు
అనుకొన్న నాలోని అలయిక దేర్తువూ ॥ పల్లవి ॥

నీ మనసు దెలియక నేఁ గూరిమి గొసరితే
నా మొగము చూచి నీవు నవ్వుదువూ
ఆము కొన్నితమకము లటు నీకుఁ జూపితేను
ప్రేమ [1]మెఱిఁగి నాతో [2]గాఁపురము సేతువూ ॥ నేనే ॥

నీడ నుండి చెమటతో నిన్నుదప్పక చూచితే
వేడుక మిగుల నన్ను వేఁడుకొందువు
వోడక నీపై బత్తిని వొడివట్టి తీసితేను
కూడ వచ్చి పానుపుపైఁ గూచుండుదువు ॥ నేనే ॥

అక్కర గలిగి నీపై నాసల నే నుండితేను
గక్కన నందుకు నీవు కౌఁగిలింతువు
యిక్కువ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మక్కువ న న్నేలితివి మరియు మన్నింతువు. ॥ నేనే ॥ 89

నాదరామక్రియ

కందువ రేపల్లెలోనే కానవచ్చె నీసుద్దులు
అందుకొని పొగడ ని న్నలవి గాదు ॥ పల్లవి ॥

వారికి వారికి నీవు వలచిన ట్టున్నాఁడవు
యీ రీతి నీ జాణతన మెటువంటిదో
కోరి నీ వెందరినైనాఁ గొలువు సేయించు కొందు
చేరి నీ యోపిక [3]యెంతో చెప్పరాదు ॥ కందు ॥

భావింప నెవ్వరికైనా పక్కనున్నట్టున్నాఁడవు
తావగు నీ విటరాయతన మెట్టిదో
వేవేలు సతులతోడ వేసారక మాటాడుదు
యేవల్లా నీ నేరుపు యెంచరాదు ॥ కందు ॥

అందరికౌఁగిటఁ గూడి నట్లానే వున్నాఁడవు
అందిన నీ చుట్టరిక మది యెంతో
అందపు శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
పొందితివి నీగుణాలు పొగడరాదూ. ॥ కందు ॥ 90

1. తే. పా.—మెరింగి, 2. తే. పా.—గాఁపిరము, 3. తే. పా.—యంతో.

416-వ రేకు కాంబోది

యిట్టుండ వలదా యెన్నికైన నీ గుణము
అట్టె నిన్నుఁ జూచి నాకు నరు దాయను ॥ పల్లవి ॥
మక్కువ తోడుత నా మనసు నీవె యెఱిఁగి
చక్కెర నీ మోవియ్యఁగ సంతోసమాయ
తక్కక యప్పటి నా తమకము గనుఁగొని
వెక్కసాన నవ్వఁగాను వేడుకాయను ॥ యిట్టు ॥
వోముక నే విన్నవించే వుపమ నీకే తెలిసి
ఆ మాటే నాతో నాడఁగ నరు దాయను
కామించిన నాయాస గక్కన విచారించి
ప్రేమతోఁ గౌఁగిలించఁగ ప్రియమాయను ॥ యిట్టు ॥
యిందు నా కళలలో నీ యిక్కువలు నీవే యంటి
అంది రతులఁ గూడఁగా నానంద మాయ
అందపు శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
సందడి నన్నేలఁ గాను సమ్మతే యను. ॥ యిట్టు ॥ 91

వరాళి

చెలియరో యీతఁ డిన్ని చింతల వాఁడే
చలివాపి తనమోవిచవులెల్లఁ జూపెనే ॥ పల్లవి ॥
తలవంచుకుండఁగాను తానే నా వొద్దికి వచ్చి
కళ లంటి మొగము చెంగలింపించెనే
పలుకక వుండఁగాను పసగా నన్ను లాలించి
చెలరేఁగించి కతలు చెప్పించుకొనెనే ॥ చెలి ॥
సిగ్గువడి వుండఁగాను చెక్కు నొక్కి వేఁడుకొని
వెగ్గళముగా నన్ను నవ్వింపించెనే
తగ్గి దిగువ నుండఁగా దండఁ గూచుండఁ బెట్టుక
వొగ్గించి నోరఁ దమ్ములము నొసఁగఁ బెట్టెనే ॥ చెలి ॥

గుట్టుతో నే నుండఁగాను కోరి శ్రీవేంకటేశుఁడు
అట్టె నన్నుఁ గౌఁగిలించి దిట్టఁ జేసెనే
నెట్టుకొని మొక్కఁగాను నే నలమేల్మంగ నని
చుట్టరికమునఁ గూడి సొంపు లిట్టే రేఁచెనే. ॥ చెలి ॥ 92

పాడి

పదఁతి భారము నీదే పరాకు సేయకు మింక
సడిఁ బెట్ట కిట్టే నీవే చన వియ్యవలెను ॥ పల్లవి ॥
సిగ్గుతో నున్నది చెలి సేసే విన్నపము లెల్లా
దిగ్గన నీలో నీవే తెలియవలే
యెగ్గు లేమీ నెంచదు ఇచ్చకురాలై వున్నది
అగ్గలమై నీవే ఇంకా నాదరించవలెను ॥ పదఁతి ॥
చింతతో నున్నది యీకె సేసేది సేవ లెల్లా
కాంతుఁడవు నీవే మరి కైకొనవలె
పంతములు నెరపదు భావించి నిన్నుఁ దాను
సంతోసించఁ జేసె నీవే సరిఁ గావ వలెను ॥ పదఁతి ॥
వినయముతో నున్నది వెస నీ లేమ కౌఁగిలి
పనివడి నీవే యిచ్చి పాలించవలె
ఘనుఁడ శ్రీవేంకటేశ కాంత యలమేల్మంగను
తనియ నీవే కూడి దక్కియుండవలెనూ. ॥ పదఁతి ॥ 93

కన్నడగౌళ

యింత వలపించుకొంటి విదివో నన్ను
యెంత కెంత నా యాసోదమేమి చెప్పే నయ్యా ॥ పల్లవి ॥
కన్నులఁ జూతు నిన్ను కరఁగుదు మనసులో
సన్నలనే నీ మోవిచవి గొందును
చన్నుల నొత్తఁ దలఁతు జలజలఁ జెమరింతు
యెన్నికలు నాలోనివి యేమి చెప్పేనయ్యా ॥ యింత ॥

చక్కఁదనాలకు మెత్తు సారెఁ జే యెత్తి మొక్కఁదు
పక్కన నున్నవానిఁగా భావించుకొందు
చొక్కి నిన్నుఁ జేరుకొందు జుమ్మనఁ బులకింతు
యిక్కువ నా తలపోఁత లేమి చెప్పే నయ్యా ॥ యింత ॥
చెనకె నంటా వత్తు సిగ్గుపడుదు నంతలో
ననిచి శ్రీవేంకటేశ నవ్వుదు నీతో
అనిశము న న్నేలితి వలమేల్మంగను నేను
యెనసి నా కోరిక లేమి చెప్పేనయ్యా. ॥ యింత ॥ 94

రామక్రియ

యెంత తమకీ నని న న్నేలయించేవు
చింత నీపైఁ బుట్టితేను చెమరించవలదా ॥ పల్లవి ॥
కన్నుల నీవు చూచితే గక్కన నెవ్వతెకైనా
మిన్నక యాస లెల్లాను మించ వలదా
సన్నలు నీవు సేసితే సరుగనఁ గౌఁగి టిడి
పన్ని నీమీఁద మనసు పారఁగ వలదా ॥ యెంత ॥
యిచ్చలఁ జన్ను లంటితే నెవ్వతెకైనా నిట్టే
రిచ్చలతో సిగ్గు లెల్లా రేఁగ వలదా
ముచ్చట మర్మము నీవు మోవఁగఁ బలికితేను
రచ్చలోన నైనా నవ్వు రావలదా ॥ యెంత ॥
నెట్టనఁ గౌఁగిట నీవు నించితే నెవ్వతెకైనా
గట్టిగా సంతోస మిట్టె కప్పవలదా
అట్టి శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
జట్టిగా న న్నేలితివి సారె మెచ్చవలదా. ॥ యెంత ॥ 95

కొండమలహరి

కంటి నీగుణము లిట్టే కన్నులతుద నేను
జంటయై కొలిచితేను సంతోసమా నీకూ ॥ పల్లవి ॥

హత్తి నీకు సేవ సేసే యంగనలఁ గంటేను
చిత్తమునఁ బెట్టి రక్షింతువు నీవూ
బత్తి నీపైఁ గలిగితే భావ మెల్లాఁ జిగిరించు
గుత్తపు నీ సెలవుల గొబ్బున నవ్వు నిండు ॥ కంటి ॥

యెనసి నీ పట్టుకు నిచ్చకము నెరపితే
ఘనమైన నీమనసు కడుఁ గరఁగు
ననుపుతో నీ మొగము నాటుకొనఁ జూచితేను
గనులై మించి మదనకళ లెల్లా రేఁగుసూ ॥ కంటి ॥

ఆయము లెఱిఁగి నీ యంగములు ముట్టితేను
పాయపు మదము నిదె పయి పై మించు
యీయెడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పాయక నన్నేలితివి పచ్చిదేరు సిగ్గులూ. ॥ కంటి ॥ 96

417-వ రేకు మంగళకౌశిక

నేర మెన్నఁడును లేదు నెట్టనఁ దనవంకను
వోరుచుకొ మ్మనవే నే నొద్దిక మొక్కేను ॥ పల్లవి ॥

కడునాపైఁ దా మచ్చిక గలది నెఱుఁగుదునే
యెడయక మన్నించేది నెఱుఁగుదునే
నడుమ సవతు లట్టే నాతో సరి పెనఁగఁగా
పడలే కతను దూఱి పలుకుదుఁ గాని ॥ నేర ॥

మిక్కిలిఁ దా నాకుఁ జేసే మేలూఁ దలఁతునే
తక్కక కరుణించేదీ దలఁతునే
పుక్కట సతులు తనపొందులు చెప్పుకొనఁగ
తక్కక వెస నోపక తను నందుఁ గాని ॥ నేర ॥

అలమి తా నన్నుఁ గూడెనందుకు మెచ్చితినే
మెలఁగి తనరతికి మెచ్చితినే
లలిఁ దా శ్రీవేంకటేశుఁ డలమేల్మంగనే నేను
వెలయాండ్ల యెమ్మెలు వినినప్పుడుఁ గాని. ॥ నేర ॥ 97

రామక్రియ

యెచ్చరిక దేవ నీకు నెక్కడ పరాకు
మచ్చిక నీమీఁద వే మారుఁ జల్లీని ॥ పల్లవి ॥

చెలి నీ యెదుట నదె చిత్తగించు మిప్పు డిట్టే
మలసి సొలసి నీతో మాటలాడీని
కలువపూవు లవె కానుకగాఁ గైకొని
పలుదెరఁగులఁ జేతఁ బట్టుకున్నది ॥ యెచ్చ ॥

వినయముతో నాకె విన్నప మవధరించు
ననుపున నీకు మనవి చెప్పీని
తనివార నీవు గందము పూయించు కొమ్మదె
కనుఁగొని నీకు వూడిగము సేసీని ॥ యెచ్చ ॥

సంగడి శ్రీవేంకటేశ చనవు లీడేరించు
చెంగట నలమేల్మంగ సేసవెట్టీని
యింగిత మెఱిఁగి నీవె యిన్నిటాను గరుణించు
ముంగిటఁ గొలువు సేసి మోము చూచీని. ॥ యెచ్చ ॥ 98

మేచఁబౌళి

మేలే పతి నిన్నిటా మెప్పించితివి
నీలాగు లెల్లఁ గంటి నేరుపరి వొదువే ॥ పల్లవి ॥

వద్ద నుండి దానిమీఁద వలపులు గడుమించు
అద్దుకొన్న మగవాని కలరుచును
వొద్దికై యంతటిమీఁద నూడిగాలు సేసితేను
పొద్దువొద్దుకుఁ జవులు పుట్టి తమి రేఁగును ॥ మేలే ॥

యిచ్చలాడే దానిపైనే యింపు లెల్లఁ బెనగొను
విచ్చనవిడి నుండేటి విభునికిని
పచ్చిగా నంతటిమీఁద బత్తి గడుఁ జూపితేను
నిచ్చకల్యాణములై నిండుకొను రతులు ॥ మేలే ॥

వినయపుదానిఁ గంటే వేడుకలు దైవారు
నను పుఁ జుట్టరికపు నాయకునికి
మును శ్రీవేంకటేశుఁడు నిను నలమేల్మంగ [1]ను
యెనసిఁ గొసరితేను యిచ్చు సిరు లిప్పుడే. ॥ మేలే ॥ 99

కన్నడగౌళ

కామినుల కెప్పుడునుఁ గలిగిన సాజమిది
తా మగఁడు నే నాలను దయఁ జూడు మనవే ॥ పల్లవి ॥

చిత్తము రా నూదిగము సేసితినో సేయనో
హత్తి యెదురుమాట లే మాడితినో
యెత్తి చేతుల మొక్కేను యిన్నిటికి సెలవుగా
బత్తి చేకొని నన్నిట్టే పాయ కుండు మనవే ॥ కామి ॥

నిచ్చలు నుపచరించ నేరుతునో నేరనో
ఇచ్చ రతి నెంత యలయించితినో
యెచ్చు కుందులెల్లఁ దీర నిదివో ప్రియము చెప్పె
మచ్చిక నలుక దేరి మన్నించు మనవే ॥ కామి ॥

యెనసి వేడుక మోవి యిచ్చితినో యియ్యనో
చనుఁగవ నెంత వొత్తి జరసితినో
అనువై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
చనవు చెల్లించి నన్ను సారెఁ గూడు మనవే. ॥ కామి ॥ 100

నాదరామక్రియ

రతిరాజజనక వో రామామనోహర
తతితోడఁ బురుషోత్తముఁడవు నీవే ॥ పల్లవి ॥

సతుల మన సెఱిఁగి సరసము లాడవలె
యితవుగాను మోవి యియ్యవలె
మతకము లెల్ల మాని మర్మము లంటఁగవలె
చతురుఁడ విన్నిటాను జాణవు నీవే ॥ రతి ॥

---

1. తే. పా.—వు.

భావించి చూచేవారిఁ బక్కన లాలించవలె
కైవసమై వలపులు గైకొనవలె
చేవమీఱ నవ్వు నవ్వి సిగ్గు దేరుచవలె
కోవిదుఁడ విందుకెల్లా గురువవు నీవే ॥ రతి ॥

తొట్టి యిందరికి నీ రతులు నేరుపఁగవలె
నెట్టుకొని యేలి కృప నించఁగవలె
గట్టిగ నే నలమేల్మంగను నన్నుఁ గూడితివి
యిట్టి గుణాల శ్రీవేంకటేశుఁడవు నీవే ॥ రతి ॥ 101

మాళవిగౌళ

యేమని పొగడవచ్చు నిదివో నీవిలాసము
కామించి నిన్నుఁ బొందినకాంతదే భాగ్యమూ ॥ పల్లవి ॥

చొప్పుగా మన్నించి నీవు సుదతిఁ జూచితేను
కప్పి మోమున మదనకళలు నిండే
కొప్పు దువ్వి నీవు కొనగోరు సోకించితేను
అప్పుడే జవ్వనసామ్రాజ్యము చెలరేఁగెనూ ॥ యేమని ॥

మన సిచ్చి నీ వీకెతో మాట లాడినంతలోనే
వొనరుచుఁ గుచగిరు లుప్పొంగెనూ
పెనఁగుచు నొకమాటు ప్రియానఁ జేయి వట్టితే
పనివడి తమకపు భండారము నిండెనూ ॥ యేమని ॥

అలరి శ్రీవేంకటేశ అలమేల్మంగఁ గూడితే
కల చక్కఁదన మెల్లాఁ గనుపట్టెనూ
నిలిచి యీవేళనే నీవు దయఁ జూచితేనూ
బలిమితో మోహన సంపద లెల్లా మించెనూ. ॥ యేమని ॥ 102

418-వ రేకు. మధ్యమావతి

ఔనే మంచివారే మీరు అమ్మరో నేఁడు
వీనులారఁ బొగడితే విందుఁ గాక యతని ॥ పల్లవి ॥

చెలువుని దూరకురే చెలులాల
అలరి ప్రాణమై వుండు నాతఁడు నాకు
తలచుక వచ్చీఁ గాక తానే యీడకు
బలిమిసేతు రటవే బత్తి నాపై గలఁడు ॥ ఔనె ॥

రమణునిఁ గొంగు వట్టి రాఁ దియ్యకురే
అమరి నాపాలి దేవరై వుండును
తమిగలప్పుడు నన్నుఁ దానే కూడీని
తిమురుదురటే నాకు దిక్కయినవాఁ డితఁడు ॥ ఔనె ॥

సన్నల శ్రీవేంకటేశు జరసే రేలే
అన్నిటా నా కాతఁ డాత్మయై వుండును
మన్నించి కూడె నలమేల్మంగను నేను
పన్నిక నవ్వుదురటే పంతముతో జాణఁడూ. ॥ ఔనె ॥ 103

ముఖారి

కాంతపై నెప్పుడు బత్తి గలవు నీవు
మంతనాన నేనూ నీకు మనవి చెప్పితిని ॥ పల్లవి ॥

అవధరించితివా అతివవిన్నపములు
తవిలి యిప్పుడు నీచిత్తము వచ్చునా
వివరించి నేఁ డాకె నీవే గతి యని వున్నది
యివలఁ జెలిఁ గనక యెచ్చరించే నేనూ ॥ కాంత ॥

కరుణించి చూచితివా కాంత యంపినకానికె
సరవితో నీకది సమ్మతేయనా
నిరతిఁ దనయాసలు నీపైఁ బెట్టుకున్నది
పరిచారకురా లని భావము దెలిసెను ॥ కాంత ॥

అట్టె మన్నించితివా అలమేల్మంగనుఁ గూడి
వొట్టి శ్రీవేంకటేశ్వర వోవరిలోన
నెట్టన సంతోసాన నిన్ను మెచ్చుచున్నది
యిట్టే వూడిగపువార మిద్దరిఁ బొగడేమూ. ॥ కాంత ॥ 104

సాళంగనాట

ఆతని నే నెఱుఁగుదు నాతఁడు నీ వో జెఱుఁగు
　నీ తెరువు వచ్చితినా నీ కేలే పగటు　　॥ పల్లవి ॥

నన్నుఁ బెండ్లాడె నతఁడు నాతో నవ్వె నతఁడు
　సన్న లేమి సేసేవే సవతి నీవు
　కన్నుల మొక్కితి నేను కందువ లంటితి నేను
　నిన్ను నేమైనా నంటినా నీకేలే పగటు　　॥ ఆతని ॥

చేయి వేసె నా మగఁడు సిగ్గు దేర్చె నా మగఁడు
　చాయ లేమి చూపేవే సవతి నీవు
　నాయ మడిగితి నేను నవ్పై వుండితి నేను
　నీ యెమ్మెలు వ ద్దంటినా నీ కేలే పగటు　　॥ ఆతని ॥

అలమె శ్రీవేంకటేశుఁ డదె శ్రీవేంకటేశుఁడు
　చల మేల మానవె సవతి నీవు
　అలమేల్మంగను నేను అన్నిటా దేవుల నేను
　నిలిచి నీ బత్తి గంటి నీ కేలే పగటు.　　॥ ఆతని ॥ 105

శ్రీరాగం

రతిరాజ గురుఁడవు రమణిని నే నీకు
　ఇతరము లెల్లాను యేమి చెప్పేమయ్యా　　॥ పల్లవి ॥

వరుసల నీ చిత్తము వచ్చినదే కాఁపురము
　అరసి నిన్నుఁ బాయని దది బదుకు
　సరసము నీతో నాడే చనవే సౌఖ్యము
　యెరవుల సుద్దు లిఁక నేమి చెప్పేమయ్యా　　॥ రతి ॥

నెలవి నీవు నవ్విన చెలువమె సఫలము
　అలరి నీవు మాటాడు టది సంపద
　తలఁచి నీకు వలచు దాని జన్మమే జన్మము
　యెలమి నున్న కోరికె లేమి చెప్పేమయ్యా　　॥ రతి ॥

భావించి నీవు చూచిన భాగ్యమే యెక్కుడు
తావుకొన్న నీ రతులే ధనధాన్యాలు
శ్రీవేంకటేశ్వర నే నీదేవి నలమేల్మంగను
యీవేళ నేలితి వింక నేమి చెప్పే మయ్యా. ॥ రతి ॥ 106

శంకరాభరణం

చెలులలో నేను చేసినభాగ్య మెట్టిదో
వెలలేని వేడుకలు విభుఁడే యెఱుఁగునే ॥ పల్లవి ॥

అందరికి మోహించిన అట్టే వుండుఁ గాని యాతఁ
డందులో నాపై బత్తియై యుండుఁ దాను
యిందరితో మాటలు తా నెన్నేసి ఆడినాను
కందువ నాతోనే ఆ కత లెల్లాఁ జెప్పునే ॥ చెలు ॥

కొలువులో కాంతలఁ బైకొని కనుఁగొను గాని
తలఁపులో నన్నే చూచుఁ దా నితఁడు
నెలవులఁ గొందరితో చేకొని నవ్వినాను
చలువల నాతోను సన్నలనే నవ్వునే ॥ చెలు ॥

అచ్చలాన నెవ్వరిపై నైనాఁ జేయి వేసుఁగాని
కచ్చుపెట్టి నన్నే రతిఁ గౌఁగిలించునే
యిచ్చల శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
మచ్చిక నాపైఁ గలఁడు మన్నించునే నన్నును. ॥ చెలు ॥ 107

భైరవి

యిది నాకుఁ బదివేలు యెప్పుడూ నీ దాననే
కొదలేక యెప్పుడైనాఁ గూడేవు గాని ॥ పల్లవి ॥

యేపొద్దూ నేఁ గొలువులో నిటు దవ్వులఁగొల్చినా
చూపులు నీమీఁద నంటి సోఁకి వుండుఁగా
పైపై నీ వెక్కుడను పరాకై వుండినాను
యేపుల నీ మోవి నన్ను నిట్టే నో రూరించుఁగా ॥ యిది ॥

తనువుపైఁ బచ్చడము తగఁ గప్పుక వుండినా
మనసు నీతో జంటై పెనఁగాడుఁగా
ననుపున నెవ్వతెతో నవ్వితా నీ వుండినాను
పనివడి నా మొక్కు నీ పాదాలపై నుండుఁగా ॥ యిది ॥

తచ్చనసిగ్గుతో నీవు తలవంచు కుండినాను
నిచ్చ మరఁదలివావి నీ కైతిఁగా
యిచ్చట శ్రీవేంకటేశ యే నలమేలు మంగను
హెచ్చి నన్నుఁ గూడితివి యిట్టె సంతోసింతుఁగా. ॥యిది॥ 108

419-వరేకు. దేవగాంధారి

యెఱిగించరే పతికి యీ సుద్దు లెల్లాను
[1]కఱకఱినేసితేను గయ్యాళి యందురు ॥ పల్లవి ॥

మలసి తన కెదురు మాట లాడుటకంటే
చెలిచే మనవి చెప్పించేదే మేలు
పలుమారుఁ దన్నుఁ జూచి పచ్చారుకంటేను
తలవంచుక తనముందర నుండుటే మేలు ॥ యెఱి ॥

తడివి మందెమేళానఁ దనతో నవ్వుటకంటే
వొడికమై సిగ్గుతోడ నుండుటే మేలు
సడిఁబెట్టి సారె సారె సరస మాడుటకంటే
వుడివోని బత్తితోడ నుమ్మగిలుటే మేలు ॥ యెఱి ॥

అనుకొని తన్ను రతి నలయించుటకంటే
పానుపుపై దండ నిట్టే పండుటే మేలు
నే నలమేలుమంగను తాను శ్రీవేంకటేశుఁడు
మేనంటి తా నన్నుఁ గూడి మెఱయుటే మేలు. ॥ యెఱి ॥ 109

వరాళి

వేడుకతో నుండుఁ గాని వేసరీఁ జుమ్మీ
జాడతో నా విన్నప మిచ్చట వినుమనవే ॥ పల్లవి ॥

1. తే. పా.-కఱకరి.

వనితలు తనుఁ గంటే వదలి పూరకుందురా
పెనఁగక తక్కుదురా ప్రియముతోను
చనవునఁ బైపై సరస మాడక విడుతురా
వొనర నన్నిటికిని వోరుచుకొమ్మనవే ॥ వేడు ॥

ఆయములు సోకితే నాసలఁ బోనిత్తురా
పాయపుమదముతోడఁ బాయఁగలరా
చేయి చాఁచి నవ్వక సిగ్గులువడుదురా
యీయెడ మా కోరికె లీడేర్చ మనవే ॥ వేడు ॥

నిచ్చలు రతివేళల నేరుపు మరతురా
విచ్చనవిడైన చోట వీఁగుదురా
ఇచ్చట శ్రీవేంకటేశు డే నలమేలుమంగను
మచ్చికతో నన్నుఁ గూడె మన్నించు మనవే. ॥ వేడు ॥ 110

భూపాళం

చెలులాల యిదెవో నేఁ జేసినది భాగ్యము
కలిగెఁ దనకరుణ కడమ లింకేఁటివే ॥ పల్లవి ॥

మన్నించి తానే నాపై మచ్చిక గలిగుండఁగా
విన్నప మేమి సేసే నీ వేగినంతాను
కన్నులెదుటను తాను కైవసమై మెలఁగీని
సన్న లిఁక నేఁటికి సారెసారెకు ॥ చెలు ॥

కోరిన ట్లల్లా దానే కొమ్మని యొసగఁగాను
చేరి వేడుకొనే దేమే చేతులు చాఁచి
యీరీతి నావాఁడై తా నా యింట నిట్టే వుండఁగాను
కూరిమి గొసరే దేమే కొచ్చి కొచ్చి యిపుడూ ॥ చెలు ॥

కందువ లంటి తానే కౌఁగిలించి కూఁడఁగాను
అంది యాసపడే దేమే అప్పటి నేను
యిందునే శ్రీవేంకటేశుఁ డే నలమేలు మంగను
మందలించి మెచ్చే దేమే మాటిమాటికి. ॥ చెలు ॥ 111

దేవగాంధారి

అతివ లూరకుండరే ఆతఁడే నేనై [1]వున్నదాన
గతి యాతనిపాదాలే కడమ లే దిఁకనూ ॥ పల్లవి ॥

యిచ్చినాఁడు [2]సలిగలు యిన్నిటా నాతఁడు నాకు
కొచ్చి కూరిము లింకానుఁ గొసరుదురా
మెచ్చినాఁడు తొల్లి నా మిక్కుటపు సేవలకు
ముచ్చట నిప్పుడు రతి మొగచాటు సేతురా ॥ అతి ॥

నవ్వినాఁడు వేడుకతో నసుపున నిందాఁక
చివ్వన నింకా మరి చెనకుదురా
పవ్వళించి నా చన్నులపైఁ జేయి చాఁచినాఁడు
వువ్విళ్ళూరి వట్టియాన లూరకే చల్లుదురా ॥ అతి ॥

కూడినాఁడు సంతోసాన కుచ్చి నా కొఁగిట నేఁడు
తోడనే సరసముల దొమ్మి సేతురా
యీడనే శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
జోడు వాయ కేలినాఁడు చుట్టి పెనఁగుదురా. ॥ అతి ॥ 112

పాడి

యేలినవాఁడు తాను యే మనఁగల నేను
పోలించి తా నన్నూరకే పొగడీఁ గాక ॥ పల్లవి ॥

పంత మాడ నెంతదానఁ బలుమారుఁ దనతోను
చెంతఁ దా నా చెప్పినట్టు సేసీ నని
వింతలుగా నందరితో విజ్ఞపీఁగ నెంతదాన
కాంతుఁడు దా నిట్టే నాకుఁ గైవస మాయ నని ॥ యేలి ॥

సేవ సేయ నెంతదాన చెలరేఁగి చెలరేఁగి
చేవమీఱ నా బత్తి చేకొనీ నని
వేవేలైన నా సుద్దులు విన్నవించ నెంతదాన
దేవరవలెఁ దా విని తెలిసి మెచ్చీ నని ॥ యేలి ॥

1. తే. పా.—వుందాన, 2. తే. పా.—సలిగెలు.

పెనగఁగ నెంతదాన ప్రియముతోఁ దనతోడ
నను పునఁ దా నాతో నవ్వీ నని
యెనసి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
పనిగొన నెంతదాన బడిఁ దా నున్నాఁ డని. ॥ యేవి ॥ 113

రామక్రియ

తా నాకుఁ జేసినమేలు తలఁపులో నే మఱవ
పూని నన్నుఁ గరుణించి బుద్ధి చెప్పు మనుమీ ॥ పల్లవి ॥
మనసార తనతోనే మాటలాడ నేర్చుకొంటే
నినుపు నెలవినవ్వ నేర్చుకొంటిని
పనులు గొనఁగా తనపాదా లొత్త నేర్చుకొంటి
యెనసి తానే నన్ను నింతదానిఁ జేసెనే ॥ తానా ॥
సొలసి కన్నులతుదఁ జూడ నేరుచుకొంటి
నలి రేఁగి రతులఁ జెనక నేర్చితి
వెలయ సంగడి నుండి వినయాలు నేర్చుకొంటి
నెలకొని తానే నన్ను నేరుపరిఁ జేసెనే ॥ తానా ॥
పానుపుపై తనుఁ గూడి పైపై మెచ్చ నేర్చుకొంటి
అనుకొని మోవిచవు లాన నేర్చితి
తాను శ్రీవేంకటేశుఁడు నే నలమేలుమంగను
కానిమ్మని యిటువలెఁ గలికిఁగాఁ జేసెనే. ॥ తానా ॥ 114

420-వ రేకు శుద్ధవసంతం

యింత నీ వుపకారము లే మని పొగడుదు
సంతసించి యేలితి నా సరివారిలోనా ॥ పల్లవి ॥
కలవు నాకు నీ వని గర్వించి వుండుట గాక
చెలఁగి నీకుఁ బ్రియము చెప్పవత్తునా
నలువంక నటువంటి ననుఁ దెచ్చి నీ సేవకు
అలవఱచుక నన్ను నాదరించితివి ॥ యింత ॥

చుట్టరికపు వరుస సుద్దులె చెప్పుదుఁ గాక
నెట్టుక నీ కొలువులో నిలుచుందునా
యిట్టి నన్ను మన్నించి నీ యెదుట నిలుపుకొని
గుట్టు దెలిపి నాకు నీ గుణము నేర్పితివి ॥ యింత ॥

నీ విచ్చిన [1]సలిగల నే దొర నై వుందుఁ గాక
యీవిధాన నీ యక్కుపై నిర వౌదునా
శ్రీవేంకటేశుఁడ నేను జిగి నలమేల్మంగను
వావితోడ నన్నుఁ గూడి వన్నె కెక్కించితివి. ॥ యింత ॥ 115

సామంతం

యెంత ఆసోదమో(?) యని యెంచేవు సుమీ
యింతినై [2]వున్నదాన నీకు నేమియు నెఱఁగను ॥ పల్లవి ॥

అట్టే నీతోఁ జెలఁగి మాటాడియుఁ దనియను
దట్టపుఁ జూపులఁ జూచీ తనియను
పట్టి పెనఁగి పెనఁగి పలుమారుఁ దనియను
యెట్టు మోహింపించితివో [3]యెఱఁగ నేను ॥ యెంత ॥

చిమ్ముచు వినయములు సేసియుఁ దనియను
తమ్మి చేతులెత్తి మొక్కిఁ దనియను
పమ్మి నీ గుణములు భావించీ దనియను
ఇమ్ముల నింత సేసితి వేమీ [4]నెఱఁగను ॥ యెంత ॥

గక్కన నీ పాదములు కౌఁగిలించీ తనియను
దక్కఁగొని మోవి యానీ తనియను
ఇక్కడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
యెక్కడా నన్నే యేలితి [5]వెఱఁగ నితరము. ॥ యెంత ॥ 116

ఆహిరి

నీ మహిమవల్లనే నే బదికే దెల్లాను
వేమరు నా కేల యింక వేసరించ నిన్నును ॥ పల్లవి ॥

---

1. తే. పా. – సలిగెల, 2. తే. పా. – వుందాన, 3. తే. పా. – యెరంగ,
4. తే. పా. – నెరంగను, 5. తే. పా. – వెరంగ.

ఆముకొని నిన్నుఁ బాసి అట్టే విరహాన నున్నా
నీ మీఁది మోహమే నన్ను నెరవేర్చును
భామలపై నీవు గొంత పరాకై వుండినాను
నేమపు నీపై తలఁపే నిన్నుఁ దెచ్చి యిచ్చును ॥ నీమ ॥

యిట్టే నీ కెదురుచూచి యెంత కాఁకఁ బొందినాను
జట్టిగ నీపై యాస చల్లఁజేసును
గుట్టున నేవనితలఁ గూడి నీవుండినాను
చుట్టపు నీ సుద్దులే సొంపులు వుట్టించును ॥ నీమ ॥

సేసవెట్టి ఇప్పు డెంత సిగ్గుతో నే నుండినాను
రాసి కెక్క నీ కౌఁగిలే రవ్వ సేసును
యీసరి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
వేసరని నీరతులే వేడుకలు రేఁచునూ. ॥ నీమ ॥ 117

హిజ్జిజి

అందుకే మొక్కే నేను ఆతని కిదే
పొందుగా విన్నవించరే పొలఁతులాల ॥ పల్లవి ॥

పొంచి సింగారాలకు బొమ్మల జంకింతుఁ గాని
మించి మేలువాఁడు తాను మిక్కిలి నాకూ
అంచెల గుట్టుగాన నీ కటు మెచ్చకుందుఁ గాని
మంచిమాట లెల్లా నాడి మన్నించునే ॥ అందు ॥

సేసే తరితీపులకు సిగ్గులు వడుదుఁ గాని
ఆసల నన్నుఁ బెండ్లాడి నప్పుడే తానూ
వాసులు చూపవలసి వన్నెల సొలతుఁగాని
బాసతోడఁ జనవిచ్చి పాలించునే ॥ అందు ॥

చవులు చూపవలసి సమ్మతించకుందుఁ గాని
వివరించి నా ప్రాణవిభుఁడే తాను
జవళి శ్రీవేంకటేశ్వరుఁ డలమేల్మంగను
కవగూడి నన్నిటాను ఘనుఁడే తాను. ॥ అందు ॥ 118

### శుద్ధవసంతం

కంటి మిట్టే మీ పొందులు కన్నులపండుగ గాను
జంటఁ గొసరుదుము మీసరిత లెఱఁగకా ॥ పల్లవి ॥

యిద్దరును నొక్కటే యింతులెల్లా విన్నవించే
సుద్దులే వేరుగాని చూడఁ జూడను
వొద్దికతో మారుకు మారొక రొక రుంగరాలు
కొద్దులై వున్నవి మీఁద కొనవేళ్ళ నివివో ॥ కంటి ॥

తలఁపు లెప్పటివే తరితీపుల మీకు
చెలి పెనఁగు లాటలే చెప్పఁ గొత్తలు
పులకలూ నొక్కటే పొదలి మీ మేనులను
వెలసెఁ దారుకాణలై వేడుకతో నివివో ॥ కంటి ॥

అతఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
రతులే యెంచరానివి రచ్చలోనను
తతితోడఁ గూడితిరి తనువునఁ గళ లంటె
మితిమీటి మాకుఁ జూడ మెచ్చులాయ నివివో. ॥ కంటి ॥ 119

### రీతిగౌళ

తామే యెఱుఁగుదురు తమపొందులు
ప్రేమములు రేఁచితేను బెరయు వేడుకలు ॥ పల్లవి ॥

చెలినోరిలోమాట సిగ్గులలోపలితేట
తెలిపి చెప్పి చూపరే తెఱవలాల
పలుసతుల మగఁడు పరాకై వున్నాఁ డేమో
తలపించరే మీరు తటుకన నిపుడూ ॥ తామే ॥

పెద్దకన్నులలో యాస పిడికిటిలోనినేస
పొద్దున [1] నెఱిఁగించరే పొలఁతులాల
చద్దివేఁడివలపుల సందడి నున్నాఁడేమో
బుద్దిగా సన్నల నింపు వుట్టించరే ॥ తామే ॥

1. తే. పా.—నెరింగించరే.

అలమేల్మంగలో నవ్వు అరచేతిలోని పువ్వు
లలిఁ దారుకాణించరే లలనలాల
యిల శ్రీవేంకటేశ్వరుఁ డియ్యకొని యున్నాఁడేమో
కలసెఁ దొలుతే యింకాఁ గరుణ పుట్టించరే ॥ తామే ॥ 120

421-వ రేకు దేసాళం

యేమైనా నిన్ననేనా యింతి నేఁడు
చేముంచి యింతలో నేల సిగ్గువడే వయ్యా ॥ పల్లవి ॥

వెలఁది నిను మెచ్చితే విన వేడుక గాదా
నలువంకా సొలసితే నవ్వు రాదా
తలఁచి నీకు మొక్కితే దయ పుట్టవలదా
చెలఁగి యిందుకు నేల సిగ్గువడే వయ్యా ॥ యేమై ॥

సారె నిన్నుఁ జూచితేను సంతోసించఁ దగదా
చేరి మాటాడితే పొందు సేయఁ జెల్లదా
కూరిమి దెలిపితేను గుట్టున నుండవలదా
జీరలచెక్కుల నెంత సిగ్గువడేవయ్యా ॥ యేమై ॥

కదలేక వూఁకొంటే కతచెప్ప సందు గాదా
యెద మిచ్చితే పందుండ నింపులు గావా
అదరి శ్రీవేంకటేశ యలమేల్మంగఁ బెండ్లాడి
[1] చిడిముడి నీ వెట్టు సిగ్గువడేవయ్యా. ॥ యేమై ॥ 121

పాడి

యేమయ్యా యేనుగతోడి యేలాట [2] లిఁక నీకేల
కామించి నీకు నీవే కరుణించేవు గాక ॥ పల్లవి ॥

సింగారించుకొన్న నిన్నుఁ జేరి సంతోసించుఁ గాక
అంగన యెఱుఁగునా ఆ సుద్దులు
ముంగిట నీవుండఁగాను ముంచి కైలా గిచ్చుఁ గాక
సంగతి యెందు వోయే వని సారె నిన్ను నడుగ ॥ యేమ ॥

---

1. తే. పా.—చిడుముడి, 2. తే. పా.—లికేకునేల,

చెమరించీ నని మేను చెలఁగి విసరుఁ గాక
　రమణి నీసుద్దు లెల్లా రచ్చవేసునా
　జమళి నీ సేవ సేసి చవులు పుట్టించుఁ గాక
　అమరునా అంతలోనే అకె నిను జరయ ॥ యేమ ॥

అలరి నీవు గూడితే నానందించుకొనుఁ గాక
　అలమేలుమంగ నీ చొప్పులు చూచునా
　లలి శ్రీవేంకటేశ నీ లాగులకు నవ్వుఁగాక
　తలపించఁ దగవా తనబత్తి [1]యింకను. ॥ యేమ ॥ 122

లలిత

చూచి చూచి సంతోసింతు సోద్యముగా నే నెప్పుడు
　కాచుక న న్నేలేటి చక్కని నా విభుని ॥ పల్లవి ॥

నా తలఁ [2]పెఱుఁగునే న న్నిట్టె లాలించునే
　యీతని నెట్టు గొసరే నింకా నేను
　చేతికి లోనై వుండునే చెప్పినట్టు సేసునే
　యీతలఁ దనగుణము లేమని చెప్పుదునే ॥ చూచి ॥

సన్నలనే మెలఁగునే చనవు నా కిచ్చునే
　విన్నప మేమి సేసేనే వేరే మరియూ
　తన్నుఁ దానె వచ్చునే తగవులు నెరపునే
　యిన్నిటా మెచ్చె నంటే యెంతదాననే ॥ చూచి ॥

చెలిమి సేయ జాణఁడే శ్రీవేంకటేశుఁడే
　తెలుప నేలే నాపాలిదేవరే తాను
　అలమేల్మంగనే నేను అన్నిటాను నన్నుఁ గూడె
　అలవి గాదు పొగడే నంటే నిట్టె మొక్కెనే. ॥ చూచి ॥ 123

గుజ్జరి

యెంత జాణతనమో నా కెటువంటి మొగమోటో
　సంతోసించఁ జేసి నీకు చనవరి యాయను ॥ పల్లవి ॥

---

1. తే. పా. - ఇంకను, 2. తే. పా. - తలపెఱుంగునే.

చెప్పరాని ప్రియములు చెప్పి ని న్నింతవలపు
చిప్పిలఁ దనమొగము సేసుకొనెను
నెప్పున నీ చిత్తము రా నిచ్చలూఁ గొలిచీ నిన్ను
నప్పుడే మంచిమాటలూ నాడించుకొనెను ॥ యెంత ॥

పెనఁగి పెనఁగి నీకు పెక్కు వూడిగాలు సేసి
ననుపున నీ సెలవి నవ్వు రేఁచెను
చెనకి వినయమున చెక్కు నొక్కి వేఁడుకొని
తనిపి నీ మోవితేనె తా నిప్పించుకొనెను ॥ యెంత ॥

పానుపుపైఁ బవ్వళించి పక్కనఁ జన్నుల నొత్తి
సోనలచెమటతోడఁ జొక్కించెను
పూని యలమేలుమంగ పొంచి శ్రీవేంకటేశ్వర
తానే నిన్నుఁ బెండ్లాడి తగులై నిలిచెనూ. ॥ యెంత ॥ 124

ముఖారి

ఆతనినే రమ్మనరే అంగనలాల
యీతలనే విన్నవించే నిన్ని విన్నపములూ ॥ పల్లవి ॥

అరతఁ జేసే విన్నపా లడియాసలై యుండు
తరితీపులై యుండు దవ్వుల విన్నపములు
వొరులవిన్నపములు వొడఁబాటులై తోఁచు
వెరవేది పతికింక విన్నవించ నిపుడూ ॥ ఆత ॥

చెవిలోనివిన్నపాలు సిగ్గులెల్లాఁబెడఁబాపు
చవులెల్లాఁ బుట్టించు సరసపు విన్నపము
సవినయవిన్నపము సంతతముఁ దలఁపించు
వివర మేది పతికి విన్నవించ నిఁకను ॥ ఆత ॥

యేకతపువిన్నపము లిచ్చకము పుట్టించు
రాకొట్టులై పెనగొను రతివేళ విన్నపము
యీకడ శ్రీవేంకటేశుఁడే నలమేలు మంగను
చేకొని విన్నపములు సేసే దేమె యిఁకను. ॥ ఆత ॥ 125

నీలాంబరం

యెంత భాగ్యవంతుఁడవో ఇటువంటి సతి గల్గె
సంతోసించుకొంటిమి మీ సరితెలు చూచి ॥ పల్లవి ॥

ఆండనుండి యెవ్వతో అట్టె నీకు నొక్కొక్కచే
బొండుమల్లెపానుపుపై బుద్ధి చెప్పీని
పండఁబడి మోవితేనె పానకముచవి చూపి
చండిపెట్టి చన్నులతో సాము సేయించీని ॥ యెంత ॥

తా నెవ్వతో పెచ్చు రేఁగి దంతపుటోవరిలోన
నానుఁజెమటల నిన్ను నవ్వింపించీని
సానఁబట్టేచూపులను సన్నలనే జంకించి
వూనినరతులలోన నోలలాడించీని ॥ యెంత ॥

గుట్టున నెవ్వతో యిది కోరి పచ్చడములో
చుట్టుక చుట్టుక కూడి సొంపు నించీని
నెట్టన శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
యిట్టే నన్ను నేలితివి యీకె నిన్ను మెచ్చీని. ॥ యెంత ॥ 126

422-వ రేకు దేశాక్షి

మనసులోఁ దనమేలు మఱవ ననరే మీరు
యెనసినరమణుని కెచ్చరించరే ॥ పల్లవి ॥

కానుక చేకొనెఁగా కవకవ నవ్వుకొంటా
వీనులను విన్నపాలు వినెఁగా తాను
మేను మేను సోఁక నిట్టే మేలములూ నాడెఁగా
అనుకొన్నసంతోస మెంతని చెప్పే నిఁకను ॥ మన ॥

పువ్వులబంతి యిచ్చెఁగా పొలఁతి నా చేతికి
దవ్వులనుండి వచ్చెఁగా తానే వొద్దికి
నివ్వటిల్ల మోవితేనియ నాకు నిచ్చెఁగా
యివ్వల నా భాగ్యఫల మీదేరె నిప్పుడూ ॥ మన ॥

చేతు లెత్తి నామీఁద సేసలునుఁ బెట్టెఁగా
కాతరాన నన్నుఁగూడి కరుణించెఁగా
యీతల శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
యేతుల నా యానంద మిరవాయ నిదివో. ॥ మన ॥ 127

మలహరి

నీ వెట్టు సేసినా నీ కిరితే
భావించి నీవల్లనే బ్రదుకుట గాకా ॥ పల్లవి ॥
నీకు మోహించినవారు నిన్ను మరి దూరుదురా
కైకొను మనేవారు కాంతాళింతురా
వాకుచ్చి పొగడేవారు వది వెంగేలాడుదురా
పైకొని నీ చిత్తము రా బదుకుట గాకా ॥ నీవె ॥
నీతోడ నవ్వేవారు నిన్ను నటు జంకింతురా
చేతు లెత్తి మొక్కేవారు జేర దీతురా
ఆతుమఁ దలఁచేవారు అలుకలు చూపుదురా
పైతరవు బత్తి సేసి బదుకుట గాకా ॥ నీవె ॥
తగఁ బెండ్లాడినవారు తప్పులు వట్టుదురా
మొగిఁ బాయలేనివారు మోము వంతురా
నిగిడి శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
బగివాయ కేలితివి బదుకుట గాకా ॥ నీవె ॥ 128

భైరవి

యెట్టయినా నాయఁ గాక యేమాయను
నెట్టుకొన్న నావలపు నీ చేతిది యిఁకను ॥ పల్లవి ॥
తగ నీవు మన్నించేది తలఁపున నెఱుఁగుదు
సొగిసి యట్టే పదరి సొలయుదును
నిగిడి నన్ను నడపే నీ నేరుపో యిది
బగివాయకున్న నా భ్రమతో యెఱఁగను ॥ యెట్ట ॥

చేకొన్నవాఁడవు నన్నుఁ జేరి యేలే దెఱుఁగుదు
యీకడ విరహమున నిట్టే దూరుదు
జోకతో నింతసేసే నీ సొంపుల యాలాటమో
కాకరి(?) నా తమకపుకందువో యెఱఁగను ॥ యెట్ట ॥

సరుస నన్నుఁ బెండ్లాడి చన విచ్చు టెఱుఁగుదు
పరవశపుఁ గౌఁగిట పచారింతును
యిరవై శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
సిరుల నీగుణ మింత సేసేది యెఱఁగనూ ॥ యెట్ట ॥ 129

ఆహిరి

యేలే పొగిలేవే యిప్పు డింతిరో నీవు
వాలాయించి నీ విభుఁడు వచ్చి కూడీఁగాక ॥ పల్లవి ॥

కదుఁ దమకముతోడఁ గాచుకున్నకాంతను
సడిఁబెట్టి యేఁపునా సరసుఁడు
జడియక మోవితేనె చవిచూపి చెక్కు నొక్కి
బడలిక లెల్లాఁ దీర్చి పచారించుఁగాక ॥ యేలే ॥

ఆసల నెదురుచూచి అండకు వచ్చినదాని
గాసిలఁ గాఁక రేఁచునా కాంతుఁడు
వేసరక నవ్వు నవ్వి వెడసిగ్గులు దేర్చి
రాసికెక్కఁ జన విచ్చి రక్షించుఁగాక ॥ యేలే ॥

మించి వుర మెక్కి యలమేలుమంగవైన నిన్ను
వంచించునా శ్రీవేంకట వల్లభుఁడు
పొంచి కౌఁగిలించుకొని భోగపురతుల నించి
యెంచరాని నీతలఁపు లీడేర్చుఁ గాకా. ॥ యేలే ॥ 130

శ్రీరాగం

ఔనో కాదో యీమాట అంగనలాల
నానఁ బెట్టక వలపు ననుపై నిలుచునా ॥ పల్లవి ॥

యెన్ని తలపోఁతలతో నెంచుకొని వుండినాను
కన్నులఁ బతిఁ జూడక కాంక్ష దీరునా
సన్నలు వేడుకతోడ సారె సారెఁ జేసినాను
విన్నపము సేయక వెసఁ దనివారునా ॥ జానో ॥

[1]చాయవాటుగా నెట్టు సరసము లాడినాను
చేయి చాఁచి పెనఁగక చెమరించునా
పాయపుమదాన నెంత పచ్చిదేర నవ్వినాను
రాయదిరతులఁ గాక రంజకము వుట్టునా ॥ జానో ॥

ఆసల లోలో నెంత ఆరడిఁ బొరలినాను
సేసవెట్టి పెండ్లాడక చే చిక్కునా
యీసరి నలమేల్మంగ నేను శ్రీవేంకటేశుఁడు
వాసితోఁ దా నన్ను నిటువలెఁ గూడకుండునా. ॥ జానో ॥ 131

ముఖారి

యిదివో నీతోడిపొందు యిట్లానే కదవయ్యా
సదరాననే వచ్చి జాజుకొనెఁ గూరిమి ॥ పల్లవి ॥

సుద్దులువలెనే వుండు సొలపులసరసాలు
కొద్దితో మఱవరాదు గుండెలు మోచు
అద్ది వూరకున్న ట్టుండు ఆనకపు కాఁపురాలు
ముద్దు ముద్దువలె నౌను మోవరాని మోపులు ॥ యిది ॥

తేటలువలెనే వుండు తెలిఁగన్నుల చూపులు
నాటుకొని పాయరాని నాము లెక్కను
గాటమై దక్కిన ట్టుండుఁ గప్పురపు వీడేలు
మేటి సమరతులలో మిక్కిలిఁ జొక్కించును ॥ యిది ॥

సులభాలువలె నుండు చుట్టుకొన్న కూటములు
తలపించఁ దలపించ తమి రేఁచును
యెలమి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
కలసితి వీఁక నివి కాణాచులై యుండునూ. ॥ యిది ॥ 132

1. తే. పా. – చాయపాటు.

423-వ రేకు మేఁచబౌళి

యెంచకు నానేరమి యెంతకోపి నైనాను
నించి నన్నేలుకొనుటే నీ నేర్పు ॥ పల్లవి ॥

పాసివున్న తమకానఁ బదఁతు లే మాడినాను
వాసితో నేర్చిన మగవానిదే నేర్పు
ఆసలతోడఁ బెనఁగి అట్టే కొంగు వట్టితేను
వోసరించి గుట్టుతోడ నుండుటే నేర్పు ॥ యెంచకు ॥

తగులై నది పెనఁగి తా నెం తలయించినాను
నగుతా నోరిచినజాణనిదే నేర్పు
వెగటైన కాతరాన వేసటగాఁ గొల్చినాను
పగటున నాదరించి పాయనిదే నేర్పు ॥ యెంచకు ॥

కాఁకలఁ బొరలినది కౌఁగిటఁ గొసరినాను
సోఁ కోర్చి మెచ్చే సరసునిదే నేర్పు
యాఁకట శ్రీవేంకటేశ అలమేల్మంగను నేసు
వాకముగాఁ గూడితివి వది నిదే నేర్పు. ॥ యెంచకు ॥ 133

సౌరాష్ట్రం

యిన్ని విన్నపములును యిందులోనే వున్నవి
పన్ని నన్ను నేలే నిఁక బతికితి ననవే ॥ పల్లవి ॥

యెనసినమీఁద నేలే యెరవులూ
ననిచినమీఁద [1]నేలే నమ్మికలూ
తనిసినమీఁద నేలే తమకములూ
మనవి చేకొని యిఁక మఱవకు మనవే ॥ యిన్ని ॥

మరిగినమీఁద నేలే మరిచింతలూ
కరఁగినమీఁద నేలే కాంతాళింపులు
సరియైనమీఁద నేలే సాదింపులు
గరిమ నా కిచ్చె నిఁకఁ గరుణించు మనవే ॥ యిన్ని ॥

1. రే. పా. – నేం.

కలసినమీఁద నేలే కడువాసులూ
పిలిచినమీఁద నేలే బిగువులూ
యెలమి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
తలఁచినట్టె [1]కూడఁ దగు నింక ననవే. ॥ యిన్ని ॥ 134

సామంతం

తగవరి వన్నిటాను దయఁ జూడవలదా
వెగటుగాఁ జెలు లింత విన్నవించవలెనా ॥ పల్లవి ॥

కందువ నీవేళలు గాచుక యాపె వుండఁగా
యెందుండో వచ్చి నవ్వీ యీలేమ నీతో
ముందువెనక దెలిసి మోహము చేకొనవద్దా
సందుసుదికత్తెలకు చనవు లీఁ దగునా ॥ తగవరి ॥

యెప్పుడు మాటాడేవంటా నీపెమోము చూడఁగా
దెప్పరమై కత చెప్పేఁదెరవ నీతో
తప్పకుండాఁ బెద్దపిన్నంతరువులు చూడవద్దా
చిప్పిలఁ బొరుగువారిఁ జిమ్మి రేఁచవలెనా ॥ తగవరి ॥

అలమేలుమంగ వురమందు నెక్కుకుండఁగాను
వెలినున్నసతి నీతో వియ్య మందీని
యెలమి శ్రీవేంకటేశ యిద్దరినిఁ గూడితివి
కెలనివారితోఁ బొత్తు గలపఁగ వలెనా. ॥ తగవరి ॥ 135

మంగళకౌశిక

నిన్నుఁ జూచి చెలులకు నివ్వెఱఁగులై వున్నవి
పన్నిన వలపులకు పండుగాయ నేఁడు ॥ పల్లవి ॥

వీడె మిచ్చి చెలి నీకు విన్నపము సేయఁగాను
వేడుకల కన్నియును వినేవు నీవు
తోడనే వినయాలెల్లా తోడుచూపఁగా నీకు
జాడతోరేఁగీ సంతసములెల్లా నేఁడు ॥ నిన్ను ॥

---

1. వే. పా.—కూడేఁ.

సంగడిఁ గూచుండి యీకె చనవునఁ జెనకఁగా
అంగమెల్లాఁ జెమరించి యానందించేవు
రంగుమీఱ నీమీద రతిఁ జేయి చాఁచఁగా
వుంగిటి (?) మదనకళ లుబ్బీ నీకు నేఁడు ॥ నిన్ను ॥

అలిమేలుమంగ నీయక్కుమీఁద నిలువఁగా
బలిమి శ్రీవేంకటేశ పచ్చిదేరేవు
యెలమి నీకె మమ్మ నిందరి నేలు మనఁగా
వెలలేని భోగములు వింతలాయ నేఁడు. ॥ నిన్ను ॥ 136

సాళంగనాట

గోవిందుఁ డీ బాలుఁడు గోపాలుఁడు
కావింప రేపల్లెలోని కాంతాలోలుఁడు ॥ పల్లవి ॥

జనియించెఁ గృష్ణుఁడు సర్వలోకజిష్ణుఁడు
దనుజాంతకుఁడు యీతఁడే విష్ణుఁడు
పనివడి సజ్జనుల పాలికి వర్ధిష్ణుఁడు
సనకాదులమతుల [1]సంచరిష్ణుఁడు ॥ గోవిందుఁ ॥

పెరిగెఁ గంసశత్రుఁడు భీషణతేజమిత్రుఁడు
వరవసుదేవదేవకీ పుత్రుఁడు
సరుస భావించి చూడ సర్వజీవగాత్రుఁడు
పరగ రుక్మిణీసత్యభామాకళత్రుఁడు ॥ గోవిందుఁ ॥

వెలసె భూధరుఁడు విశ్వలోకగురుఁడు
సులలిత బలభద్ర సోదరుఁడు
కలితనిశ్చల శ్రీవేంకటగిరి [2]సంచారుఁడు
కలసిన యలమేల్మంగా మనోహరుఁడు. ॥ గోవిందుఁ ॥ 137

గుండక్రియ

చెలులాల రమణుఁడు చిత్తగించీ నల వాఁడె
మెలఁగి సేవ సేయరే మెచ్చీ నిందరిని ॥ పల్లవి ॥

---

1. సంచరించువాఁడను వర్తమున, 2. తే. పా. – సంచరుఁడు.

మంచి మాట లాడవలె మనసు గరఁచవలె
కంచపు మో వియ్యవలె కాంతునికి
వంచనతో మొక్కవలె వద్దఁ గాచుకుండవలె
కొంచక లోనికి రారే కొలువు వే ళాయను ॥ చెలు ॥

యిచ్చకము చూపవలె నింపులే నెరపవలె
మచ్చిక నవ్వఁగవలె మగనితోను
కచ్చుపెట్టు కుండవలె కానుక లందుకోవలె
కొచ్చి విన్నవించరే కొలువువే ళాయను ॥ చెలు ॥

వేడుకలు రేఁచవలె వెస నలమేల్మంగకు
వీడె మియ్యవలె శ్రీవేంకటేశుకు
యీడుకుఁ బొగడవలె యిద్దరును ముద్దువలె
గూడిరి తెరదీయరే కొలువువే ళాయనూ. ॥ చెలు ॥ 138

424-వ రేకు లలిత

యెన్ని నేరుచుకొన్నాఁడే యిందుకే వెరగయ్యాని
చెన్నుమీర యశోదకుఁ జెప్పరే యీ సుద్దులు ॥ పల్లవి ॥

వుట్లు దించఁగఁ గాచుకున్న [1]కృష్ణునిఁ జూచి
తిట్లు దిట్టు గొల్లెత తేరిచూడఁగా
[2]చెట్ల వంటి చన్నులు చేత ముట్టి పెనఁగీని
చుట్లచొల్లెలతోడఁ జూడరే యీ బాలుని ॥ యెన్ని ॥

వేవేలు పండ్లగంప విడుమంటా వేరొకతె
పూవులచెండునఁ గృష్ణుఁ బూఁచివేయఁగా
మోవిపం [3]డ్లంట్టఁ బట్టె ముంచి యాకె యధరము
చేవమీఱి యున్నాఁ దేమి సేతమే యీ బాలుని ॥ యెన్ని ॥

మలసె నేఁడ లమేలుమంగ శ్రీవేంకటకృష్ణు
నలమిపట్టి చేతికోలలు దియ్యఁగా
కలసె నంతలోనే కౌఁగిలించి రతులను
వెలసి మెచ్చఁగదరే వేడుక యీ బాలుని. ॥ యెన్ని ॥ 139

1. తే. పా.—క్రిష్ణు, 2. తే. పా.—చిట్ల=చెండ్లవంటి యని యర్థము,
3. తే. పా.—పండ్లంటా.

హిజ్జిజి

నెఱజాణ విభుఁడవు నీవే యిన్ని నేరుతువు
తఱితోడ నీ విదివో దయఁ జూచితివి ॥ పల్లవి ॥

కన్నుల నవ్వితివి కానుక చేకొంటివి
విన్నపము లెల్లాను వింటివి నేఁడు
సన్నలఁ జొక్కితివి చనవు లిచ్చితివి
ఇన్నిటా నీ వుపకార మేమని చెప్పుదును ॥ నెఱ ॥

సరస మాడితివి చవులమో విచ్చితివి
పరిమళములు నాపైఁ బూసితివి
అరుదైన మాట లాడి ఆదరించితివి నన్ను
సరుగ నీచేఁత కెంత సంతోసించు కొందును ॥ నెఱ ॥

చెలిమి చేకొంటివి నేస నాపైఁ బెట్టితివి
తలఁపులో నిలిచి చింత వాపితివి
అలమేల్మంగను నేను అంకెల శ్రీవేంకటేశ
కలసి యేలితివి యీగతి యెట్టు మెత్తును. ॥ నెఱ ॥ 140

భైరవి

నాలోని వేడుకలు నామనసే యెఱుఁగును
కే లెత్తి తన కిట్టే మొక్కితి నే ననవే ॥ పల్లవి ॥

వొడఁబరచ నేరుచు వొద్దికై వుండఁగలఁడు
చిడిముడిఁ బతికిఁకఁ జెప్పే దేమే
అడియాలా లిచ్చి నాఁడు అన్నిటా మన్నించినాఁడు
తడవనున్నపనులు తానే యెఱుఁగునే ॥ నాలో ॥

తను నిట్టే మరిగించె తమకము నాకు రేఁచె
చెనకి యింకా వేరే చెప్పే దేమే
మన సొక్కటిగాఁ జేసె మంతనానఁ జన విచ్చె
తనిసితిఁ గోరికల తానే యెఱుఁగునే ॥ నాలో ॥

కలయఁగ నాకు నేర్పె కమ్మి నావద్ద నున్నాఁడు
చెలికత్తెలాల మరి చెప్పేదేమే
అలమేలుమంగను తా నదె శ్రీవేంకటేశుఁడు
తలపులోఁ బాయఁడు తానే యెఱుఁగునే. ॥ నాలో ॥ 141

సామంతం

యెవ్వరే నీకు సరి యింతులు
చివ్వన నలమేల్మంగ చెల్లునే నీ రంతులూ ॥ పల్లవి ॥

తరుణి నీకన్నులబిత్తరి చూపులూ
మరునికి నవియే కమ్మని తూపులూ
బిరుదుల నీపతికె పెరరేఁపులూ
వరుసఁ జల్లితి వౌనే వలపుల రాఁపులూ ॥ యెవ్వరే ॥

పగటున నీరతి పలుకులూ
జిగి మతిఁ దగిలిన చిలుకులూ
తగిన నవ్వు దంతపు తళుకులూ
మొగి మర్మములు రేఁచే ములుకులూ ॥ యెవ్వరే ॥

పొసఁగే నీ కౌఁగిటి పొందులూ
సుసరాన మోవితేనె జుంటి విందులూ
కసిదీరని తమకపు మందులూ
కొసరి శ్రీవేంకటేశుఁ గూడుటకే సందులూ. ॥ యెవ్వరే ॥ 142

కేదారగౌళ

నా రమణునిఁ జూడరే నలినాక్షులాల నేఁడు
గారవముతోడ నన్నుఁ గరుణించీ నిదివో ॥ పల్లవి ॥

మరిగిన [1] యెడాటాన మంకు లేమి రేఁగవు
సరవితోఁ బెనగితే చలము లేదు
తిరమైన పొందులకు తెరమరఁ గెంచవద్దు
నిరతపు వేడుకలే నింకుకొను మతివి ॥ నా రమ ॥

1. తే. పా. యడాటాన.

మొగము చూచినమీఁద మొనయవు కాఁకలు
నగఁ దొడఁగితే మఱి నాట దలుక
చిగిరించిన వలపు చేగలు దీరకపోదు
మిగులాఁ దమకములే మేనఁ బెనగొనును ॥ నా రమ ॥

బలిమిఁ గూడినతఱిఁ బంతములు వుట్టవు
చెలఁగి యేకతమైతే సిగ్గు మించదు
అలమేల్మంగను నేను అతఁడు శ్రీవేంకటేశుఁ
డిల నన్ను నేలె నిఁక నిచ్చకమౌ రతులు. ॥ నా రమ ॥ 143

మధ్యమావతి

చెలులాల యిందుకే సిగ్గయ్యీ నాకు
తలకొన్న నాగుణము దాఁచ నేలే యిపుడూ ॥ పల్లవి ॥

అతఁడు చేసినమేలు ఆడుకొన వేడుకొను
యితరసతులు విని యే మందురో
తతితో వాని గుణాలు తలఁచితే వెరగౌను
మితిమీరి సవతులు మిం చెట్టు నవ్వుదురో ॥ చెలు ॥

చిమ్ముల నా రమణుని చేఁతలు నేఁ జూచుకొందు
కిమ్ముల వనిత లెంత గేలి సేతురో
నమ్మి వానిఁ బేరుకొని నాలోనెఁ జొక్కుకొందు
కొమ్మలు మోమోము లెట్టు కోరి చూచుకొందురో ॥ చెలు ॥

గక్కున శ్రీవేంకటేశుఁ గంటేఁ గౌఁగిలించుకొందు
పక్కనున్నవా రెంత పచ్చిసేతురో
ఇక్కువఁ దా నన్నుఁ గూడె యే నలమేలుమంగను
యెక్కుడు నందు కిందరు మించి యెట్టు మెత్తురో. ॥చెలు॥ 144

425-వ రేకు భూపాళం

యిందరికిఁ గలుగునా యిటువంటి భాగ్యాలు
చెందేవారికి వారు నోఁచిన యంతే కాక ॥ పల్లవి ॥

పాదము నాపై నతఁడు పక్కన జాఁచితేను
సోదించి మీ మొగా లేమి చూచుకొనేరే
సాదించి తా మోవితేనెచవులు నాకిచ్చితేను
[1]ఆదికొని నో రూరే రది యేమే మీరు ॥ యింద ॥

తమ్ముల మాతఁడు నాకు తానే పిల్చి యొసగితే
చిమ్ముచు మీ రేమి సన్న సేసుకొనేరే
కమ్మర నప్పటి నా కైదండ వట్టుకుండితే
పమ్మి లోలోనే సిగ్గులు పడ నేలే మీరు ॥ యింద ॥

శ్రీవేంకటేశుఁడు నన్నుఁ జేరి కౌఁగిలించుకొంటే
యీవల దోమతెర యేమి వేసేరే
ఆవటించి పెండ్లాడె నలమేల్మంగను నేను
బూవాన నిద్దరి నెంత పొగడేరే మీరు. ॥ యింద ॥ 145

నారణి

పతికి విన్నవించరే పడఁతులాల
తతితోడఁ దను మదిఁ దలఁతు నే ననరే ॥ పల్లవి ॥

యిచ్చకమయినచెలి యేపనులైనాఁ జేయు
కచ్చుపెట్టుకున్నది కాంక్ష రేఁగును
మచ్చిక గలిగినది మందెమేళాన సొలయు
యెచ్చు కుందులెంచి మరి యెగ్గుపట్టఁ దగదే ॥ పతికి ॥

ఆసతో నుండినది ఆలకించుఁ దనమాట
వాసి గలిగినది సేవలు సేయును
బాసలు నమ్మినది తప్పని గుట్టుతో నుండు
రాసి కెక్కించి ఇది రవ్వసేయఁ దగదే ॥ పతికి ॥

యిల్లాలై వుండినది యెదుటనే కాచుకుండు
[2]వెల్లివిరి నవ్వులది వేడ్కతో నుండు
యిల్లిదే శ్రీవేంకటేశుఁ దే నలమేలుమంగను
తెల్లమిగా నన్నుఁ గూడె తిరమైతి ననరే. ॥ పతికి ॥ 146

1. తే. పా.—అదిగొని, 2. తే. పా.—వెల్లవిరి.

గౌళ

వేసరించేదానఁ గాను వేగినంతా నిన్నును
రాసి కెక్క నీకృప నే రతిఁ జెలఁగుదును ॥ పల్లవి ॥

నట్టనడుమనే నీవు నావాఁడవై వుంటేఁ జాలు
అట్టే నే నెంతటిదాన నైనా నౌదును
గుట్టుతోడ నీవు నాకుఁ గొలు విచ్చితేఁ జాలు
నెట్టన లోకమునకు నేనే రాజ నౌదును ॥ వేస ॥

కందువ నీవు నన్నుఁ గన్నులఁ జూచితేఁ జాలు
అందపు సిరుల నోలలాడుదును
మందలించి నాతో నొక మాటాడితేనే చాలు
పందెమాడి నీచే తుదిపదము చేకొందును ॥ వేస ॥

చేరి శ్రీవేంకటేశ్వర సెలవి నవ్వితేఁ జాలు
కోరి నీవలపులకు గురి యౌదును
సారె నలమేల్మంగను సతి నీకు నైతేఁ జాలు
మేరతోఁ గూడితిని మేలెల్లా సాదింతునూ. ॥ వేస ॥ 147

శంకరాభరణం

తానే వచ్చీగాని తరవులు వెట్టకురే
మోనమునఁ జెలులాల మొక్కరే మీరు ॥ పల్లవి ॥

మనసువచ్చినసతి మరి దవ్వుల నుండినా
తనువు సోకినట్ల తలఁచుఁ బతి
యెనయికయైన మాట యెక్కడనాడినాను
అనిశముఁ జెవిలోనే ఆడినట్టే వినును ॥ తానే ॥

యిచ్చకపు జవరాలు యెదుటికి రాకుండినా
పచ్చిగా మఱపు లేక భావించును
బచ్చెన సిగ్గులతోడఁ బచ్చడము గప్పుకొన్నా
విచ్చి విచ్చి కన్నులను వేమారుఁ జూచును ॥ తానే ॥

మానాపతియైనది మఱఁగున నుండినాను
పూని వచ్చి కౌఁగిటఁ బొంచి కూడును
యే నలమేలుమంగను యీతఁడు శ్రీవేంకటేశుఁ
డానుకొని నన్ను నేలే నన్నిటాను మెచ్చును. ॥ తానే ॥ 148

కాంబోది

కాంతలాల చూడరే కన్నులపండుగ లివి
వింతయైన తనలోని వేడు కెటువంటిదో ॥ పల్లవి ॥
సింగారించుకొనఁగాను చెలియ విభునిఁ జూచి
అంగ మెల్లఁ జెమరించె నాస యెట్టిదో
రంగుగ మోవిమీఁది రసముల నిగ్గు చూచి
సంగతిగా నో రూరీచవు లెట్టివో ॥ కాంత ॥
పతి వాఁడే జవరాలు పవళించుండగఁ జూచి
మతి నివ్వెరగు లయ్యీ మక్కువెట్టిదో
చతురతఁ గొలువులో చక్కఁదనములు చూచి
తతిగొని పులకించీ దమకము లెట్టివో ॥ కాంత ॥
శ్రీవేంకటేశ్వరుఁడు సెలవి నవ్వఁగాఁ జూచి
భావించీ నలమేల్మంగబత్తి యెట్టిదో
యీవేళఁ గౌఁగిటఁ గూడి యీతనినేరుపు చూచి
చేవ దేరీఁ గళలతో చేఁత లెట్టివో. ॥ కాంత ॥ 149

నాదరామక్రియ

అడుగఁగ సిగ్గయ్యీ నా కందుకే నేఁడు
చిడిముడి చేఁతల చిన్నదానఁ గనకా ॥ పల్లవి ॥
చిత్త మెట్టున్నదో నాపై చెలువునికి
యిత్తల నాపొందు లింక నేమి నేసీనో
చిత్తరపు రతులలో ప్రియ మేటిదో
హత్తిన వో చెలులాల అదె విచారించెనూ ॥ అడు ॥

యెప్పుడు వచ్చునో మా యింటికిఁ దాను
చిప్పిలఁ గాంతలచేత [1]చెప్పంపినాఁడు
చొప్పుగాఁ గరుణ నన్నుఁ జూచె నిందాఁకా
తప్పక యీ వుపమలే తలపోసీ నేనూ ॥ అదు ॥
వోవరిలోఁ బవళించి వున్నాఁడట
దైవసమై యెంతలోనే కలసె నన్ను
నేవ నలమేల్మంగను శ్రీవేంకటేశుఁడు తాను
భావించి నే నిందుకే పైపై మెచ్చేనూ. ॥ అదు ॥ 150

426-వ రేకు దేశాక్షి

యెవ్వరికిఁ గలుగు నేఁడీ భాగ్యము
నివ్వటిల్ల నన్ను మన్నించితివి గాకా ॥ పల్లవి ॥
వేడు కొను నీగుణాలు వెలఁదులు పొగడితే
చూడఁ జూడ నీ రూపు సోద్యము లౌను
కూడి వున్నంతదడవు గొబ్బున సంతోస మవును
యీడ నామనసు నీపై నెంత మరిపితివో ॥ యెవ్వ ॥
నెమ్మది నిద్రించితేను నీకలలే కందును
కొమ్మలతో నిన్నుఁ బేరుకొని మెత్తును
కమ్మర నీగురుతులు కాయ మంటితేఁ జొక్కుదు
ఇమ్మల నీమీఁదిబత్తి యెంత నా కిచ్చితివో ॥ యెవ్వ ॥
చిగిరించు నవ్వులు [2]చేయి నాపైఁ జాచితే
నిగుడుఁ దమకములు నీవు చేరితే
తగు నలమేల్మంగ నింతట శ్రీవేంకటేశ్వర
వొగి నీరతుల కెంత వొడిగట్టించితివో. ॥ యెవ్వ ॥ 151

ఛాయానాట

అందుకే వో చెలియా అపుదయ్యీ నాకు నిట్టె
చందమాయఁ బను లెల్లా సంతోసమూ నీకు ॥ పల్లవి ॥

1. తే. పా.-చెప్పెంపి, 2. తే. పా.-చెఱ.

ఆనుకొని చెలులచే ఆతఁడు సేసేచేఁత
వీనుల పండుగగాను వింటివా నీవు
వూనినవేడుకతోడ నుండేటిలాగు లెల్ల
కానుకగాఁ గన్నులారఁ గంటివా నీవు ॥ అందు ॥

ఆరితేరి వద్దనుండి యాతనితలఁపు లెల్లా
చేరి మాటలాడి తెలిసితివా నీవు
నారుకొనే నప్పటి నీనయగారితనములు
మేరమీఱి పచారించి మెచ్చితివా నీవు ॥ అందు ॥

మెఱయ శ్రీవేంకటేశు మేలిమినేరుపు లెల్లా
గుఱిగాఁ గౌఁగిటిలోఁ జేకొంటివా నీవూ
మఱియును నలమేలుమంగ నైన నన్నుఁ గూడె
తెఱవలలోన సమ్మతించితివా నీవు. ॥ అందు ॥ 152

బౌళి

నీ దిక్కే తప్పక చూచీ నీ విభుఁడు
మోదముతోఁ జేతు లెత్తి మొక్కు మొక్కఁగదవే ॥ పల్లవి ॥

బాసికము గట్టుకొని పదరఁగ నేఁటికి
సేసలు చల్లేఅప్పుడు సిగ్గు లింకానా
ఆసతోఁ బెనఁగుతాను అనుమానము దగునా
వేసరని వలపుల విఱ్ఱవీఁగఁ గదవే ॥ నీది ॥

వీడెము చే నందుకొని వింత సేయవలెనా
కూడిమాడి వుండి మరి గుట్టు సేతురా
వాడికగాఁ బొందుసేసి వావు లడుగుదురా
జోడు గూడి కౌఁగిటిలో సొంపుమీఱఁ గదవే ॥ నీది ॥

మంతనాన దక్కఁగొని మరఁగు వెదకుదురా
పంతము లీడేరె మరి కొసరేలా
చెంత నలమేల్మంగవు శ్రీవేంకటేశుఁ డతఁడు
సంతోసించి నిన్ను నేలే జట్టిగొనఁగదవే. ॥ నీది ॥ 153

మధ్యమావతి

నీ కెప్పుడు చూచినాను నేనే యితవరిఁ జుమీ
　పైకొని ముందుగా విన్నపము సేసికొంటిని ॥ పల్లవి ॥

కొప్పు జారె నంటే నింతేకొంగు వట్టేవు సుమీ
　దెప్పరాన నేఁ డది తెలుపు మని
　యిప్పు డద్దము చూపితే నిట్టె కోపగించకుమీ
　కప్పి సింగారము తారుకాణించవలెను ॥ నీకె ॥

కళలు నిండే మోమంటే కాంతాళించేవు సుమీ
　సొలసి నీకు దిష్టాలు చూపు మని
　చెలఁగి తెర వేసితే సిగ్గులు వడకుమీ
　అలపారఁ బవళించు మంటే నింతే నేను ॥ నీకె ॥

పూరకే నవ్వితి నింతే వొట్టు వెట్టేవు సుమీ
　కారణ మిందుకుఁ బోల గడించు మని
　యీరీతి శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
　చేరి న న్నేలఁగా సంతోసించితి నేను. ॥ నీకె ॥ 154

ఆహిరి

తలపోసి తలపోసి తమకించీ నా మనసు
　తలుపు దెఱచి నా దండకుఁ బిలువరే ॥ పల్లవి ॥

చెలికత్తెల మాటలు చేకొని వినినవాఁడు
　యెలమి నిక్కడి కిప్పు దేల రాఁడే
　కలకల నవ్వుతాను కానుక లందినవాఁడు
　పలుమారు నెక్కడి పరాకున నున్నాఁడే ॥ తల ॥

ఆసవెట్టి నాకు లేక లంపినయట్టివాఁడు
　పాసి తా నక్కడ నేమిపని కున్నాఁడే
　వాసి కెక్క నాపై వలపు చల్లినవాఁడు
　సేస చేఁబట్టుక యెంత సిగ్గుతో నున్నాఁడే ॥ తల ॥

పక్కన నాయండ వచ్చి పవళించి వున్నవాఁడు
మొక్కలాన నే లవ్వలిమోమై వున్నాఁడే
యిక్కడ శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
మిక్కిలి న న్నేలే యెట్టు మెచ్చుతా నున్నాఁడే. ॥ తల ॥ 155

దేసాళం

యింతకంటె నేమి సేసు యిది చాలదా నాకు
సంతసము రేఁచి ఇంత చన విచ్చినాఁడూ ॥ పల్లవి ॥

తగవరి తా నౌనే దయగలవాఁడూ నౌనే
జగమెల్లా నెరిఁగిన జాణఁడూ నౌనే
వెగటుగా తన్నుఁ బాసి విరహాన నున్న నన్ను
మొగము చూచి నాచే మొక్కించుకొన్నాఁడే ॥ యింత ॥

వొడఁబరచ నేర్చునే వొద్దికై వుండ నేర్చునే
[1]చిడిముడి నంది పొందుసేయ నేర్చునే
కడఁగి తన్నుఁ జూడక కాఁకలఁ బొరలే నన్ను
వొడివట్టి నాకు మోవి యొసఁగినాఁడు ॥ యింత ॥

విన్నపాలు వినేనే వీడు [2]దొర్లాదేనే
యిన్నిటాఁ దా శ్రీవేంకటేశ్వరుఁడే
మన్నించి యలమేలుమంగనైన నన్నుఁ గూడె
వున్నతపు రతులను వోలలార్చినాఁడు. ॥ యింత ॥ 156

427-వ రేకు శ్రీరాగం

విరహ మేడదే నాకు వెస నీకరుణ గద్దు
అరసి నీకతల నోలాడుచుందుఁ గాక ॥ పల్లవి ॥

తలఁపులో నీ వుండఁగా తడఁబాటు లేల నాకు
వలపు గలిగుండగా వగ పేల
చెలిమి నీవు సేయఁగా చింతలెల్లాఁ బెడఁబాసె
పలుమారు సంతోసానఁ బరగుదుఁ గాక ॥ విరహ ॥

1. తే. పా.—చిదుముడి, 2. తే. పా.—దొల్లాదెనే.

వేల నీ వుంగరమిదే వేళలు చూడ నేఁటికి
సోలి నీసతులు వీరే సొలయవద్దు
వోలివెట్టి పెండ్లాడితి వొడఁబరచవలెనా
మేలు తోడిదాననై మెలఁగుదుఁ గాక ॥ విరహ ॥

నీపేరు నానోర నిదే నేరములు లేవు నాకు
కాఁపురము నీకుఁ జేసే కడ మెంచను
యేపొద్దు శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
వోపి నన్ను నేలితివి వొనరుదుఁ గాకా. ॥ విరహ ॥ 157

## ముఖారి

కాచుకున్నారు నీవూడిగపు చెలు లిందరును
[1]చేచేఁత జలకమాడ చిత్తగించే దెపుడే ॥ పల్లవి ॥

గుట్టునఁ బతిగుణాలు కొనియాడనే పట్టె
చుట్టి యాతనిమొగము చూడనే పట్టె
అట్టె వీడె మిచ్చి నీవు ఆకు మడిచియ్యఁ బట్టె
నెట్టన సింగారించుకో నీకు వేళ యపుడే ॥ కాచు ॥

ననిచి యాతనితోడ నవ్వులు నవ్వనే పట్టె
పెనఁగి వలపు లెల్లాఁ బెంచనే పట్టె
తనివోని రతులపైఁ దమి రేఁచనే పట్టె
అనువునఁ గూచుండి ఆరగించే దెపుడే ॥ కాచు ॥

సతతముఁ గెమ్మోవులు చవులు చూడనే పట్టె
మితిమీరి నేరుపులు మెచ్చనే పట్టె
అతఁడు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగవు నీవు
పతికిఁ బతి గూడేరు పవ్వళించే దెపుడే. ॥ కాచు ॥ 158

## ధన్నాసి

అటువంటి గుణాలదే అలమేల్మంగ
[2]తటుకునఁ జిత్తగించి తగిలి మెచ్చవయ్యా ॥ పల్లవి ॥

---

1. తే. పా.—చేచేత, 2. తే. పా.—తటుకన.

కొనియాడనేర్చిన కొమ్మ పొందుసేయ నేర్చు
నసువుగలిగినది నవ్వ నేరుచు
చెనకినది వెనకఁ జేరి మొక్కనేరుచు
వినయ మెరిఁగినది వేఁడుకొన నేర్చును ॥ అటు ॥

గుట్టుగలిగినయది కోరి వలపించ నేర్చు
దిట్టయైనది మాట తెలుప నేర్చు
అట్టడి యయినది మీఱక వుండఁగ నేరుచు
చుట్టమైనది కలయ సుసరాన నేర్చును ॥ అటు ॥

సిగ్గుగలిగినది మచ్చిక సేవసేయ నేర్చు
యెగ్గు పట్టనిది యిట్టే యెనయ నేర్చు
అగ్గమై శ్రీవేంకటేశ అన్నిటా నిన్నిపె గూడె
తగ్గు మొగ్గు లేనిది దయనుండ నేర్చునూ. ॥ అటు ॥ 159

కురంజి

నందుసుడివనితవు జాణవమ్మా
అందుకోలు పెండ్లాదే వౌనమ్మా ॥ పల్లవి ॥

కాతరాన రమణుఁ దేకతమున నుండఁగాను
ఆతనిపై బత్తి నేనే వౌనమ్మా
యీతల నెవ్వతెకో తా నెదురులు చూడఁగాను
చేతు లెత్తి మొక్కేవు చేరీ మేలు నమ్మా ॥ సందు ॥

వేడుకతో నేమిటికో వీను లాలకించఁగాను
ఆదేవు నీమాటలు అవునమ్మా
జాడతోనే అదపముసతుల వెదకఁగాను
వీడెము నీ విచ్చేవు విటకత్తె వమ్మా ॥ సందు ॥

యింటిలో యలమేల్మంగ నెదఁ బెట్టుకుండఁగాను
అంటేవు శ్రీవేంకటేశు నౌనమ్మా
జంటలై యీతఁడే మమ్ము సరి నేలుకుండఁగాను
నంటున నీవు మెచ్చేవు నయగారివమ్మా. ॥ సందు ॥ 160

## నట్టనారాయణి

వోజ దప్పకుండావలె నొయ్యారపుదానికి
సాజపురమణుని కే చందమైనా నమరును ॥ పల్లవి ॥

కరుణించి తానే వచ్చి కలసితేఁ దగుఁగాక
వరుసఁ దరవువెట్ట వచ్చునా నాకు
మరిగి యప్పటి నాతో మాటాడితే నాదేఁగాక
యెరవుల దానివలె యెచ్చరించఁ దగవా ॥ వోజ ॥

సమ్మతించి నామోవి చవిగొంటే నింపుగాక
నెమ్మది నోదఁబరచ నేరుపా నాకు
చిమ్ముచుఁ జెనకితేను సేవసేయఁ గూడుఁగాక
దిమ్మరితనాన నాకు దీకొన సరవులా ॥ వోజ ॥

సారె సారె నవ్వితేను సరసమాడుదుఁగాక
చేరి మందెమేళాలు చెల్లునా నాకు
యీరీతి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కూరిమి నన్నేలినాఁడు కొసర నుచితమా. ॥ వోజ ॥ 161

## కుంతలవరాళి

మరుఁడు సేసినమాయ మగలకు నాండ్లకు
విరసాలు పుట్టవు వేడుకే కాని ॥ పల్లవి ॥

యెంత దూరి మాటాడినా యింపు లయ్యే వుండుఁగాని
పంతము రేఁగ దింతిపైఁ బతికి
పొంతనుండి సారె సారె బొమ్మల జంకించినాను
వింతలు దోఁచవు మరి వేడుకే కాని ॥ మరుడు ॥

చలపట్టి సరసము జరయుచు నాడినాను
అలయికవుట్టదు దేహమునకును
పెలుచుఁదనాన మరి పెనఁగులా టాడినాను
వెలయ వేసటగాదు వేడుకేకాని ॥ మరుడు ॥

మిన్నక కొసరి మందెమేళ మెంత నేసినాను
అన్నిటా లోలో నెగ్గులై మించవు
యెన్నఁగ శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
విన్నప్పుడే కూడె మాకు వేడుకలె కాని. ॥ మరుదు ॥ 162

428-వ తేకు ధన్నాసి

చెప్పేనంటా నేనే వుంది సిగ్గుపడుదు నెదుట
వొప్పుగ నాతనికి మీ రొగి విన్నవించరే ॥ పల్లవి ॥

చనవరితనమున సారెకు మాటలాడుదు
నను పైనకతమున నవ్వుదును
వినయము నేర్తునంటా వేవేలు సేవలు సేతు
యెనలేని నా రమణుఁ డెగ్గుపట్టీఁ జుమ్మీ ॥ చెప్పీ ॥

చిన్నదానఁ గనకనే చేఁతలెల్లాఁ జేయవత్తు
మన్నించిన కతమున మలయుదును
సన్నకు లోనైతిఁ గన సంతోసానఁ దమకింతు
యిన్ని నెఱిఁగినవాఁడు యెగ్గుపట్టీఁ జుమ్మీ ॥ చెప్పీ ॥

పట్టపుదేవులనై పైపైఁ బెనఁగుదును
గుట్టుతోదానఁ గనక కొంచి మొక్కుదు
యిట్టే శ్రీవేంకటేశుఁ దే నలమేలుమంగను
యెట్టైనఁ దా నన్నుఁ గూడె నెగ్గుపట్టీఁ జుమ్మీ. ॥ చెప్పీ ॥ 163

దేశాక్షి

తనచిత్త మెట్టుండునో తగ వెఱుఁగుదు నేను
వినయము గొంత చూపి వెలసేఁగాకా ॥ పల్లవి ॥

యేలినవాఁడు నన్ను నిట్టే మన్నించకుండినా
కోలుముందుగాఁ గొంత కొసరేఁగాక
చేల కొంగంటినవాఁడు చెనకఁడా యెప్పుడును
వాలుకచూ పాతనిపై వంచేఁగాక ॥ తన ॥

కప్పుర మంపినవాఁడు కౌఁగిటికి వచ్చునేకా
పిప్పిగట్ట మరి నవ్వి పెనఁగేఁగాక
యిప్పుడు బత్తిగలవాఁ డెప్పుడూనుఁ జుట్టమౌనే
దప్పికి మోవి యడిగి తనిసేఁగాక ॥ తన ॥

చేతికి లోనైనవాఁడు సిగ్గువడునా యిఁక
ఘాతలఁ గౌఁగిటఁ గూడి కలసేఁగాక
యీతఁడు శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కాతరాన నాపయ్యెద గప్పేఁగాకా. ॥ తన ॥ 164

## [1] తోడి

చెప్పిన ట్లల్లా మరి చేసుటగాక
దప్పిదేరి లోలోనే తలవంచ నేఁటికీ ॥ పల్లవి ॥

సిగ్గులు వడేవారికి చింతఁ బొరలే వారికి
యెగ్గులు వట్టఁగఁ జెల్లు నెంతైనను
అగ్గలమై పతిమీఁదియాసకు లోనైనవారు
తగ్గు మొగ్గు వాసులలోఁ దడఁబడ నేఁటికీ ॥ చెప్పి ॥

పంతము లాడేవారికి భావించుకొనేవారికి
వింతగా జరయఁ దగు వేమారును
చెంతనుండి రతులలోఁ జెలిమిసేసేవారు
మంతనాన వట్టి యనుమానము లేఁటికీ ॥ చెప్పి ॥

చలపాదివారికి జడియనివారికి
కిలకిల నవ్వవచ్చుఁ గేరడానను
యెలమి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
కలసె న న్నితఁడు కక్కసించ నేఁటికీ. ॥ చెప్పి ॥ 165

## నాగవరాళి

యేమి విన్నపము సేసే వెంతైనాఁ గలదు పని
గామిడితనా [2] లెఱఁగఁ గరుణించు మనవే ॥ పల్లవి ॥

1. తే. పా. — తోండి, 2. తే. పా. — లెరంగ.

పట్టి పెనఁగఁగ నోప బాస లడుగఁగ నోప
వొట్టుక వొద్దఁ గాచుకుండ నోపుదు
అట్టడివిభుఁడు తాను జాతిగుండెవాఁడు తాను
గట్టిగా నా భావ మెంచి కరుణించు మనవే ॥ యేమి ॥

వేసాలదానఁ గాను వేగిరపుదానఁ గాను
ఆసతో సేవలు సేసే అందు కొాదును
రాసి కెక్కెఁ దొల్లే తాను రాజసపువాఁడు తాను
వాసితో నన్నుఁ బాయనివరుస ఇమ్మనవే ॥ యేమి ॥

చలములు పచరించ జంకెనలు వచరించ
పలుమారు వలపులే బడి నింతును
చెలి యలమేల్మంగను శ్రీవేంకటేశుఁడు తాను
కలసె నాగుణ మింకాఁ గనుఁగొన మనవే. ॥ యేమి ॥ 166

పూర్వగౌళ

యెంతటి నేరుపరివి యేమని పొగడవచ్చు
వింత నీసుద్దులు చూచి వేడు కాయ నాకును ॥ పల్లవి ॥

చన విచ్చి నీవు మోవిచవులు చూపఁగాను
తనివిఁ బొందె నాతలఁ పెల్లను
మునుకొని నీవు నామొగమై నిలువఁగాను
పెనగొన్న సంతోసము పెడరేఁగె నాకును ॥ యెంత ॥

పక్కన నీవు నాకు బాగా లొసగఁగాను
యిక్కువలు గరఁగను ఇంతలోనె
చెక్కు నొక్కి నీవు నన్ను సిగ్గులు దేరుచఁగాను
నెక్కొన్న కోరికలు నెరవేరె నాకును ॥ యెంత ॥

కందువ నుండినన్నుఁ గౌఁగిలించుకొనఁగాను
చిందె నాసెలవులనుఁ జిరునవ్వులు
యిందునే శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పొందితివి రతుల నీభోగ మబ్బె నాకును. ॥ యెంత ॥ 167

సావేరి

తనచిత్తము వచ్చితే తానే కరుణించీఁగాక
ఘనుఁడైన రమణునిఁ గక్కసించ నేఁటికే ॥ పల్లవి ॥

వూహగలవారికి నుపమలు దోఁచును
దాహ మణఁచేవారికి దప్పి దేరును
మోహముగలవారికి మునుకొను సంతోసము
వోహో రిత్తవారికి నొదఁబాటు లేఁటికే ॥ తన ॥

మనసువచ్చినప్పుడు మాటలెల్లాఁ జవు లౌను
తనిసివున్నయప్పుడు తాలిమి నిండు
ననిచినయప్పుడు నవ్వులు తానే వచ్చు
పనిలేనియప్పుడు పచారించ నేఁటికే ॥ తన ॥

కూటములు గలిగితే గుణములు చక్క నౌను
పాటించి పొందు [1]గలిగితేఁ బంత మీదేరు
యీటున శ్రీవేంకటేశుఁ డిదివో నన్ను నేలె
మేటామేటి రతులలో మెఱయఁగ నేఁటికే. ॥ తన ॥ 168

429-వ రేకు లలిత

విభుఁడు వద్ద నున్నాఁడు వేవేలు చందాలాను
సభలో సిగ్గు లేటికే చనవరి తాను ॥ పల్లవి ॥

చిన్నఁబోవ నేటికే చెంగలించి వుండుగాక
మన్ననదేవులైన మగువ తాను
సన్న సేయ నేటికే చక్కఁగా మాటాడుఁగాక
కన్న వెల్లా నేర్చిన కలికి తాను ॥ విభుడు ॥

తలుపు మాటేఁటికే దండనే కూచుండుఁగాక
కులముతోడి పెండ్లికూఁతురు తాను
అలయఁగ నేఁటికే ఆసలఁ జేకొనుఁగాక
పలురచనల మించె పంతగత్తె తాను ॥ విభుడు ॥

1. తే. పా.-గలితే.

కానుక లంప నేఁటికే కౌఁగిటనే కూడుఁగాక
పూని సలిగెలు చల్లే పొలఁతి దాను
అనుక శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నుఁ గూడె
ఆన లేఁటికే నిజమాడే లేమ తాను. ॥ విభుడు ॥ 169

## మనోహరం

అడుగరే యీసుద్ది ఆతనినే చెలులాల
[1]చిడిముడిఁ జెప్పినట్టు సేసేఁగాని ॥ పల్లవి ॥

కొత్త కొత్త విన్నపాలు కోరి వేఁడిఁ జేయఁగాను
చిత్త మెట్టుండునొకా చెలువునికి
బత్తితోడ సారె సారెఁ బాదాలు విసుకఁగాను
తత్తరపుగో శ్నదఁ దాకునో తనకు ॥ అడుగ ॥

[2]యెగ్గెఱఁగక సేవ నే నిందరిలోఁ జేయఁగాను
సిగ్గులెంత నిండునొకా చేరి పతికి
వొగ్గి యేపొద్దునుఁ దనవొద్దఁ గాచుకుండఁగాను
వెగ్గళించరాక యెంత వేసటొకా తనకు ॥ అడుగ ॥

గట్టి నా గుబ్బల నొత్తి కరఁగించఁగాను పంత
మెట్టొకా శ్రీవేంకటేశ్వరునికి
యిట్టె తా నన్నుఁ గూడె యింకా నేఁ గొసరఁగా
రెట్టించి తమకములు రేఁగునొకా తనకు. ॥ అడుగ ॥ 170

## భైరవి

విన వేడుకయ్యీ నాకు వెస నిద్దరిసుద్దులు
మన సొక్కపై వుండే మఱి యెఱిఁగించరే ॥ పల్లవి ॥

వెలఁది తలఁపులెల్లా వినెనా రమణుఁడు
చెలులతోఁ బరాకు సేయఁడుగదా
తలఁపులు తలఁపులు తారుకాణ వచ్చెనా
చెలికత్తెనే నేనూఁ జెప్పరే మీరు ॥ విన ॥

1. వే. పా. – చిడుముడి, 2. వే. పా. – యెగ్గెరంగక.

పడఁతిచే కానుక పట్టి నాచేయి చాఁచి
అడియాలాలు మఱస్తి ననఁడుగదా
బడినుండి యాతనిభావము దెలిసితిరా
[1]చిడిముడి పడకుండాఁ జెప్పరే మీరు ॥ విన ॥

చేరి యాకెఁ గూడేనా శ్రీవేంకటేశ్వరుఁడు
జీరగాఁగఁ గొనగోరఁ జిమ్మఁడుగదా
అరితేరి యిద్దరిని అడిగితిరా నేఁడు
చేరువ సంతోసాలు చెప్పరే మీరు. ॥ విన ॥ 171

ఆహిరి

చెప్పరాని మోహపు చెలివి నీవు
చప్పఁగా నాతని నీవు సాదించ నేఁటికే ॥ పల్లవి ॥

చేతిలోనె వున్నవివే సేసపాలు
కాతరించ నేఁటికే కాంతునితోను
ఆతుమలో నిండెఁగదే అడియాసలు
యేతుల నీపంతము లింత చూప నేఁటికే ॥ చెప్ప ॥

యిప్పు డిప్పుడే మొలచీ నివె చన్నులూ
చొప్పు లెత్తి పతి నేల సొలసేవే
చిప్పిలేవేడుకల చిన్నదానవూ
తిప్పరాని తమితోడ దీకొనఁగ నేఁటికే ॥ చెప్ప ॥

పరిపాకమైన దీనిపాయము
యిరవై శ్రీవేంకటేశు నెంత దూరేవే
యెరవులేక యిట్టే యెనసితివి
తరితీపుతో మరి తమకించ నేఁటికే. ॥ చెప్ప ॥ 172

బళహంస

యెంతైనాఁ దనివోవఁ డిదివో తాను
బంతి నిట్టే నాపొందులు బాఁతెయ్యానా తనకు ॥ పల్లవి ॥

1. తే. పా.—చిడుముడి.

చెక్కులపై జవ్వాది చేతఁ దీసి కాంతకు
మిక్కిలి వేడుకతోడ మెత్తీఁ దాను
చొక్కపు సిరసునిండాఁ జుట్టుకొన్న పూదండలు
మిక్కుటముగా నాపెమెద వేసీఁ దానూ ॥ యెంతై ॥

పాదమున నున్న తన బంగారు పెండెము
ఆదిగొని మెచ్చి పెట్టీ నాపెకుఁ దాను
పోదిగా నంతటిలోనే పుక్కిటితమ్ములము
మోదాన నాపెకుఁ జూపి మోవి యిచ్చీఁ దాను ॥ యెంతై ॥

చందనకావివన్నె పచ్చడ మాపెకును నాకు
కందువల సరిగానే కప్పీఁ దాను
యిందులోనే శ్రీవేంకటేశ్వరుఁడు నన్ను నేలే
[1]కుందనఁపు టుంగరము గురు తిచ్చీఁ దాను. ॥ యెంతై ॥ 173

శుద్ధవసంతం

వరుసతో రమణుని వలపించవలెఁ గాక
సరసము లాడితేనే సవతులైరా తాము ॥ పల్లవి ॥

కాంతుని నూరకైనా కన్నుల జంకించితేనే
పంతములు వచ్చేనా పడఁతులకు
చెంతనుండి సెలవుల చిఱునవ్వు నవ్వితేనే
బంతి నన్నిటా నేరుపరులైరా తాము ॥ వరుస ॥

చనవున నాతని చన్నులఁ దాకించితేనే
తనిసెనా మనసులు తమ కెల్లాను
వినయానఁ బాదాలు వేమారుఁ బిసికితేనే
పెనఁగినవారైరా బీరపురతులనూ ॥ వరుస ॥

వలవని జోలితోడ వద్దఁ గాచుకుండితేనే
చలములు దక్కెనా చక్క జాడను
యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
పలికినంతటిలోనే పనులు చేకూరీనా. ॥ వరుస ॥ 174

1. తే. పా. — కుందణపు.

430-వ రేకు బలహంస

యింక నేఁటి మేలములు యింతితోడ నీకును
అంకెలఁ గరుణ నేలి ఆదరించరాదా ॥ పల్లవి ॥

చెంది నీకు మొక్కఁగాను చెమటలు గరఁగని
కందువ నీ పాదాలంటె కస్తూరిబొట్టు
అంది కానుకియ్యఁగాను అట్టే తనకొప్పు వీడి
ఇందు నిన్నుఁ గప్పుకొనె నింద్రనీలాలు ॥ యింక ॥

విన్నపము సేసుకోఁగా వెసఁ [1]దామరలవలె
నిన్నంటెఁ బూజించినట్టు నిండుఁ జన్నులు
చెన్నుమీరఁ జేయరానిసేవ నీకుఁ జేయఁగాను
పన్నీరు గులికినట్టు పైఁ జిందేఁ జెమటా ॥ యింక ॥

మంచి మాట లాడఁగాను మధురాలు సోఁకి సోఁకి
ముంచి నీపెదవి నంటె మోవిపండు
యెంచఁగ శ్రీవేంకటేశ యీకె నిట్టే యేలితివి
మించె జవ్వనమదపుమేటివాసన. ॥ యింక ॥ 175

నీలాంబరం

మేలే నీనేరుపులు [2]మెలఁత
చాలుకొన్నసరసాలు చవులాయను ॥ పల్లవి ॥

సూటి దప్పవుగదవే చూపులు నీవి
పాటించి నేఁ డాతనిపై నిండెను
వాటమాయఁ గదవే నీవలపులు
కూటము లాతనివద్దఁ గుప్పలాయను ॥ మేలే ॥

నాములాయగదవే నీ నవ్వులు
కామించి యాతనిమోము కళ లెక్కెను
వాములువడెఁగదవే వట్టిమాటలూ
కోమలపు వీనుల కొటారులఁ జేరెనూ ॥ మేలే ॥

1. తే. పా.—దామెరల, 2. తే. పా.—మెఱత.

కమ్ముకొనెఁగదవే కౌగిలి నిది
పమ్మి శ్రీవేంకటేశ్వరుఁ బాయ వెన్నఁడూ
చిమ్మి రేఁగెఁగదవే చెమట లెల్లా
కుమ్మరింపు వేడుకల గుఱుతులాయనూ. ॥ మేలే ॥ 176

రాయగౌళ

యెందాఁకా సిగ్గువడే విప్పుడు నీవు
కందువ లెల్లా నంటి కౌఁగిలించరాదా ॥ పల్లవి ॥

పూచినతంగేడువలెఁ బొలఁతి నిలుచున్నది
కూచుండుమనరాదా కోరి నీవద్ద
రాచిలుకవలెనే రవళిగా మాట లాడీ
చేచేత మెచ్చి సంతోసించఁగరాదా ॥ యెందా ॥

యెలమి రాయంచవలె నింటికి వచ్చె నప్పుడే
చెలరేఁగి కాఁపురాలు సేయరాదా
కొలని [1] తుమ్మెదవలె కోరి నిన్నుఁ బాయ లేదు
పిలిచి లాలనసేసి బెరయఁగరాదా ॥యెందా॥

అందపుఁ [2] గోవెలవలె ఆకు కొరికి నీ కిచ్చీ
చెంది పొత్తుల వీడెము సేయరాదా
యిందునే శ్రీవేంకటేశ యీకె నిట్టే యేలితివి
పొందుల రతులు దలపోసుకొనరాదా. ॥ యెందా ॥ 177

సాళంగనాట

యిన్ని నేరుపుల యీకె యీ యలమేలు మంగ
నిన్ను జట్టిగొనె నిట్టే నెగడఁగఁ దగును ॥ పల్లవి ॥

మక్కువగలుగుపతి మనసు గలఁచరాదు
వక్కణతో మెప్పించవలెగాని
వెక్కసపుమాటలు వేమారు నాడఁగరాదు
పక్కన వినయముచే పచరించఁ దగును ॥ యిన్ని ॥

1. తే. పా.—తుమ్మిద, 2. తే. పా.—గోవిం.

బత్తిసేసి యాతనిఁ బైపైఁ గొసరరాదు
మెత్తనిమోవి యిచ్చుటే మేలుగాని
హత్తి సరసమాడఁగ నలయించఁగరాదు
గుత్తపుచన్నుల నొత్తి కూడఁగఁ దగును ॥ యిన్ని ॥
యేలిన శ్రీవేంకటేశు నెలయించఁగరాదు
చాలాఁ గౌఁగిలించుటే చందముగాని
జోలిఁబెట్టి వూరకైనా సొరిదిఁ బెనఁగరాదు
యీలీల వొకరొకరు యెనయుటే తగును. ॥ యిన్ని ॥ 178

శ్రీరాగం

యెంత నే నెఱఁగకున్నా నెప్పుడూ నీవే గతి
వింతలేక మన్నించి విచ్చేయుమా యింటికి ॥ పల్లవి ॥
నినుఁ గూడేతమకము నిలుపలేక నేను
కినిసి వేమారు వెంగెములాడుదు
వెనుఁగ నీ రతి దలపోసి పోసి నేను
అనువురాక వట్టి యలుకఁ బొరలుదు ॥ యెంత ॥
కన్నుల నిన్నుఁ జూచేకాంతాళమున నేను
పన్నిక సారెఁ దప్పులు పట్టుతా నుందు
యెన్నరాని కౌఁగిలి యిట్టే కోరి కోరి నేను
సన్నలా చాయలాను జంకించి సొలతును ॥ యెంత ॥
నీ మన్నన లింతంతన నేరక ఇప్పుడు నేను
కామించి నీ కౌఁగిట గర్వింతును
యీమేరల శ్రీవేంకటేశ నన్నేలితివి
ఆముకొన్న సంతోసాన నానందింతునూ. ॥ యెంత ॥ 179

మధ్యమావతి

ఇంతులు నోఁచిననోఁమో ఇది నీకు విలాసమో
యెంతైనానుఁ బొగడక యెట్లు మానవచ్చును ॥ పల్లవి ॥

సిగ్గుతో నేనుండితేను చేరి మాటలాడింతువు
దగ్గర లోఁగితే వచ్చి తమి రేఁతువు
వెగ్గళించక కొంకితే వెఱపు దెలుపుదువు
యెగ్గులేని నీ గుణాల కెవ్వరు వలవరు ॥ ఇంతులు ॥

వినయాన నేనుండితే వేడుకఁ జేయి చాఁతువు
నను నేనే దూరుకొంటే నవ్వింతువు
మన సెఱఁగ కుండితే మందెమేళము సేతువు
యెనలేని నీచేఁతల కెవ్వ రిఁక మెచ్చరు ॥ ఇంతులు ॥

గుట్టున నేనుండితేను కూడి చనవిత్తువు
చుట్టరికాలెంచుకొంటేఁ జొక్కింతువు
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
యిట్టె నీ సుద్దులకు నెవ్వ రిటు మొక్కరూ. ॥ ఇంతులు ॥ 180

431-వ రేకు మంగళకౌశిక

ఆతఁడు తానే మన్నించినపుడు నన్ను
చేతికి లోనుగానే చెప్పవే నా వలపు ॥ పల్లవి ॥

తలఁపు దెలుసుకో దయపుట్ట మాటలాడు
చలము సాదించకు చతురునితో
పొలయకు సారె సారె చూపు వినయములే
చెలియరో యీరీతిఁ జెప్పవే నా వలపు ॥ ఆత ॥

యెదుటనే నిలుచుండు ఇచ్చకమే పచరించు
పచరకు మెంతయినా పతితోడను
పొదిగి కొలువుసేయి పుట్టించు వేడుక లెల్లా
చెదరకుండాఁ దగిలి చెప్పవే నా వలపు ॥ ఆత ॥

మొక్కుము నా మారుగాను మునుకొని యెచ్చరించు
వెక్కసాన దూరకు శ్రీవేంకటేశ్వరు
తక్కక నన్నింతలోనే తా నిందు విచ్చేసి కూడే
చెక్కు నొక్కి యింకానుఁ జెప్పవే నా వలపూ. ॥ ఆత ॥ 181

## నారణి

చేరి నీవు చెప్పినట్టు సేయనేవలెఁ గాని
మేర మీఱరాదుగా మిక్కిలి నీతోను ॥ పల్లవి ॥

వెద్దు వెట్టి చెక్కు నొక్కి వేఁడుకోఁగా నీతోను
వొద్దించుకోరాదుగా వువిదకును
జిడ్డుదేరఁ గత లెల్లాఁ జెప్పి వొడఁబఱచఁగ
అడ్డ మాడరాదుగా ఆపెకు నీతోను ॥ చేరి ॥

కప్పుర మిచ్చి నీవు కౌఁగిలించుకొనఁగాను
తప్పించుకోరాదుగా తరుణికిని
దప్పి దేర మోవి యాని తమ్మలము నీ విదఁగా
వుప్పతించరాదుగా వూరకే నీతోను ॥ చేరి ॥

తిద్దుచు రతులఁ గూడి తెప్పలఁ దేలుచఁగాను
గద్దించరాదుగా కాంతకును
అద్దుక శ్రీవేంకటేశ ఆదరించి యేలితివి
కొద్ది మీఱఁ దగదుగా కొసరి నీతోను. ॥ చేరి ॥ 182

## తెలుఁగు కాంబోది

ఇంతి యేమి సేసీనంటా యేమి యడిగేవు మమ్ము
అంతేసి యెఱుఁగుదుమా ఆపె నీవే కాక ॥ పల్లవి ॥

తలపోయుచున్నది తరుణి నీ రూపము
చెలరేఁగి చెక్కుటిచేత నున్నది
వలపులు కొనగోర వాసుకొంటా నున్నది
నెలవుల నవ్వుతోడ సిగ్గువడి వున్నది ॥ ఇంతి ॥

అడుగుతా నున్నది అంగనల నీ సుద్దులు
అదరి తా నుస్సు రస్సు రంటా నున్నది
అడియాలపు నీ సొమ్ము లవి చూచుచున్నది
బడి బడి నీ పదాలు పాడుకొంటా నున్నది ॥ ఇంతి ॥

యిదె పవ్వళించి వున్న దెప్పుడు వత్తువో యంటా
కదిమి నీ కూటమికిఁ గాచు కున్నది
అదన శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
ముదమునఁ గూడితివి మొక్కఁతా నున్నది. ॥ ఇంతి ॥ 183

పళవంజరం

మేలు మేలు యిదే బుద్ధి [1] మెలఁతల కెల్లాను
నీ లీల లన్నియు మాకు నేరుపఁగదే ॥ పల్లవి ॥

పతికి నిచ్చక మాడి భావము గరఁగించేవు
కతకారి వవుదువే కలికి
అతివినయాలు చూపి అట్టే సేవలు సేసేవు
చతురత లెల్లా నేర్చి జాణ వైతివే ॥ మేలు ॥

సెలవి నవ్వులు నవ్వి చేతికి పీడె మిచ్చేవు
వలపించ నోపుదువే వనిత
నిలువుఁగొలువు సేసి నెట్టనఁ దమి రేఁచేవు
పలుకుఁబంతములకుఁ బంతగత్తె వవుదువే ॥ మేలు ॥

యిచ్చట శ్రీవేంకటేశు నెదపై నెలకొంటివి
మెచ్చులాఁడివే అలమేలుమంగా
అచ్చముగ మమ్ము నేలుమని యప్పణిచ్చితివి
కచ్చుపెట్టి నీవు దయగలదాన వవుదువే. ॥ మేలు ॥ 184

పూరిఖి

యెఱుఁగునో యెఱఁగఁడో యింతులు విన్నవించరే
మెఱసి యిన్నిటా నేను మేలుదానఁ జుమ్మీ ॥ పలవి ॥

కోపగించఁ జుమ్మీ కొసరి తనతో నేను
చూపులలో నా బత్తి చూపితిఁ గాని
వోప ననఁ జుమ్మీ వొడివట్టితేఁ దనతో
కాఁపురము సేసేవారిగతు లివి గాని ॥ యెఱు ॥

1. తే. పా. – మెలఁత.

వేసరించఁ జుమ్మీ వెడమాట లాడి నేను
ఆసపడి సరసము లాడుదుఁ గాని
వాసు లెంచఁ జుమ్మీ వలచి తన సరుస
నేసవెట్టి కూచుండి చెలఁగితిఁ గాని ॥ యెలు ॥

అలయించఁ జుమ్మీ అట్టే తాఁ గూడఁగా నేను
యెలమి రతులఁ దనియించితిఁ గాని
అలరి శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నుఁ గూడె
అలమేల్మంగను నేను అవునంటిఁ గాని, ॥ యెలు ॥ 185

[1] ఆరభి

యేమయ్యా ఆపె మీఁద నింత బత్తి [2]గలిగితేను
కామించి పెండ్లాడరాదా కా దనేరా నిన్నును ॥ పల్లవి ॥

పలచఁగా నవ్వు నవ్వి పాపట దువ్వుకొంటా
కొలువు నేసే యాపెఁ గోరి చూచేవు
వలిదపయ్యదలోని పట్టువ గుబ్బలమీఁద
కలువపువ్వులు వేసి కాంతాళించేవూ ॥ యేమ ॥

వీడెపు సెలవితోడ వీఁగి సిగ్గువడుకొంటా
కూడిమాడివున్న యాపెఁ గొంగు వట్టేవు
జాడతోడ నిట్టే మేనిచక్కఁదనాలకు మెచ్చి
చేదెలతోఁ బొగడుతాఁ జెలరేఁగేవూ ॥ యేమ ॥

యింతుల సన్నలు సేసి యేకతము లాడుకొంటా
చెంత నున్న యాపెమీఁదఁ జేయివేసేవూ
యింతలోనే శ్రీవేంకటేశ మమ్ము నేలితివి
పొంత నీ చెలికాఁగిట భోగించేవూ. ॥ యేమ ॥ 186

432–వ రేకు సామవరాళి

వెలలేని గొల్లెతపై వేడుక గాక
పిలువక వచ్చేవారు ప్రియ మయ్యేరా ॥ పల్లవి ॥

1. తే. పా.–ఆరిభి, 2. తే. పా.–గలితేనా.

దొంతరచూపులు చూచి తొరలింపుమాట లాడి
పంతాలుగొనే సతులు డాఁ తెయ్యేరా
వింతగా నవ్వులు నవ్వి వేడుకలు నీకు రేఁచి
చెంతఁ గాచుకుండేవారు చిత్తము వచ్చేరా ॥ వెల ॥

పచ్చిదేరఁ జెనకుచు డాగాలు చేతి కిచ్చి
యిచ్చకము సేసేవారు ఇత వయ్యేరా
కొచ్చి కానుక లొసఁగి కొలువులు సారెఁ జేసి
ముచ్చట లాడేవారు మచ్చి కయ్యేరా ॥ వెల ॥

కన్నులనే నీకు మొక్కి కంచువ నెదురు చూచి
సన్నల మెలఁగేవారు సమ్మ తయ్యేరా
మన్నించి శ్రీవేంకటేశ మమ్మ నిట్టె యేలితివి
వున్నవా రల్లా నీకు నొద్ది కయ్యేరా. ॥ వెల ॥ 187

కోకిలపంచమం

యింతకంటే సుద్దులు నే [1]మెఱఁగము
వింత లెల్లా నీకు విన్నవించఁగ వచ్చితిమీ ॥ పల్లవి ॥

మన సెల్లా నీమీఁద మంతనాలు చెలులతో
తనువు పానుపుమీఁదఁ దరుణికిని
కనుఁగొంటే దయ వుట్టు కద నున్నవారికైనా
వినవయ్య నీకు విన్నవించఁగ వచ్చితిమి ॥ యింత ॥

గుటిగాఁ జేయి చెక్కుపై కొనచూపు నీ రాకపై
జటియు నిట్టూర్పులు చన్నులమీఁద
కటకురా యైనాను కరఁగుఁబో నీకువరె
వెఱగంది యిదే విన్నవించఁగ వచ్చితిమి ॥ యింత ॥

అలయిక తనలోన ఆసలు నీ కొఁగిటిపై
సెలవుల లేనగవు శ్రీవేంకటేశ
కలిసితి వింక మేదకంబమైనా నిగిరించు
వెలసే వేడుక విన్నవించఁగ వచ్చితిమి. ॥ యింత॥ 188

1. తే. పా. — మెరంగము.

బంగాళం

వుత్తమనాయకుఁడవు వోరుపు గలవు నీవు
చిత్తగించి నా బత్తి చేకొనవయ్యా ॥ పల్లవి ॥

ఇంగిత మెఱఁగ నైతి నేడలేనివి గడించి
వెంగెము ని న్నాడితి వెనకకును
సంగ తెఱిఁగితి నిఁకే సమ్మతించితి నీ మాట
చెంగలించి నీకు మొక్కేఁ జేకొనవయ్యా ॥ వుత్త ॥

విరహాఁపుఁగాఁకఁ జెంది వేఁడుకోఁగానే నిన్ను
విరులఁగొని వేసితి వేమారును
సరవు లెల్లాఁ గంటి సంతోసించుకొంటి నిన్ను
సిరులఁ బంతము లిచ్చేఁ జేకొనవయ్యా ॥ వుత్త ॥

మిక్కిలి మోహముతోడ మేనవాఁడ వనఁగానే
వెక్కసాన జంకించితి విచ్చనవిడి
యిక్కడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిఁకే
చెక్కు నొక్కి నవ్వించేఁ జేకొనవయ్యా. ॥ వుత్త ॥ 189

కన్నడగౌళ

యెట్టు చేసినాఁ జేయి యేమీ ననఁజాల నిన్ను
ముట్టిననామతిలోని మోహము చెప్పితిని ॥ పల్లవి ॥

విరహాగ్నిఁ గాఁగి నిన్ను వెంగెమాడఁ దలఁతుఁను
కరఁగి యంతలో నాడక మానుదును
విరులయమ్ములు నాటివేయఁ బూనుదు పూవుల
పరగ నా మేలుగానే [1]భావించి వూరకుందు ॥ యెట్టు ॥

తమక మాఁపఁగలేక దాకొని జంకించఁ జూతు
మమతతో జంకించక మరి సోలతు
వుమురు వెన్నెలకుఁగా కూహింతు నిన్నుఁ బైకొన
భ్రమసి నీవే నే నని భావించి వూరకుందు ॥ యెట్టు ॥

1. తే. పా. -భావించి.

కోవిలకూతలకుఁగా కూచుందు నీ తొడమీఁద
కావిరిఁ గూచుండ కటు కౌఁగిలింతును
శ్రీవేంకటేశ నన్నుఁ జేకొని కూడితి విట్టె
భావము సొక్కటిగానే భావించి పూరకుందు. ॥ యెట్టు ॥ 190

ద్రావిడ భైరవి

యేడ కేడ నా గుణ మెఱఁగనివాఁడవా
యీడువెట్టుకొనేనంటే నెంతదాన నేను ॥ పల్లవి ॥

వల పెఱిఁగి నీవే వచ్చి న న్నేలుట గాక
పిలిపించఁగలనా పెనుదొరవు
తలఁపు దెలిసి మాట తగ నీ వాడుట గాక
పలికించ నోపుదునా పంతగాఁడవూ ॥ యేడ ॥

వొడఁబాటు దలఁచుక వొగి నన్నేలుదు గాక
వొడివట్టవచ్చునా వున్నతుఁడవు
బడలిక చూచి నీవే పైకొని కూడుదు గాక
అడుగఁదగవా కౌఁగి లప్పుడే నిన్నును ॥ యేడ ॥

సేవ సేయఁగాఁ జూచి సేసలు వెట్టేవు గాక
ఖావి చెప్పుకో వసమా దేవుఁడవూ
శ్రీవేంకటేశ నీవే చేకొని పెండ్లాడితివి
భావించ నాకుఁ దరమా పంతగాఁడవూ. ॥ యేడ ॥ 191

తెలుఁగు కాంబోది

విరహాన నుండినాను వేడుకలే పుట్టె నాకు
పరగ నేఁ జేసిన భాగ్య మింక నెట్టిదో ॥ పల్లవి ॥

యెంతతడవు రాకున్నా నెదురె చూతుఁ గాని
పొంత నీపై వేసట పుట్టదు నాకు
చింతలు మతి రేఁగినా నెలవి నవ్వుదుఁ గాని
చెంత నుండి నా మొగము చిన్నఁబోవ దందుకూ ॥ విర ॥

చూడక నీ వెందున్నా నీ సుద్దులే విందుఁగాని
యీడుకుఁ గోపము రేఁగ దిందుకు నీపై
పీడని నా యాస లెంత వేఁడఁ బొరలించినా
వాడదు నా మేను పైపై వల పిగిరించును ॥ విర ॥

పరాకున నీ వుండినాఁ బైకొని మొక్కుదుఁ గాని
తరితీపు సేసే వని తప్పయి తోఁచదూ
యిరవై శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
సరి నల యించే వని జడియపు రతులు. ॥ విర ॥ 192

433-వ రేకు సింధురామక్రియ

నీ వేమి సేతువు నన్ను నీవు మోహించు మంటివా
[1]వావాదు నెంచేది నావలపింతే కాక ॥ పల్లవి ॥

[2]నీయిచ్చకాఁడవు తొల్లే నీ వెవ్వతెవద్ద నున్నా
నాయమా నిన్ను దూర నడుమ నేను
యీయెడఁ బూవుటమ్ముల నేసేటిమరుని నే
చాయల నే మాడినాను సంగతెవుఁ గాక ॥ నీవేమి ॥

చెల్లుబడివాఁడవు నే సేసినదే చేఁత గాక
పల్లదానఁ గొంగు వట్ట భావ్యమా నాకు
మల్లాడి తమకించేటి మక్కువ నా మనసునే
మెల్లనే యెంత వొత్తినా మే లింతే కాక ॥ నీవేమి ॥

శ్రీవేంకటేశ నీ చేతిదే భాగ్యము గాక
వావి గద్దంటాఁ బెనఁగ వసమా నేఁడు
యీవేళ నన్నుఁ గూర్చిన యిట్టి నా జవ్వనమునే
చేవమీర నిట్టే సంతోసించుకొంట గాక. ॥ నీవేమి ॥ 193

భూపాళం

నాకుఁ జెప్పకోరాదు నలినాక్షులాల మీరు
పైకొని నా వోజ విన్నపము [1]సేయరే ॥ పల్లవి ॥

---

1. తే. పా.-వావాత, 2. పీవిచ్చ అని యుండనోపు ప్రాసదైనమార్పు ఇది.

వేడుకకు జవరాలు వెంగెమాడితే నమకు
ఆడరాదు కోపగించి అట్టే మగని
వాడికకు నతనితో వంతులకు రాఁదగు
కూడే వేళ సరివెట్టుకొని మీరఁ దగదు ॥ నాకు ॥

కడు సింగారమునకుఁ గన్నుల జంకించఁ దగు
జడియుచు గర్వమున సాదించరాదు
కడ లేక సేవసేయఁ గాచుక వుండుట మేలు
బడి నెంమాఁ బోకుండఁ బట్టరాదు గాని ॥ నాకు ॥

చనవుతోఁ గూడిమాడి సరసమాడుట యొప్పు
పెనఁగుచు రతివేళ బిగియ వద్దు
యెనసి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్ను నేఁడు
మనసులో నెన్నటికి మఱవఁగ రాదు. ॥ నాకు ॥ 194

ధన్నాసి

నీ వెట్టు సేసినాఁ జేయి నీ పాదమే గతి నాకు
యీవేళ చిత్తాన వేరే భావించకువయ్యా ॥ పల్లవి ॥

కోరి పొందు సేసేదానఁ గోపగింతునా యేమి
ఆ రీతిఁ బాయనిదాన నలుగుదునా
గారవించి కూడేదానఁ గసరి జంకింతునా
చేరి నీకు నిచ్చకమే సేతుఁ గాకా ॥ నీవెట్టు ॥

యితవరి నైనదాన యెగ్గులు వట్టేనా
సతి నైనదాన నిన్ను సాదించేనా
రతికిఁ బిలిచేదాన రాయడిఁ బెట్టేనా
సతమైన నీ గుణాలే సంతోసింతుఁ గాకా ॥ నీవెట్టు ॥

నీకు దేవులైనదాన నేరములు వెదకేనా
చేకొని కూడినదానఁ జింత రేఁచేనా
యీకడ శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
జోకగాఁ బొగడి మేలే చూపుదుఁ గాకా. ॥ నీవెట్టు ॥ 195

1. తే. పా.—రాయడే.

ప్రతాపనాట

యితర సతుల మరి యేమి చెప్పేది
పతిబత్తి గలదే చెప్పరాని మేలుది ॥ పల్లవి ॥

కలయక వుండినాను కాంతుని మొగము చూచి
చెలరేఁగి నవ్వేటి చెలి మేలుది
పిలువక మానినాను ప్రియముతోడుత వచ్చి
కొలువు సేసేదే యెక్కుడు మేలుది ॥ యితర ॥

మఱచి వూరకుండినా మక్కువ లెచ్చరించి
నెఱఁ దమి రేఁచేదే నిండుమేలుది
[1]యెఱుఁగక పరాకైనయెడల నెదుట వచ్చి
గుఱిగా మోము చూపించుకొనేదే మేలుది ॥ యితర ॥

యింతులతో నొకమారు యెట్టకేలకుఁ గూడినా
సంతోసించుకొనేదే యచ్చపుమేలుది
చింత దీర నేలితివి శ్రీవేంకటేశ యీకెను
పంతపు టలమేల్మంగే పాయరాని మేలుది. ॥ యితర ॥ 196

సామంతం

మఱచితే నేమాయ మగువల సందడిలో
అఱిముఱి వీడె మంప దంటా నలిగేనా ॥ పల్లవి ॥

రమణుల నంప నేల రాయబారా లింత యాల
సముకానఁ జెప్పితేను సమ్మతించనా
తమితోఁ జింతించ నేల తాఁ బోదిఁబదఁగ(?) నేల
క్రమమునఁ దా బత్తిగలది యెఱుఁగనా ॥ మఱచి ॥

వుంగర మంపఁగ నేల వూర కానవెట్ట నేల
రంగుగఁ దాఁ బిలువఁగ రా నన నేల
అంగపుఁ జెమట లేల అట్టె తా విచ్చేయ నేల
సంగడి సరిదాననై సాదించేదాననా ॥ మఱచి ॥

---

1. తే. పా. – యెఱంగక.

చేరి మాటాడించ నేల చెక్కులు నొక్కఁగ నేల
గారవించి కూడఁగాఁ గా దనేనా
యీరీతి శ్రీవేంకటేశుఁ డెంత దయ సేసె నన్ను
కోరి తనవేడుకకు గుఱియైనదాననూ. ॥ మఱచి ॥ 197

కేదారగౌళ

తనివి లేదు నాకై తేఁ దమకము దీరదు
తనకుఁగానే మతిఁ దలపోసెనే ॥ పల్లవి ॥

కడు సంతోసానఁ దన్నుఁ గౌఁగిలించుకొనే నంటే
యెడలేని నా చన్ను లెంత వొత్తునో
జడియక తనతో నే సారె మాటలాడే నంటే
అడ రెప్పు డెంతలవా టవునో తనకూ ॥ తనివి ॥

చక్కని తనమొగము సారెఁ జూచే నంటే
యిక్కువైన నా చూపు లెంత నాఁటునో
తక్కక రతులఁ గూడి తన్ను మెప్పించే నంటే
నెక్కొన్న మవసెంత నీరుగాఁ గరఁగునో ॥ తనివి ॥

తగఁ దన కధరామృతము చవి చూపే నంటే
చిగురుమోవి యాడఁ జిల్లులవునో
అగపడి శ్రీవేంకటాధిపతి నన్నుఁ గూడె
అగడుగాఁ దన కెన్ని యాసలు రేఁగునో. ॥ తనివి ॥ 198

434-వ రేకు మాళవశ్రీ

నానావిధాల తను నే నమ్మినదాన
యే నెపమూ [1]నెఱఁగ నిదే విన్నవించరే ॥ పల్లవి ॥

యిందు వచ్చే ననఁగాను యెదురుచూచు [2]కున్నదాన
కందువ నుండు మనఁగాఁ గాచు కున్నదాన
అంది వుంగర మంపఁగా నాసతోడ నున్నదాన
ఇందుముఖులాల పతి కిదే విన్నవించరే ॥ నానా ॥

1. తే. పా.—నెఱంగ, 2. తే. పా.—కుందాన.

యెదమాట లాడించఁగా నిచ్చగించి వున్నదాన
పడఁతుల నంపఁగాను బత్తి [1]నున్నదాన
అదరి యంతలో రాఁగా నానందాన నున్నదాన
యెదసి పాయఁగ నోప నిదే విన్నవించరే ॥ నానా ॥

చేయి పట్టి పెనఁగఁగా సిగ్గుతోడ నున్నదాన
ఆయము లంటఁగా వెరగై వున్నదాన
వేయి విధముల శ్రీవేంకటేశుఁ డిదే కూడే
యే యెడ నెన్నటికి నిదే విన్నవించరే. ॥ నానా ॥ 199

మలహరి

చెలులాల యిఁకఁ దన చిత్తము నాభాగ్యము
తలఁచిన తలఁపెల్లాఁ దానే యెఱుఁగునే ॥ పల్లవి ॥

విన్నవించ కుండరాదు విరహానఁ బడరాదు
యెన్నికలు విభునికి నెట్టుండునో
మన్నించినాఁడు తాను మరిగితి నింత నేను
యిన్నేసి సుద్దులు మీకు నేమి చెప్పేనే ॥ చెలులాల ॥

చేయి వట్ట కుండరాదు సిగ్గులు వడఁగరాదు
ఆయెడ నేమనునో ఆతఁడు నేఁడు
చాయ చూపినాఁడు తాను సన్న [2]యెఱిఁగితి నేను
మీయంత నా భావములు మీరే చూచుకోరే ॥ చెలులాల ॥

అలమ కుండఁగరాదు ఆసలు మానుపరాదు
యిల శ్రీవేంకటేశ్వరు ఇత వేదో
కలసినాఁడు తాను కైవస మైతి నేను
తెలుసుకోరే ఇఁకఁ దేటతెల్లమిగను ॥ చెలులాలు ॥ 200

ఆహిరి

యేమయ్యా నా మనసు నీ [3]వెఱుఁగనిదా యేమి
దీమసపు నా మదిలో దేవరవు నీవూ ॥ పల్లవి ॥

---

1. తే. పా.—సుండ్దాన, 2. తే. పా. —యెరిఁగితి, 3. తే. పా.— వెఱఁగని.

వింతదాననా నీకు వేఁడుకొనే విటు నన్ను
యెంతైనా నీ పట్టుకు నెగ్గు పట్టెనా
అంతే పో నే నీతో నలిగేటిదాననా
పంతముతో నాపాలిటిప్రాణమవు నీవూ ॥ యేమయ్యా ॥

పెనఁగుచు నాపై నెంత ప్రియములు చల్లేవు
అనవయ్య నీ మాటల కవుఁగా దనేనా
మనసునఁ బెట్టుకొని మచ్చరించేదాననా
తనివోని నాయింటి నిధానమవు నీవూ ॥ యేమయ్యా ॥

ఆదరించి ననుఁ గడు నలమి లాలించేవు
యే దెస నైనా నీకు నెదు రాడేనా
పోదితో శ్రీవేంకటేశ పొసఁగ నన్నేలితివి
దా దాతనాయ రతిచింతామణివి నీవూ. ॥ యేమయ్యా ॥ 201

కుంతళవరాళి

యేమి గొసరే మయ్యా ఇఁక నిన్నును
ప్రేమతోడ సంగడిఁ బెట్టుకొంటి వాపెను ॥ పల్లవి ॥

ఇత్తల నత్తల నీ వెందరిఁ బెండ్లాడినా నీ
చిత్తము వచ్చినదే మించిన దేవులు
కొత్త సొమ్ములు పెట్టెలఁ గోరి యెన్ని వుండినాను
హత్తి నీమె నీపై నుండినదియే మంచిది ॥ యేమి ॥

అంగనామణులు నీ యండ నెంద రుండినా నీ
సంగడిఁ గూచుండినదే చక్కని సతి
సింగారించి వాహనాలు ముంగిట నెన్ని వుండినా
సంగతి నీ వెక్కినదే సాంబ్రాణి ॥ యేమి ॥

యెసగి సరసమాడే ఇంతు లెందరుండినా నీ
పస నురమెక్కినదే పట్టపురాణి
కొసరి శ్రీవేంకటేశ కూడితివి మమ్ము నేఁడు
దెసల నీవు గట్టినదే పీతాంబరము. ॥ యేమి ॥ 202

కొండమలహరి

యెవ్వరివాఁడ వౌతా నెఱుఁగరా దెవ్వరికే
నివ్వటిల్ల మా వాఁడవే నీ వంటా నున్నారము ॥ పల్లవి ॥

యిందుముఖు లెల్లాను యెదుట నిన్నుఁ జూడఁగా
అందరికి నన్ని రూపులై యున్నాఁడవు
పొందుగా మతులఁ దలపోసుకొని చూచితేను
అందుకోనట్టే నీవు అక్కడా నున్నాఁడవు ॥ యెవ్వరి ॥

నెమ్మది ని న్నొక్కనినే నేరుపుతోఁ బిలువఁగా
కొమ్మల నోళ్ళకు నెల్లా గురైనాఁడవు
చిమ్ముఁగొనగోళ్ళవారు చేతులెత్తి మొక్కితేను
పమ్మి నీవే నోములఫలము లైనాఁడవు ॥ యెవ్వరి ॥

ముదితలు రతుల నీ మోవి చవిగొంటేను
అదివో పెక్కెండ్లవిందై వున్నాఁడవు
కదిసి శ్రీవేంకటేశ కడు సరసాలాడఁగా
సదరాన నందరికి సంతోస మైనాఁడవు. ॥ యెవ్వరి ॥ 203

భైరవి

ఇంతులు పొందైన దెల్లా నీసడించేకొరకా
కాంతునిచిత్తమే కాక కడుఁ గొసరకురే ॥ పల్లవి ॥

ఆసలఁ బొరలి పతి నట్టె రాయిడించుకంటే
వాసితోడ నుండఁగాను వచ్చినంతే మేలు
వేసరించి యేమైనా వెంగెము లాడుటకంటే
మూసిన ముత్యమువంటి మోనమె మేలు ॥ ఇంతులు ॥

అట్టడితనానఁ జెప్పే చుట్టరికమున కంటే
గుట్టుతోడ నుండఁగాను కూడినంతే మేలు
పట్టి పెనఁగి పిలిచి బలిమిసేయుట కంటే
చుట్టి చుట్టి యెదురులు చూచుటే మేలు ॥ ఇంతులు ॥

జడిసి సిగ్గుపడక సారెకుఁ బైకొనుకంటే
అడఁకువతో నుండఁగా నైనంతే మేలు
యెడయక శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁగూడె
వుడివోని సంతోసాన నుండుటే మేలు. ॥ ఇంతులు ॥ 204

435-వ రేకు అమరసింధు

యీసతికి నీకే తగు నీ వేడుక
రాసి కెక్కి పానుపుపై రచనలే వేడుక ॥ పల్లవి ॥
వెక్కసపు రతులలో వినయమే వేడుక
పిక్కటిల్లుఁ దిట్ల వోరుపే వేడుక
మక్కువ సరసాలలో మంచిమాటలే వేడుక
చొక్కపుటాసలలో చూపులే వేడుకలు ॥ యీసతి ॥
సందుసుడి సన్నలలో జంకెనలే వేడుక
పొందు లైనందులో పిలుపులే వేడుక
యెందుఁ దరితీపులో యెదమాటలే వేడుక
చిందేటి నవ్వులలో సిగ్గులే వేడుక ॥ యీసతి ॥
జవ్వన మదములలో చలములే వేడుక
రవ్వ కొఁగిటిలో తత్తరమే వేడుక
యివ్వల శ్రీవేంకటేశ యింతి నిట్టే యేలితివి
మువ్వంక నింక మీలో ముచ్చటలే వేడుక. ॥ యీసతి ॥ 205

హిందోళవసంతం

నెఱజాణలైనవారి నేరుపు లివి
మఱవక నేవసేసి మరిగుండఁ గదవే ॥ పల్లవి ॥
పొందైనందుకు ఫలము పొంచి యెగ్గుపట్టనిదే
విందువెట్టిన ఫలము వేడుక నాదరించేదే
అంది సరసములాడే యందుకు ఫలము నవ్వే
కందువ లెఱిఁగి పతిఁ గలయఁగఁ గదవే ॥ నెఱజాణ ॥

మనసు లెనయుటకు మంచిమాటలే ఫలము
ననిచిన ఫలము చనవుతో మెలఁగేదే
తనవారైన ఫలము వినయము చూపుచే
చెనకి పీడె మతనిచేతి కియ్యఁ గదవే ॥ నెఱజాణ ॥

కూడినందుకు ఫలము కొసరి యలుగనిదే
యీడైనందుకు ఫలము యెన్నఁడుఁ బాయనిదే
వోడక శ్రీవేంకటేశుఁ దొద్దికతో నిన్ను నేలే
పాడి యీతని గుణాలు పచారించఁ గదవే. ॥ నెఱజాణ ॥ 206

నారాయణి

చెప్పినట్లానె సేసి చిత్తము పట్టుదు గాక
తప్పు లెంచఁగలనా తగులైనదానను ॥ పల్లవి ॥

నీ మోము చూచి చూచి నిన్ను నెట్టు దూరుదు
కామించి నీ రాకకు నేఁకరేదానను
ఆముకొని నా బొమ్మల నప్పటి నెట్టు జంకింతు
గామిడి నీ పంగెనపు కౌఁగిటిలో దానను ॥ చెప్పిన ॥

సారె నీతో నవ్వి నవ్వి జరసి యెట్టలుగుదు
కోరి యాసపడి కాచు కున్న దానను
మేర మీఱి యెట్టు మందెమేళముతోఁ బెనఁగుదు
వూరక నీ మొగమోట నుండేటిదానను ॥ చెప్పిన ॥

గరిమ నీవద్ద నుండి కన్నుల నెట్టదలింతు
మరిగి వలచిన నేమపుదానను
యిరవై శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
గరిసింతునా నే నీ కరుణలో దానను. ॥ చెప్పిన ॥ 207

ఆహిరినాట

అవ్వలిమో మే లయ్యే వాపెతో మాటాడవయ్య
ఇవ్వల నాకెకుఁగాను ఇందవయ్య కానిక ॥ పల్లవి ॥

పాసి వుండలేనిసతి పంతమే పనికివచ్చు
వాసికత్తె మేనిగర్వ మెంతటిది
నేసపాల పెండ్లికూఁతు చేఁతలు కిందుపదేవే
యీసు లేదాకెకు నీపై యిందవయ్యా కానిక ॥ అవ్వలి ॥

వొక్క మంచముపై కాంత వొట్టు లెందాఁకా నుండు
దక్కిన దాని గయ్యాళితన మేఁటిదే
లక్కవంటి మనసు లలన కేడ చలము
యిక్కువలు మఱవకు యిందవయ్యా కానిక ॥ అవ్వలి ॥

నీకు నాసపడియున్న నెలఁత కేమి బీరము
కైకొన్న విరహిణి కెక్కడి గుట్టు
చేకొంటి వీకె నింతలో శ్రీవేంకటేశ దయతో
యీకడ సంతోస మాయ నిందవయ్యా కానిక. ॥ అవ్వలి ॥ 208

## శ్రీరాగం

వుప్పతిల్లీ జవ్వనము వొళ్ళి మీఁదను
యెప్పుడు మఱవరాదు యేమి సేతునే ॥ పల్లవి ॥

చిలుకతో మాటాడితే చిమ్మి రేఁచీ వలపులు
కొలనిలోపల నైతే నళుల బాధ
పలుదిక్కులుఁ జూచితే పరగీ వెన్నెల వేఁడి
యెలమి నెందుఁ బోరాదు యేమి సేతునే ॥ వుప్పతిల్లి ॥

సింగారపుఁ దోఁట నుంటే చిగురులు బెదరించీ
కంగి చింతించితే మదిఁ గంతుఁ డున్నాఁడు
కొంగున విసరుకొంటే గుంపించీఁ జల్లగాలి
యింగితము దెలియదు యేమి సేతునే ॥ వుప్పతిల్లి ॥

కత లాలకించే నంటే కలసీఁ గోవిలఁకూత
మితి నేకతాన నుంటే మించీఁ గోరిక
గతియై యింతలో శ్రీవేంకటేశుఁడు నన్ను నేలే
యితని వుపకారాన కేమి సేతునే. ॥ వుప్పతిల్లి ॥ 209

బలహంస

తామసించఁ బనిలేదు తగవు లెంచుకొంటేను
    ప్రేమము దెలుసుకొని బెరయుట గాకా ॥ పల్లవి ॥

విన్నప మేమి సేసేము వేగినంతా నింటికాడ
    కన్నె నీవు వచ్చేవంటాఁ గాచు కున్నది
    సన్నల నీ కెంతని చవులు వుట్టించేము
    మన్నించి యింతిఁ గూడేదే మాట యింతే కాకా ॥ తామ ॥

కాను కెందాఁకా నిచ్చేము కమ్మటిఁ గమ్మటి నీకు
    పానుపుపైని యాస పట్టు కున్నది
    నానా రీతుల నిన్ను నమ్మిక లే మడిగేము
    మానినిఁ గరుణించేదే మంచి దింతే కాకా ॥ తామ ॥

యిందు కెంత పొగడేము యిట్టే నీవే రాఁగా
    ముందే యాపె సంతోసమున నున్నది
    కందువ నేలితి వీకెఁ గని శ్రీవేంకటేశ్వర
    పొందు పాయకుండేదే బుద్ధి యింతే కాకా. ॥ తామ ॥ 210

436-వ రేకు దేవగాంధారి

యేల మమ్ము వేఁడుకొనే వెంత అట్టు సేసేవు
    వాలాయించి నీ చేతిలోవార మింతే నేము ॥ పల్లవి ॥

చలముతోవారమా సాదించేవారమా నీపై
    వలపులు చల్లేటివారము గాక
    పలుకకుండఁ గలమా పాసి వుండఁ గలమా నీ
    తలఁపులోనే మెలఁగి తగిలేము గాక ॥ యేల ॥

కొసరేటి వారమా గుంపించే వారమా
    వసమై నీ సేవ సేసేవారము గాకా
    విసిగేమా నీతోను వేడుకకు లోఁగేమా
    సుసరాన నీ యిచ్చలోఁ జొక్కేము గాకా ॥ యేల ॥

గరిసించేవారమా కాంతాళించేవారమా
వరుస నీ దేవుళ్ళలోవారముగాక
యిరవై శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టే
పొరిఁబొరి నీ గుణాలు పొగడేము గాకా. ॥ యేల ॥ 211

నాగగాంధారి

యెంత మన్నించేవు నే నీ కేమి బాఁతి
చింతల యే నోము నోఁచితినో తొలుతను ॥ పల్లవి ॥

నవ్వుతా నీ పాదములు నామీఁదఁ జాఁచేవు
యెవ్వరిఁ బోలుదు నీ యింతులలోను
వువ్విళ్ళూర నప్పటిని వొడి వట్టి పెనఁగేవు
ఇవ్వల నీకును నాకు నేడ కే దంతరము ॥ యెంత ॥

కందువ నా చన్ను లంటి కడు సరస మాడేవు
పొందుగ నీ కాలిగోరఁ బోలుదునా
విందుగా నా మాటలకు వేడుకపడేవు నీవు
అంది నీతో నీడువెట్టే యంతటిదాననా ॥ యెంత ॥

యేలుకొని శ్రీవేంకటేశ నీ నీడవలెఁ
బోలించి నన్నుఁ బాయ వేపొద్దును నీవు
మేలుదాన నని ఇట్టే మెచ్చేవు లాలించి
సోలి నాగుణాలు చెప్పి చూప నే మున్నది. ॥ యెంత ॥ 212

గంభీరనాట

యే మని చెప్పుదునే యిఁక మీతోను
ఆముకొన్న నా బత్తి యది తా నెఱుఁగునే ॥ పల్లవి ॥

చల మెంత సాదించినా చవు లెన్ని వుట్టించినా
తలఁపు [1]కొలఁదే కాక తమి వుట్టీనా
యెలమి వో చెలులాల యెదమాట లె న్నాడినా
కొలఁది [2]మీఱఁగ నిట్టె కూడిన ట్టయ్యీనా ॥ యేమని ॥

---

1. తే. పా. – కొలదే. 2. తే. పా. – మీరఁగ.

కత లెన్ని చెప్పినాను కాఁక లెన్ని రేఁచినాను
యితవైనంతె కాక యెక్కుడయ్యీనా
చతురత మెఱయుచు సారె నెంత పెనఁగినా
మతి కింపైనటువలె మచ్చిక వుట్టీనా ॥ యేమని ॥
వాడి కెంత చూపినాను వావు లెన్ని చెప్పినాను
వేడుక గలంతే కాక వెగ్గళ మౌనా
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలో నన్నేలినాఁడు
యీడు జోడు లాయ నిఁక నెరవు లయ్యీనా. ॥ యేమని ॥ 213

సోమరాగం

అందుకే విచారించే నాతఁడు నా ప్రాణము
చెంది నా వలపు లైతేఁ జిమ్మి రేఁచీఁ జెలియా ॥ పల్లవి ॥
కాటుక కన్నులఁ జూడఁగా నవి నాటవు గదా
మేటియైన కోమలపు మేను తనది
మాటలు సారె నాడఁగా మర్మాలు దాఁకవు గదా
కూటువైన దయగల గుణములు తనవి ॥ అందుకే ॥
కడు మచ్చిక చూపఁగాఁ గమ్మి కరఁగదు గదా
నడుమను మెత్తని మనసు తనది
జడియఁ గౌఁగిలించఁగాఁ జన్ను లొత్తవు గదా
వుడివోనియట్టి పురుషోత్తముఁడు తాను ॥ అందుకే ॥
యెదుట నుండఁగా నాపై యీ పరాకే కాదుగదా
తుద భక్తవత్సల బిరుదు తనది
యిదె నన్నేలె శ్రీవేంకటేశుఁ డలయఁడు గదా
కదిసి చెప్పరాని చక్కఁదనము తనది. ॥ అందుకే ॥ 214

నాగవరాళి

తెలుసుకొమ్మనవే దేవర మాకుఁ దాను
పొనుఁగక మా గుణాలు పొగడుకో నేఁటికే ॥ పల్లవి ॥

ననుపు గలిగినంతే నాఁటుకొన్న ప్రియములు
మనసు గలిగినంతే మంగళము
పెనఁగి నందులోనే ప్రేమము గానఁగ వచ్చు
వినక నప్పటి మరి విన్నపము లేఁటికే ॥ తెలుసుకొ ॥

చేకొనినపాటే సేవలును
వాకునఁ గలపాటే వావులూ
యేకత మాడినందునే యింపు దెలుసు
పైకొన్న మోహములు పచారించ నేఁటికే ॥ తెలుసుకొ ॥

నేసపాలలోనివే సిగ్గులూ
ఆసపడినయింతే అంటుఁ గౌఁగిలి
యీసు లేక శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గూడె
చేసిన చేతఁలెఁల్లా జెప్పి చూప నేఁటికే. ॥ తెలుసుకొ ॥ 215

మాళవిగౌళ

యిట్టి సింగారముగల యింతి నీకు దేవులాయ
నెట్టిన నాపె కోరిక నెరవేర్చవయ్యా ॥ పల్లవి ॥

జలజాక్షి నెమ్మోము చంద్రుఁ డని చెప్పవచ్చు
కళలు చెప్పే మంటే నలవి గాదు
అళులఁ బోలుచవచ్చు నాపె నెరిఁగురులను
పొలసి యామెమెఱుఁగులు పోలించి చెప్పరాదు ॥ యిట్టి ॥

వనితకన్నులు కలువల సరి చెప్పవచ్చు
వొనరనందలితేట లూహింపరాదు
గొనకొన్న చన్నులతో కుండ లీడు వెట్టవచ్చు
నునువట్రువలు చెప్పే మనుకొనరాదు ॥ యిట్టి ॥

భామపిఱుఁదు మరునిబండి కం డ్లనవచ్చు
కోమలము చెప్పేమనఁ గొలఁదిరాదు
యీమేర శ్రీవేంకటేశ యీకె నేలితివి పాదా
లోముచుఁ దామర లౌను వొప్పిద మెంచరాదు ॥ యిట్టి ॥ 216

437-వ రేకు. సాళంగనాట

అంతే పో తనపొందు లటువంటివా
చింత దీర నా మనసు చిత్తగించనీవే ॥ పల్లవి ॥

వింతవాఁడా తానేమి విచ్చేయ మనఁగదే
చెంత నుండి నాకేమి చెప్పంపీఁ దాను
పంతగత్తెనా నేను పైపై నేమి వేఁడుకొని
యింతటికి నేనే మొక్కె నిటు చూడనీఁ గదే ॥ అంతే ॥

నేఁడు గొత్తలా తనకు నిండుకొన్న నాపై బత్తి
పోఁడిమి నా కేల చూపి పొదిగీఁ దాను
వాఁడిమాట లాడేనా వచ్చి నన్నేల పొదిగీ
పేఁడుకొవి వలపు రేపించెఁ జూడనీవే ॥ అంతే ॥

యెరవా తనకు నాకు నియ్యకో లయినచోట
గరిమ నెగ్గువట్టేనా కౌఁగిలించీని
యిరవై శ్రీవేంకటేశుఁ డిప్పుడే తా నన్నుఁ గూడె
బెరసిన రతుల మెప్పించెఁ జూడనీవే. ॥ అంతే ॥ 217

నాదరామక్రియ

యిందుకు నీచిత్తమున నెంత యెమ్మె లనకుమీ
చెంది నీ చుట్టరికమే చెప్పుకొంటీఁ జుమ్మీ ॥ పల్లవి ॥

నలువంక నీ వెప్పుడు నాపై బత్తి సేతు వని
అలరి చెలులతో నే నాడుకొందును
వెలయఁగ నీవు నా విన్నపము విందు వని
కలిమి మెఱసి నే గర్వమున నుందును ॥ యిందు ॥

వుదుటున నీవు నాకు నుంగర మిచ్చితి వని
సుదతుల కెల్లా నేఁ జూపుదును
చెదరక నీవు నా చెప్పినట్టు సేతు వని
పది మారులును నేను పందేలు వేతును ॥ యిందు ॥

నన్ను నీవు మన్నింతువు నా వాఁడవే యని
మిన్నకైనా సలిగెలు మెఱతు నేనూ
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
సన్నలా చాయలా నవ్వి సంతోసించుకొందును. ॥యిందు॥ 218

శుద్ధదేశి

ఇటువంటివాఁడు తాను యెదురాడేనా నేను
చిటుకనఁ జెప్పినట్టు సేసేనే తనకు ॥ పల్లవి ॥

వినయము సేసేచోట వెంగెము లాడఁగరాదు
చనవిచ్చినచోటను జరయరాదు
మనసొక్కటైనచోట మంకులు చూపఁగరాదు
ననువులు గలిగితే నమ్మకుండరాదూ ॥ ఇటు ॥

ప్రియము చెప్పేయప్పుడు బిగిసె ననఁగరాదు
క్రియగలపొందులు తగ్గించఁగరాదు
నయ మిచ్చి మాటాడఁగా నవ్వక మానరాదు
దయతోఁ దగులఁగాను దాఁగఁగరాదు ॥ ఇటు ॥

పచ్చిదేరఁ గూడఁగాను పంతము లడుగరాదు
కచ్చుపెట్టి చెనకఁగాఁ గాదనరాదు
ఇచ్చట శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
మెచ్చి సరసమాడఁగా మితి మీఱరాదు. ॥ ఇటు ॥ 219

మాళవిగౌళ

నేయఁగల చేఁతలు నీ చేతి విఁకను
నాయము నీకే తెలుసు న న్నడిగే దేమీ ॥ పల్లవి ॥

చెలియమాటలు నీకుఁ జేరి విన్నవించితి
చెలఁగి యాపెకానుక చేతి కిచ్చితి
యెలమిఁ బలుకుఁ బంతా లిటు నీ కొప్పగించితి
నిలుచుక నీ యెదుట నే నిట్టె [1]వున్నదానను ॥నేయ ॥

1. తే. పా.—వుండ్డానను.

పదఁతి మారు నేనీ పాదాలకు మొక్కితి
    తొడిఁబడ నానవాలు తొల్లే చూపితి
    కదలేనివినయానఁ గమ్మటిని వేఁడుకొంటే
    అదరి నీవేళ గాచు కట్టే [1]వున్నదానను ॥ నేయ ॥
వువిద నీ నడుమను వున్నతెర దీసితి
    అవిరళముగ నేస లంది యిచ్చితి
    తవిలి శ్రీవేంకటేశ తగ నీకెఁ గూడితివి
    జవళి నీ పెండ్లి సంతోసాన నే [2]నున్నదాననూ. ॥ నేయ ॥ 220

సాళంగనాట

యిద్దరూ నిద్దరే మిమ్ము నే మని నుతించేను
    సుద్దులు వింటా మిమ్ముఁ జూచేను నేనూ ॥ పల్లవి ॥
చెలి చక్కఁదనములు చేరి నీతోఁ జెప్పే నంటే
    మలసి నీ వైతేను మరుతండ్రివి
    పొలసి యీపె నేరుపులు పొగడే నంటేను
    అలరి నీవు మాయానాథుఁడవూ ॥ యిద్ద ॥
సతి నిన్ను మోహింపించఁ జతురురా లనే నంటే
    రతి వలపించితి గొల్లెతల నీవూ
    కతలుగా నేఁ డివి కలిమి చెప్పే నంటే
    సతతము నీ వైతే సర్వేశ్వరుఁడవూ ॥ యిద్ద ॥
అంగనచనుఁగొండల నధికురా లనే నంటే
    రంగున శ్రీవేంకటాద్రిరాజవు నీవూ
    అంగవించి యీపె క్షీరాబ్ధికూతు రనే నంటే
    సంగడి నీ కే నిచ్చిన జలధియల్లుఁడవూ. ॥ యిద్ద ॥ 221

కన్నడగౌళ

నీ కొకరైన నేరమి నేరుపులే యాఁ గాని
    జోకతోడ నొఁ గా దని సోదించఁ జెల్లదూ ॥ పల్లవి ॥

1. తే. పా.—వుండ్దానను, 2. తే. పా.—నుండ్దానను.

నిన్నుఁ బాసి వుండలేక నే నెంత దూరినాను
పన్ని నీకు నది యెగ్గుపట్ట మరి చెల్లదు
కన్నుల కాంక్షల నెంత కాఁడివారఁ జూచినాను
అన్నిటా దిష్టి దాఁకె నని యెంచఁ జెల్లదు ॥ నీకొ ॥

ఆసతోనుంటవింట ని న్నట్టే కప్రాన వేసినా
వాసితో నొచ్చిన నొవ్వివదే నెంచఁ జెల్లదు
సేసలువెట్టేవేళ చేత నెంత పెనఁగినా
బేసబెల్లి పంతాల బీర మాడఁ జెల్లదూ ॥ నీకొ ॥

కామించి గుబ్బలు దాఁక కౌఁగి లెంత బిగించినా
కోమలపు మే నొత్తిన కుమ్మె లెంచఁ జెల్లదూ
ప్రేమతోడ మోవి యెంత పేర్చినా శ్రీవేంకటేశ
ఆముకొని అది యెంగి లాయ ననఁ జెల్లదూ ॥ నీకొ ॥ 222

438-వ రేకు శంకరాభరణం

యేమి నేతు నమ్మలాల యెవ్వరితోఁ జెప్పుదును
వోముచు నో చెలులాల పూరకున్నా రిపుడు ॥ పల్లవి ॥

పిలువఁగ వచ్చి నేనే ప్రియములు చెప్పే నంటే
వెలఁదులకు సిగ్గులు విడువరాదు
చలివాసి తనదిక్కు చక్కఁగాఁ జూచే నంటే
కొలఁది ఇల్లాండ్లకు గుట్టు మూలధనము ॥ యేమి ॥

వొనరఁ దనవద్దనే వూడిగాలు సేసే నంటే
వనితలకుపంతాలు వద్దా యందురు
గొనకొని నిలుచుండి కొలువులు సేసే నంటే
పెను రాణివాసాలకు బిరుదు గంభీరము ॥ యేమి ॥

మంతనాన నాతనితో మాటలు నే నాడే నంటే
యింతులకు నారజము లింత దగదు
చెంత నిట్టే వచ్చి నాతో శ్రీవేంకటేశుఁడు గూడె
కాంతలకు నిట్టే రతి కడుఁ బెద్దరికము. ॥ యేమి ॥ 223

సౌరాష్ట్రం

నే ననఁగా నెంతదాన నీకుఁ దొల్లె వలచితి
దానికేమి రక్షించఁగఁ దగ నీకే భారము ॥ పల్లవి ॥

యిమ్మల నేమీ నేరని యెట్టి ముద్దరాలైనా
కమ్మి నీతో మాటాడితే కలికి యౌను
పమ్మి యప్పటి నెంతటి పంతగత్తె యైనాను
తెమ్మగా నీతో మాటాడితే నే లో నౌను ॥ నేనన ॥

చెలరేఁగి యెటువంటి సిగ్గరిది యైనాను
నలి నీ యెదుట నుంటే నవ్వులాఁ దౌను
మలసి గుణముగల మానాపతి యైనాను
కలసి నిన్నుఁ గూడితే గయ్యాళి యౌను ॥ నేనన ॥

యెన్ని చందముల మరి యేమీ నేరని దైనాను
సన్న లా చాయల నాడే జాణక త్తౌను
యిన్నిటా శ్రీవేంకటేశ యే నలమేలు మంగను
మన్నించి న న్నేలితివి మంచి తనమౌను. ॥ నేనన ॥ 224

లలిత

తా నెంత నే నెంత తగవా వో చెలులాల
వీనులార నీసుద్దులు వినరే మీరు ॥ పల్లవి ॥

చేరి తన కూడిగాలు సేయుచు నుందే తన్ను
వూరకే మంచముపైఁ గూచుండు మనీనే
కోరి తనకుఁ బాదాలు గుద్దే యటువంటి నన్ను
ఆరజానఁ బక్కఁ బండు మనీనే తాను ॥ తానెంత ॥

వాడికతోఁ గూర లెల్లా వడ్డించేయట్టి నన్ను
వేడుకఁ బొత్తుకుఁ బిల్చి వేఁడుకొనీనే
వోడక తన పదాలు వుంచాన నేఁ బాడఁగాను
పీడెము నా చేతి కిచ్చి వేమారుఁ జెనకీనే ॥ తానెంత ॥

కూరిమితో వద్దనుండి కొలువు నేఁ జేయఁగాను
గోర గీరి యంతలోనే కొంగు పట్టీనే
యీరీతి శ్రీవేంకటేశుఁ డే నలమేలు మంగను
మేర మీఱి నన్నుఁ గూడి మెచ్చులు మెచ్చీనే. ॥తానెంత॥ 225

సింధురామక్రియ

చెల్లు నయ్యా నీవు సేసే చేఁత లెల్లాను
వుల్లస మే మాడినాసు వొద్దనేమా నిన్నును ॥ పల్లవి ॥

మోము చూచితే నవ్వేవు మొక్కితే దీవించేవు
యేమయ్యా నీ జాణతనా లెన్ని గలవు
కామినుల వలపింత [1] కాఁకాయ నీవల్లను
గామిడితనా లివి యక్కడ నేర్చుకొంటివో ॥ చెల్లున ॥

చేరితేనే చెనకేవు సిగ్గుపడితేఁ దిట్టేవు
నేరమయ్యా నేము నీతో నేసాలు సేయ
మూరు కెక్కిరి నీచేత తొల్లే గొల్లెతలెల్లా
యీరీతి విద్యలు నీకు నింకా నెన్ని గలవో ॥ చెల్లున ॥

సొలసితేఁ గూడేవు చొక్కితేనే మెచ్చేవు
నిలిచె నయ్యా నీ నెయ్యములెల్లా
అలరి శ్రీ వేంకటేశ అన్నిటా నన్నేలితివి
కలిగె నీ కీగుణా లెక్కడఁ గాచుకుండెనో. ॥ చెల్లున ॥ 226

మేఁచబౌళి

యిద్దరి మేలూ గంటి మిన్నాళ్ళకు నేము
పొద్దువొద్దు కేమని పొగడేమే మిమ్మునూ ॥ పల్లవి ॥

నెలవి నవ్వులతోడ చెక్కులఁ జెమట గార
చెలువుని కూడిగాలు సేసే వవునే
వలపు దైవారఁగాను వాసన కొప్పు వీడఁగా
అలసి పాదా లొత్తఁగా నాదరించీ నాతఁడు ॥ యిద్దరి ॥

1. తే. పా.—కాకాయ.

కన్నుల చూపులు నాఁటఁ గస్తూరివాసన మించ
మన్నన నాతనితోడ మాటాడే వానే
చన్నులు గదలఁగాను సారెఁ గుంచ విసరఁగా
నిన్నుఁ జూచి కరఁగిని నివ్వెఱఁగై యాతఁడు ॥ యిద్దరి ॥
నిట్టూరుపులు రేఁగ నీ మైఁ బులకలు నిండ
బెట్టుగా గందము పూసి పెనఁగే వవునే
యిట్టే శ్రీవేంకటేశుఁ డెనసె నిన్నూ నన్నూ
గుట్టుతోడ నిద్దరినిఁ గోరి మెచ్చీ నాతఁడు. ॥ యిద్దరి ॥ 227

నాదరామక్రియ

నీరుకొలఁది తామెర నేరిచితేను వలపు
యీరీతి విన్నవించరే యింతులాల పతికీ ॥ పల్లవి ॥
మొగసక్కెపువారి నేమీ ననరాదు గాని
నగినవారితోడ నగవచ్చును
బిగియఁగా సారె సారెఁ బెనగఁగ రాదు గాని
మొగము చూచేనంటే మోము చూపవచ్చును ॥ నీరు ॥
చాయపాటు పొందులకు సమ్మతించరాదు గాని
సేయించుకొంటేఁ బనులు సేయవచ్చును
నాయము చెప్ప వచ్చితే నమ్మఁగరాదు గాని
ఆయము లంటితేను అంటుకొనవచ్చును ॥ నీరు ॥
యేడ కేడో కతలకు నియ్యకొనరాదు గాని
కూడితేను కౌఁగిటఁ గూడవచ్చును
యీడు జోడై శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
వేడుకైతే నిద్దరికి వేడుకలే వచ్చునూ. ॥ నీరు ॥ 228

439-వ రేకు ఆందోళి

యిదివో నా వలపే యింత నేసే నన్నును
వెదకుతా నిందుకే విచారించే నిప్పుడు ॥ పల్లవి ॥

హత్తి నే నవ్వుతాను ఆయము లంటినందుకు
చిత్త మెట్టుండె నొకో చెలువునికి
బత్తితోడఁ గొంగువట్టి బలిమి సేసినందుకు
చిత్తిణి నంటాఁ గైపు సేయఁడు గదా ॥ యిదివో ॥

ఆనవెట్టి మేడమీఁది కపు దెక్కించి నందుకు
మే నెంత అలసెనొకో మేటి తనకు
ఆనుక చన్నులు నాట నంటి పెనఁగినందుకు
దీని కెంత యాఁకటని తిట్టఁడు గదా ॥ యిదివో ॥

యెగ్గనక నేను మోవి యెంగిలి సేసినందుకు
సిగ్గు లెంత రేఁగెనొకో చేరి పతికి
అగ్గమై శ్రీవేంకటేశుఁ డట్టె తా నన్నుఁ గూడె
నిగ్గుల గురుతులు మెయి నించఁడు గదా. ॥ యిదివో ॥ 229

మాళవిగౌళ

మిక్కిలి తా నధికుఁడు మేలుదాన నే నైతి
చక్కఁగా నెట్టు సేసినా సంతోసించేఁ గాకా ॥ పల్లవి ॥

అలుగఁగ నిఁక నేలే అతఁడు వీడె మియ్యఁగా
తొలఁగక చే యొగ్గి యందుకొనేఁ గాక
పలుక కుండఁగ నేలే పచారించి మాటాడఁగా
వొలిసిన ట్లెల్లాను వూఁకొనేఁ గాకా ॥ మిక్కిలి ॥

తప్పించుకొనఁగ నేలే తా నన్నుఁ బైకొనఁగాను
వొప్పి ఇచ్చకురాలనై వుండేఁ గాక
వుప్పతించి దూర నేలే వూరకే తా నవ్వఁగాను
రెప్ప లెత్తి చూచి ఇంపు రేఁచేఁ గాకా ॥ మిక్కిలి ॥

సిగ్గులు వడఁగ నేలే సేసలు తాఁ బెట్టఁగాను
అగ్గమై సిరసు నే నొగ్గేఁ గాక
యెగ్గు లేక శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
వెగ్గళపు తమితోడ వెలసేఁ గాకా. ॥ మిక్కిలి ॥ 230

మంగళ కౌశిక

ఆతని నడిగి రారే అందు కేది బుద్ధి నాకు
యీతలఁ దనకుఁ గానే యిట్లున్నదాననూ ॥ పల్లవి ॥

మనసులోఁ దనతోను మాటలాడే నంటేను
యెనలేని నివ్వెఱఁగు లెద మియ్యవూ
కనుచూపులే యెదురుగానైన నంపే నంటే
అనిశము నాసిగ్గులు అడ్డాలు వచ్చీని ॥ ఆతని ॥

కలలోనైనాఁ దన్నుఁ గౌఁగిలించుకొనే నంటే
నెలకొన్న విరహాన నిద్దుర రాదూ
చెలరేఁగి తనరూపు చేతుల వ్రాసే నంటే
తొలఁకుఁ బరవశాలు తోడు గావూ ॥ ఆతని ॥

వీనులఁ దన కతలు వినియైనాఁ జొక్కే నంటే
పూనిన తమకములు వుప్పతిల్లీని
ఆనుక శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నుఁగూడె
నే నిట్టె పొగడే నంటే నిండీ సంతోసమూ. ॥ ఆతని ॥ 231

ముఖారి

యెప్పుడూఁ దనకు నాకు నెడసీనా యెంతైనా
ముప్పిరి సంతోస మాయ మొక్కితి నేననరే ॥ పల్లవి ॥

యెవ్వతైనాఁ దనమతి కింపైతేఁ జాలుఁ గాక
నవ్వుతాఁ గంటకాలాడ నా కేలే
నివ్వటిల్లు మోహములు నిండుకొంటేఁ జాలుఁ గాక
అవ్వల నివ్వలఁ దము నొఁ గా దన నేలే ॥ యెప్పుడు ॥

ఆపెకూఁ దనకు వావు లమరితేఁ జాలుఁ గాక
చూపించి పొంతనాలు నే సోదించ నేలే
మేపొద్దూఁ దమకోర్కు లీడేరితేఁ జాలుఁ గాక
కోపము దెచ్చుక తమ్ముఁ గొసర నేలే ॥ యెప్పుడు ॥

విచ్చనవిడిఁ దమకు వేడుకై తేఁ జాలుఁ గాక
యెచ్చుకుందులు వెదక నిఁక నేలే
ఇచ్చట శ్రీ వేంకటేశుఁ డిట్టె తా నన్ను నేలే
పచ్చిదేరెఁ బను లెల్లా పచారించ నేలే. ॥ యెప్పుడు ॥ 232

భైరవి

తన్నుఁ బాసి నే నెట్లా దరియింతు ననవే
విన్నవించా రాదు విన్నవించకుండా రాదే ॥ పల్లవి ॥

మాటలఁ దన్ను నొడివి మరికొంత పొద్దు వుత్తు
కూటములు దలఁచుక కొంత పొద్దు వుత్తునే
పాటలు వాడుకొంటా నప్పటిఁ గొంతపొద్దు వుత్తు
పూఁట పూఁట కేమిటాను పొద్దు వోదే చెలియ ॥ తన్ను ॥

యెదురు చూచిచూచి యిట్టె కొంత పొద్దువుత్తు
కుదురై అడియాసలఁ గొంతపొద్దు వుత్తునే
వెదకుతా నింటిలోన వెసఁ గొంత పొద్దు వుత్తు
పొదలుతా నేమిటానుఁ బొద్దు వోదే చెలియ ॥ తన్ను ॥

అంచెల లేక లంపి అట్టె కొంత పొద్దు వుత్తు
కొంచక వినుకలినే కొంతపొద్దు వుత్తునే
యెంచఁగ శ్రీవేంకటేశుఁ డిట్టె విచ్చేసి నన్నేలె
పొంచి తనియ కేమిటాఁ బొద్దు వోదే చెలియ. ॥ తన్ను ॥ 233

నాట

నన్ను మన్నించు మనవే నా యింటికి రమ్మనవే
యెన్నరాని చుట్టరికా లెంత లేదే తనకు ॥ పల్లవి ॥

పొరుగు పోరచివిందు పొసఁగించుఁ జవు లెల్లా
తరితీపుల మాటలు తమి రేఁచును
తెరమరఁగు సన్నలు తెగని యాసలు చూపు
యెరవులవారి పొందు లెంత లేదే తనకు ॥ నన్ను ॥

సంగడి జాణతనాలు సరసము లాడించు
ముంగిటి నేస్తములు ముచ్చ టాడించు
అంగపు పెనఁగులాట లాయములు గరఁగించు
ఇంగితపు తాలపోఁత లెంత లేదే తనకు ॥ నన్ను ॥

వుమ్మగిలఁ బ్రియములు వుబ్బఁ జెమటలు నించు
చిమ్మఁ జూపులు మోములు చెంగలింపించు
కమ్మి శ్రీవేంకటేశుఁడు గక్కనఁ దా నన్నుఁ గూడె
యిమ్ముల వినోదాలు యెంత లేదే తనకూ. ॥ నన్ను ॥ 234

440-వ రేకు మధ్యమావతి

నా భాగ్య మిది యని నవ్వుతా నుండుదుఁ గాక
యే బుద్ధులూ నేల చెప్పే రీతఁదే నా దేవరే ॥ పల్లవి ॥

యెంత వలసినాఁ గద్దు యెంచుకొంటే నా యాస
చింతించితేఁ గోరికలు శానాశాన
పంతములు చూచితేను పట్టిన దెల్లా నెగ్గు
యింతటి విభుని నే నెట్టు దూరవచ్చునే ॥ నాభా ॥

యెన్నైనా నాడఁగవచ్చు నెగసక్కెపు మాటలు
పన్నుకొంటే గర్వము పట్టఁగరాదు
సన్నల జంకించితేను సణఁగులు రాలుచుండు
యెన్నిటి కెన్ని యీతని నెట్టు దూరవచ్చునే ॥ నాభా ॥

ఇచ్చగించి యియ్యకొంటే నింపులే మనసు నిండు
కొచ్చి కూడితే రతులు కొలఁది లేవు
యిచ్చట శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలె
[1]నెచ్చు కుందుల నితని నెట్టు దూరవచ్చునే. ॥ నాభా ॥ 235

కుంతల వరాళి

అప్పటి నన్ను నేనే ఆడుకోరాదు గాక
ఇప్పు డిట్టే చెలులాల ఇ దేమే నాగుణము ॥ పల్లవి ॥

---

1. తే. పా.—పెచ్చు.

చెలిమి సేసేనంటే జిగిగొనీ సిగ్గులు
తల వంచుకుండే నంటే తమి ఘనము
కొలువున నుండే నంటే గుబ్బతిలీ వలపులు
యెలమి నో చెలులాల యేఁటిదే నాగుణము ॥ అప్పటి ॥

కందువ మాటాడే నంటే [1]గగ్గుత్తిక యయ్యీని
అంది సేవ సేసేనంటే చిందీఁ జెమటా
పందేలాడే నంటేఁ జూచి పరవశములు దొట్టీ
ఇందరిలోఁ జెలులాల యేఁటిదే నా గుణము ॥ అప్పటి ॥

సరుసఁ గూచుండే నంటే సంతోసాలే రేఁగిని
విరుల వేసే నంటే వీడీఁ గొప్పు
యిరవుగా శ్రీ వేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
యెరవరి చెలులాల యేఁటిదే నా గుణము. ॥ అప్పటి ॥ 236

## పాడి

వేగిరించకురే వో వెలఁదులాల
చేగదేర వేరొకటి సేసునా అతఁడు ॥ పల్లవి ॥

తనకు మోహించే నాపై దయ తలఁచుఁ గాక
నను నిరాకరించునా నా విభుఁడు
పనులేమి గలిగి యే పసల నున్నాఁడో కాక
మనసున నాపై బత్తి మఱచునా అతఁడు ॥ వేగి ॥

నంటునఁ బెండ్లాడిన నన్ను మన్నించుఁ గాక
యింటికి రా కుండునా యెప్పుడైనాను
అంటిత నాదకు వచ్చేనని వున్నాఁడోకాక
దంటయై యవ్వలిపని దలఁచునా అతఁడు ॥ వేగి ॥

తానే గతై వుండే నాకు తగఁ జన విచ్చుఁ గాక
మానఁ గలఁడా కూడక మరి నాతోను
పానుపుపై శ్రీవేంకటపతి వున్నాడో కాక
యే నవఁగా నన్ను నేలె యింతలోనె యతఁడు. ॥ వేగి ॥ 237

1. తే. పా.—డగ్గుత్తిక యని యుండవలెను.

శ్రీరాగం

అందరివంటిదాననా అయ్యో తనకు
మందలించి తన సేవే మన్నించీ ననవే ॥ పల్లవి ॥

తనపై నేఁ జేసే బత్తి తగ నాకుఁ దోడై వచ్చి
వినయము నాదే నన్ను వెలయించీని
యెనసిన యిచ్చకమే యీడేరించీ నన్ను
కనుఁగొని తన్ను నింత కక్కసించ నేఁటికే ॥ అందరి ॥

కమ్మి తనకుఁ గట్టిన కంకణమే మేలై వచ్చి
నమ్మిన నమ్మికలే నన్నుఁ గాచీని
ఇమ్ముల నా కోరికలే యిట్టే తన్నుఁ దోడి తెచ్చి
చిమ్ముచుండను బలిమి సేయవచ్చు నటవే ॥ అందరి ॥

సొరిది నే వినే తన సుద్దులే ఫల మిచ్చి
బెరసి నా తమకమే పెండ్లి సేసీని
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్నుఁ గూడె
సరికి బేసికిఁ దన్ను సాదించఁ దగునా. ॥ అందరి ॥ 238

గంభీరనాట

వలచిన యంగనల వాఁడవు గాక
తలఁచి నీ చిత్తములో దానఁ జుమ్మీ నేనూ ॥ పల్లవి ॥

యే సతిఁ బెండ్లాడినా ని న్నెట్టు వెంగే లాడవచ్చు
వాసితో నాపెను నావంటిదే కాదా
వోసరించ కప్పటి నీ వొడి వట్ట నెట్టు వచ్చు
బాసతో నీ వొక్కతె పాలఁ జిక్కితివా ॥ వలచిన ॥

నీ వెవ్వతెతో నవ్వినా ని న్నెట్టు మానుపవచ్చు
ఆ వనితనోముఫల మట్లుండఁగా
కావించి నీ కెటువలె కంకణము గట్టవచ్చు
చేవ మీర నీ వొకతె చేతిలోని వాఁడవా ॥ వలచిన ॥

యెందరిఁ దెచ్చుకొనినా యే మనఁగవచ్చు నిన్ను
అంది నీ కింతా లాభమై యుండుఁ గాకా
యిందరిలో శ్రీవేంకటేశ న న్నేలితివి
కందువ దొరకెతి వొక్కటె కబ్బేవాఁడవా. ॥ వలచిన ॥ 239

మంగళ కౌశిక

యెంతని కొనియాడేనే యీతని నేనూ
పొంతనే తా నెన్ని నేరుపులు నేర్చెనే ॥ పల్లవి ॥
మంతనము లాడించేది మనసు పెడ రేఁచేది
సంతసపు తన మేని చక్కఁదనమే
పంతము లిప్పించేది భావము గరఁగించేది
మంతుకు నెక్కిన తన మంచి గుణమే ॥ యెంతని ॥
వేడుకలు వుట్టించేది వినోదాలు నెరిపేది
జాడతోఁ దా నాడేటి సరసము లే
వాడికలు నేసేది వద్దఁ బాయ ని య్యనిది
చూడఁ గొత్తైన తన మెచ్చుల సింగారమే ॥ యెంతని ॥
తగ మరిగించేది తనపొందు నేయించేది
తగుదైన యటువంటి తనకౌఁగిలే
జిగిఁదా నింతలో నన్ను శ్రీవేంకటేశుఁడు గూడె
యిగిరింపించీనాస లిదే తన వలపే ॥ యెంతని ॥ 240

441-వ రేకు పళవంజరం

విచారించవద్దు మరి విన్నపాలుఁ జేయ నేను
పచారించి రమ్మనవే బత్తి నేనే గాని ॥ పల్లవి ॥
తత్తరించి దూరనే తనతో నలుగనే
చిత్తము రాఁ దన సేవ సేసేఁ గాని
కొత్తలేమిఁ జేయనే కొసరి జంకించనే
హత్తి తన యిచ్చలోనే అలరేఁ గాని ॥ విచా ॥

వేసారించి సొలయనే వేమారు నలయించనే
నాసూటినే తనతోను నవ్వేఁ గాని
ఆసల భ్రమయించనే ఆఁడి నేఁ బెట్టనే
బాసికము గట్టి తలఁబాలు వోసేఁ గాని ॥ విచా ॥
చలము సాదించనే చండిసేసి పెనఁగనే
నెలకొని కౌఁగిటిలో నించేఁ గాని
అలరి శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నుఁ గూడె
బలిమి సేయనే తన్నుఁ బాయకుండేఁ గాని. ॥ విచా ॥ 241

పాడి

నీరువట్టు గొన్నచోట నేతఁ దీరునా
సారె నాతనిపొందులే చలిమందులు నాకూ ॥ పల్లవి ॥
కప్పి యాతఁడు నవ్వితేఁ గాఁకలు మానీఁ గాక
కప్పుర మేల చల్లేరే కాంతలాల
తప్ప కాతనిమోవినే దప్పులు దేరీఁ గాక
యిప్పు డింత పన్నీరు ఇచ్చిరే నాకూ ॥ నీరు ॥
పొరిఁబొరి నాతనివూర్పులఁ జెమ టారీఁ గాక
సుర టేల విసరేరే సుదతులాలా
సరి నాతనిమేలమే విరహ మార్చీఁ గాక
విరు లేల పోసేరే వేమారు నాపైని ॥ నీరు ॥
సొగి సాతనిపాదాలు సోఁకి చల్లనయ్యీఁ గాక
చిగు రేల పరచేరే చెలియలాల
నిగిడి శ్రీవేంకటనిలయుఁడు నన్నుఁ గూడె
జిగి వట్టి కత లేల చెప్పేరే యింకాను. ॥ నీరు ॥ 242

హిందోళవసంతం

చెలులాల యీ కన్నెకుఁ జెప్పరే బుద్ధి
చెలఁగి పయ్యద మాఁటుసేయ నేలే తానూ ॥ పల్లవి ॥

పెంచి యిద్దరము బొమ్మపెండ్లిండ్లు సేత మంటే
కొంచి నాతో తానేల సిగ్గులు వడీనే
పొంచి నాచేతికి పెద్ద [1]పూజెకుండ లిమ్మంటేను
వంచనతో నిట్టె యాల వంచీనే శిరసు ॥ చెలు ॥

ననిచే నేఁడే పెండ్లీ నాగవల్లి సేత మంటే
యెనలేని తలపోఁత నేల నవ్వీనే
తనియ కిట్టె కంకణదారాలు గట్టుద మంటే
పెనఁగుచు నిప్పు డెంత బిగిసీనే యీకె ॥ చెలు ॥

కూడ మంచివేళ కొంగులు ముళ్ళు వేత మంటే
జాడతో బొమ్మల నేల జంకించీనే
యీడై శ్రీ వేంకటేశుఁ డీపెమాటలు నే నాడఁగా
జో డాయ సోబన మేమి చూచీనే నన్నును. ॥ చెలు ॥ 243

మాళవశ్రీ

కంటి నీవుపాయ మింక కాంతాళించి నిన్ను దూర
జంటల నీవల్ల నింత సతమాయ వేడుక ॥ పల్లవి ॥

యెచ్చి నీపైతలపోఁత తెన్నైనా వేడుకే
రచ్చ నీకుఁగొన్నవిరాలి వేడుకే
అచ్చముగా నీమీఁదిఆస లన్నీ వేడుకే
వచ్చినప్పుడు రమ్మ నీవల్ల నింతా వేడుకే ॥ కంటి ॥

చెంది నీకుఁగాఁ బొడమే చెమటలు వేడుకే
కందువ నీపై తమకము వేడుకే
పొందుల నీ కెదురుచూపులు నివీ వేడుకే
యెందు నున్నా నీవల్ల నింతా నాకు వేడుకే ॥ కంటి ॥

దవ్వులమాటలు వినే తరితీపు వేడుకే
యివ్వల నన్నుఁ గూడితి విదీ వేడుకే
రవ్వగా శ్రీవేంకటరమణ మన రతుల
జవ్వన మదములలో సాదింపులూ వేడుకే. ॥ కంటి ॥ 244

---

1. తే. పా.—బూజగుండ (అయిరేని.)

ద్రావిడభైరవి

యెదమాట లాడించే నెందాఁకాను
వుడివోని మచ్చికతో నున్నదాన ననవే ॥ పల్లవి ॥

తానే గతి యనేదాన దయ గోరు కున్నదాన
వీనులఁ దన కతలే వింటా [1]నున్నదాన
మానరాని పొందుదాన మానాపతిదానను
నానావిధముల విన్నప మిదే యనవే ॥ యెద ॥

మొక్కుతానే వున్నదాన మోహించి యున్నదాన
చెక్కుచేతఁ దనరూపు చింతించేదాన
యిక్కువనే వున్నదాన యెదురు చూచేదానను
మిక్కిలి యాసతోడ నమ్మి [2]యున్నదాన ననవే ॥ యెద ॥

తగులమిగలదాన తమకించి యున్నదాన
మగటిమితోఁ దన మన్ననదాన
జిగి నింతలోఁ దా వచ్చి శ్రీవేంకటేశుఁడు గూడె
జగములోఁ దనకు నేఁ జనవరి ననవే. ॥ యెద ॥ 245

శంకరాభరణం

యెందరిఁ దాఁ బెండ్లాడినా నితవే కాని
పొందులు తనకు నాకు పొద్దు కొక కొత్తలూ ॥ పల్లవి ॥

మొనపి చన్ను లెంతైనా తనకు వేసట గాదు
మన సెంత ద వ్వేఁగినా మఱి యలపే లేదు
తను వెంత భోగించినాఁ దనివి యెన్నఁడు లేదు
యెనసెఁ దనకు నాకు నెరవే లేదు ॥ యెంద ॥

వల పెంత గనమైన వల దని తోయరాదు
కలి మెంత యెక్కుడైనా కడు మొగచాటు గాదు
[3]కలిగితేఁ జక్కదనము కొలఁదివెట్టఁగ రాదు
లలిఁ దా నెంత మీరినా చలము లేదు నాకు ॥ యెంద ॥

---

1. తే. పా.–నుండ్దాన. 2. తే. పా.–యుండ్దాన. 3. తే. పా.–కలితే.

కొమరేపాయ మెంత కూడినాను మోపు గాదు
 తమి యెంత రేఁగినా చేతనుఁ బట్ట వస గాదు
 సమరతి శ్రీవేంకటేశ్వరుఁడు తా నన్నుఁ గూడె
 రమణుఁ డాయను యే నేరమీ నిఁకలేదు. ॥ యెంద ॥ 246

442-వ రేకు మంఘారి

యేమీ వూరకుండే వంటా యేల నన్ను నొరసీని
 కామించి తన గుట్టు గాన వసమటవే ॥ పలవి ॥

చక్కఁదనాలకే తన్ను సంతోసింతునో నేను
 మిక్కిలి మంచిగుణాలు మెత్తునో మరి
 తక్కక తన సుద్దులు దడవి పొగడుదునో
 యెక్కడాఁ దన మహిమ లెంచ వసమటవే ॥ యేమీ ॥

తననేరుపులే యిట్టె తలఁచి నవ్వుదునో
 అనిశము నుదారత్వ మాడుకొందునో
 పనివడి ప్రతాపమే పరికించి చొక్కుదునో
 యెనలేని తన సేఁత లెంచ వసమటవే ॥ యేమీ ॥

ఆసఁ దన యీవులకు నచ్చెరు వందుదునో
 సేసవెట్టి నందుకే చెలఁగుదునో
 రాసి కెక్క నన్నుఁ గూడె రతి శ్రీవేంకటేశుఁడు
 యీ సరవుల మేలు యెంచ వసమటవే. ॥ యేమీ ॥ 247

మేఁచ భవుళి

యెరవు లే కిద్దరమూ నియ్యకోలై యుంట గాక
 వెరవులు సారె సారె వెదకఁగ నేలే ॥ పల్లవి ॥

మనసు లెనయుదాఁకా మంతనము లాడేది
 చనవు గలుగుదాఁకా సాదించేది
 తనివి గలుగుదాఁకాఁ దత్తరించి కొసరేది
 పను లీడేరితే మరి పచరించనేలే ॥ యెర ॥

పంతములు వచ్చుదాఁకా బట్టి పట్టి పెనఁగేది
చింతలు దీరుదాఁకా జెక్కు నొక్కేది
సంతోసము గలదాఁకా సరసము లాదేది
వింత లేక వున్నవేళ విచారము లేలే ॥ యెర ॥

నేసలు వెట్టినదాఁకా సిగ్గులతోడ నుండేది
ఆసలు ఫలించుదాఁకా నాలి దయ్యేది
బాస [1]యిచ్చి శ్రీవేంకటపతి దానే నన్ను నేలె
వాసి నలమేల్మంగను వక్కణించ నేలే. ॥ యెర ॥ 248

ఆహిరి

యెట్టు నేసినాఁ జేయనీ యింక నే నేమీ నెఱఁగ
చుట్టరికమునకే చొక్కితి నేనూ ॥ పల్లవి ॥

మన సిచ్చి నాతోను మంచిమాట లాడఁగాను
ననిచి అన్నిటాఁ దన్ను నమ్మితి నేను
కనుఁగవ దెరచి యిక్కడ నన్నుఁ జూడఁగాను
చెనకి తనతో పొందు నేసితి నేనూ ॥ యెట్టు ॥

సారె సారె నప్పటిని సరసము లాడఁ గాను
ఆరయఁ దనకు లో నయితి నేను
గారవించి యందరిలోఁ గడు నాతో నవ్వఁగాను
పూరక సంతోసాన వొడఁబడితి నేనూ ॥ యెట్టు ॥

చిత్తగించి నామీఁద నేసవెట్టి కూడఁగాను
హత్తి తనచెంత కిరవైతి నేనూ
యిత్తల శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
బత్తి నేయఁగా నాసలఁ బరగితి నేనూ, ॥ యెట్టు ॥ 249

సామంతం

పంతము లాడఁ జెల్లదు పతులకు సతులకు
ఇంతయుఁ దెలిపి పతి నింటికి రమ్మనవే ॥ పల్లవి ॥

---

1. తే. పా. – ఇచ్చి.

ఆడుకోలుమాటలు ఆయములు గరఁగించు
యీడైనవయసులు యేఁకరింపించు
చూడఁ జూడ చూపులు చుట్టరికములు సేసు
వేడుకైన సరసాలు వియ్యమందింపించును ॥ పంత ॥

తనివోని వినుకులు తలపోఁతలు రేఁచు
బెనకుల చేఁతలు సిగ్గులు నించు
పెనగొన్న కోరికలు ప్రియములు చెప్పించు
పనుపడ్డ నవ్వులు బయలిఁ దెప్పించును ॥ పంత ॥

వుడివోని మోవిపండు వూరకే నోరూరింపించు
అడియాలపు రతు లాస లెక్కించు
బడి నలమేలుమంగపతి శ్రీవేంకటేశుఁడు
విడువక నన్నుఁ గూడి వేడుక వుట్టించును. ॥ పంత ॥ 250

దేశాక్షి

తన కైతే నవ్వులు తగ మాకైతే రేసులు
వనితల కల్లా నివి వాసిపట్లు గాని ॥ పల్లవి ॥

మంతనము లాడవచ్చు మచ్చికలు చూపవచ్చు
చెంతఁ బతితో పొందు సేయవచ్చును
పంతమున సవతులు పారి పారి కొచ్చి కొచ్చి
వింతమాట లాడఁగాను వినరాదు గాని ॥ తన ॥

సరసము లాడవచ్చు చవులెల్లా రేఁచవచ్చు
వెరగులు వడవచ్చు విభునితోను
సరుగ నూడిగముల సతు లీడువెట్టుక
పరగఁ బొత్తు గూడఁగాఁ బడరాదు గాని ॥ తన ॥

పెనఁగులాడఁగవచ్చు ప్రియములు చెప్పవచ్చు
యెనయవచ్చు శ్రీవేంకటేశునితోను
వినయపు టలమేల్మంగను నన్ను నేలెఁ దాను
కని వెలయాండ్లసంగతి వద్దు గాని. ॥ తన ॥ 251

శుద్ధవసంతం

వూరకే దక్క సటవే వుడివోని వలపు
గారవించి యాతనిఁ గౌగిలించఁగదవే ॥ పల్లవి ॥

మంచిమాట లాడితేను మరిగి నమ్మిక వుట్టు
ఇంచుకంత నవ్వినాను యియ్యకో లవును
వంచనతో మొక్కితేను వడి మొగమోట గల్గు
మించుగాఁ బొగడితేను మే లెల్లా దైవారును ॥ వూర ॥

మళ్ళి మళ్ళి చూచితేను మనసులు గరఁగును
వెల్లివిరిఁ గొసరితే వేడుక లవును
వొల్లనే పీడె మిచ్చితే వుప్పతిల్లుఁ దమకము
చెల్లుబడి గలిగితే సిగ్గు లెల్లాఁ దేరునూ ॥ వూర ॥

యిచ్చకమై వుండితేను యింపు లౌను రతు లెల్లా
పచ్చిదేరఁ గూడితేను బలుసు నాస
యిచ్చట శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
తచ్చన లేక యేలెఁ దలఁపు లీడేరెనూ. ॥ వూర ॥ 252

443-వ రేకు దేసాళం

నే నీకు వేరు గాను నీవు నా కెరవు గావు
యే నెపమూ వేయ నీపై నింటికి రావయ్యా ॥ పల్లవి ॥

చెక్కనఁ బెట్టినచేయి నేసవెట్టె నీమీఁద
ముక్కపైఁ బెట్టినవేలు ముందే మెచ్చెను
వక్కణ లడుగనేల వలచితి నాఁడే నీకు
యిక్కవలు చెప్పేఁగాని ఇంటికి రావయ్యా ॥ నేనీ ॥

సిగ్గువద్ద మొగమున నెలవినవ్వులు రేఁగె
వెగ్గళించిన కన్నులే వేడుకఁ జూచె
కగ్గి నీతో నలుగను కడు ముద్దరాలను
యెగ్గు లేమీ నెంచను యింటికి రావయ్యా ॥ నేనీ ॥

వాడిన కేమ్మోవిని వడిఁ దేనెలూరఁ జొచ్చె
పీడిన నెరులలోన విరులు నిండె
యీడనే శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
యీడుగాఁ గూడితి విఁక నింటికి రావయ్యా. ॥ నేనీ ॥ 253

శ్రీరాగం

యేల నన్నుఁ బొగడీని యింతకూ నే గుఱుతంటా
తాలిమిచేఁతల కెల్లాఁ దానే గుఱుతు ॥ పల్లవి ॥

చక్కఁదనమున కెల్లా జవ్వనమే గుఱుతు
మక్కువల కెల్లాను మనసే గుఱుతు
తక్కిన పనులకెల్లా తనువే గుఱుతు
జక్కవ పిట్టలఁ బోల్చ చన్నులే గుఱుతు ॥ యేల ॥

మానరాని చేఁతలకు మంచితనాలే గుఱుతు
వూనిన సిగ్గుల కెల్లా నోరచూపే గుఱుతు
సేనలైన యాసలకు చేతిమొక్కులే గుఱుతు
నానా సంతోసాలకు నవ్వులే గుఱుతు ॥ యేల ॥

వుడివోని వలపుల కొదఁబాట్లే గుఱుతు
యెడయనికూటముల కిచ్చకములే గుఱుతు
అదరి శ్రీవేంకటేశుఁ డట్టె నన్ను నేలినాఁడు
తడయని భోగాలకు తమకమే గుఱుతు. ॥ యేల ॥ 254

వరాళి

చెప్పి చూప రాదు తన చిత్తమే యెఱుఁగు నంతా
యిప్పుడు నన్ను మన్నించి యేలుకొమ్మనవే ॥ పల్లవి ॥

చనవు గలిగితేను చలము లీదేరును
మనసు వచ్చితేను మాట లింపౌను
వినయము చూపితేను వెలయు మోహము లెల్లా
చెనక నేరిచితేను చిప్పిలుఁ దమకము ॥ చెప్పి ॥

చుట్టరికమైనచోట చుట్టుకొను మొగమోట
పొట్టఁబొరుగై తేను పొందు గలుగు
నెట్టుకొన్న తరితీపు నిండించు వేడుకలు
కట్టుకొన్న వలపులు కౌఁగిటఁ జొక్కించును ॥ చెప్పి ॥

తనివోని కోరికలు తగులాయములు సేయు
మునుకొన్న తలపోఁత ముద మందించు
యెనలేని శ్రీవేంకటేశుఁ డిట్టే నన్నుఁ గూడె
వొనరిన నసుపులు వొదఁబాటు సేసును. ॥ చెప్పి ॥ 255

లలిత

యిరుమొనసూది యాయ నిదివో నీ మోహము
విరు లాపె వేసినవి వెస నాపై వేసేవు ॥ పల్లవి ॥

కాసుక యిచ్చి ఆపె కాచుక నీ కుండఁగాను
వూనుకొని నాతో నెంత పొందు సేసేవు
వీనులలోని కప్పటి విన్నపాలూఁ జేయఁగాను
మానక నా మోము చూచి మాట లాడేవు ॥ యిరు ॥

చేరి చేరి యాపె నిన్నుఁ జెరఁగువట్టుకుండఁగా
నారుకొన నాతో నీవు నవ్వు నవ్వేవు
కూరిమి గొసరి మరీఁ గొప్పు నీకు ముడువఁగా
నేరుపున నామీఁద నెయ్యము చల్లేవూ ॥ యిరు ॥

వేడుకతో నాపె నిన్ను వెసఁ గౌఁగిలించఁగాను
యీడ నాకు మోవితేనె లియ్య వచ్చేవు
జాడతో శ్రీవేంకటేశ సరిగా మ మ్మిద్దరినిఁ
గూడి మాలో మాకు నసుగుణము సేసేవూ. ॥ యిరు ॥ 256

శుద్ధదేశి

నీ యిచ్చ మేలఁగే నంటా నిలుచున్న దూరకే
చాయల నేమేమో భావించకువయ్యా యీపెను ॥ పల్లవి ॥

కూరిమి గలుగుకాంత కోపగించదు
వోరుపుతో గుట్టు సేసు కుండుఁగాని
యీరీతి వోజలదే మా యిగురుఁబోఁడి
సారె నలుకలు గడించకువయ్యా యీపెకు ॥ నీ యి ॥

మంచి గుణాలమగువ మంకు చూపదు
వంచనతోనే మెలఁగి వసమౌఁ గాని
యెంచి చూడ నేరుపరి యిదె మా చెలి
అంచెల వట్టి సడి వేయకువయ్యా యీపెకు ॥ నీ యి ॥

తగ [1]వెఱఁగినసతి తత్తరించదు
మొగమోటతో నీకు మొక్కుఁ గాని
జిగి నిట్టిది మా కన్నె శ్రీవేంకటేశ
బగివాయదు జోలి చూపకువయ్యా యీపెకు ॥ నీ యి ॥ 257

రామక్రియ

వే వేలకు నే నిన్ను వేఁడుకొనేను
మావంకఁ దప్పు [2]గలిగితే మన్నించవయ్యా ॥ పల్లవి ॥

మఱి నీ చిత్తము రా మాటలాడే నంటా వచ్చి
యెఱుఁగ కేమాడుదునో యెగ్గు పట్టకువయ్యా
వుఱక బత్తితోఁ బాదా లొత్తఁగా నా కంకణాలు
వొఱసి యాద నొత్తునో వోరుచుకోవయ్యా ॥ వేవే ॥

యిచ్చకముగాఁ గౌఁగిలియ్య వచ్చి చన్నులనుఁ
గుచ్చి యెంత [3]యొత్తుదునో కోపగించకువయ్యా
మచ్చికతోనే నీకు మరిగి వీడె మియ్యఁగా
యెచ్చు కుందు లెట్టుండునో యింపు సేసుకోవయ్యా ॥ వేవే ॥

దప్పి దేర మోవితేనె తతిగొని యియ్య వచ్చి
చిప్పిల నేమి సేతునో చేకొనవయ్యా
యిప్పుడే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నీ
కొప్పు ముడువఁగా నెట్టో గుట్టు సేసుకోవయ్యా. ॥ వేవే ॥ 258

---

1. తే. పా.—వెరింగిన, 2. తే. పా.—గలితే, 3. తే. పా.—యొత్తుదునో.

444-వ రేకు నాదరామక్రియ

నే నెంత తమకించినా నీ గుణము మేలు మేలు
నానాగతి నలయవు నవ్వులే కాని ॥ పల్లవి ॥

వాసులకే పెనఁగితి వలపులు చల్లితి
వేసర వెంతైనా నీవు వీఁగి లోఁగవూ
ఆసలనే కొసరితి ఆయములు నంటితి
వీసమంతాఁ దలఁకవు వేడుకే కాని ॥ నేనెం ॥

చనవున సొలసితి జంకించి చూచితి
మనసు విఱుచుకోవు మానవు తమి
కనుసన్నల దూరితి కాఁకలు పైఁ బూసితి
అనుమానించ వేమిటా నాదరణే కాని ॥ నేనెం ॥

కప్పురాన వేసితి కౌఁగిట బిగించితి
తప్పించుకొనవు మరి తడఁబడవూ
ముప్పిరి శ్రీవేంకటేశ మోవితేనె లానితి
చొప్పుమాయ లేమిటాను సొంపులే కాని ॥ నేనెం ॥ 259

కేదారగౌళ

నీ చిత్త మెట్టున్నదో నే నెఱఁగను
చేచేత నా వలపులే చిమ్మి రేఁచీని ॥ పల్లవి ॥

చేరి నీకు విన్నపాలు చేసుకొనే నంటేను
సారెకు నివ్వెఱఁగులు సందడించీని
కూరిమి గొసరి నీ కొంగు వట్టే నంటేను
తారుమారై నాసిగ్గులే తడఁబరచీని ॥ నీచి ॥

కొంకక నిన్నే తలఁచి గుట్టున నుండే నంటే
పొంకపు చిఱునవ్వులు పొదిగొనీని
అంకె నీసుద్దులు విని అట్టె పొద్దు వుచ్చేనంటే
మంకుల పరవశాలు మరపించీని ॥ నీచి ॥

కన్నులనే నిన్నుఁ జూచి కడు బత్తి చూపే నంటే
కన్నెపాయపుగుణము కప్పీ నన్ను
యిన్నిటా శ్రీవేంకటేశ యేలితి వింతలో నన్ను
సన్నల నీ మోవితీపు చవి పుట్టించీని. ॥ నీచి ॥ 260

మాళవిగౌళ

అన్నిటా నేరుపరి అదే యాతఁ డెఱుఁగఁడా
విన్నవించరే యీ మాట వేడుక లాతనికి ॥ పల్లవి ॥
యెవ్వరి నేమన నేల యెదమాట లాడ నేల
నవ్వుతా నారమణుఁడే న న్నేలీఁ గాక
సువ్వన నా మనసు యిసుకపాఁతర యెంతని
తవ్వేను తానే దయ దలఁచీఁ గాకా ॥ అన్ని ॥
చెక్కున చే యిడ నేల చింతలఁ బొరల నేల
మక్కువ నాతఁడే వచ్చి మన్నించీఁ గాకా
గుక్కక నా దీమసము గోడవంటిది యెంతని
మక్కు వేసే తానే చూచి మమ్ముఁ గాచీఁ గాకా ॥ అన్ని ॥
నెలవి నవ్వఁగ నేల సిగ్గులు వడఁగ నేల
వెలయఁగూడె నన్ను శ్రీవేంకటేశుఁడే
చిలుకవంటిది నాలోఁ జెలఁగేయాస యేమని
పిలిచేను నాపైఁ దానే ప్రేమ నించీఁ గాకా. ॥ అన్ని ॥ 261

ధన్నాసి

తనచిత్తమే యెఱుఁగు దయగలవాఁడు తాను
వొనరి యెప్పుడూఁ బాయకుండు మని యనరే ॥ పల్లవి ॥
కన్నులఁ దన్నుఁ జూచితి కాంక్షలునుఁ దీరవు
సన్నలు సేసితి మొగబాటూఁ గాదు
విన్నపములూఁ జేతు వేడుకకు మితి లేదు
యిన్నిటా నావల పిఁక నేమి చెప్పే ననరే ॥ తన ॥

నగుదుఁ దనతో నెంతైనానుఁ దనివి లేదు
తగిలి మోవి యానుదు దప్పిఁ బోదు
అగపడి కౌఁగిలింతు నాసలునుఁ దెగవు
యెగసక్కె మాయ వల పేమి చెప్పే ననరే ॥ తన ॥

మంతనానఁ గూడుదు మద మెంతైనా దిగదు
వింతలుగాఁ గొసరుదు వీడదు తమి
పంతముతో శ్రీవేంకటపతి యిట్టె నన్ను నేలే
యింత సేసె నా వలపు యేమి చెప్పే ననరే. ॥ తన ॥ 262

కాంబోది

యెందూఁ దప్పించుకో రాదు యేమిటానుఁ బొద్దు వోదు
అందే పరాకు సేసుకో నలవి గాదు ॥ పల్లవి ॥

తలఁపునఁ బారును తన చక్కనిరూపము
వెలిఁ దా నాడేమాటలు వినిన ట్టౌను
కల గనిన ట్టౌను కన్నులు మూసుకొంటేను
యెలమి నా భావ మిది యేమి సేతునే ॥ యెందూ ॥

కడు సందు లదరును కౌఁగిలించుకొన్న ట్టౌను
బడి నుండిన ట్టౌను పైపై నీడ
వాడి వట్టిన ట్టౌను వూరకే నా కోరికసు
వుడివోని నా యాస కుపమ యేదే ॥ యెందూ ॥

చెనకినయ ట్టౌను సెలవి నవ్వులు వచ్చు
చనుగవ యంటిన ట్టౌ సంతోసానను
యెనసె శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి నన్ను
మనసు నిర్మల మాయ మరియు నే మందు సే. ॥ యెందూ ॥ 263

కన్నడగౌళ

అడుగరే మీ రయిన నంగనలాల విభుని
యెదయవు తలపోఁత లేమందునే ॥ పల్లవి ॥

వూరకే వుండితేను వుమ్మగిలీఁ దమకము
సారెకుఁ జెనకితే వేసట వుట్టీని
కూరిమి గొసరితేను కుప్పవడీఁ దరితీపు
యేరీతి నుండునో చిత్త మే మందునే ॥ అడుగ ॥

మొగము చూచితేను మునుకొనీ యాసలు
నగితేను పంతములు నాఁటుకొనీని
తగిలి మాటాడితేనుఁ దాఁకీని మర్మములు
యెగసక్కెములు నేర నే మందునే ॥ అడుగ ॥

వరుసతోఁ బెనఁగితే వంతులు వాసులు రేఁగీ
సరసము లాడితేను చల మెక్కీని
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
యెరవు లే దిద్దరికి నే మందునే. ॥ అడుగ ॥ 264

445-వ రేకు శంకరాభరణం

ఇదెవో నా గుణము యింతకంటె నేమి సేతు
పదిలానఁ దాను నేరుపఁగ వచ్చె నాకునూ ॥ పల్లవి ॥

చలము సాదించ నేర సరసునితోడుత
చెలరేఁగి ప్రియములు చెప్ప నేర్తును
బలిమిఁ బెనఁగఁజాలఁ బైకొంటేఁ జేతికి
చులుకఁగా మెలఁగి మెచ్చులు మెచ్చఁ జాలుదు ॥ ఇదెవో ॥

బొమ్మల జంకించ నోప పూఁచి తన్ను నింతలోనె
సమ్మతించి వలపులు చల్ల నోపుదు
దొమ్మిసేయ [1]నెఱుఁగను తొడరి తాఁ గూడితేను
వుమ్మగిలుఁ దమి నూరకుండ [2]నెఱుఁగుదును ॥ ఇదెవో ॥

బీరమాడ నియ్యకొనఁ బ్రేమ శ్రీవేంకటేశుఁడు
కోరి నన్నుఁ గూడె నియ్యకొనెఁ గాని
నేరము లెంచఁ దా నిగిడి నన్ను మన్నించె
నేరుపులే సారె సారెనె నెంచెఁ గాని. ॥ ఇదెవో ॥ 265

1. తే. పా. — నెరంగను, 2. తే. పా. — నెరుఁగు.

## పాడి

వట్టి పరాకు సేయఁగ వచ్చే దేమి
యెట్టైనాఁ గూడక పోదు ఇఁక నేల మఱుఁగు ॥ పల్లవి ॥

నెలవి నవ్విన నవ్వు సిగ్గుల వెన్నెల పువ్వు
పలుకుఁదేనెలసోన బంగారు వాన
లలితాంగి నీకు నిదే లంచ మిచ్చి యెదుటను
యెలమిఁ జేకొనవయ్య ఇఁకనేల మఱుఁగు ॥ వట్టి ॥

తొంగిచూపులమొక్కలు తుమ్మెదపిండురెక్కలు
పొంగేటి చనుఁగొనలు పూఁపమొనలు
అంగన కానుక వట్టీ నదివో నీకు నేఁడు
ఇంగితాన నియ్యకొను ఇఁక నేల మఱుఁగు ॥ వట్టి ॥

గట్టి గోరిరేకలు కంతు ముద్రలేకలు
తొట్టిన యీకాఁగిలి రతుల లోఁగిలి
నెట్టన శ్రీవేంకటేశ నెలఁత నూడిదె వట్టె
యిట్టె యేలవయ్య ఇఁక నేల మఱుఁగు. ॥ వట్టి ॥ 266

## బౌళి

యెట్టు నేసినాఁ జేయనీ ఇఁకఁ దనచిత్తము
ఇట్టిదని రమణుని [1]కెఱిఁగించరే ॥ పల్లవి ॥

ముచ్చటెంతైనాఁ దీరదు మోహముగలవారికి
మచ్చికతో సారె సారె మాట లాడినా
వచ్చిరాని పద్యమువలె నుండు నదియాస
కొచ్చి కొచ్చి యెంతేసి కొసరినాను ॥ యెట్టు ॥

తని వేమిటాఁ బొందదు తమకించేవారికి
పెనఁగి పెనఁగి యెంత ప్రియపడినా
వినియు విననిమాట [2]విధమై యుండుఁ దలఁపు
కనుఁగొని యెదుటనే కాచుకుండినాను ॥ యెట్టు ॥

---

1. తే. పా.—తెలింగించ, 2. తే. పా.—విద్ధమై.

తగు లెంతైనాఁ బాయదు తతిఁ గూడిన వారికి
నగి యెటువలె గోరు నాటించినాను
తగ శ్రీవేంకటేశుఁడు తానే వచ్చి నన్నుఁ గూడె
చిగురుఁ జేగై వుండు చిమ్మి రేఁచినానూ. ॥ యెట్టు ॥ 267

సింధురామక్రియ

యింకనైన రావే యిదే వచ్చె రమణుఁడు
మంకు లేకుండితేను నీ మగఁ డిట్టె మెచ్చును ॥ పల్లవి ॥

సిగ్గుగలదానికి చెల్లును పంతము లెల్లా
యెగ్గుపట్టనిదానికి నెనయుఁ బొందు
వొగ్గి వినయపుదాని కొనగూడు వేడుకలు
వెగ్గళించక నా బుద్ధి వింటెఁ బతి మెచ్చునే ॥ యింక ॥

వోరిచివున్నదానికి నొద్దికాఁ జుట్టరికము
నేరిచినదానికి నిండుసిరులు
మేరతో నవ్వేదానికి మిక్కుటమౌ రాజసము
యీరీతి నా బుద్ధి వింటే నీ విభుఁడు మెచ్చునే ॥ యింక ॥

గుట్టున నున్నదానికి గుణము లోఁజకు వచ్చు
దిట్టయైనదానికి తేఁకువ గల్గు
నెట్టన శ్రీవేంకటనిలయుఁడు నిన్ను నేలె
యిట్టి నా బుద్ధి వింటే నీతఁ డింకా మెచ్చునే. ॥ యింక ॥ 268

రీతిగౌళ

చేరి పెనఁగఁగఁ బోతే చిత్త మెట్టుండునో
కోరి తను నింతేసి కొసరఁగ నేలే ॥ పల్లవి ॥

తగిలి నా తమకమే తనకు దయ వుట్టించీ
వెగటుగా విన్నవింపించ నేలే
మొగము చూచినా యాసె మోహము దనకు రేఁచీ
అగడుసేసి కొసరి యలయించ నేలే ॥ చేరి ॥

కిందుపడి తనకు మొక్కి మొక్కి పలమిచ్చి
చందముగాఁ ద న్నిట్టె వేసరించ నేలే
కందువ నే నంపే కానుకలే తను రప్పించి
సందడించి సారె సారె చండిపెట్ట నేలే ॥ చేరి ॥

కడు నేఁ జేసే వూడిగాలే తన కెచ్చరించి
బడి బడి దైన్యము చూప నిఁక నేలే
[1] చిడిముడిఁ దానె వచ్చి శ్రీవేంకటేశుఁడు గూడె
గుడిగొన సంతోషించుకొంటెఁ జెప్ప నేలే. ॥ చేరి ॥ 269

శ్రీరాగం

యిదెవో నా నోముఫల మిఁక నే వెరపు లేదు
పదిఁబదై యాసలు నాపైఁ దన కున్నవి ॥ పల్లవి ॥

యెప్పుడూ మరుబాణా లెంత వాఁడియైనా నేమి
తప్పదుగా నామీఁద తనకరుణ
వొప్పుగఁ గోవిల లెంత వొరటుతో నుండినాను
చొప్పులుగాఁ దాఁ జూచిన చూపులు నా కున్నవి ॥ యిదెవో ॥

అల చందురుని వెన్నెలంత వెట్టయైన నేమి
కలదుగా యీ చుట్టరికము తనది
చిలుకలు కొరకొరై చిమ్మ రేఁగఁ బలికినా
చెలరేఁగి తాఁ బెట్టినసేసలు నా కున్నవి ॥ యిదెవో ॥

మందానిలుఁడు యెంత మందటాడినా నేమి
అందరిలోఁ దన పొందు లబ్బెఁగా నాకు
యిందు శ్రీవేంకటేశుఁడు యిట్టె తా న న్నేలినాఁడు
చందాన నా రెచ్చినట్టి చనవు నా కున్నది. ॥ యిదెవో ॥ 270

446-వ రేకు రామక్రియ

ఆకెకు నీకుఁ దెలుసు నౌభళేశా
యేకతాననే యరసి [2] యెఱుఁగుకో రాదా ॥ పల్లవి ॥

1. తే. పా.–చిదుముడి, 2. తే. పా.–యెరుంగు.

యెదురుఁ గొండ లెక్కి యేటి కొల కే మమ్మ
అదిగో సొలసి మాటలాడీ నిన్ను
పొదిగి పొదిగి యట్టె బొమ్మల జంకించు కొంటా
తుదలేని వేడుకలఁ దొంగి చూచీని ॥ ఆకెకు ॥

చల్లని మాకులనీడ సమదిష్టితో నీకు
వొల్లని ప్రియాలు చెప్పి వొరసీ నిన్ను
తెల్లమిగా నెలవులఁ [1]దెగ నవ్వు నవ్వుకొంటా
పల్లదాన నీపైఁ బూబంతి వేసీని ॥ ఆకెకు ॥

మిక్కుటపుఁ దమకము మించఁగా నీతొడ యెక్కి
గక్కునఁ జన్నుల నొత్తి కలసీ నీతో
తక్కక యహోబలానఁ దగ శ్రీవేంకటాద్రిని
వొక్కటై నిన్నుఁ బెండ్లాడి వొద్దికె చూపీని. ॥ ఆకెకు ॥ 271

నారాయణి

అరయ నాపెపై నీకు నట్లానె కాఁబోలు
గరిమ మీ గుణములు కడుఁ గొత్తలయ్యా ॥ పల్లవి ॥

మొగము చూచి చూచి మోహములు చల్లి చల్లి
చిగురుమోవితేనె చింది చింది
పగటున మాటలాడి పచ్చిదేరఁ దమకించీ
మగువ వేడుకలు యేమని చెప్పేమయ్యా ॥ అరయ ॥

చేతులు చాఁచి చాఁచి నెలవుల నవ్వు నవ్వి
పోతరపు సరసాలు పూసి పూసి
రాతిరిఁ బగలుఁ బొంచి రతులకే యాసగించీ
యీ తరుణి కోరిక లెన్ని లేవయ్యా ॥ అరయ ॥

చనుఁగవ నొత్తి యొత్తి జవ్వాది మెత్తి మెత్తి
పెనఁగి పెనఁగి సిగ్గు పెంచి పెంచి
యెనసెను శ్రీవేంకటేశ నిన్ను నింతలోనే
వనితచందము లివి వసమా నేఁడయ్యా. ॥ అరయ ॥ 272

1. తే. పా.– దెగే.

తెలుఁగుఁ గాంబోది

అతివపాలి దేవుఁడ వన్నిటాను
[1]నతులు సేసె నీకుఁ దగ మన్నించవయ్యా ॥ పల్లవి ॥

జలజాక్షికి నీపేరు జపియించే మంత్రము
తలఁపులో నీరూపు సంతత ధ్యానము
అలరి చెలి నీవద్ది కంపినదే ఆవాహనము
వొలసి యచ్చువాసిన వురమే నీ పీఠము ॥ అతివ ॥

అంగపుఁ జెమఁజెమట లర్ఘ్యపాద్యాచమనాలు
సంగతిఁ బెంజమాటలె జలకములు
పొంగటఁ జల్లఁగా మేనిపూఁత కుంకుమే గంధము
చెంగటఁ గొప్పువిరులే సేసేపూజ నీకు ॥ అతివ ॥

నీరజాక్షి మోవితేనె నీకు నారగింపులు
యీరీతిఁ బుక్కిటి విడె లిచ్చె బాగాలు
కూరిమి శ్రీవేంకటేశ కూడితి వీకె నింతలో
సారపు సమరతులే సకలోపచారాలు. ॥ అతివ ॥ 273

గుజ్జరి

యే మని విన్నవించేనే యిఁకఁ దనకు
చేముంచి తానే దయసేసెఁ గాక ॥ పల్లవి ॥

చెప్పరాని సుద్దులకు సేయరాని చేఁతలకు
వొప్పి తన కొడఁబడి *వున్నదాన నేను
కుప్పలైన యాసలకు గుఱిలేని కోరికెకు
తప్పక గుఱి యైతిని తనకుఁగా నేనూ ॥ యేమని ॥

నెట్టుకొన్న మొక్కులకు నిండుకొన్న ప్రియాలకు
వొట్టుకొని కాచుక *వున్నదాన నేను
కట్టిన కంకణానకు కడుఁ జుట్టరికేనకు
యిట్టె పాలుపడి తన కిర వైతిని ॥ యేమని ॥

1. తే. పా.—తపము, * తే. పా.—వుందాన.

పీడరాని పొందులకు వేడుక కూటములకు
వోడక తన యెదుట *నున్నదాన నేను
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్ను నేలె
తోడునీడవలె నిట్టే దొరసితి నేను. ॥ యేమని ॥ 274

దేవగాంధారి

యెక్కడ పరాకు నీకు నెందు చూచేవు
పిక్కటిల్లే వలపుల ప్రియ మిట్టిదయ్యా ॥ పల్లవి ॥

కుప్పలుఁ దెప్పలు నైన కోరికలు మదిలోన
వుప్పతిల్లుఁ జెమటలు వొళ్ళిమీఁదను
దప్పి దేరే మాటల తరితీపు మోవిమీఁద
కప్పి వున్నది చెలికిఁ గనుఁగొనవయ్యా ॥ యెక్కడ ॥

తనివోని తలఁపుల తమి జవ్వనముమీఁద
వినియేటి వేడుకలు వీనులమీఁద
ననిచిన పొందులనవ్వు నెలవులమీఁద
గనమాయ నిదెవో కనుఁగొనవయ్యా ॥ యెక్కడ ॥

చిమ్మిరేఁగే యటువంటి సిగ్గులు చన్నులమీఁద
కమ్ముకొన్న యడియాస కౌఁగిటిమీఁద
యిమ్ముల శ్రీవేంకటేశ యింతి నిట్టె కూడితివి
కమ్మర మన్నించి యింకాఁ గనుఁ గొనవయ్యా. ॥యెక్కడ॥ 275

భైరవి

యెగ్గు పట్టేవు సుమ్మీ యెఱుఁగ నేను
సిగ్గులు నీ వంటితేను చేతఁ జెనకుదును ॥ పల్లవి ॥

నీ విచ్చిన చనవున నీ చిత్త మెఱుఁగక
వే వేగ రావైతి వని వేగిరింతును
దేవులనై యుండిన మందెమేళాన నూరకే
పూవుల నీవు వేసితే బొమ్మల జంకింతునూ ॥ యెగ్గు ॥

* తే. పా. – వుందాన.

నాకు నీవు గల వని నమ్మిన గర్వమునను
పైకొని నిన్ను నేను గుబ్బల నొత్తుదు
రాకపోకల నీవు సరసమాడే వేడుకను
యేకాంతాలు చెవిలోన నేమైనా నాడుదును ॥ యెగ్గు ॥
నాతో నీవు సారె సారె నవ్వే వనే మదమున
రాతిరిఁ బగలు నీతో రతి సేతును
యీతల శ్రీవేంకటేశ యిన్నిటా న న్నేలితివి
పోతరించి రాకొట్టఁ బొగడుదునూ. ॥ యెగ్గు ॥ 276

447-వ రేకు భూపాళం

యెఱఁగఁడా తా నేమైనా యేల నన్ను జరసీని
మెఱసే తనగుణాలు మెచ్చుకొందుఁ గాకా ॥ పల్లవి ॥
నగితే మారుకు మారు నగవచ్చునా తనతో
మొగము చూచి యట్టే మొక్కుదుఁగాకా
మగఁడు తా గో రూఁదితే మరి నేఁ జెనకుదునా
జిగిమీఱ సమ్మతించి సిగ్గున నుందుఁగాకా ॥ యెఱఁగ ॥
యెనసి తా మాటాడితే యెదురు మాటాడుదునా
వొనర వీనుల విని వూఁకొందుఁ గాకా
చెనకి పూబంతి వేసితేఁ దప్పించు కొందునా
అనుమానించక చేత నందుకొందుఁ గాకా ॥ యెఱఁగ ॥
ధరఁ దాఁ జెక్కు నొక్కితే తనచెక్కు నొక్కుదునా
వొరసి అందుకుఁ బాదా లొత్తుదుఁ గాకా
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్నుఁ గూడె
గరువము చూపుదునా కౌఁగిలింతుఁ గాకా. ॥ యెఱఁగ ॥ 277

నారాయణి

యేఁటి కయ్యా నీవు మాతో యేలాటా లాడేవు
నాఁటకపుదానవా నవ్వేదానఁ గాకా ॥ పల్లవి ॥

సారె నీతో బెనఁగ సరిదాననా
మేరలు మీఱఁగ నంత మేనదాననా
దూరి మాటలాడ బిరుదులదాననా
యేరీతిఁ జేసినను నీ యిచ్చలోదానఁ గాకా ॥ యేఁటి ॥

నిక్కి నిక్కి నిన్నుఁ జూడ నీటుదాననా
తొక్కి పాదాలఁ బెనచ దొడ్డదాననా
చిక్కి మో వెడుగ నప్పిచ్చినదాననా
మక్కువ నీ వేలితే సమ్మతించేదానఁ గాకా ॥ యేఁటి ॥

తగవులఁ బెట్ట నేఁ బంతపుదాననా
తగిలి చేయి వట్టఁగ దంటదాననా
నిగిడి శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గూడితివి
మిగులా నీ మన్ననల మెఱసేదానఁ గాకా. ॥ యేఁటి ॥ 278

వరాళి

విన్నవించరే యీ [1] మాట విభునికిఁ జెలులాల
పన్ని తనతో నేను పంతము చూపితినా ॥ పల్లవి ॥

చెలఁగి తనకురులు చిక్కులు దీసితిఁ గాక
బలిమి నేసి శిరసు పట్టితినా
వెలయఁ జక్కని తన్ను వేడుకఁ జూచితిఁ గాక
కలికి కన్నుల నిట్టే కడు జంకించితినా ॥ విన్న ॥

గట్టిగా ముంజేతఁ గంకణము గట్టితిఁ గాక
దిట్టనై తనచేయి వట్టి తీసితినా
గుట్టుతోడ తనకు నేఁ గొలువు సేసితిఁ గాక
అట్టే తన్నుఁ బోకుండా నాఁగితినా ॥ విన్న ॥

సరుగఁ దన్నుఁ గౌఁగిటఁ జన్నుల నొత్తితిఁ గాక
బిరుదులు చూపి [2] మోపి పెనఁగితినా
యిరవై శ్రీవేంకటేశుఁ డిన్నిఁటా నన్ను నేలె
సరి మెచ్చితిఁ గాక యాసలఁ గొసరితినా. ॥ విన్న ॥ 279

1. తే. పా. — మాఁట, 2. తే. పా. — మోంపి.

కాంబోది

యేమి చెప్పేమయ్యా నీతో నింతిసుద్దులూ
కామించె నిన్ను నీకెఁ గరుణించవయ్యా ॥ పల్లవి ॥

పడఁతి నిన్నుఁ దలఁచి బయలు గౌఁగిట నించు
బడిబడి నీ సుద్దులు భావించును
అడియాలములు చూచి ఆనందమున మించు
వుడివోని కోరికెల నుమ్మగిలును ॥ యేమి ॥

తక్కక నిన్నుఁ బేర్కొని తనలోనె సిగ్గువడు
చిక్కి నీ మా టాలకించి చెమరించును
మిక్కిలి నీ గుణాలకు మెచ్చి మెచ్చి లోలో నవ్వు
వొక్కపై నీ మోవితేనె కూరకె [1]యాకారును ॥ యేమి ॥

సమరతు లూహించి సరసపు మాట లాడు
కొమరునీరూపు వ్రాసి గోర గీరును
తమితో శ్రీవేంకటేశ తగ నీ విట్టె వచ్చి
రమణిఁ గూడితివి యీ రతులే తలఁచును. ॥ యేమి ॥ 280

భైరవి

యిప్పుడు వచ్చితివి మా యింటికి నీవు
దప్పి దేరె నాపయి దయ దలఁచఁగ వలదా ॥ పల్లవి ॥

తలపోఁతలనుఁ జిక్కి తగ వెదకుదు నిన్ను
లలి నిన్నుఁ జూచేనంటా లాచి కోరుదునూ
అలమె నంటా లోలో నాసలఁ బొరలుదును
యెలమి నీ వయితేను యెక్కడ నుందువయ్యా ॥ యిప్పుడు ॥

మంతనాన నుండి తమకింతు నీ రాకకు
బంతికూటివేళ నీకు వార మిత్తును
కాంతల నీవద్దికంపి కాచు కుందుదు వేళలు
యింత నే మోహించితి నీ వెక్కడ నుందువయ్యా ॥ యిప్పుడు ॥

---

1. తే. పా. – యూంకా.

సరసము లాడే నంటా సారెకు వేడుక సేతు
సరుగ నీ రతు లెంచి సంతోసింతును
యిరవై శ్రీవేంకటేశ యింతలో న న్నేలితివి
యెరవు లే దిద్దరికి నెక్కడ నుందువయ్యా. ॥యిప్పుడు॥ 281

దేసాళం

నీ చిత్తము వచ్చితిని నేఁ జేసినదే భాగ్యమో
చేచేత నీవు నన్నుఁ జెక్కులు నొక్కేవూ ॥ పల్లవి ॥
పలుకఁదేనెలవారు బంతిబోజనాలవారు
చెలమికత్తెలు నీకు నేనా నేన
యెలమి నీ కెందులోను యెవ్వతెఁ బోలుదు నేను
కలికి నంటా నన్నుఁ గడుఁ బొగడేవూ ॥ నీచిత్త ॥
దగ్గరఁ గూచుండేవారు తమితోఁ జెనకేవారు
సిగ్గులువడేవారు నేనా నేన
వొగ్గి నీకు సేవ సేసి వొడఁబడ నెంతదాన
తగ్గులేని గుణములదాన నంటా మెచ్చేవూ ॥ నీచిత్త ॥
మఱఁగున నుండేవారు మంతన మాడేవారు
చిఱునవ్వు నవ్వేవారు నేనా నేన
నెఱి నీ దేవుళ్ళలోను నే నేమి నేరుతును
గుఱిగా శ్రీవేంకటేశ కూడి గారవించేవూ. ॥ నీచిత్త ॥ 282

448-వ రేకు మాళవశ్రీ

చెప్పితి మిప్పుడే ఆకె సిగ్గువడును
యెప్పుడు నేర్పరి వౌదు విన్నిటాను నీవూ ॥ పల్లవి ॥
చక్కఁగా మగువపై సేసలు చల్లుదువు గాని
చెక్కు నొక్కేవు సుమ్మీ సిగ్గువడును
పిక్కటిల్లు చన్నుల పెండ్లికూఁతురు యీకె
కక్కసించేవు సుమ్మీ కడుఁ బువ్వువంటిది ॥ చెప్పితి ॥

కాతరించక రమణిఁ గాలు దొక్కుదువు గాని
　　చేతులు వట్టేవు సుమ్మీ సిగ్గువడును
　　నీ తరుణి బారెఁడేసి నెరుల కొప్పుది యీకె
　　గాత చూపేవు సుమ్మీ బంగారు బొమ్మవంటిది　　॥ చెప్పితి ॥
యెలమి శ్రీవేంకటేశ యింతి నేలుదువు గాని
　　నెలవి నవ్వేవు సుమ్మీ సిగ్గు వడును
　　మొలనూళ్ళ బంగారు గంటల పిఱుఁదుల దీకె
　　అలయించేవు సుమ్మీ తలిరాకు వంటిది.　　॥ చెప్పితి ॥ 283

**కురంజి**

ఆఁటదై పుట్టినందు కటువలెఁ గాకుండితే
　　యేఁటి జన్మమయ్యా మమ్ము నేలుకొనవలదా　　॥ పల్లవి ॥
పానుపుపైఁ గూచుండి నీపాదములు చేత నొత్తి
　　అనించి గుబ్బలమీఁద నందుకొంటాను
　　నానుపుఁజెమట నీపై నసుపునఁ జిందుకొంటా
　　కానుకగా మోవి యిచ్చి కరఁగఁగ వలదా　　॥ ఆఁటదై ॥
కొనగోర నీ కురులు కూడగిరి దువ్వి దువ్వి
　　చెనకి చెక్కునఁ జెక్కు చేర్చుకొంటాను
　　పెనఁగి నీ బుజాలపై ప్రియానఁ జేతులు వేసి
　　తనివార మోము చూచి దైవారవలదా　　॥ ఆఁటదై ॥
వొయ్యనే కొఁగిట నించి వొత్తగిలి పక్కనుండి
　　తియ్యని నీ మోవితేనె దీసుకొంటాను
　　ఇయ్యెడ శ్రీవేంకటేశ ఇదే నీ దేవుల నైతి
　　పయ్యెదఁ గప్పి ఇట్టె తెప్పలఁ దేలవలదా.　　॥ఆఁటదై॥ 284

**గౌళ**

యిదివో నీ కతాననే యింత లాయను
　　యెదురుచూచే యాస లేమి చెప్పేమయ్యా　　॥ పల్లవి ॥

జవ్వన ముప్పతిల్లి సతి చనుఁగవ యాయ
నివ్వటిల్లుఁగోరికలే నేరు లాయను
వువ్విళ్ళూరి మోహరస మూరేటిచెమట లాయ
యివ్వల నీకీ సింగారా లేమి చెప్పేమయ్యా ॥ యిదివో ॥

తరితీపు లింతికి గుత్తపు మోవితేనె లాయ
గరిమనింపులు మోముకళ లాయను
సురతపుఁదమకము చూడఁ జూడఁ గొత్తలాయ
యిరవైన గురుతులు యేమి చెప్పేమయ్యా ॥ యిదివో ॥

కూటముల నిబ్బరము కొనగోరే వాండ్లాయ
సూటితో నడియాసలు చూపు లాయను
యీటుతో శ్రీవేంకటేశ యీకె నిట్టే కూడితివి
[1]యేటవెట్టే యీలాగు లేమి చెప్పేమయ్యా. ॥ యిదివో ॥ 285

నాగగాంధారి

చెలియ భావము చూడఁ జెప్పఁ గొత్తలు
యెలమి నీ వేలవయ్య యెంత పొగడేము ॥ పల్లవి ॥

నిండిన తమక మెల్లా నిలువునఁ దొట్టఁగాను
దండి తరితీపులు తమి రేఁచఁగా
కొండలవంటి చన్నులు కొనసాగి పెరుగఁగా
మెండగు వయసు నీకు మీఁదెత్తు కున్నది ॥ చెలియ ॥

తలపోఁతలు మదిలోఁ దడఁబడుచుండఁగాను
చెలపచెమటలు పైఁ జిప్పిలఁగాను
కలికిచూపులకాంక్ష కడు సందడించఁగాను
వలపు నీకుఁగాను కవడిఁ బట్టుకున్నది ॥ చెలియ ॥

కోటానఁగోటి కోర్కులు కుప్పలుగఁ బడఁగాను
మాటలు పెదవులపై మల్లాడఁగాను
నీటున శ్రీవేంకటేశ నీ వేలితి వింతలోన
కూటపు రతులు నీకు గుటిసేసుకున్నది. ॥ చెలియ ॥ 286

1. తే. పా.—యేఁట.

కుంతలవరాళి

యెంతని చెప్పే నేను యేమని వినేరు మీరు
సంతతము దైలువారిచల్లువెద (?) లాడీనే ॥ పల్లవి ॥

మనసునఁ దాగేపాలు మరి లెక్కవెట్ట నేల
గొనకొని గుక్కిళ్ళు కొలవ నేల
నినుపులై యీతనికి నే వలచిన వలపు
యెనలేక చెలులాల యేల న న్నడిగేరే ॥ యెంతని ॥

నెలవి నవ్వినవవ్వు చేటఁ దేమి గంపెఁ దేమి
పలుకు లెన్నేయ నేమి పదర నేమి
పలుమారు నాతనిపైఁ బెట్టినయాసలు
కొలచి కొలచి యెంతగుట్టు దెలిసేరే ॥ యెంతని ॥

వేడుకై నరతులకు వెలలు చెప్పఁగరాదు
వాడిక మోవితేనె వద్దించరాదు
యీడనె శ్రీవేంకటేశుఁ డింత నేసె నన్నుఁ గూడి
యీడువెట్టి మి మ్మిందరి నేలితేనే మెచ్చేరే. ॥ యెంతని ॥ 287

నాదరామక్రియ

తగులాయఁ బొందులు తనకూ నాకూ
తగు నిద్దరి కనవే తలపోయ నెపుడూ ॥ పల్లవి ॥

శిరసు వంచితి నెంతే సిగ్గులు రేఁగఁగాను
గరువము గా దనవే కాంతునితోను
విరుల వేసితి నెంతే వేడుకలు గాఁగాను
విరసము లే దనవే వే వేలకు నేఁడూ ॥ తగు ॥

యింతలో నవ్వితే నెంతే యిచ్చకము గాఁగాను
పంతము గా దనవే పలుమారును
సంతోసించుకొంటి నెంతే చవిగా మాటాడఁగాను
రంతుసేయ ననవే రవ్వగా నేనూ ॥ తగు ॥

కలసితి నెంతే రతిఁ గాగిలించుకొనఁగాను
అలయించ ననవే అంకెలఁ దన్ను
యెలమి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
సొలయ ననవే తానే సొంపుగా నన్నేలెనూ. ॥ తగు ॥ 288

449-వ రేకు శుద్ధవసంతం

వూరకే దక్కుదువా వువిదలకు
యీరీతి నీ సేవ సేసే నేఁటికి వద్దనేవూ ॥ పల్లవి ॥

పెదవులు మోఁపి నీకుఁ బ్రియములు చెప్పవలె
చెదర కిచ్చకములు సేయఁగవలె
కదలుఁ గన్నుల నిట్టే కాంక్షతోడఁ జూడవలె
వదలుఁబయ్యెద జార వంగి మొక్కవలెను ॥ వూర ॥

నీ వేమి చెప్పినాను నెట్టుకొని వినవలె
భావించి నీమాట కొడఁబడవలెను
కైవసమై వీడె మిచ్చి కౌఁగిట నించఁగవలె
వేవేలకుఁ జెక్కు నొక్కి వేఁడుకొనవలెను ॥ వూర ॥

సరసము లాడితేను సమ్మతించి నవ్వవలె
ఇరవై రతిఁగూడితే నెనయవలె
అరుదై శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
మరిగించితి విట్లా మతిఁ జొక్కవలెనూ. ॥ వూర ॥ 289

శోకవరాళి

యిదివో కామినిభావ [1]మెఱిఁగించ వచ్చితిమి
వుదుటు మనోరథాల నోలలాడుచున్నది ॥ పల్లవి ॥

విన్నుఁ బాసి విరహాన నీతోడికూటములు
తన్నుఁ దానె తలపోసి తని వందును
సన్నిధి గల్పించుకొని సారె సారె మాటలాడు
వున్నతపుకొనగోరు వూరకే వూఁదును ॥ యిది ॥

---

1. వే. పా. – మెరింగించ.

మట్టుమీఱఁ జన్నులు మలగుతో నదుమును
వొట్టు వెట్టి పోకు మను నూరకే నవ్వు
తిట్టులు భావించుకొను దీకొని సరసమాడు
బట్టబయలు కౌఁగిటఁ బట్టు వేఁడుకొనును ॥ యిది ॥

పానుపుపై నిన్నుఁగూడ భావించుఁ జెమరించు
పూనినట్టి భోగములఁ బొద్దు వుచ్చును
ఆనుక శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
యీనెలవుననే వచ్చి యింతలోఁ గూడితివి. ॥ యిది ॥ 290

పాడి

యెంచుకొంటే నిన్ను నన్ను నెంత కెంత
పంచబాణునిబలము పంగెనలవారము ॥ పల్లవి ॥

మన సియ్య నేరుతువు మరిగించ నేరుతువు
వినుపులుగాఁ గృప నించ నేర్తువు
వినయాన నేము నేసేవిన్నపము లే మున్నవి
తనివోని కోరికలఁ దగిలేటివారము ॥ యెంచు ॥

తమి రేఁచాఁ గలవు తమకించాఁ గలవు
అమరఁగఁ జనవు లియ్యఁగఁ గలవు
ప్రమదాన నేము నీకు బత్తినేసే దేమున్నది
కామరెపాయముతోడఁ గొసరేటివారమూ ॥ యెంచు ॥

వాడివట్ట నోపుదు వానగూడా నోపుదువు
కదు శ్రీవేంకటేశ చొక్క నోపుదువూ
అదరి యలమేల్మంగ కాపె పంత మేమున్నది
యెదయక నీ సేవకు నిరవైనవారమూ. ॥ యెంచు ॥ 291

గంభీరనాట

యేమయ్య నీకు నాకు నెంత కెంత అంతరము
ఆముకొని నాకుఁ బ్రియము చెప్పేవయ్యా ॥ పల్లవి ॥

యెట్టు నేసినా నిన్ను నెగ్గు లెంచేదాననా
బట్టబయ లేల వొడఁబరచేవయ్య
పట్టి పెనఁగఁగా నేను పంతమున బిగిసేనా
వెట్టికి నీ వెంతేసి వేఁడుకొనేవయ్యా ॥ యేమ ॥

చిత్తగించు మెప్పుడూ నీ చేతిలోనిదానను
బత్తిసేసీ నన్ను నెంత పైకొనేవయ్యా
యెత్తలఁ జూచినాను ఇచ్చకురాల నీకు
పొత్తులమాఁటల నెంత పొదిగేవయ్యా ॥ యేమ ॥

యేపనులు చెప్పినాను ఇయ్యకొనేదాన నీకు
చేపట్టి సన్నలు యేమి సేసేవయ్య
రాపుల శ్రీవేంకటేశ రతి నలమేల్మంగను
నాపాలివాఁడవు నిన్ను నమ్మితినయ్యా. ॥ యేమ ॥ 292

అమరసింధు

యేమి సేతు నా తమక మిటువలె నున్నది
నేమము లెల్లా నాకు నీకొరకే కాదా ॥ పల్లవి ॥

వేమారు నీవు రావని వేసరించి దూరే దెల్లా
కామించి నీపై బత్తినే కాదా నేను
ఆముకొని బొమ్మలను అట్టే మరి జంకించేది
దోమటి నీతోడి పొందుకొరకే కాదా ॥ యేమి ॥

కొనచూపులను నిన్ను గుంపించి చూచే దెల్లా
అనిశము నీతోఁ బాయలేకే కాదా
మనసు మర్మాలు సోఁక మాటలు నిన్నాడే దెల్లా
తనివోని కోరికల దైవారుటాఁ గాదా ॥ యేమి ॥

పచ్చిగా నిన్నుఁ జెనకి పంతములు చూపే దెల్లా
కొచ్చి కొచ్చి నిన్నుఁ గూడే కొరకే కాదా
యిచ్చట శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
మెచ్చి న న్నేలితివి యీమేలుకే కాదా. ॥ యేమి ॥ 293

కేదారగౌళ

యెప్పుడూ న న్నింతటాను యీదేర్చ నీ భారము
చెప్పినట్టల్లా నీవే సేసేవు గాకా ॥ పల్లవి ॥

వేడుకతో నే నెంత వేగిరించినా నేమి
వాడికతో మన్నించవలెఁగా నీవూ
వాడి యెఱిఁగిన నిన్నుఁ బైకొని కొసర నేమి
జాడతోఁడ నీవే నాకు చన విచ్చేవు గాకా ॥ యెప్పు ॥

ఆసపడి నీ పాదాల కటు నే మొక్కిన నేమి
వాసితో నా దిక్కు చూడవలెఁగా నీవూ
సేసవెట్టితివి నిన్నుఁ జెక్కు నొక్క నిఁక నేమి
బాస దప్ప కిట్టే నన్నుఁ బాలించేవు గాకా ॥ యెప్పు ॥

యెదురుగా వచ్చి నిన్ను నింటికిఁ దెచ్చితే నేమి
వదలక ఆదరించవలెఁగా నీవూ
యిదివో శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పొదిగి కూడితి విట్టే భోగించేవు గాకా. ॥ యెప్పు ॥ 294

450-వ రేకు బలహంస

వనితలకుఁ బతికి వలపే కీలు
ననుపు గలిగితేను నానుఁ బ్రియములూ ॥ పల్లవి ॥

చిత్తమువచ్చినచోట సేవ లెల్లా నీడేరు
అత్తుగ దయితే మాట లనువు లౌను
పొత్తులు గలసితేను భోజనాలు రుచులౌను
బత్తి గలిగితేను యే పనులైనా నౌను ॥ వనిత ॥

చెలిమి సేసినచోట చెలఁగు మంచితనాలు
తలఁపు గలిగితేను తమి రేఁగును
బలిమిఁ బొగడితేను భావములు గరఁగును
నెలవై పాయకుండితే నిలుచు మచ్చికలూ ॥ వనిత ॥

కందువ గలుగుచోట కాఁపురాలు వేడుకలౌ
చందముగాఁ బెనఁగితే సరస మౌను
యిందునే శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
పొందితివి నన్ను నిట్టే పొసఁగు మన్ననలూ. ॥ వనిత ॥ 295

ఆహిరి

యేమని పొగడుదునే యిటువంటి నావిభుని
యీ మేలు నే మఱవను యెప్పుడూ ననవే ॥ పల్లవి ॥

యెంత పరాకై వుండినా నెదుటికి నే వచ్చితే
సంతోసాన మోము చూచి చన విచ్చునే
వింతలుగా నిద్రించేవేళ నేఁ బాదా లొత్తితే
అంతలోనే లేచి నన్ను నాదరించునే ॥ యేమ ॥

యేపొద్దు నే వచ్చినాను యెదురుకొని లాలించి
చేపట్టి కౌఁగిలించి సేద దేర్చునే
చాపలాన సిగ్గుతోనె సముకాన నుండినాను
చాఁపునే చేతులు నా చన్నులమీఁదటనే ॥ యేమ ॥

యెచ్చి రాజసానఁ దాను యేకతాన నుండినాను
మచ్చిక నాతో నవ్వి మన్నించునే
ఇచ్చట శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
ఇచ్చగించి నన్ను నేలె యెన్నఁడునుఁ బాయఁడే. ॥యేమ॥ 296

లౌళి

కొచ్చి నేఁ బైకొనే నంటే గోలదానను
యెచ్చిన నావలపే ఇంత సేసే నన్నును ॥ పల్లవి ॥

నీ మొగము చూచితేను నీసుద్దులు దలఁ పౌను
చే ముట్టితే పులకలు చిమ్మి రేఁగును
కామించి వద్ద నుండితే కళలు దైవారును
యేమి సేతు నా వలపు లింత సేసే నన్నును ॥ కొచ్చి ॥

విన్నపము సేసేనంటే వెస నిండీ సిగ్గులు
పన్ని వేఁడఁబోతే ముంచీఁ బరవసము
సన్నలు సేసేనంటే జలజలఁ జెమరించీ
యెన్నరానినావలపు వింతసేసే నన్నును ॥ కొచ్చి ॥
సరసము లాడేనంటే సంతోసము లెల్లఁ దొట్టీ
అరుదుగా నవ్వేనంటే నాసలు వుట్టీ
యెరవులేని శ్రీవేంకటేశ యలమేల్మంగను
యిరవై తి నా వలపు లింత సేసే నన్నునూ. ॥ కొచ్చి ॥ 297

పూర్వగౌళ

యింకా నేల పరాకులు యింకా నేల సిగ్గులు
సంకె లన్నియునుఁ దీరె చన వియ్యవయ్యా ॥ పల్లవి ॥
మూసినముత్తెమువలె ముంగిట నిలుచున్నదీ
ఆసపడ్డచెలితో మాటాడవయ్యా
సూసకము గట్టుకొని చూచీ నీ మొగమే
నేసముత్యాలతోడఁ జిత్తగించవయ్యా ॥ యింకా ॥
నెలవినవ్వులతోడ శిరసు వంచుకున్నదీ
చెలరేఁగి కొనగోరఁ జెనకవయ్యా
కలయికలకు నీ కొలువులు సేసీని
లలిఁ జెక్కు నొక్కి యిట్టే లాలించవయ్యా ॥ యింకా ॥
మచ్చిక నీ కౌఁగిటికి మనసు పెట్టుకున్నది
కుచ్చి కుచ్చి కౌఁగిటఁ గూడవయ్యా
యిచ్చట శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
యిచ్చల నేలితి విట్టే యీడేర్చవయ్యా. ॥ యింకా ॥ 298

సామంతం

అవధారు చిత్తగించు మంగనప్రాణేశుఁడవు
యివల నీ కింతలోనే యెక్కడ పరాకు ॥ పల్లవి ॥

సొలపు నిట్టూర్పుల సోబానఁ బాడీఁ జెలి
పలుకులఁ గప్పురాలు పచారించీని
వలపుల చెమటల వసంతము చల్లీని
నిలువుఁగొలువులను నెయ్యము నించీని ॥ అవ ॥

పగటుఁజూపుల రాయబారుల నంపీని
చిగురుఁజేతి మొక్కుల చిమ్మిరేఁచీని
నగవులనరసాల నారువోసీఁ దమకము
జిగిఁ బులకముత్తేల సేసలు వెట్టీని ॥ అవ ॥

కరగింపుఁజెనకుల కానుకలు చేతి కిచ్చి
తొరలింపుమోవుల విందులు వెట్టీని
యిరవై శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సిరుల నీవు గూడఁగాఁ జెలఁగి మెచ్చీని. ॥ అవ ॥ 299

శంకరాభరణం

యిద్దరిభావాలుఁ గంటి మిదెవో నేము
వొద్దికతోఁ జెమరించె నొరపై నీ మేనను ॥ పల్లవి ॥

చెక్కులఁ జెమట గారీ సిగ్గులు మోమునఁ దేరీ
చొక్కపు చెలియమోము చూడవయ్యా
మక్కువ నీపై నున్నది మహిమ లెల్లా గన్నదీ
మక్కళించి మాటలాడీ మన్నించు మిపుడు ॥ యిద్ద ॥

చింతతోఁ గ్రుమ్మడివీడీ చిగురుమోవి వాడీ
యింతికేఁ జనవు లెల్లా నియ్యవయ్యా
సంతోసాలు మేన నుబ్బె సరసము లెల్లా నబ్బె
పొంత కిట్టే చేరి తముల మిడవయ్యా ॥ యిద్ద ॥

గుబ్బలఁగుంకుమ రాలీ కోరిక నీపై వాలీ
జొబ్బిలఁ గూడితి విట్టే చొక్కవయ్యా
అబ్బురపు శ్రీవేంకటాధిప అలమేల్మంగ
నుబ్బున నేలితి వింకా నొనగూడవయ్యా. ॥ యిద్ద ॥ 300

461-వ రేకు కుంతలవరాళి

యిన్నాళ్ళు నెఱఁగమైతి మిద్దరి మీ పొందులు
సన్నలాను చాయలాను సరి గానుపించీని ॥ పల్లవి ॥

ఇచ్చిన చన వెట్టిదో యీపెకు నీవు నేఁడు
పచ్చిదేర నవ్వు నవ్వి పచారించీని
కచ్చుపె ట్టైప్పటనుండి కాచుకున్నదో నీకు
యిచ్చలఁ దన తమక మిప్పుడే చూపీని ॥ యిన్నాళ్ళు ॥

పలుమారు మీలో నొకఁటా ట్లవి యెట్టివో
మలసి యీకె నీతో మాటలాడీని
వెలలేని వలపుల వేడుక లింకా నెన్నో
కలువపూవుల వేసి కాంతాళించీని ॥ యిన్నాళ్ళు ॥

తనివోని యాసోదము తన కెంత గద్దో కాని
చనుఁగవఁ బెనగుతా సాము సేసీని
ననుఁ గూడితి వింతలో నమ్మించి శ్రీవేంకటేశ
నను పెంతో తాను గోరు నాఁటించీని పైని. ॥ యిన్నాళ్ళు ॥ 301

రీతిగౌళ

యేల మమ్ము రేఁచేవు యేమనవచ్చును నిన్ను
యేలుకొందువు గాని మాయింటికి రావయ్యా ॥ పల్లవి ॥

వాకుచ్చి నీతో నేను వక్కణగా మాటాడఁగా
నీకు [1] దేవులైనవారు ని న్నేమందురో
మేకులకు నీతో నేను మేలములాడఁగాను
కాకరితనాల నవ్వి కమ్మటి సాదింతురో ॥ యేల ॥

చేతులు చాఁచి నీకు సేవలు నేఁ జేయఁగాను
నీ తగులు గలవారు ని న్నేమందురో
కాతరించి నీ మొగమే కనుపెట్టి చూడఁగాను
యేతులకు జంకించి యెంత అట్టు సేతురో ॥ యేల ॥

1. తే. పా. – దేవులైన.

గట్టి నా చన్నుల నొత్తి కౌఁగిట బిగించఁగాను
నెట్టన నీయింటివారు ని న్నేమందురో
ఇట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్నింతలో
దిట్టతనములవా రెంతేసి చెనకుదురో. ॥ యేల ॥ 302

ఆరభి

నీకు నింపైనవారినే నేము పొగడేముగాక
పైకొలిపిన వలపు పనికి వచ్చీనా ॥ పల్లవి ॥

మనసు వచ్చినవారే మంచి గుణములవారు
కనుపట్టినవారే చక్కనివారలు
యెనయని వనితల నెందరి నీకుఁ జెప్పినా
పెనఁగులాటే కాక ప్రియ మయ్యీనా ॥ నీకు ॥

నీవు సరసమాడిన నెలఁతలే జాణలు
కావలసినవారే నిక్కపుఁ జుట్టాలు
వేవేల నెందరి నెంత వేడుకకుఁ జూపినాను
దావతి పడుటే కాక తమి వుట్టీనా ॥ నీకు ॥

యిట్టె నీమన్ననగల యింతులే భాగ్యవతులు
పట్టి నీ వేలినవారే బలవంతులు
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్నుఁ గూడితివి
కట్టఁగడ వా రెరవే కాక యితవయ్యీనా. ॥ నీకు ॥ 303

భూపాళం

యెట్టు మఱవఁగ వచ్చు నిటువంటి నీ గుణాలు
చుట్టరికమే మాకు చొక్కపు నిధానము ॥ పల్లవి ॥

యెనసిన రమణుఁడు యింపుతోడ నొసగిన
చనవే సామ్రాజ్యము సతులకును
తనివోక సారె సారెఁ దమితోడఁ జూచేటి
కనుచూపులే నిత్యకల్యాణములు ॥ యెట్టు ॥

మొగ మెత్తి నాయకుఁడు మోహముతోఁ జల్లేటి
నగవె కోటిలాభము నాతులకును
చిగిరించే యాసతోడ చేసన్న చెనకులు
నిగిడించే సరసము నిండుకొన్న సంపదా ॥ యెట్టు ॥

పాటించి విభుఁడు తానే పైకొని కౌఁగిలించే
కూటమే నోముఫలము కొమ్మలకును
యీటుతో శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
చాటువైన యీ రతులే సకల భోగములూ. ॥ యెట్టు ॥ 304

శుద్ధదేశి

మామాట నమ్మదు నీ మతకానకు లోనంటా
చేముట్టి బుజ్జగించి చెక్కునొక్కవయ్యా ॥ పల్లవి ॥

మంతనాన నీ వాపెతో మాటలాడినమాటా
యింతలో నెవ్వరు చెప్పి రీకెకు నేఁడు
చింతించి యందుకుఁగాను చెక్కుచేతితో నున్నది
సంతోసపడ నాన లిచ్చుటఁ బెట్టుకోవయ్యా ॥ మామాట ॥

కుప్పళించి నీ వాకెఁ గూడిన దంతపుటిల్లు
యిప్పుడే యెవ్వరు చూపి రీపెకు నేఁడు
చెప్పరాని కాంతతోడ సిబ్బితి పడినందుకు
తప్పు దీర ముందరికేఁ దడవ ననవయ్యా ॥ మామాట ॥

ఆపె చేతివుంగరము అట్టే నీ వేల నుండఁగా
యేపున నెవ్వ రిచ్చిరి యీపెకు నేఁడు
యీపొద్దు నీవు గూడఁగ నిచ్చకముతో నున్నది
చేపట్టి శ్రీవేంకటేశ సేదలు దీర్చవయ్యా. ॥ మామాట ॥ 305

గుజ్జరి

రావే వో చెలియా రఘునివద్దకి
యీవల నితని నేమీ నెగ్గు లెంచఁ దగదు ॥ పల్లవి ॥

యెంచరాని మచ్చరము లెన్నెన్ని గలిగినాను
మంచిమాట లాడితేనే మతి గరఁగు
పంచబాణుశరములు పైకొని యెంతవచ్చినా
అంచలఁ గూడుకొంటేను అంటవు విరహులా ॥ రావే ॥

చేయరాని చేఁత లేమిసేసినవి గలిగినా
చాయలకు నవ్వితేనే చవి వుట్టును
పాయక చంద్రకళ లేపాటి వేఁడి చూపినాను
చేయారఁ గూడితే నేమీఁ జేయవు విరహులా ॥ రావే ॥

తనివోని తమకము తగ నెంతఁ గలిగినా
పెనఁగినంతటి మీఁదఁ బ్రియము లౌను
మును కోవిల కూఁతలు ముంచినా శ్రీవేంకటేశుఁ
డెనసె తామూఁ గూడితే నెంచవు విరహులా. ॥ రావే ॥ 306

462-వ రేకు రామక్రియ

యెక్కడి కెక్కడ వల పెందెందు [1]మోచివున్నది
చొక్కపు వేడుక లివి చూడరమ్మ చెలులూ ॥ పల్లవి ॥

చనుఁగొండల నడుమఁ జంద్రోదయ మాయ
వెనకఁ జెక్కులవెంట వెన్నెల గాసె
మునుకొని ఇందరము మొగములు చూచుకొంటే
తన కేల సిగ్గువడఁ దరుణికినీ ॥ యెక్కడి ॥

దొరసి మోముఁదమ్మిపై తుమ్మెదలు చెలరేఁగె
గరిమ ముక్కునఁ దావిగాలి విసరే
అరు దందె మనలోన నందుకుఁగా మెచ్చితేను
సిరసు వంచుకో నేలే చెలియకును ॥ యెక్కడి ॥

వావిరి మెఱుఁగుమేన వానలు గురియఁ జొచ్చె
శ్రీవేంకటేశుఁ డింతలోఁ జేరి కూడెను
యీవేళఁ దమ కిందర మితవులు నెరపితే
భావించి చూడఁగ నేల పడఁతికిని. ॥ యెక్కడి ॥ 307

---

1. తే. పా. – మోంచి.

సామంతం

యేమని విన్నవించేను యిన్నీ నాతఁడే యెఱుఁగు
వోముచుఁ దా మన్నించేది వొక్కటే గుఱుతు ॥ పల్లవి ॥

మలసి మాటలాడితే మఱి యెన్నైనాఁ గలవు
కలసి పొందు సేసితే కాంక్ష తీరదు
చెలరేఁగి చెప్పితేను శేనాశేన ప్రియములు
వలపుల కెందుఁ గడవర లేదే చెలియా ॥ యేమని ॥

కన్నులఁ జూచేనంటే కమ్ముకొనీ వేడుకలు
యెన్నుకొంటేఁ దలపోఁత లింతా మోఁతలు
వున్నతి మెఱసితేను వుడివోదు తమకము
వెన్నడించే కోరికకు వెల లేదే చెలియా ॥ యేమని ॥

మంతనమాడే నంటే మతికిఁ దనివి లేదు
చెంత నెంత పాయకున్నా సిగ్గు మానదు
యింతటె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
సంతసపుట్టి రతికి సరి లేదే చెలియా. ॥ యేమని ॥ 308

కన్నడగౌళ

నెలవి నవ్వులతోడఁ జింత లేలయ్యా
చెలఁగి మా మండాటాలు చేకొనరాదా ॥ పల్లవి ॥

విరహపుచెలిలాగు వింటే దోసము గాదు
గిరిగొనఁ గొంత ఆలకించవయ్యా
అరుదుగా విన్నవించే నదేల పరాకు నీకు
అరసి న న్నదేమని యడుగరాదా ॥ నెలవి ॥

ఆసపడ్డసతితో మాటాడితే దోసము గాదు
లేసుపెదవులు గదలించవయ్యా
చేసూటినే చూపెను సిగ్గు లిదేఁటికి నీకు
నేసపాలు వట్టుకొని శిరసెత్తరాదా ॥ నెలవి ॥

అండనున్న యీ లేమ నంటితే దోసము గాదు
నిండుఁ గౌఁగిట నీవు నించవయ్యా
కొండల శ్రీవేంకటేశ కోరి యలమేల్మంగను
దండిగా నేలితి విట్టె దయ సేయరాదా. ॥ నెలవి ॥ 309

ముఖారి

యెఱుఁగమి సేసుకొన నేఁటికే నీకు
యెఱుకతోనే చనవియ్యవయ్యా ॥ పల్లవి ॥
చిలుకుఁజూపులతోడ నెలవి నవ్వులతోడ
నిలుచున్న దెవ్వతో నీ ముందరను
మొలకచన్నులు గొంత మొనలు గదలఁగాను
పొలసీ నప్పటి నిన్నుఁ జూడవయ్యా ॥ యెఱుఁగ ॥
తీగెమాట లాడుకొంటా తేరి సన్న సేసుకొంటా
బాగుగా నెవ్వతో నీపక్క నున్నది
చేగదేరి పొనగోరి చిమ్ము లమరఁగాను
సోగచేతులు చాఁచీని చూడవయ్యా ॥ యెఱుఁగ ॥
విరులు గానుక యిచ్చి వేమారుఁ గొచ్చి కొచ్చి
పరగఁ గొలువుసేసెఁ బాయ కెవ్వతో
యిరవుగ శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సొరిది నాపెమొగము చూడవయ్యా. ॥ యెఱుఁగ ॥ 310

నాదరామక్రియ

యింక నేలే వెఱపు యింత సేసే నావిభుఁడు
లంకె లౌనరెను మా లాగు లెల్లా మంచివే ॥ పల్లవి ॥
చనవు గలుగువారి చరిత లెల్లాఁ జెల్లు
మన సొక్కైనవారి మాట లీడేరు
తనివిఁబొందినవారి తలఁపులు చక్కనుండు
ననిచినవారి సన్నలు చవు లవును ॥ యింక ॥

అందిపొందినవారి ఆస లిట్టే నెరవేరు
విందువినోదపువారి వేడుక మేలు
కందువ చుట్టపువారి కాఁపురాలు తలకూడు
చందపు వయసువారి సరసము మెఱయు ॥ యింక ॥

పాయక కూడినవారి పంతములు గొనసాగు
దాయగాండ్లైనవారి తగులు మెచ్చు
యీయెడ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలే
చాయకు వచ్చినవారి జాడలు ఫలించును. ॥ యింక ॥ 311

తెలుఁగుఁగాంభోది

నన్ను మన్నించె నాతఁడు నమ్మితి నేను
యెన్నికగా నిఁకఁ జెలు లేమిఁ జెప్పకురమ్మా ॥ పల్లవి ॥

అంకించి నే నాతని నట్టే వేఁడుకొనేఁ గాని
జంకించ నోపనమ్మా సారె సారెకు
మంకుదాన నౌదుఁ గాని మనసు మోకదాకిరి (?)
కొంకక యేమి సేసినాఁ గోపగించ నమ్మా ॥ నన్ను ॥

పొలసి విభునితోడఁ బొందు సేయఁగలఁ గాని
అలుగనేర నమ్మా యెంతైనా నేను
చలమరి నౌదుఁ గాని సాదించితి వినయము
చెలి నెందుండి వచ్చినా వెంగె మాడనమ్మా ॥ నన్ను ॥

శ్రీవేంకటేశుఁ గూడి సేవ సేయఁ గలఁ గాని
కావరించ నొల్ల నమ్మా కాంతాళానను
లావరి నౌదుఁ గాని లలి సిగ్గు నాసొమ్ము
యీవల నన్నేలినాఁడు యెదిరించ నమ్మా. ॥ నన్ను ॥ 312

463-వ రేకు సాళంగనాట

కన్నులు చల్లఁగా నేము గారవించి చూచేము
నిన్ను మెచ్చుచే మేలు నీవే బదుకవే ॥ పల్లవి ॥

గొప్ప లెంత లైనాను గుబ్బలకే మేలు
చిప్పిలెంత రసమున్నఁ జిగురుమోవికే మేలు
క ప్పెంత గలిగినా కడుఁ గొప్పునకు మేలు
నెప్పున నెంత చూపేవు నీవే బతుకవే ॥ కన్నులు ॥

నెమ్మిఁ గళ లెన్నియైనా నీమొగానకే మేలు
చిమ్ము నవ్వు లెన్నియైనా నెలవులకే మేలు
పమ్మి నడ లందమైతే పాదములకే మేలు
నిమ్మలాన మెఱసేవు నీవే బతుకవే ॥ కన్నులు ॥

పిన్ననడు మెట్లున్నా పిఱుఁదునకే మేలు
యెన్ని సింగారాలైనా నిట్టె నీ మేనికే మేలు
వన్నెల శ్రీవేంకటేశ్వరుఁడ నాకోరిక
నిన్ననే యీడేరించితి నీవే బతుకవే. ॥ కన్నులు ॥ 313

ప్రతాపనాట

వొక్క గరిడీలోనే వోటపంతా లిఁక నేల
చిక్కించి యిద్దరి సరిసేసేము గాని ॥ పల్లవి ॥

వెలఁది బొమ్మలనే విలువిద్య సాము సేసె
చిలుకుటమ్ములందుకు చిమ్ముఁజూపులు
చలపట్టి యాపె చను సంగడా లెత్తఁగరాదా
చెలఁగి యిద్దరి సరిసేసేముగాని ॥ వొక్క ॥

తరుణి కొనగోరనే దారకత్తి సాముసేసె
అరిది ముంజేయి కొర డందుకుఁ దోడు
సరిఁ బిఱఁది యరిగె సాదించి పట్టఁగరాదా
సిరుల నిద్దరి సరిసేసేముగాని ॥ వొక్క ॥

కాంత నీతో కౌఁగిటిలో కంబముసాము సేసె
అంతటా నీవు పెన్నుద్ది వందు కైతివి
పంతపు శ్రీవేంకటేశ పచ్చిమోవి మోపరాదా
చెంతల నిద్దరి సరిసేసేము గాని. ॥ వొక్క ॥ 314

నట్టనారాయణి

నీ వేపాటి మన్నించినా నేఁడు నాకుఁ బదివేలు
చేవ దేర మోహించితి చింత లేల నాకు ॥ పల్లవి ॥

చిలుకుఁజూపుల నిన్నుఁ జిమ్మి చిమ్మి చూడఁగ
చలమరిదాననా సరిదాననా
అలపులా సొలపులా ఆసలఁ బెట్టె నంటే
సలిగెలు నెరపేనా చవులు చూపేనా ॥ నీవే ॥

చాయలకు మాటలాడి సరసము పచరించ
మాయదారిదాననా మంకుదాననా
పాయపుమదాన నీతో పంతము సాదించే నంటే
నాయిచ్చల మెఱసేనా నటన సేసేనా ॥ నీవే ॥

[1]కఱకఱిఁ బెట్టి నిన్ను కౌఁగిట బిగించే నంటే
మెఱమెచ్చుదాననా మేనదాననా
యెఱఁగితి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
మఱుఁగులు పెట్టేనా మరి కొసరేనా. ॥ నీవే ॥ 315

కేదారగౌళ

ఆతఁ డెంత నే నెంత అవుగడే చెలులాల
యీ తలఁపులే పతికి నిట్టే విన్నవించరే ॥ పల్లవి ॥

చిప్పిల నవ్వఁగఁబోతే సిగ్గులు రేఁగవా
దప్పికి [2]మో వడిగితే దగ దొట్టదా
కొప్పు వంచి మొక్కఁబోతే కురియవా చెమటలు
అప్పుడే సరసమాడ నమరునా నాకు ॥ ఆత ॥

మాటలాడఁ బోతేను మర్మాలు సోఁకవా
కాటుకకండ్లఁ జూచితే కప్పదా తమి
నీటునఁ బెనఁగఁబోతే నిండుకోవా పులకలు
కూటమికిఁ జేయి చాఁచఁ గూడునా నాకు ॥ ఆత ॥

1. తే. పా. – కఱకరి, 2. తే. పా. – మోవెడిగితే.

చన్నుల నొత్తఁగఁ బోతే జడియవా మఱపులు
మిన్నక గోర నంటితే మించదా దయ
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడే
సన్నల నే బత్తి చూప సంగతే నాకూ. ॥ ఆత ॥ 316

భైరవి

అటు గాన పతియడ కవుఁగాము లెంచరాదు
యెటువలెనైనాను యెనయుటే మంచిది ॥ పల్లవి ॥

తలఁపులో తమకము తనివిఁ బొందఁగ లేక
అలుగఁబోతే తాప మధిక మౌను
మొలచిన కోరికలు ముగియించుకొనలేక
చలము సాదించే నంటే చవులు గావు ॥ అటుగాన ॥

వెక్కసపు వలపుల వేడుక చెల్లించలేక
కక్కసాన దూరఁబోతేఁ గలఁగు మది
దక్కిన చుట్టరికము తాఁ దగులు నేసుకోక
నెక్కొన రట్టు నేసితే నేరుపు గాదు ॥ అటుగాన ॥

కాఁగిటిలోపలి మేలు కడఁగి భోగించక
మాఁగబెట్టి వూరకుంటే మంకు దీరదు
యేఁగి వచ్చి శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్నుఁ గూడే
చేఁగదేర నవ్వే నంటే సిగ్గు తరి గాదూ. ॥ అటుగాన ॥ 317

శ్రీరాగం

నేనే భాగ్యమంతురాల ని న్నేమని పొగడేను
పూని నేఁ దలఁచఁగానే బోరున వచ్చితివి ॥ పల్లవి ॥

వేడుక నామదిలోని విరహపుకాఁక మాన్పె
జాడతో నీ నెలవిపై చల్లని నవ్వు
వాడలో ని న్నెనసిన వట్టి తహతహ మాన్పె
పీడెపు నీ మోవితోడి వింత వింత మాటలూ ॥ నేనే ॥

అగపడి నీవు రాని అందోళ మెల్ల మాన్పు
తగిలి నను( జూచే నీ దయ చూపు
చిగిరించే నా మై కన్యసిగ్గు లెల్లా మానుపు
సొగిసి నీ కొనగోరి సో(కుల చెనకులు ॥ నేనే ॥

మునుకొని నే( గోరే ముచ్చటెల్లా మానుపు
ననిచి నన్ను( గూడే మన్నన కా(గిలి
యెనసితి వీలాగున యిట్టే శ్రీవేంకటేశ
దినదిన భోగాల( దీరవు నీ రతులూ. ॥ నేనే ॥ 318

464-వ రేకు భైరవి

యెఱు(గనా నే నేమైనా యింతులాల నావిభుని
నెఱవుగా వెంగేలు నే నే లాడేనే ॥ పల్లవి ॥

మనసురా నేవసేసి [1] మాటలాడే యా(టదాని(
గను(గొంటే దయవుట్టు(గాక పతికి
పెన(గి పెన(గి వట్టి బిగువులు బిగిసితే
యెనసునా పొందులు యెరవులే కాక ॥ యెఱు(గనా ॥

అతివినయాలు చూపి అండనున్న యా(టదాని
రతి వేడుకొ( గాక రమణునికి
చతురతలు మెఱసి సణ(గులు చల్లితేను
తతి నియ్యకోలౌనా తడ(బాటేకాక ॥ యెఱు(గనా ॥

మా(గిన మోవి యిచ్చి మరిగిన యా(టదాని
కా(గిలింపొ( గాక శ్రీవేంకటపతికి
చే(గదేర నన్ను( గూడె చే(త లెవ్వతె సేసినా
లో(గక వెల్లివిరౌనా లోలోనే కాకా. ॥ యెఱు(గనా ॥ 319

కాంబోది

చూడ నీ కెట్టున్నదో నా సొబగు నీకు
వేడుక సేసీ నాకు విభునిపై తల(పు ॥ పల్లవి ॥

1. తే. పా. – మా(ట.

చెక్కుపైనే చేయిగాని చిత్తములోపలఁ దానే
యెక్కడిదే నాకుఁ జింత ఇంతలోఁ జెలి
ముక్కుపైనే వేలు గాని ముంచి నూర్పు దనకుఁగా
నెక్కొన నాపై నేదే నివ్వెఱఁగు నేఁడు ॥ చూడ ॥

పానుపుపై మేను గాని పలు కాతనిపై రెంచి
అనుక యేద నున్నదే అలపు నాకు
వీను లాస కొల్పఁ గాని విని కాతనిగుణాలే
తానకమై మరి యేదే తడఁబాటు ఫేఁడు ॥ చూడ ॥

చూపులే దవ్వులు గాని చుట్టరికము చేరువ
యేపొద్దు నిఁక నేదదే యెరపు మరి
యేపున శ్రీవేంకటేశుఁ డితఁడే తా నన్నుఁ గూడె
పైపై నెందున్నదే పరాకు నేఁడు. ॥ చూడ ॥ 320

వసంతవరాళి

యెంత వొడఁబరచీని యీతఁడు నన్ను
వింత యేదే యిందులోను విచారించితేను ॥ పల్లవి ॥

తానన్ను మన్నించినాఁడు తన దేవులను నేను
యేను సేసే విన్నపము లిఁక నేఁటివే
మానఁడు నాపై బత్తి మరిగితి ముందే నేను
అనుకొని కొసరి నే నడిగేదేమే ॥ యెంత ॥

సేసవెట్టెఁ జేతులార శిరసు నేనూ నొగ్గితి
ఆసలెల్లా నెరవేరే నడ్డ మేదదే
సేసినాఁడు నాకు మేలు చిత్తము తనకు దక్కె
యేసుద్దులు నే నిఁక నెచ్చరించే దేమే ॥ యెంత ॥

మెచ్చి నన్నుఁ గౌఁగిలించె మీటుగుబ్బల నొత్తితి
అచ్చమాయఁ జుట్టరిక మరయ నేదే
కొచ్చి శ్రీవేంకటేశుఁడు కూడె నేనూఁ దనిసితి
యిచ్చకపు తనమన సెఱిఁగే దేమే. ॥ యెంత ॥ 321

బౌళిరామక్రియ

అన్నిటా సంతోసమె అందుకే మీరేవయ్యా
మన్ననలో నీ వెంత మరిగించినాను ॥ పలవి ॥

యెగ్గుపట్ట బుద్ది గాదు యిచ్చకురాలఁ గనక
దిగ్గన నీ వేవనితఁ దెచ్చుకొన్నను
సిగ్గువడ బుద్ది గాదు సేవకురాలఁ గనక
వొగ్గి నీ వెంత పచ్చిగ నుదుటు లాడినను ॥ అన్నిటా ॥

అట్టు సేయ బుద్ది గాదు చుట్టపుదానఁ గనక
తొట్టి మరి నీ వెవ్వరితోడ నవ్వితా?
గుట్టు చూప బుద్ది గాదు కూడిమూడి వుందుఁగాక
నెట్టన నేడ సుద్దులు నీ వడిగినాను ॥ అన్నిటా ॥

వింత సేయ బుద్ది గాదు వేడ్కలో సతిఁ గనక
సంతకూటములను వేసాలు సేసేనా
ఇంతలో శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
పంతమాడ బుద్ది గాదు పక్కన మెచ్చినాను. ॥ అన్నిటా ॥ 322

శుద్ధదేశి

యిది యేమయ్యా నీవు యీపె నేల వొరసేవు
మదిరాక్షి వొడికము మరి నీ వెఱఁగవా ॥ పల్లవి ॥

వేడుకకత్తెయైనది వెక్కసాన నవ్వుఁగాక
వాడికైన యిల్లాలికి వరుసా యిది
తోడ నీ కితవైతే సంతోసించుకొందుగాక
వాడలోని సతులకు నాడికలై వుండగా ॥ యిది ॥

వెలియాలైనది నీతో వింతమాట లాడుఁగాక
కులకాంతకైతే నింత గొరబు గద్దా
చలివాసి తిరిగేటి జాణవు నీ కింపుగాక
యిలలోని కాంతలకు యెగ్గులివి గావా ॥ యిది ॥

ఆసపడి వచ్చినది అన్నిటాఁ జెనకుఁ గాక
వాసితోడి గరితెకి వేసా లేఁటికే
నేసవె ట్టికె నేలితి శ్రీవేంకటేశుఁడ నేఁడు
రాసికెక్క నిటువంటి రతి మెచ్చు గాదా. ॥ యిది ॥ 323

భైరవి

వలపెల్లా రాసివడే వనిత వేఁడుకొనీని
చల మేల సాదించేవు చన వియ్యవయ్యా ॥ పల్లవి ॥
మాటలఁ దేనెలు గారీ మగువకు నీ యెదుట
కోటిసేయఁ బెట్టినట్టి కొప్పు జారీని
వూటలుగాఁ బెం జెమటలూరీని మేన నెల్లా
యేఁటికి నలయించేవు యియ్యకొనవయ్యా ॥ వలపె ॥
చెక్కుళ్ళ జవ్వాది చిందె చేరి నీకు మొక్కఁగాను
గక్కన గుబ్బలు రాసీ కసుగందిని
తక్కక నిన్నుఁ జూచి సంతస మంది మదిలోన
తక్కుల నేల పెట్టేవు దయసేయవయ్యా ॥ వలపె ॥
నెమ్మిఁ బోఁకముడి వీడీని కొలువు సేయఁగాను
చిమ్ముఁ జెనకులచేత సిగ్గు లూఁదీని
నెమ్మది శ్రీవేంకటేశ నీ వింతలో నేలితివి
సమ్మతాయ నిటులానే సమకూడ వయ్యా ॥ వలపె ॥ 324

465-వ రేకు సావేరి

కాంతపొరుగు పోరచి గంటివా వోయి
యింతలోన నీ చిత్త మెట్టున్నదో కాని ॥ పల్లవి ॥
చేరి నీతో మాటాడఁగా చెక్కులెల్లాఁ జెమరించె
గారాపు నీ చెలిలాగు గంటివా వోయి
సారె సారెఁ జూడఁగాను జారీఁ బయ్యదకొంగు
ఆరితేరి యెటువంటి ఆసోదమో కాని ॥ కాంత ॥

చెలరేఁగి నిన్నుఁ జూచి చిత్త మెల్లాఁ గరఁగిని
కలికిజాణతనాలు గంటివా వోయి
నిలువునఁ జొక్కి చొక్కి నివ్వెఱఁగు నొందీని
తలపోఁత లెందు మోవఁ దలఁచేనో కాని ॥ కాంత ॥

తతి నీ పాదా లొత్తి తనివోక కొసరీని
కతకారితనములు గంటివా వోయి
యితవై శ్రీవేంకటేశ ఇంతలో నన్నేలితివి
మతిలోనఁ దా నెంత మరిగినో కాని. ॥ కాంత ॥ 325

హిందోళం

చెలియరో నీ వేల చింతించేవే
వలెనంటే నీ విభుఁడు వచ్చీఁ దా నీడకే ॥ పల్లవి ॥

వలపు గలిగితేను వాడికలూఁ దానే వచ్చు
తలఁపు గలిగితేను తమి రేఁగును
పిలుపు గలిగితేను ప్రియములూఁ బెనగొను
చెలిమి గలిగితేను చేఁతలూ నీడేరును ॥ చెలియ ॥

మాటలు గలిగితేను మనసులూ సమ్మతించు
కూటమి గలిగితేను కోరిక నిండు
చోటు గలిగినచోట సొలపులూ నింపౌను
సూటియై రాక [1]గలిగితే సులభమే భోగము ॥ చెలియ ॥

ననుపు గలిగితేను నవ్వులు చందమౌను
చనవు గలిగితేను చవియౌ మోవి
యెనసీ శ్రీవేంకటేశుఁ డింతలోనే వచ్చి నిన్ను
తనివి గలిగితేను దక్కు నేర్పు లెల్లనూ. ॥ చెలియ ॥ 326

అమరసింధు

పొంచి నీ వే లాతనికి పూనుక [2]మాటలాడేవే
యెంచి చూడ రమణుని కిన్నియు నితవులే ॥ పల్లవి ॥

1. తే. పా. – గలితే, 2. తే. పా. – మూంట.

పంతము లాడుకొందురు పదఁతులు సారెసారె
చింతలఁ జన విచ్చిన చెలువునితో
వంతులును మీఱుదురు వాసితో నొక్కొకవేళ
వింతలైన మన్ననలు వెసఁ జల్లేచోటను ॥ పొంచి ॥

వాడివట్టి తీతురు వుదుటున నవ్వుదురు
వాడబాటులు గలిగివుండే కాంతలు
[1]చిడిముడి జంకింతురు చేతికి లోనైనప్పుడు
బడివాయక పొందులు పరగేటిచోటను ॥ పొంచి ॥

చేముంచి పెనఁగుదురు చెక్కు నొక్కి కూడుదురు
ప్రేమతో సేసవెట్టిన పెండ్లికూఁతులు
ఆముక శ్రీవేంకటేశుఁ డాతఁ డిట్టే యీకెఁ గూడె
నేమము లెల్లా నీడేరు నిందుకొన్నచోటను. ॥ పొంచి ॥ 327

ముఖారి

మగఁడు త న్నొల్లకుంటే మరి మమ్మేల దూరీనే
జిగి మీరైనా బుద్ధి చెప్పరే చెలులు ॥ పల్లవి ॥

చెలరేఁగి యందరితోఁ జెప్పుకొనే సుద్దులు
చలివాసి చల్లేటి సణఁగరాలు
పలుకుఁ బంతాలలోని పచ్చి వెచ్చి వెంగేలు
[2]వెలయించీ నీకెచేత వింటిరటే చెలులు ॥ మగఁడు ॥

వుమ్మగిలుఁ జెమటతో నుడివోని జంకెనలు
సమ్మతించక వినేటి చండితనాలు
చిమ్ముఁ జూపులతోడఁ జేతులు చాఁచే సన్నలు
సొమ్మల మురిపెములుఁ జూడరే చెలులూ ॥ మగఁడు ॥

చీటికి మాటి కింతలో చీఁదరగొన్న మొక్కులు
కాటుకకన్నుల యీకె కొంతాళాలు
మేటి శ్రీవేంకటేశుఁడు మిక్కిలి నన్నేలినది
తేట లెల్ల మాయ మీరు తెలియరే చెలులూ. ॥ మగఁడు ॥ 328

1. తే. పా. – చిదుముడి, 2. తే. పా. – వెలఇంచి.

పాడి

కోరికె లీడేరె నింకా గొసరు లేలే
యీరీతి నితఁడు నీవు నెనయుట గాకా ॥ పల్లవి ॥

తలఁచిన తలఁపులు దైవారి లోలోన
వలచిన వలపులు వాఁట మాయను
మొలచిన చన్నులు మోసులెత్తెఁ బయ్యదలో
యెలమిఁ దెరమఱుఁగు లింక నేలే నీకు ॥ కోరికె ॥

జవ్వనమదము మేన జారీఁ జెమటలై
నవ్వులు నెలవులను నారుకొనెను
పువ్వులతోడి తురుము బుజముపై వీడుపడే
యివ్వల నీ తమి దాఁచ నిఁక నేలే నీకు ॥ కోరికె ॥

సురతపుటాసలు చూపులలోఁ బెనగొని
గరిమఁ బొందులు పులకలఁ జూపెను
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోన నిన్నుఁ గూడె
యెరవుల నిండు సిగ్గు లిఁక నేలే నీకు. ॥ కోరికె ॥ 329

సామవరాళి

యెదమాట లెందాఁక నేమిటికిని
బడివాయకుండితేను ఫల మీడేరీని ॥ పల్లవి ॥

భావించుకొనినఁ గాని పల్లవించదు మనసు
కైవసమైనఁగాని కాంక్ష దీరదు
మోవఁ బెనఁగినఁగాని మొనయవు వేడుకలు
రావే వో చెలియా రమణునికడకు ॥ యెద ॥

మొగము చూచినఁగాని మోహములు దెలియవు
నగినఁగాని తలఁపు నాఁటు కొనదు
తగిలి పిల్చినఁగాని తనివోదు తమకము
మగువ నీ విఁక రావే మన్నించీ నీవిభుఁడు ॥ యెద ॥

సరస మాడినఁగాని చవి వుట్టదు కూటమి
వొరసినఁగాని పంత మొనగూడదు
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్ను నేలే
మరిగి యిట్టే రావే మది నుబ్బి నితఁడూ. ॥ యెద ॥ 330

466-వ రేకు మాళవిగౌళ

ఎట్టి వేసాలు సేయఁగ వద్దు గాక ,
చుట్టముఁ జేసుక రాఁగా సూడువట్టేనా ॥ పల్లవి ॥
మంతనాన నాతఁడు నా మాటలోనివాఁ డంటా
యెంత వుప్పతించేవే యేమే నన్ను
పంతగత్తె వంత యైతే పతిని నీయింటికే
వంతుకుఁ బిలుచుకోఁగా వద్దనేనా నేను ॥ ఎట్టి ॥
చెలరేఁగి యీతఁడు నా చెప్పినట్టు సేసునంటా
చలపట్ట నేలే యేమి సాదించేవే
బలవంతురాలవై తే పైకొని యీతని నీవు
యెలయించి తియ్యఁగా న దేమనేనా నేను ॥ ఎట్టి ॥
కరదువ నాతఁడు నన్నుఁ గౌఁగిలించుకొనే నంటా
గొందినుండీ న న్నేఁటికిఁ గొనియాడేవే
యిందరిలో దిట్టవైతే నిప్పుడు శ్రీవేంకటేశు
సందుకొని కూడఁగాను జంకించేనా నేనూ. ॥ ఎట్టి ॥ 331

పూరిబి

కన్నె ముద్దరాలు కసుఁగాయవంటిదీ
వున్నతి మెల్లనే తేనె లుట్టిపడీఁ గాకా ॥ పల్లవి ॥
సిగ్గుతోఁ దలవంచఁగా చెక్కు నొక్కె వప్పటిని
అగ్గమైనపూవువంటి అబల యీాకె
వెగ్గలింతురా తొల్లె వేఁడి వేఁడి వలపిదీ
బెగ్గిలక చల్లారితేఁ బేరుకొనీఁ గాకా ॥ కన్నె ॥

తెరమాటున నుండఁగాఁ దీసేవు చేయి వట్టి
వరుస లేఁదీగెవంటి వనిత యీకె
గొరబు సేతురా ఇంత కొత్త కొత్త వయసిదీ
పరువాన వికసించి పరిమళించీఁ గాకా ॥ కన్నె ॥

పక్క నుండఁగా నప్పటి పలుమారుఁ గూడేవు
మిక్కిలిఁ జిగురువంటి [1]మెలఁత యీకె
చొక్కఁజేతురా రతి చూడఁ జూడ చోద్య మిదీ
నిక్కితి శ్రీవేంకటేశ నిండుకొనీఁ గాకా. ॥ కన్నె ॥ 332

మనోహరి

తలవాతిపను లెల్లఁ దా నెఱుఁగును
అలిమలిఁ జెలులాల అడుగరే యాతని ॥ పల్లవి ॥

తా నంపిన వుంగరము తగ నావేల నున్నది
కానుకలు నే నంపేకత లేఁటివే
తానకమై తనమీఁది తలఁపు నా కిచ్చినాఁడు
సానఁ బట్టిన చూపుల సాదించే దేమే ॥ తల ॥

చెప్పి తా నంపినమాట చెవులలోనే వున్నదీ
ముప్పిరిఁ జేసేవిన్నపములు మరేవే
చిప్పిల [2]దొర్లే నేసలు శిరసుపైఁ బెట్టినాఁడు
గొప్ప గొప్ప కన్నులనుఁ గొసరే దేమే ॥ తల ॥

కూటమికి నా కౌఁగిలి గురిగాఁ జేసి వున్నదీ
పాటించి రతులలో నీపంతా లేడవే
యీటుగా శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడినాఁడు
కోటి నేసు నిఁక వేరే కొసరే దేమే. ॥ తల ॥ 333

దేసాళం

యింతేసి కోపను నేను ఇచ్చకమే సేసే నీకు
చెంతల నన్నలయించి సిగ్గులు రేఁచకుమీ ॥ పల్లవి ॥

1. తే. పా. – మెలంత, 2. తే. పా. – దొర్లే.

పంతము గొనే యాఁటది పై పై బిగియఁజొచ్చు
వంతుకు వచ్చినాఁటది వాసు లెంచదు
వింతయైన యాఁటది భావించి గుట్టున నుండు
జంతయైన యాఁటది సాదించును ॥ యింతే ॥

మాయదారి యాఁటది నేమములు చూపఁగవచ్చు
చాయలాఁడే యాఁటది సన్న చేసును
దాయగత్తైన యాఁటది తగిలి పెనఁగవచ్చు
పూయక దూలైనాఁటది పొంచులే వినును ॥ యింతే ॥

గబ్బియైనయాఁటది గక్కనఁ గౌఁగిట నించు
వుబ్బరియైనయాఁటది వొడివట్టును
గొబ్బున శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టే
అబ్బురపుగుణమాఁట దంకెలఁ జంకించును. ॥ యింతే ॥ 334

గుమ్మకాంబోది

యెగ్గో తప్పో యెఱుఁగ నేమి సేతు నయ్య నేను
సిగ్గుతో నుండక నిన్నుఁ జిమ్మి రేఁచవలసే ॥ పల్లవి ॥

విరుల వేసినఁ గాని వేడుకలు రేఁగవు
తెరఁ దీసితేఁ గాని తెలియరాదు
సరస మాడినఁ గాని చవులు వుట్టవు నీకు
యెరవు లేకటుగాన ఇంత సేయవలసే ॥ యెగ్గో ॥

పట్టి పెనఁగక నీకు పరాకులు మానవు
చుట్టరికము చెప్పక సొంపు నిండదు
వొట్టు వెట్టి పిలువక వుదుటు నీకు మించదు
యిట్టె యిందుకుఁగా నిన్నింత సేయవలసే ॥ యెగ్గో ॥

చన్నుల నొత్తి పట్టక సమరతి బెరయదు
కన్నుల జంకించక కమ్మదు తమి
మన్నించి శ్రీవేంకటేశ నన్ను నేఁ దేలితి విట్టె
ఇన్నిటా నాకు నిన్ను నింత సేయవలసే. ॥ యెగ్గో ॥ 335

నాదరామక్రియ

తలపోఁతలే గనము తనివి లేదు
పిలిచేవా రెవ్వరే ప్రియుని నీడకును ॥ పల్లవి ॥

వెన్నవంటిదీ మనసు వేఁడివంటిదీ వలపు
యెన్నరాదు తమియైతే నేమి సేతునే
చన్నులును గొప్ప లాయ జవ్వనము కడు వీఁగు
విన్నవించేవా రెవ్వరే విభునితోనూ ॥ తల ॥

జిగురువంటిది సిగ్గు జీడివంటిది వేడుక
యిగిరించీఁ గోరికలు యేమి సేతునే
నిగిడీ నడియాసలు నిండీ నెదురుచూపులు
తగు లెవ్వరు సేసేరే తగ నా కాతనికి ॥ తల ॥

పచ్చివంటిది కౌఁగిలి పండువంటిది కెమ్మోవి
హెచ్చెను నా చక్కఁదన మేమిసేతునే
యిచ్చ యెఱిఁగి శ్రీవేంకటేశుఁ డిందు వచ్చి కూడె
మెచ్చే వారిఁకనెవ్వరే మే మిట్టే వుండఁగనూ. ॥ తల ॥ 336

467-వ రేకు సామంతం

ఔఁ గా దనవచ్చునా అయిన ట్టయ్యీఁ గాక
కౌఁగిటికి వచ్చేపతికరుణ యెందున్నదో ॥ పల్లవి ॥

చెలులకు బుద్ధి లేదు చిలుకలఁ దిట్టరాదు
యెలమి నారమణుఁడు నింటికి రాఁడు
వలరాజు గుఱిగాఁడు వంకవోదు పూవుటమ్ము
చెలఁగి విరహ మెంత సేయ నున్నదో ॥ ఔగా ॥

మనసూఁ జుట్టము గాదు మందానిలూ ననరాదు
చన విచ్చి విభుఁడూ నాసలు చూపఁడు
జునుగనీఁడు చంద్రుఁడు సొంపు మాయదు వెన్నెల
తనివోని మోహ మెంత దడ వేఁచ నున్నదో ॥ ఔగా ॥

వయసూ నణఁచరాదు వసంతుఁడూఁ దోడుగాఁడు
ప్రియుఁ డిట్టే వచ్చెనాకు భేదమూఁ గాఁడు
దయతో న న్నేలె నితఁడే శ్రీవేంకటేశుఁడు
నియతి నారతులలో నేరు పెట్టున్నదో. ॥ ఔగా ॥ 337

లలిత

ముక్కుమీఁదివేలితోడ ముందట నుండేఁ గాక
వక్కణగా తనతో నే వాదించ నేలే ॥ పల్లవి ॥

సాకిరి చెప్పి నిజాలే సారెకు నెరపఁగాను
కైకొని వినేఁగాక కా దన నేలే
జోకలుగాఁ దన మేనిచొప్పులు చూపి మోపి
నాకు నాకే సెలవుల నవ్వఁగ నేలే ॥ ముక్కు ॥

వాదివట్టుకొని నన్ను నొడఁబరచి చెప్పఁగా
వడిగా నూఁకొనేఁ గాక వద్దన నేలే
తడఁబడే పెదవుల దప్పికిఁ బన్ని రిచ్చి
అడియాలా లెల్లాఁ దన్ను నడుగ నేలే ॥ ముక్కు ॥

పక్కనఁ దన రాకలు పలుమారుఁ జెప్పఁగాను
లెక్కలు వెట్టేఁగాక లే దన నేలే
ఇక్కువతో శ్రీవేంకటేశుఁడు తా నన్నుఁ గూడె
మొక్కితిఁ దన నేరుపు ముదలించ నేలే. ॥ ముక్కు ॥ 338

రామక్రియ

యెఱుఁగ కడిగితేను యె గ్గాయనా
తఱితో సిగ్గువదేవు తగవా నీవూ ॥ పల్లవి ॥

యెలమి నీవద్దియింతి కే మౌదు వంటేను
అలవోకగాఁ జెప్పె వదేరా నీవు
మలసి మీయిద్దరికి మంచి యీ డౌ నంటేను
సెలవుల నవ్వేవు చేరి యేమీ నీవూ ॥ యెఱు ॥

పొంతనా లిద్దరికిని పొసఁగునా యంటేను
యింతలోనే తలవంచే వేరా నీవు
మంతనాన మీలోని మర్మము లడిగితేను
యెంత నన్నుఁ దిట్టేవు యేలరా నీవూ ॥ యెఱు ॥

కూడిన మీపానుపుపై గుఱుతులు చెప్పితేను
యీడుకు నాతోఁ బెనఁగే విదేరా నీవు
జాడతో శ్రీవేంకటేశ సరి నన్నుఁ గూడితివి
ఆడినట్టే మాఁటాడే వవురా నీవూ. ॥ యెఱు ॥ 339

భవుళి

తలపోఁతలనే నాకు తడఁబడీ వేడుకలు
చెలులాల యేమి సేతు చిమ్మి రేఁగీ మనసు ॥ పల్లవి ॥

చిత్తము రా మాటలాడి చెంగలించఁ జేసీ కదు
బత్తి చూపే దెన్నఁడొకో పతికి నేను
గుత్తపుగుబ్బల నూఁది కొనగోరు సోఁకఁ బాదా
లొత్తే దిక నెన్నఁడొకో వుమ్మగిలీ మనసు ॥ తల ॥

కళ లెల్లా రేఁగఁ దన్ను కౌఁగిలించి పట్టుకొని
వలపించే దెన్నఁడొకో వాని నేను
మొలకనవ్వులు నవ్వి ముప్పిరిఁజూపులు నాఁటఁ
దిలకించే దెన్నఁడొకో తిమిరీ నామనసు ॥ తల ॥

చెమటలు జొబ్బిలించి సిగ్గుదేర రతిఁ గూడి
తమి రేఁచే దెన్నఁడొకో తనకు నేను
సమగతి శ్రీవేంకటేశ్వరుఁడు వచ్చి నన్నేలె
అమరె నెన్నఁడొకో అరుదండీ మనసు. ॥ తల ॥ 340

ఆహిరి

మఱచి వుండఁగ రాదు మఱి తలఁచుకో రాదు
యెఱిఁగెఱిఁగి నాగుణ మింత సేసీ నన్నును ॥ పల్లవి ॥

సారెకు మాటాడే నంటే సంతోసము దొట్టుకొనీ
చేరి మోము చూచేనంటే సిగ్గులు బెట్టు
వూరక వుండేనంటే నుమ్మగిలీఁ దమకము
యీరీతి నితనిపొందు లింతసేసీ నన్నును ॥ మఱచి ॥

చన్నుల నొత్తే నంటే జల్లన మే చెమరించీ
వున్నతి నవ్వే నంటే నొలికీఁ దేనే
పన్ని సన్నసేసే నంటే పరవశములు నిండీ
యిన్నిటా నితనిమేల మింత సేసీ నన్నునూ ॥ మఱచి ॥

యిట్టే కౌఁగిలించే నంటే ఇక్కువలు గరఁగీని
చుట్టమనై మొక్కే నంటే చొక్కీ మనసు
గుట్టున న న్నింతలోనే కూడె శ్రీవేంకటేశుఁడు
యెట్ట నెదుట నా మోహ మెంత సేసీ నన్నును.॥ మఱచి ॥ 341

హిజ్జిజి

రావయ్య నావద్దికి రమణుఁడ నమ్మి నేఁడు
నీ వేమి సేసినాను నిన్ను మారు సేసేనా ॥ పల్లవి ॥

పంతాలకు నెవ్వతైనా పైకొని పెనఁగుఁగాక
చెంతనుండి నే బలిమి సేసేనా నిన్ను
అంతనుండే మాటలాడే వాన వెట్టుకొ మ్మనేవు
యింతటి దొరవు నిన్ను నింకఁ బచ్చిసేతునా ॥ రావ ॥

నవ్వుల నెవ్వతైనా సన్నలఁ గొంగు వట్టుఁగాక
చివ్వన నీకొప్పు నేను చేతఁ దీసేనా
దవ్వుల నేల లోఁగేవు [1]తలఁ పేల పెట్టేవు
పువ్వువంటివాఁడవు పైఁ బుప్పొడి చల్లేనా ॥ రావ ॥

యేతుల నెవ్వతైనా మోవెంగిలి నీకుఁ జేసితే
యీతల నే నటువలె నెమ్మె చూపీనా
ఘాతల శ్రీవేంకటేశ కౌఁగిట బిగించితివి
ఆతుమైనవాఁడవు ని న్నలయించ వచ్చేనా. ॥ రావ ॥ 342

1. వే. పా. – తలు.

468-వ రేకు కేదారగౌళ

రావయ్యా మనవలపు రచ్చల నేల పెట్టేవు
వేవేలు సరసాలకు వేళ లేదా యిఁకను ॥ పల్లవి ॥

ఆడఁగా నాడఁగా మాట లంటుబచ్చలివంటివి
చూడఁ జూడఁ జూపులు చూచి మరపు
యేడ గొలఁదీ యాసల నెందాఁకా వేగించవచ్చు
కూడినకూటములే గురుతులేఁ గాకా ॥ రావ ॥

చేరఁగాఁ జేరఁగా పొందు జిగురుఁగండెవంటిది
కొరఁగొరఁ గొరికే కొండవంటిది
యిరీతిఁ దమకము లెటువలె నాఁపవచ్చు
వారసేయని కౌఁగిళ్ళ నుబ్బు గలుగుఁ గాకా ॥ రావ ॥

పెంచఁగాఁ బెంచఁగాఁ దమి పెనుఁ దొడుసువంటిది
నించ నించ సిగ్గులు వన్నెలవంటివి
యెంచఁగ శ్రీవేంకటేశ ఇట్టే నన్ను నేలితివి
ముంచిన రతులివే మునుకొనుఁ గాకా. ॥ రావ ॥ 343

రామక్రియ

చక్కఁ జూడరాదా ఇంతిజాడలు నీవు
యెక్కడ లేని యాసోద మెంతగద్దో కాని ॥ పల్లవి ॥

చెక్కులఁ జెమట గారీ సేసకొప్పు వెడ జారీ
పక్కన మగువ నీకుఁ బాదా లొత్తఁగా
నెక్కొనఁ గళలు దేరీ నివ్వెఱఁగు లుట్టిపడీ
అక్కరతో నిన్నుఁ జూచేయట్టి నిబ్బరానను ॥ చక్క ॥

చన్నులు గక్కదలీని సంధులు గడు నదరీ
వన్నెల నీ కీపె యాలవట్ట మిడఁగా
నెన్నడుము నసియాడీ నిట్టూర్పులును రేఁగీ
విన్నపాలు నీకుఁ జేసే వేడుకలను ॥ చక్క ॥

వేళ్ళ మట్టెలు వాఁగీ వెస మోవిఁదేనె చిందీ
కొల్లలుగా నిన్ను రతిఁ గొసరఁగాను
అల్లదే శ్రీవేంకటేశ హారములు నులిగొనీ
మెల్లనే నీతోఁ బెనఁగే మెలపునను. ॥ చక్క ॥ 344

పాడి

చెలుల మింతే నేము సిగ్గు మీ కేల
వెలసే మీ సంగాతాలు వేడుకాయ మాకు ॥ పల్లవి ॥
మచ్చికమాటలు నీతో మగువ నేఁ డాడఁ గాను
విచ్చనవిడి వీనుల వింటిమి నేము
రచ్చఁబడి వలపులు రాఁపాయ మీ తలఁపులు
పచ్చిసేసి ఇఁక నవ్వఁ బాడిగాదు మాకు ॥ చెలుల ॥
చనవుతో నాకె నీ సంగడిఁ గూచుండఁగా
కనుఁగవ పండుగగాఁ గంటిమి నేము
పెనగొని వేడుకలు బెరసె మీ వాడికలు
పను లివి మి మ్మడుగఁ బాడిగాదు మాకు ॥ చెలు ॥
నాతిని పానుపు మీఁద ననిచి కౌఁగిలించఁగా
చేతులార నీ సేవ సేసితిమి నేము
యీతల శ్రీవేంకటేశ యిద్దరిమేనులు దాసె
పైతరవై మి మ్మొరయఁ బాడిగాదు మాకూ. ॥ చెలు ॥ 345

సామంతం

యింతితో నలుగకుమీ యెన్నఁడూ నో రమణుఁడ
పొంతచెలులము గాన బుద్దులు చెప్పేము ॥ పల్లవి ॥
కలువలు వంటివే కన్ను లందురు గాని
సొలసి చూచితే నాఁటుఁ జురు కనుచు
తలిరువంటిదే మెత్తని మోవందురు గాని
పలికితే మదనుని పట్టమై తోఁచును ॥ యింతి ॥

జక్కవలువంటివే చన్ను లందురు గాని
పక్కనఁ జూపితేనే భ్రమసు మతి
చక్కెరబొమ్మవంటిది సతిమే నందురు గాని
వొక్కమాటు సోఁకినాను చొక్కించు నా మగుచు ॥ యింతి ॥

తమ్మిపూలవంటివి హస్తము లందురు గాని
కమ్మి కౌఁగిలించుకొంటే కళ రేఁచును
యిమ్మల శ్రీవేంకటేశ యీపె నిట్టే కూడితివి
తెమ్మలై నరతుల నీదేవులై వుండును. ॥ యింతి ॥ 346

శ్రీరాగం

విరహము మీఁదనే వేడుక వెల్లివిరిసీ
నిరతి నెండలలోనే నీడలు గలిగేనే ॥ పల్లవి ॥

చెక్కునఁ బెట్టినచేయి నెలవి నవ్విన నవ్వు
వొక్కమాటే నీకు నెందుండి వచ్చెనే
లక్కవంటి దీ మనసు చొక్కువంటిదీ వలపు
గక్కనఁ బతిఁ గంటేనే కల[1]భెరుకాయనే ॥ విర ॥

మోవిమీఁది వసివాడు మొగముపై చెంగలింపు
యీవల రెండూ జవళి నెట్టు గల్గెనే
పూవువంటిది యాస పూఁపవంటిది పొందు
నీ విభుఁడు రాఁగాను నిండు దోమ టాయనే ॥ విర ॥

చన్నులఁబయ్యెద జారు సరిఁగన్నుఁగవ సిగ్గు
యెన్న నొకటొకటికి నెనయు బెట్టె
యిన్నిటా శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁ గూడే
సన్నల నితనివల్ల సరిబేసు లాయనే. ॥ విర ॥ 347

ఆహిరి

వేగిరించి యాతనికి వేసట సేయకురే
నాగుఋ తెలుఁగుఁ దానే నన్ను నేలీఁ గాని ॥ పల్లవి ॥

1. తే. పా. – చెరకా.

ఆసకొలిపినవాఁడు ఆఁడిఁబెట్టినవాఁడు
 నేసవెట్టి నాపై దయసేయ నేరఁడా
 వాసి యెఱిఁగినవాఁడు వలపు చల్లినవాఁడు
 లాసుకొన్న నన్నుఁ గూడి లాలించీఁ గాక ॥ వేగి ॥

చనవు లిచ్చినవాఁడు చవి మరపినవాఁడు
 చెనకి సంతోసించఁ జేయ నేరఁడా
 వినయ మెఱిఁగి* నవాఁడు వేడుకకు లోనై* నవాఁడు
 మన [1] సెఱిఁగి నన్నిట్టే మన్నించీఁ గాక ॥ వేగి ॥

చెలిమిసేసినవాఁడు చేతికి లోనైనవాఁడు
 తలఁచినప్పుడే నా దండకు రాఁడా
 యెలమి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడే
 పలుమారు నారతులఁ బాయకుండీఁ గాకా. ॥ వేగి ॥ 348

469-వ రేకు సాళంగం

తనకు నాకును జంట తానే యెఱుఁగు నిది
 అనిశముఁ జెలులాల అడుగరే యతని ॥ పల్లవి ॥

కనుచూపులకు జంట కడలేని యాసలు
 మనసుకు జంట నెమ్మదిఁ గోరిక
 తనువుకు జంట కాంతాళపుఁ దమకము
 ననుపులకును జంట నానాభోగములు ॥ తనకు ॥

చక్కఁదనానకు జంట సరసవిహారము
 అక్కరకును జంట అతిమోహము
 చొక్కుపురతికి జంట సొలపుల చిరునవ్వు
 జక్కవ చన్నులకును జంట నిండుఁగౌఁగిలి ॥ తనకు ॥

కలయికలకు జంట కట్టిన కంకణము
 నిలుకడలకు జంట నెక్కొన్న భక్తి
 యెలమి శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్ను నేలే
 తలపోఁతలకు జంట తనివోని వేడుకా. ॥ తనకు ॥ 349

* తే. పా. — నాఁడు, 1. తే. పా. — మనసెరింగి.

ధన్నాసి

నీచిత్త మెట్టున్నదో నే మేమీ నెఱుఁగము
చూచి మా మనసు లైతే చొక్కి కరఁగీని ॥ పల్లవి ॥

సిగ్గరితనాన నిట్టే చెలి తల వంచీఁ గాని
అగ్గమై నీ మోము చూచే ఆస గనము
యెగ్గుపట్టుదువో యంటా నీతల నున్నది గాని
దగ్గరి కౌఁగిలించే తమకమే గనము ॥ నీచిత్త ॥

గోలతనమున నీకె గుట్టున నున్నది గాని
తాలిమి నీతో మాటాడే తమి గనము
గేలిసేతువో యంటా కేలు చాఁచదు గాని
చాలా గుబ్బల నిన్నొత్తే చలములే గనము ॥ నీచిత్త ॥

చిన్నతనమునఁ జేఁత సేయక లొంగీఁ గాని
వున్నతిని రతి రేఁచే వుబ్బు గనము
యిన్నిటా శ్రీవేంకటేశ యిట్టే యింతిఁ గూడితివి
నిన్ను మెప్పించే ననే నేర్పు లింకా గనము. ॥ నీచిత్త ॥ 350

సాళంగనాట

నేనే నీపై వుండఁగాను నేఁడు నీకుగా నిట్టే
పూనుక రా కెటువలెఁ బొంచి వుందు నేను ॥ పల్లవి ॥

వూరఁ గల సతులు ని న్నొడివట్టి తియ్యఁగాను
దూరక ని న్నిట్టే చూతును నేను
వోరి యని కన్నదెల్లా నొకటొకటే యాడఁగ
వారక నేఁ డిపు డెటువలె విందు నేను ॥ నేనే ॥

వాడవారెల్లా నీపై వసంతాలు చల్లఁగాను
వోడక ని న్నొప్పగించుకుందునా నేనూ
వేడుక కెవ్వరైనాను వెస నీతోడ లెక్కఁగా
కూడి యెట్టు వహించుకోకుందుదు నేను ॥ నేనే ॥

సంతకూటపువారెల్లా సారె నీమే నంటఁగాను
పొంత నడ్డము రా కెట్టు పోనిత్తు నేను
యింతలో శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
సంతోసించుకొంటి నిఁక సాదింతునా నేను. ॥ నేనే ॥ 351

శంకరాభరణం

ఆనతీవయ్యా నీ వేళలవి యెట్టో యెఱుఁగము
వూని నిన్ను విచారించ కూరకుండరాదు ॥ పల్లవి ॥

బత్తితో నెవ్వతెమీఁది పరాకున నున్నాఁడవో
హత్తి నే నీవేళ మాటలాడ వచ్చునా
కొత్తగా నేయింతిఁ బిల్చుకొనే నని వున్నాఁడవో
యెత్తి నీ తెరదీసి నిన్నిటు చూడవచ్చునా ॥ ఆన ॥

మఱి యెవ్వతె కీ పొద్దు మాట యిచ్చుకున్నాఁడవో
యెఱుఁగక నీకు వీడె మియ్య వచ్చునా
గుఱిగా నేసతిరాక గోరుక నీ వున్నాఁడవో
తఱితో నిప్పుడు నీపాదము లొత్త వచ్చునా ॥ ఆన ॥

అరుదుగా నెవ్వతెకు నాసపడి వున్నాఁడవో
వరుసకు నే నీతో నవ్వఁగవచ్చునా
ఇరవై శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
మరిగి నీ గుణములు [1] మఱవఁగ వచ్చునా. ॥ ఆన ॥ 352

భైరవి

తా నేల వసివాడీ దగ్గర రమ్మనవే
నేనే వెజ్జరికము నేరుతు నందుకునూ ॥ పల్లవి ॥

యెదిరివారి చూపులు యెంత దన్ను నాఁటెనో
మదనవేదమంత్రాల మంత్రింతునటే
కదియఁగాఁ జన్నులు కాయ మెంత వొత్తునో
గుదిగొనఁ గాంతు నటే గోరివెచ్చకౌఁగిటా ॥ తానేల ॥

1. తే. పా. —మరవంగ.

చెనకేవారి చేఁతల చిత్త మెంత మఱచెనో
మొనగోరి సంజీవి మోపుదు నటే
పెనఁగఁగా మర్మాలు ప్రేమ నెంత గరఁగెనో
తనిపి పేరింతునటే తరితీపు సిగ్గులా ॥ తానేల ॥

మందవారి మాటలు మరులు గొలిపెనో
దిందుపడ వలపుల మందిత్తునటే
అందపు శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
చెందె నన్ను నిఁక నిట్టే సేతు నటే సేవలూ. ॥ తానేల ॥ 353

ముఖారి

అట్టె తానెంత వాఁడైనా నాయఁ గాక
వొట్టుకొన్న మగతన మూర కేలుండీనే ॥ పల్లవి ॥

కన్నుల నింతిఁ జూచితే కలుగుఁ జుట్టరికము
వన్నెలమాట లాడితే వావి గూడును
సన్నలు సేసితేనే సమ్మందము గలసు
పన్ని కాంతలతో నేల పంత మాడీనే ॥ అట్టె ॥

చిఱునవ్వు నవ్వితేనే సిగ్గులు దానే తేరు
మఱుఁగునఁ బొలసి నా మర్మా లంటును
గుఱుతులు వినుకొన్నాఁ గూటములు పెనగొను
యెఱుఁగుదుఁ దననేమ మెంతని చెప్పీనే ॥ అట్టె ॥

కదిసి యెదుట నుంటే కాఁగిటికిఁ జేతులంటు
మదిఁ దల పోసితేనే మరుగుఁ దమీ
యిదివో శ్రీవేంకటేశుఁ డిట్టె తా నన్ను నేలె
చెదరని ప్రియ మెంత చెల్లఁ బెట్టీని. ॥ అట్టె ॥ 354

470-వ రేకు కాంబోది

పతివద్ద నెటువలెఁ బండీనో కాని
కతకారితనముల కసుఁగంద దిపుడు ॥ పల్లవి ॥

కాటుక చెదరకుండఁ గలికి చూపులు చూచి
[1]మాటలాడీఁ బెదవులు మాఁగఁ బెట్టుక
[2]గాటపుఁ గస్తూరిబొట్టెక్కడ మాయకుండా మొక్కె
జూటరి దీనిపగటు చూడరే వో చెలులు ॥ పతివద్ద ॥

కొప్పు జారీ నంటాను కూచున్నది కదలక
వొప్పుగఁ దమ్మ మెదుగకుండా నవ్వీని
విప్పక పయ్యెద నెరిపిరుగకుండాఁ గప్పె
దిప్పకాయ దీనిగుట్టు తెలియరే చెలులు ॥ పతివద్ద ॥

చన్నులు వాలకుండా సారె రవికె బిగించి
సన్న సేసె సింగారము సళ్ళకుండాను
ఇన్నిటా శ్రీవేంకటేశుఁ డితఁడే తన్నుఁ గూడె
వన్నెలాఁడి దీని ఇచ్చ వత్తమే చెలులు. ॥ పతివద్ద ॥ 355

వరాళి

పచ్చిచిగురు వంటిది పాయ మనవే
మచ్చికతో నన్ను నీఁక మన్నించు మనవే ॥ పల్లవి ॥

వలచినవారి నేఁప వల దనవే కడుఁ
గలసినపొందు మానఁగాఁ గా దనవే
పిలిచి వూరకుండేది వెలి తనవే ఆస
కొలిపి కూడకుండితే కొలగాదా యనవే ॥ పచ్చి ॥

తగులై మరి యలుగఁ దగ దనవే
జిగిఁ జెట్టవట్టే గుట్టు చెల్ల దనవే
మొగము చూచి కొంకితే మోస మనవే
నగి చెనకకుండితే నెగు లంటు ననవే ॥ పచ్చి ॥

యెనసేటిచోట సిగ్గు లేఁటి కనవే
గొనకొన్నరతి జాగు గూడ దనవే
ననిచి శ్రీవేంకటాద్రిఁ దనిసితి మిద్దరము
మనసులో తమకము మానుపరా దనవే. ॥ పచ్చి ॥ 356

1. తే. పా. — మాంట, 2. తే. పా. — గాంటవు.

తెలుఁగుఁగాంబోది

చేరి మమ్ముఁ జూచి యేల సిగ్గు వడేవు
గారవించితే దోసమా కాంతను నీ విపుడు ॥ పల్లవి ॥

పాలిండ్లు గానరాఁగా పయ్యద గొంత జారఁగా
సోలి విన్నపాలు సేసీ సుదతి
వాలుఁ గన్నులు దేలించి వడి శిర సెత్తి చూచి
జాలిఁ గూరిమి గొసరీ చనవియ్యవయ్యా ॥ చేరి ॥

చెమటలు గారఁగాను జిగిఁ గళ లుబ్బఁగాను
జమళిఁ బాదా లొత్తీ సకియా
తమి రేఁచఁగా వలపు దైలువారఁగా నవ్వి
సమరతికిఁ బెనఁగీ సమ్మతించవయ్యా ॥ చేరి ॥

కొప్పు పువ్వు లటు రాల కొంకి పోఁకముడి వీడ
నెప్పునఁ గౌఁగిట నించీ నెలఁతా
యిప్పుడే శ్రీవేంకటేశ యీకెఁ గూడి న న్నేలితి
వప్పటి నిన్నానపడీ నాదరించవయ్యా. ॥ చేరి ॥ 357

పాడి

వేఁడుకోఁగాఁ దనమాట విన ననేనా
పోఁడిమితోఁ దన్ను నేను బు ట్టెడిగేఁ గాకా ॥ పల్లవి ॥

బలిమిఁ జేసిన పొందు పస చాలదు
పిలువక వచ్చేరాక ప్రియము గాదు
చలాలకు నవ్వే నవ్వు చవి పుట్టదు
తెలిపి చెప్పరే యీ తెఱఁగు లాతనికి ॥ వేఁడు ॥

మనసురాని మాట మఱువరాదు
ననచని సరసము నాఁటుకొనదు
పనిలేని వినయాలు పాదుకొనవు
వినిపించరే యీ విధము లాతనికి ॥ వేఁడు ॥

ఆసతోఁ జూడని చూపు అంటుకొనదు
వేసరిన రతులకు వేడుక లేదు
సేసవెట్టి నన్నుఁదానే శ్రీవేంకటేశుఁడు గూడే
లాసి తలఁపించరే యీ లాగు లాతనికి ॥ వేదు ॥ 358

సింధురామక్రియ

మాకుఁ దెలియవు మీ మర్మము లెటువంటివో
జోకతో దవ్వులనుండే చూచి తనివాయను ॥ పల్లవి ॥

సిరుల నవ్వుల నాకె సేసిన నిన్నపాలు
తరితీపై యవి నీ చిత్తానఁ బట్టెనా
సరుసఁ గూచుండి యాకు సారె మడి చిచ్చె నీకు
సరసపు వేడుకతో చవు లాయనా ॥ మాకు ॥

సిగ్గులు వడుతా నీచేతి నెటికలు దీసె
అగ్గమై నీలోని యాయాలు ముట్టెనా
నిగ్గుల గోర గీరి నీ తురుము చక్కఁబెట్టె
వొగ్గి నీ మనోరథాలు వొనగూడెనా ॥ మాకు ॥

వొంటినుండి సేయరాని పూడిగా లెల్లాఁ జేసె
జంటలై చుట్టరికాలు సమకూడెనా
యింటనే శ్రీవేంకటేశ యిటు నన్ను నేలితివి
అంటి నీ చిత్తమునకు నానందమై వుండెనా. ॥ మాకు ॥ 359

ముఖారి

వూరకుండ నేఁటికే వువిద నీకు
చేరి చేరి చెనకితే సిగ్గుదేరుఁ గాకా ॥ పల్లవి ॥

యెరవులేని పతితో నెడమాట లాడ నేల
సరసము లాడితేను చవిగాకా
విరుల వేయఁగాను వెఱగులు వడ నేల
మరలఁగ వేసితేను మచ్చిక లవుఁ గాకా ॥ వూర ॥

మచ్చికసేయఁగానే మనసు సాదించ నేల
యిచ్చగించి వుండుటే యింపుఁ గాకా
అచ్చలాస నవ్వఁగాను అనుమానించఁగ నేల
కుచ్చి కౌఁగిలించుకొంటే గుఱుతులౌఁ గాకా ॥ వూర ॥

కూడిమాడి వుండఁగా నీ గుణాలు వెదక నేల
జోడైన రతులఁ బొంది చొక్కుట గాకా
యీడనే శ్రీవేంకటేశుఁ దేలె నన్ను నింతలోనె
వాడికలు నేసుకొంటే వసమౌఁ గాకా. ॥ వూర ॥ 360

471-వ రేకు హిజ్జిజి

ఇంత గుట్టు నేసుకొని యేమి గట్టుకొనేవే
చెంతనుండి యాసతోనెఁ జెనకఁగాను ॥ పల్లవి ॥

కలువకన్నులచూపు గాటేఁ బోసుకొనేవటే
పొలసి మోమెత్తి యిటు చూడఁ జాలవు
వలనైన చిరునవ్వు వడ్డి రెచ్చుకొనేవటే
వెలయ నీ వెంత నవ్వించినా నగవు ॥ ఇంత ॥

కొండలవంటి కుచాలు గూటఁ బెట్టుకొనేవటే
దండిగాఁ బయ్యద మూసి దాఁచు కొనేవు
పండిన జవ్వన మిదె పాఁతర వేసేవటే
వుండబో ముసుఁగు వెట్టు కూరకే [1] వున్నదానవు ॥ ఇంత ॥

ముచ్చట మాటలాడక మూట గట్టుకొనేవటే
తచ్చన మోనముతోఁ బెదవు లెత్తవు
ఇచ్చటఁ జుట్టమ వైతి వేను శ్రీవేంకటేశుఁడు
మచ్చిక లన్నిటాఁ జల్లి మంతన మాడేవూ. ॥ ఇంత ॥ 361

లలిత

ఔనయ్య మంచివాఁడ వందకు వచ్చినదాని
పూని యలయించే వింత కోపునటవయ్యా ॥ పల్లవి ॥

---

1. తే. పా. - వుందానవు.

తనువెల్ల జెమరించె దప్పి దేరె మోవిమీఁద
నానుపున నింతి నెంత నవ్వించేవయ్యా
పెనగొనె హారములు బేఁట్లు రాలె గందము
చెనకి యప్పటి నేల సిగ్గు రేఁచే వయ్యా ॥ ఔనయ్య ॥

వెలయఁ దురుము జారె వేడుకల దగ దొట్టె
చలాల నెంత సేసలు చల్లించేవయ్యా
పులకలు గడు నిండె పోఁకముడి వీడెను
అలరి యెంత వసంతా లాడించేవయ్యా ॥ ఔనయ్య ॥

కాటుకకప్పు దేరె గక్కనఁ బయ్యెద దెదలె
సూటి నెంత చిత్తరువు చూపించేవయ్యా
[1]గాటాన శ్రీవేంకటేశ కౌఁగిలించుకొంటి విట్టె
మాటిమాటికి నెంత మరిగించేవయ్యా. ॥ ఔనయ్య ॥ 362

కన్నడగౌళ

మానలేను నీపొందు మరి నిన్నుఁ బాయలేను
యే నెపము లెట్టుండునో యేమి సేతు నేను ॥ పల్లవి ॥

చక్కని నీరూపమె సారెకు నేఁ జూఁడగాను
తక్కక నీకు దిష్టి దాఁకె నందురో
మక్కువ మాటలాడఁగా మర్మా లెందు సోఁకునో
యెక్కడని తలపోతు నేమి సేతు నేను ॥ మాన ॥

చనవుతో నెప్పుడు నీ సంగడినేఁ బడుండఁగ
చనుమొనలు ని న్నెట్టు జంట నొత్తునో
పెనఁగఁగా రతులలో బిట్టుగా నీ వలతువో
యెనగొని మతిఁ జింత లేమి సేతు నేను ॥ మాన ॥

చలపట్టి నీతోను సరసము లాడఁగాను
కలయికలకు నెంత కరఁగుదువో
అలరి శ్రీవేంకటేశ అంతలో న న్నేలితివి
యెలమి నివ్వెఱఁగైతి నేమి సేతు నేనూ. ॥ మాన ॥ 363

1. తే. పా. గాంటాన.

రామక్రియ

యెందు వోయీ నీ మోహము యేల వేగిరించేవు
చెందినదాన నే కానా చెనకేవు గాక ॥ పల్లవి ॥

గుట్టున నా చన్నులు నీకు మీఁదెత్తినవే కావా
బెట్టుగాఁ బెనఁగి చేతఁ బట్టేవు గాక
నెట్టన నా చూపులకు నీవే గుఱిగావా
యిట్టే నావంచినతల యెత్తేవు గాక ॥ యెందు ॥

నిరతి నా చిఱునవ్వు నీమీఁదఁ జల్లేదే కాదా
కెరలింపు మాటల రేఁగించేవు గాక
ధర నా మనసు నీకు దక్కి వుండినదే కాదా
కరఁగించి భ్రమయించి కైకొనేవు గాకా ॥ యెందు ॥

వుమ్మడి నా మేను నీ సొమ్మై వుండినదే కాదా
నెమ్మది నీ కౌఁగిట నించేవు గాకా
యిమ్ముల శ్రీవేంకటేశ యిన్నిటా నన్నేలితివి
నమ్మి కెచ్చి ననుపులు నటించేవు గాకా. ॥ యెందు ॥ 364

నాగవరాళి

వేవేలు సతులు గల విభుఁడవు
సేవలు సేయకుండితే చిత్తగించేవా ॥ పల్లవి ॥

విన్నపాలు సేసితే వేడుకలు రేఁగును
కన్ను లెదుట నుండితేఁ గనుపట్టును
సన్నలు సేసితేను చవు లెల్ల నొనగూడు
మన్నింతువంటా రాకుంటే మాటలాడేవా ॥ వేవేలు ॥

కతలు సారెఁ జెప్పితే కైవసమౌ నేస్తము
తతివేళ గాచితేను దయ వుట్టును
రతికెక్కఁ గొలిచితే రచన లెల్లా నీదేరు
అతిరాజసాన నుంటే నంటి నవ్వేవా ॥ వేవేలు ॥

పాదము లొత్తితేను భావములు గరఁగును
పోదితోఁ జెనకితేను పొడముఁ దమి
యీ దెస శ్రీవేంకటేశ యిట్టే నన్నుఁ గూడితివి
పాదుకొని లోన నుంటే బాఁతి పడేవా. ॥ వేవేలు ॥ 365

నాదరామక్రియ

యేల వొట్లు వెట్టేవు యెంత వేగిరించేవు
యేలికవైతే నేమి యింత గద్దా నగవూ ॥ పల్లవి ॥
అలిగి వేఁడుకొని ఆదరించవలెఁ గాని
చలానఁ బెనఁగ నేల సతితోను
పలుకకుండితే నొడఁబరచఁగవలెఁ గాని
బలిమిఁ గొంగు వట్టితేఁ బంతము వచ్చీనా ॥ యేల ॥
చింతఁ దలవంచుకొంటే చెక్కు నొక్కవలెఁ గాని
యింత నేరుపులు చెప్ప నేల యీకెతో
పొంతఁ గన్నీరు నించితే బుజ్జగించవలెఁ గాని
యెంత బుద్దులు చెప్పినా నియ్యకోలయ్యీనా ॥ యేల ॥
కడు నుసురంటేను కౌఁగిలించవలెఁ గాని
వొడివట్టి తియ్య నేల వూర కీకెను
విడె మిచ్చి యింతలో శ్రీవేంకటేశ కూడితివి
బడివాసి వుండితేను బత్తి వెలి తయ్యీనా. ॥ యేల ॥ 366

472-వ రేకు ముఖారి

యేల బూటకాలు నేసీ యింటికి రమ్మనవే
చాలఁ దల దడిసితే చలి వాసు ననవే ॥ పల్లవి ॥
ఆపెకు లోఁగేవాఁడు అనుమానించేవాఁడు
చేపట్టి నాఁ దేల నాకు సేస వెట్టెనే
పైపై సన్న సేసేవాఁడు పరాకుచూపేవాఁడు
వోపికతోఁ దన వేలివుంగర మేలంపెనే ॥ యేల ॥

యింత మొగమోటవాఁడు ఇంతికి వెరచేవాఁడు
రంతుల నా వల పేల రచ్చఁ బెట్టెనే
మంతనపుమాటవాఁడు మరి గుట్టుతోడివాఁడు
వింతలే కతగఁ బెండ్లి వీడే లెట్టు వెట్టెనే ॥ యేల ॥

నెలవి నవ్వేవాఁడు సిగ్గులువడేవాఁడు
కలసి నన్నెటువలెఁ గౌఁగిలించెనే
యెలమి శ్రీవేంకటేశుఁ డిందరి నేలినవాఁడు
కలసి మాలోన నొక్కటి యెట్టు సేసెనే. ॥ యేల ॥ 367

నాదరామక్రియ

నీ యిచ్చ రాజవు తొల్లే నీవు మమ్మే లౌరసేవు
చాయ కొత్తి నీగుణాలు చక్కఁబెట్టేమా ॥ పల్లవి ॥

వొద్దికైన మాటలకు వూఁకొనఁగవచ్చుఁ గాక
పొద్దువోని మాట లెల్లా బుద్ధిఁ బట్టీనా
చద్దికి వేఁడికి నీవు జాణతనా లెన్నాడినా
వద్దనేమా వూరకుండేవార మింతేకాక ॥ నీయిచ్చ ॥

యితవైనపనులకు నియ్యకొనవచ్చుఁ గాక
రతికెక్కినిపనులు గతి గూడీనా
మతకారితనమున మరి నీ వెంత నవ్వినా
మితిమీరేమా నీ యిచ్చ మెలఁగేము గాకా ॥ నీయిచ్చ ॥

కూడిన వేడుకలకు గుఱిగాఁగవచ్చుఁ గాక
యేడ కేడో వేడుకల కింపు వుట్టీనా
యీడె మిచ్చి నన్ను శ్రీవేంకటేశ యేలితివి
ఆడుకొని సొలసేమా అవు ననేము గాకా. ॥ నీయిచ్చ ॥ 368

బళహంస

యెటువంటి వేడుకలో యిద్దరికిని
తటుకన మీకతలు తరితీపులయ్యా ॥ పల్లవి ॥

కలువరేకులవంటి కన్నుల నీవు చూచితే
చెలి యాల సిగ్గువడెఁ జెప్పవయ్యా
సెలవులఁ గొంతకొంత చిఱునవ్వు నవ్వితేను
మొలకచన్ను లేల మూసుకొనే నయ్యా ॥ యెటు ॥

పరువాన పూబంతి పరిమళము చూచితే
శిరసేల వంచెఁ దాను చెప్పవయ్యా
సిరుల పంజరములో చిలుకతో మాటాడితే
పరాకుసేసుక తాను భావించ నేలయ్యా ॥ యెటు ॥

సముకాన నుండి నీవు సారె సింగారించుకొంటే
చెమరించఁ దన కేల చెప్పవయ్యా
అమర మ మ్మేలితివి అన్నిటా శ్రీవేంకటేశ
రమణి యెన్నఁడు నీతో రతిఁ గూడీనయ్యా. ॥ యెటు ॥ 369

కురంజి

తడఁబడె నామది తన కౌనో నా కౌనో
చిడిముడి నాతనికిఁ జెప్పరే యీకతలు ॥ పల్లవి ॥

పెనగొని మాటలాడఁ బెదవులు వేగిరించీ
తనచిత్త మెట్టున్నదో తలఁచరాదు
కనుఁగొనలఁ దనుఁ జక్కఁగఁ జూడకుండరాదు
వొనర నెంత నాఁటునో వోరువరాదు ॥ తడ ॥

కాయముతోడి లంకెలు కరములఁ దొట్టుకొనీ
ఆయెడ నెం తలసునో అదియుఁగాదు
పాయపుమదముగుబ్బలు తనపొందు గోరీ
ఆయము లేద సోఁకునో అంత కోపరాదు ॥ తడ ॥

జవ్వనానఁ గల సిగ్గు సమరతు లాసపడీ
నవ్వు లెట్టున్నవో నాతోఁ దనకు
యివ్వల శ్రీవేంకటేశుఁ డేలె నన్ను మెచ్చితే
రవ్వ లెంతౌనో యీరతి చెప్పరాదూ. ॥ తడ ॥ 370

సాళంగనాట

యెఱుక సేసుకొందురా యీపనులు
　మఱుగున దాఁగితే మందలించవలెనా ॥ పల్లవి ॥

తరుణి తన్నుఁ జూచె తలవంచుకొంటి నేను
　వొరసి నన్నేల తాను వొడివట్టీనే
　సరసము లాడఁగాను తెరవేసుకొంటి నేను
　సరుగ వచ్చి నా కెంత సమ్మతించఁ జెప్పీనే ॥ యెఱుక ॥

సుదతి తనతో నవ్వె సురటి మా టిడుకొంటి
　గుదిగొని నన్ను నేల గోర నూఁదీనే
　కదిసి యాపె వుండఁగా కడచిత్తరు చూచితి
　చెదరక నన్ను నెంత చెక్కులు నొక్కీనే ॥ యెఱుక ॥

ఇంతి దనకొప్పు దువ్వె నివ్వలిమోమైతి నేను
　ఇంతలోనే తా నేల నా యిక్కు వంటీనే
　చెంత నాకె పొందు చూపి శ్రీవేంకటేశుఁడు తాను
　యెంత నన్ను గూడి తాను ఇంపులు చల్లీనే. ॥ యెఱుక ॥ 371

పాడి

సతిచేఁతలకు నన్ను సంతోసించు కొమ్మనీని
　ఇతవౌనా నా కవి యెటువంటి వాఁడే ॥ పల్లవి ॥

సొలసి తనతో నాపె సుద్దు లెల్లాఁ జెప్పఁగాను
　యెలమి నే వద్దనుండి యెట్టు విందునే
　వలపులు చల్లి యాలవట్టము తన కిడఁగా
　వొలిసి యందుకు నెట్టు వోర్చుకొని వుందునే ॥ సతి ॥

కొచ్చి కొచ్చి యాపె దన్ను కుచముల నొత్తఁగాను
　యిచ్చగించి నే నవ్వు దెట్టు చూతునే
　పచ్చిదేరఁ బానుపుపై పాదా లాపె పిసుకఁగా
　కచ్చుపెట్టి యెట్టు పొత్తు గలసి లో నౌదునే ॥ సతి ॥

కూరిమిఁ దనకు నాపె కొలువులు సేయఁగాను
ధీరత నే నెట్టు సమ్మతించుకొందునే
యీరీతి శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁగూడె
తేరెఁ బను లిఁక నెట్టు తెలియఁ జెప్పుదునే. ॥ సతి ॥ 372

473-వ రేకు గౌళ

నాకు మొకమోడి యాకె ననుపేల దాఁచేవు
జోకతోడ మాటలాడి సోదించరాదా ॥ పల్లవి ॥

నిక్కి నిక్కి యదే చెలి నీవంక చూచీని
దిక్కుల నాపెతలఁపు దెలియరాదా
చెక్కుపైఁ బెట్టినచేతఁ జిరునవ్వు మూసీని
[1]అక్కఱతో నదేమని యడుగరాదా ॥ నాకు ॥

ఆడుకొనీఁ జెలితోడ నాకె నీసుద్దులో యేమో
వేడుకతో నీ వవి వినరాదా
తోడనే నిమ్మపండ్లు చేతులఁ బట్టుకున్నది
యీడ నీకుఁ గాను కిచ్చీనేమో అందరాదా ॥ నాకు ॥

కూరిమితోడుత నాపె కొంగు నిన్నుఁ దాఁకించీ
నేరుపుతోఁ గౌఁగిట నించరాదా
యీరీతి శ్రీవేంకటేశ యిన్నిటా న న్నేలితివి
గారవించి యాపెగుట్టు గనుకోరాదా. ॥ నాకు ॥ 373

వేళావళి

ఆతని కన్నియు నింపులై యుండఁగా
యీతల వెరగువడ నేలే యెవ్వరికి ॥ పల్లవి ॥

వలసిన రమణుని వనిత సొలసితేను
వెలయ వినఁగ నేలే వేరొకతెకు
చెలరేఁగి యాతఁ డాపెచేతికి లోనై వుండఁగా
వలవని వాదు లేలే వద్దివారికి ॥ ఆత ॥

1. తే. పా. — అక్కర.

సిగ్గువడ కాపె పతిఁ జెరఁగువట్టి తియ్యఁగా
వొగ్గి విడిపించ నేరే వున్నవారికి
యెగ్గు లే కాతని కవి యేలాటాలై వుండఁగాను
కగ్గి కాంతాళించ నేలే కన్నవారికి ॥ అత ॥

మక్కువ నాపె గునిసి మగనితోఁ బెనఁగఁగా
చక్కట్లు దిద్ద నేలే సవతులకు
యిక్కువ శ్రీవేంకటేశుఁ డితఁడే మనలఁ గూడె
వక్కణ లడుగ నేలే వావిగలవారికి. ॥ అత ॥ 374

ఆహిరి

చెప్పితినేఁ దొలుతనే చెలులు సాకిరిగాఁగ
తప్పు లేదు నావల్లఁ దలఁచుకోరా ॥ పల్లవి ॥

జక్కవచన్నులు నీవు సారెఁ బట్టకురా
పక్కనను నీవురముపై కెగరీని
వుక్కుగోరిదాన నన్ను నొరసి చూడకురా
చెక్కు లేడ సోఁకినాను జీరవారీని ॥ చెప్పి ॥

తుమ్మెద రెక్కలకొప్పు దువ్వ నీవు రాకురా
జుమ్మన రేఁగీని మైఁ జుట్టుకొనీని
తమ్మికన్నుల నాచూపు దార దడవకురా
నమ్మి పొందుసేసితేను నాఁటుకొనీని ॥ చెప్పి ॥

మోవిపంటితేనెకు ముంచి నోరూరకురా
నావాఁడవైనా నీకు నాము లెక్కీని
యీవేళ శ్రీవేంకటేశ యెనసితి విటు నన్ను
భావించి చూచుకొంటేను పచ్చిదేరీని. ॥ చెప్పి ॥ 375

ఆహిరి

యేఁటికి దూరే విటు నన్ను నీ
నాఁటకములు గని నవ్వితిఁగాకా ॥ పల్లవి ॥

చలమా నీతో సరి పెనఁగఁగ నీ
కొలఁ దెఱఁగక నేఁ గొంకేఁగాకా
బలిమా నే నీపయిఁ జేయి వేయఁగ
చెలిమికత్తెనై చెలఁగేఁగాకా ॥ యేటి ॥

నీటా నీతో నివ్వెఱఁ గందఁగ
జూటరియాసలఁ జూచేఁగాకా
సాటి వచ్చెనా చనవు నీ వియ్యఁగ
కూటువని సరిఁ గూచుండేఁగాకా ॥ యేటి ॥

యెదురా గుబ్బల నిటు నే నొత్తఁగ
అదనని కౌఁగిట నలమేఁగాకా
యిదివో శ్రీవేంకటేశ న న్నేలితి (వి)
పొదుగఁగ నీ నేర్పు పొగడేఁగాకా. ॥ యేటి ॥ 376

శంకరాభరణం

వారీఁ జూచె దానివలపే చూచుటగాక
సారె నీకిచ్చక మౌటే సంతోసము నాకూ ॥ పల్లవి ॥

కడఁగి నీసతు లెంత గర్వముతో నుండినాను
అడియాలమగు [1] మాట లాడింతు నేనూ
వుడివోని నీ మన్నన నుల్లసము లాడినాను
యెడనెడ నందుకుఁగా నెగ్గుపట్ట నేనూ ॥ వారీ ॥

కసరి సవతులు మొగాలు ముడుచుకొన్నాను
ముసిమి చెప్పి నవ్వించి మొక్కుదునేను
వసగాని కాంతాళాల వాదుకు వచ్చినాను
పొసఁగి చుట్టరికానఁ బొందుసేతు నేనూ ॥ వారీ ॥

పక్కన నీ దేవు లెంత పంతాలు మెఱసినాను
మిక్కిలిఁ బొగడుతాను మెచ్చి చెల్లింతు
మక్కువతో నలమేలుమంగ శ్రీవేంకటేశ్వర
యిక్కడ న న్నేలితివి యిందరిదాన నేనూ. ॥ వారీ ॥ 377

1. తే. పా. మాంట.

నాదరామక్రియ

తనమేలే నామేలు తగ నాకు ఫలియించీ
వినయానఁ బతి కిట్టే విన్నవించరమ్మా ॥ పల్లవి ॥

చెలఁగి తనపై నాకు చింత లెంత ముంచుకొన్నా
తలఁపు లీడేరుఁగా తనకై నాను
బలువిరహాన నామై పచ్చి కాఁకఁ బొరలినా
చలువై వున్నది గదా చక్కని తనమేను ॥ తన ॥

అట్టే నేఁ దనయడియాసల నెం తలసినా
వొట్టుక బలిమికాఁడై వుండుఁగా తాను
అట్టడి నావలపు లాఅడిఁ బడి వుండినాను
గుట్టు తనకుఁ గద్దుగా కొలువులో నెపుడు ॥ తన ॥

బడలి పానుపుమీఁదఁ బయ్యద నాకు జారినా
కడఁగి పచ్చడము దాఁ గప్పినాఁడుగా
యెడయక శ్రీవేంకటేశుఁ డేలె నన్నింతలో
కడుఁ దానే నాపై నింత కరుణగలఁడుగా. ॥ తన ॥ 378

474-వ రేకు రామక్రియ

యెక్కడ పరాకు నీకు నెందు చూచేవు
గక్కన నాపెతమకము చూడవయ్యా ॥ పల్లవి ॥

గుబ్బలు గదలఁగాను కొప్పు గొంత జారఁగాను
తబ్బిబ్బుగా హారాలు తడఁబడఁగా
వుబ్బుతోడ వచ్చె నిదె వువిద నీకడకును
పబ్బననీమీఁది యాపెబత్తి చూడవయ్యా ॥ యెక్క ॥

[1] గాటపుఁజెమటతోడ గాజులు గల్లనఁగాను
[2] మేటికుచ్చల మీఁగాళ్ళమీఁద వాలఁగా
వాటుఁబరువున వచ్చె వనిత నీ కడకును
ఆఁటదాని యగ్గలిక అటుచూడవయ్యా ॥ యెక్క ॥

1. తే. పా.—గాంట, 2. తే. పా. – మేంటి.

తపకుఁగమ్మ లదర తగ నిట్టూర్పులు రేఁగ
పొలుపు టుద్దాలు చప్పుడు సేయఁగా
యెలమి శ్రీవేంకటేశ ఇంతి వచ్చి నిన్నుఁ గూడె
యిల మ మ్మెలితి వాపె ఇంపు చూడవయ్యా. ॥ యెక్క ॥ 379

శంకరాభరణం

చిత్తగించవయ్య యీ కొత్త లెన్నఁ దెఱఁగము
హత్తి యాపెవలపు లేమని చెప్పే మిఁకను ॥ పల్లవి ॥
నిన్నుఁ బాసి విరహాన నెలఁత తనమొగమే
వెన్నెలరాజని యెంచి విన్ననయ్యీని
కన్నుఁగవ చూపులు కలువబాణము లని
పన్నుక లోలోనె రెప్పలు వంచీని ॥ చిత్త ॥
పక్కన నినుఁ దలఁచి భ్రమసి తన చన్నులే
జక్కవపిట్ట లనుచు సారెఁ గప్పీని
నిక్కిన తన తురుము నిండుఁ దేఁటిపొఁ జని
చక్కఁబెట్టుకో ముడిచి జారివుండినాను ॥ చిత్త ॥
తగ నిన్నుఁబేరుకొని తడఁబడీ పెదవులు
చిగురు టడిదాల నీచేత మూసీని
నిగిడి శ్రీవేంకటేశ నీ వింతలోఁ గూడితివి
తగఁ దా నెప్పటివలె దైవారీ వేడుకలా ॥ చిత్త ॥ 380

వరాళి

అల్లంతనుండే మాట లానతీవయ్యా
చెల్లఁబో నీ చెప్పినట్టు సేయ ననేనా ॥ పల్లవి ॥
సరుసకు వచ్చి నన్ను సారె వేఁడుకోకువయ్య
నిరతిఁ గొప్పువిరులు నీపైఁ జిందీని
కరములు వట్టి యెంత గారవించ వచ్చేవయ్య
వొరసి నా మాణికాలవుంగరా లొత్తీని ॥ అల్లం ॥

తొడపైకిఁ దీసి యెంత తూరి బుజ్జగించేవయ్య
వడిసీ నా చెవిలో జవ్వాది నీమీఁద
వొడివట్టి న న్నింత వొడఁబరచ నేలయ్య
వుడుకు నిట్టూర్పుగాలి వొళ్ళు సోఁకీని ॥ అల్లం ॥

యిట్టే నన్నుఁ గౌఁగిలించి యెంత లాలించేవయ్య
గట్టి నా చన్నులమీఁదిగంద మంటీని
గుట్టున శ్రీవేంకటేశ కూడి యాదరించేవయ్య
ముట్టి నామదము నిన్ను ముంచుకొనీని. ॥ అల్లం ॥ 381

ఆహిరి

యేల మూసీ మంతనాలు యెదిరించి నాపనికి
వాలాయ మింత [1]గలిగితే వద్దనేమా నేము ॥ పల్లవి ॥

సందడి నుం డీతని సారెకుఁ జూడఁగ నేల
ముందరికి వచ్చి యిటు మొక్కఁగదవే
పొందుగా సన్నల వలపులు చల్ల నీ కేల
అందుకొనీఁ గాని బాగా లంపవే నీవు ॥ యేల ॥

చెలులమాఁటుననుండి సిగ్గులు వడఁగ నేల
అలరి మాట లాడుదు వండకు రావే
నిలిచి కొలువుసేసి నివ్వెఱఁగు వడ నేల
బలిమిఁ గిందఁ గూచుండి పాదా లొత్తవే ॥ యేల ॥

పయ్యదమఱఁగుననే పచ్చినవ్వు నవ్వ నేల
చయ్యనఁ గూడి మోవి చవిచూపవే
యియ్యెడ శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నన్నుఁ గూడె
చెయ్యార నీవు నసుపు సేసుకొనవే. ॥ యేల ॥ 382

ప్రతాపనాట

పురాణపురుషుఁడు భువి నవతరించెను
సిరుల జయంతి నేఁడు సేయరో పండుగలూ ॥ పల్లవి ॥

1. తే. పా.—గలితే.

శ్రావణబహుళాష్టమిఁజందురుఁ డుదయించెను
ఆవేళ రోహిణిని అద్దమరాతిరికాద
దేవకి కృష్ణునిఁ గాంచె దేవతలు నుతియించ
చేవ దేరెఁ బనులెల్లా సేయరో పండుగలూ ॥ పురాణ ॥

నందుని మందకు నేఁగినాఁడే వసుదేవుఁడు
కందువఁ గృష్ణు నెశోదకడఁ బెట్టి మాయఁ దెచ్చి
యిందమని కంసుచేతి కిచ్చితే మాయాదేవి
చెంది విడిపించుకొనె సేయరో పండుగలూ ॥ పురాణ ॥

చిన్నకృష్ణుఁడై పెరిగి చేరి కంసుఁ బొరిగొని
యెన్న శ్రీవేంకటేశుఁడై ఇందరిఁ గాచీ నిదె
వున్నది యలమేల్మంగ వురమున నితనికి
చెన్నుమీఱి దాసులెల్ల సేయరో పండగలు. ॥ వురాణ ॥ 383

బౌళి

యెటువంటి యాగడీఁడే యీ కృష్ణుఁడు
జొటజొటఁ గారఁగానే జుట్టీ మీఁగడలు ॥ పల్లవి ॥

కొట్టెఁ గృష్ణుఁడు వాఁడె కోల లెత్తి వుట్లపై
దట్టముగ గొల్లెతలు దాఁచినపాలు
చుట్టిన చక్కిలములు చొక్కపు నురుగులునుఁ
బెట్టిన కాఁగులతోనే పెంచులుగఁ జేసీనే ॥ యెటు ॥

దొంతులు దించి దించి దొరకొనీ కృష్ణుఁడు
బంతిఁ జక్కెర వెట్టీ గోపాలుల కెల్ల
మంతనాన వద్దని మానుపఁబోతేఁ దాను
కొంత వారినోరఁ బెరుగులు చమరీనే ॥ యెటు ॥

పీదు లెల్లఁ దానె శ్రీవేంకటాద్రికృష్ణుఁడు
ఆదిగొని మెసగీని యదుకు లెల్ల
కాదని పెనఁగితేను కౌఁగిలించీ గొల్లెతల
సోదించి కుచము లంటి సొంపుగాఁ గూడీనే. ॥ యెటు ॥ 384

475-వ రేకు శుద్ధవసంతం

వలపుల సొలపుల వసంతవేళ యిది
నెలవి నవ్వకువే చెమరించీ మేను ॥ పల్లవి ॥
శిరసు వంచకువే సిగ్గులు వడకువే
పరగ నిన్నతఁడు తప్పక చూచీని
విరులు దులుపకువే వెసఁ దప్పించుకోకువే
సిరుల నీవిభుఁ డిట్టే నేసవెట్టీని ॥ వల ॥
చే యెత్తి యొడ్డుకోకువే చేరి యానవెట్టకువే
చాయల నాతఁడు నీ చన్ను లంటీని
ఆయములు దాఁచకువే అట్టే వెరగందకువే
మోయ నాడీ సరసము మోహాన నీ విభుఁడు ॥ వల ॥
పెనఁగులాడకువే బిగువు చూపకువే
ఘనశ్రీవేంకటేశుఁడు కౌఁగిలించీని
అనుమానించకువే అలమేల్మంగవు నీవు
చన విచ్చి నన్ను నేలె సమ్మతించి యాతఁడూ. ॥ వల ॥ 385

మధ్యమావతి

యేమయ్య వట్టికత లేల గడించుకొనేవు
నేమపు నాగుణములు నీవే యెఱుఁగవా ॥ పల్లవి ॥
దొంతి నున్న నావలపు తూరుపెత్తితిఁగాక
పంతము చూపితినా పదరి నీకు
చింత లెల్ల బొఁజు చూచి చెక్కుచేత నుంటిఁగాక
అంతరంగమున నీతో నలిగి వుండితినా ॥ యేమ ॥
మువ్వంక నాసిగ్గులు మూలల దాఁచితి గాక
అవ్వలిమో మైతినా అప్పటి నీతో
పువ్వువంటియాస ముడుపుగఁ గట్టుకొంటిఁ గాక
నివ్వటిల్లు బొమ్మముడి నీపైఁ బెట్టితినా ॥ యేమ ॥

గక్కన నాజవ్వనము కానుక వట్టితిఁ గాక
వుక్కుమీఱి గుబ్బల ని న్నొరసితినా
అక్కున శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
మొక్కితిఁ గాక రతుల మొనగో రూఁదితినా. ॥ యేమ ॥ 386

దేసాళం

మీ కెంత వేడుకలైన మేలే మాకు
మా కేలయ్య మీలో మీకు మచ్చరాలు రేఁచను ॥ పల్లవి ॥

మనసిచ్చి నీ దేవులు మంచిమాట లాడఁగాను
పనివూని చెలులము పంత మాడేమా
ఘనమై నీచేఁత లాపె కప్పిపెట్టు కుండఁగాను
వినయపునేము నిన్ను వెల్లివిరి సేసేమా ॥ మీకెంత ॥

యెఱిఁగెఱిఁగి నీ కాపె ఇచ్చకము సేయఁగాను
గుఱియైన చెలులము కోపగించేమా
మఱియు నీ సుద్దు లాపె మరపించి దాఁచఁగాను
తఱితోడ నే మవి తారుకాణఁ బెట్టేమా ॥ మీకెంత ॥

నీడయై యలమేల్మంగ నిన్నుఁ గౌఁగిలించఁగాను
వూడిగపు చెలులము వొద్దనేమా
యీడు జోడై శ్రీవేంకటేశ నీ వాకెఁ గూడఁగా
వేడుకై వుండేము గాక వింత సేసేమా. ॥ మీకెంత ॥ 387

ఆందోళి

యేల మాతో నీడువెట్టే వెవ్వరినైనా
గాలి ముడియ గట్టితే గట్టిపడీనా ॥ పల్లవి ॥

కలువల వేసేవారు కాఁకలు చల్లేవారు
యెలమి నీకుఁ జుట్టా లెందరు లేరు
తలఁబాలు వోసిన తరుణులే గుఱిగాఁగఁ
దెలిపి చెప్పేయట్టి దేవుళ్ళు గాకా ॥ యేల ॥

పొందులు సేసేవారు పొద్దులు వుచ్చేవారు
యిందు నందు వెదకితే నెందరు లేరు
కందువ సమ్మంధపుకలయిక గుఱిగాఁగ
నందముగఁ జెప్పే వా రాండ్లు గాకా ॥ యేల ॥

సారెకు నవ్వేవారు సరస మాడేటివారు
యీరీతి శ్రీవేంకటేశ యెందరు లేరు
మేరఁ గంకణదారాల [1]మెలఁతలే గుఱిగాఁగ
కోరి వేడి చెప్పే పెండ్లికూఁతులు గాకా. ॥ యేల ॥ 388

భైరవి

చెప్పవమ్మ నిన్నుఁ జూచి చిత్తము నివ్వెఱఁ గాయి
చొప్పులు రెంటికి వచ్చుఁ జూచిన చెలులకూ ॥ పల్లవి ॥

చెక్కుల జవ్వాది గారీ చెమటలు మేన నూరీ
ముక్కున నిట్టూరుపు మించీ నిదేమే
గక్కున నీ చన్నులపై గందపుఁ బేఁట్లు రాలె
నక్కజపురతియో అతనిపై యలుకో ॥ చెప్ప ॥

పువ్వులకొప్పు చెదరె పొందులసందు లదరె
నివ్వటిల్లు దువ్వటము నెరివిరిగే
అవ్వల నివ్వలమై హారములు దడఁబడే
నవ్వితివో పతిమాట నాఁటఁ బెనఁగితివో ॥ చెప్ప ॥

చుక్కలు మోవిఁ బొడమె చూపులుఁ గెంపు దడమె
కిక్కిరించిన కళలు గిజ్జిడిగొనె
యిక్కువ శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడే
మిక్కుటపు సరసమో మెలఁగిన సిగ్గులో. ॥ చెప్ప ॥ 389

సాళంగం

వేడుకగలవారికి వెంగెములే హితవౌను
పాడిపంతా లిందు నేల పచారించేవయ్యా ॥ పల్లవి ॥

---

1. తే. పా. – మెఱుంతలే.

కాంతలు పతితోడుత కసరినాఁ గొసరినా
వింతతమి వుట్టుఁగాక వేస టయ్యీనా
అంతరంగపుసుద్దులు ఆకెకు నీకుఁ దెలుసు
చెంతనున్న మా కేమి చెప్పేవయ్యా ॥ వేడు ॥

అంగనలు వద్దనుండి అలసినా సొలసినా
సంగతులే అవుఁగాక చవుక లయ్యీనా
యింగితపు మీభావా లెట్టుండినా నుండెఁగాక
అంగవించి మాతో నేమి ఆనతిచ్చేవయ్యా ॥ వేడు ॥

వువిదలు రతివేళ నొరసినా మెఱసినా
చవులయే వుండుఁగాక చప్ప నయ్యీనా
యివల శ్రీవేంకటేశ యింతి నిట్టే కూడితివి
తివిరి మా కిఁక నేమి దెలిపేవయ్యా. ॥ వేడు ॥ 390

476-వ రేకు సామంతం

వాసితో నుండుటే మేలు వనితకు
పూసగుచ్చినట్టు తన్నుఁ బొగడేదే మంచిది ॥ పల్లవి ॥

చెప్పరాని మాటలు చెవి యొగ్గి విన నేల
తిప్పరాని మనసుతో దీకొననేల
తప్పక యెట్టుండినాను తనదాననే నేను
చిప్పిలఁ దనకొలువు సేసేదే చాలునే ॥ వాసి ॥

అందరానివీడేల కటు చేయి చాఁచ నేల
పొందుగాని రతులకుఁ బొదుగ నేల
సందడి యంతైనాను చనవరిదాన నేను
చెంది తనపూడిగాలు సేయుటే లాభమే ॥ వాసి ॥

కూడరానికౌఁగిటను కుచముల నొత్త నేల
వీడరానిచెలుములు విడువ నేల
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను నేలె
జోడుగూడి తనమోము చూచేదే నేరుపే. ॥ వాసి ॥ 391

## ముఖారి

పిన్నదాన వైతే నేమి పెద్దగాదా వలపు
చన్నులపైఁ బయ్యదే సారెఁ గప్పేవూ ॥ పల్లవి ॥

ఆడరాదా వొకమాట ఆతనితోను
యీడనుండే సిగ్గువడి యేల లోఁగేవు
చూడరాదా పతిదిక్కు సొలయుచును
వీడెము చేఁబట్టుక మావెనక [1]నున్నదానవూ ॥ పిన్న ॥

కానుక లియ్యఁగరాదా కౌఁగి లిమ్మని
వేనలి వీడగఁనేల వెర గందేవు
పూని పాదా లొత్తరాదా వొద్దఁ గూచుండి
నానించి మా మోము చూచి నవ్వు నవ్వేవూ ॥ పిన్న ॥

సేయరాదా వూడిగాలు చెలువునికి
చాయలా సన్నల నేల జంపు సేసేవు
ఈయెడ శ్రీవేంకటేశుఁ డిదే తానె నిన్నుఁ గూడె
మాయదకు దాఁపురాలు మరి యేల సేసేవూ ॥ పిన్న ॥ 392

## పాడి

ఎన్నెన్నిగుణాల ఇంతు లెంవరు లేరు
సన్నతో నేలేవానికి జాణతన మింతేకాక ॥ పల్లవి ॥

రమణునిసేఁతలు రచ్చల వేసితేను
రమణి అది [2]జగడాఁగ గాక
సమరతి నాయకునిచాయకు రాకుండితేను
అమరినచుట్టమా అతినిష్ఠూరి గాకా ॥ ఎన్నెన్ని ॥

నగినంమకుఁ బతితో నాఁటఁ గోపించుకొంటేను
మగువా అది మంటమారి గాక
మగవాఁడు చెనకఁగా మాటలాడ కుండితేను
ముగుదా అది రొమ్మునఁ గుంపటే గాక ॥ ఎన్నెన్ని ॥

---

1. తే. పా. — నుందానవూ, 2. తే. పా. — జగర్దాఁగ.

సరసుఁడు పైకొనఁగా చలము సాదించితేను
తరుణి అది నొకదయ్యము గాక
సిరి నేఁ డిచ్చ యెఱఁగి శ్రీవేంకటేశ్వరుఁ గూడె
తెరచాటువనితా దేవర గాకా. ॥ ఎన్నెన్ని ॥ 393

తెలుఁగుఁగాంబోది

యెట్టున్నదో నా భాగ్యమేమి సేతునే
చుట్టిచుట్టి నాయాసకు సుడిగొన నిపుడు ॥ పల్లవి ॥
చెలిచే నా విన్నపాలు చిత్తగించి వినునొకో
తలఁపునఁ బెట్టునొకో దయతోను
పిలిచితే వచ్చునొకో ప్రియముతో నాయింటికీ
కలసునొకో నేఁడు కౌఁగిట నా విభుఁడు ॥ యెట్టు ॥
కదఁగి నే నంపిన కాని కందుకొనునొకో
అడుగునొకో న న్నంతరిలోన
యెడయక నాకు నట్టె యిచ్చునొకో కెమ్మోవి
అడరి నాకుఁ గైవశ మౌనొకో నా విభుఁడు ॥ యెట్టు ॥
తమితో నా చన్నులపై తానే చేయి చాఁచునొకో
అమరఁగ నవ్వునొకో ఆతుమఁదాను
మమకరించ లమేలుమంగ శ్రీవేంకటేశుఁడు
సమరతి న న్నేలె యీజాణఁడే నా విభుఁడు. ॥ యెట్టు ॥ 394

ధవళి

చుట్టరికే లుండఁగాను సూడులు వట్టఁగ నేల
జట్టిగొనే నీతోడిసరసమే మంచిది ॥ పల్లవి ॥
చెలులతో నీసుద్దులు చెప్పేమంటే నెంత లేదు
యెలమి నాకోరికె లెంత లేదు
సులభుఁడవై నీవు చూచి నాతో నవ్వఁగాను
చలవాసి వలపులు చల్లుటే మంచిది ॥ చుట్ట ॥

కూరిములు సారె నిన్నుఁ గొసరఁగ నెంత లేదు
యేరుపడ నాపంతము లెంత లేదు
గారవించి నీవు నన్నుఁ గలయఁగ రాఁగాను
చేరి నీయిచ్చకో లందిఁ జెనకుటే మంచిది ॥ చుట్ట ॥

పెనఁగి పెనఁగి నీతో బిగియఁగ నెంత లేదు
యెనగొన్న నా యాస లెంత లేదు
మనసిచ్చి యలమేలుమంగ శ్రీవేంకటేశ్వర
మొనసి నన్నేలితివి మొక్కుటే మంచిది. ॥ చుట్ట ॥ 395

కేదారగౌళ

కన్నులపండుగ లాయఁ గనుఁగొని మా కైతే
యెన్న నీదేవుల నైనా నేమి వేడు కాయనూ ॥ పల్లవి ॥

చనవిచ్చి నీ వాపెతో సరసము లాడఁగాను
చెనకి విన్నపా లాకె సేయఁగాను
యెనలేని సంతోసాన నెంతో నీవు చెలఁగఁగా
చనుమొన లంట నాకె సారెఁ గొప్పు దువ్వఁగా ॥ కన్ను ॥

చేరి నీ వాకె నప్పటి చెక్కు నొక్కి వేఁడుకోఁగా
నారుకొనఁ దాను చిఱునవ్వు నవ్వఁగా
కూరిమిఁ గస్తూరిబొట్టు గోర నీవు దిద్దఁగాను
కోరి యాకు మడిచి తా నోర నీ కందిచ్చెను ॥ కన్ను ॥

కందువ నంతలో నాకెఁ గౌఁగిట నీవు నించఁగా
అందులోనే సిగ్గువడి యాకె వుండఁగా
చెంది నన్నేలి యాకెను శ్రీవేంకటేశ కూడఁగా
మందలించి యలమేలుమంగ నిన్నొరసెనూ. ॥ కన్ను ॥ 396

477-వ రేకు శుద్ధదేశి

నాపై బత్తిగల వంటా నమ్మితి నేను
బాపు బాపు నీ కప్పటిపై కొస రెవ్వతెరా ॥ పల్లవి ॥

తెరమఱుగున నుండి తీగెవార నెలుఁగించి
గరిమ నీవు రా నెఱుకలు సేసీని
సరుస నే నుండఁగా సన్నలా చాయలా నిన్ను
పెర రేఁచీ రతులకుఁ బ్రియురా లెవ్వతెరా ॥ నాపై ॥

నెమ్మి గంబము మాటున నిలుచుండి వలపులు
తమ్మిపూవులను వేసి తలఁపించీని
అమ్మరో సరసము నే నాడఁగా నీతోడన
యెమ్మెలెల్లాఁ బచరించీ నిదియూ నెవ్వతెరా ॥ నాపై ॥

తలుపుదండనే వుండి తరితీపు నవ్వు నవ్వి
కలయికలకుఁ దాను కన్ను లార్చీని
అలమేల్మంగను నేను అట్టే శ్రీవేంకటేశ్వర
కలసితి విటు నన్నుఁ గామిని యెవ్వతెరా. ॥ నాపై ॥ 397

ధన్నాసి

అవునయ్య మంచివాఁడ వంతే కాదా
రవళిఁ బొరుగు పోరచి వెదకేవూ ॥ పల్లవి ॥

నెలఁత యింటిలోనుండి నినుఁ బిలువ నంపితే
చెలికత్తెపై నేల చేయి చాఁచేవు
కలికి యంపినయట్టి కానుక నీ కిచ్చితేను
చలివాసి యంతేసి జాణతనా లాడేవు ॥ అవు ॥

ఆడనుండి గందము నీ కంపఁగాఁ దెచ్చితి మింతే
వూడిగపువారి నేల వొడివట్టేవు
యీడ నీకుఁ జెవిలోన నేకాంతము చెప్పితిమి
వాడుమోవి చవిగొని వలఁబెట్టేవూ ॥ అవు ॥

నంటున నలమేల్మంగ నవ్వి నీ వుర మెక్కితే
వెంట వచ్చిన మమ్మును వెసఁ గూడేవూ
గొంటపై శ్రీవేంకటేశ కూడె నాపె నీ దేవులు
అంటుకొని మమ్ము నెంత ఆదరించేవూ. ॥ అవు ॥ 398

నట్టనారాయణి

యేల మమ్ము రట్టు సేసే విందరిలోన
యేలాగులఁ బెనఁగినా నిది గబ్బియనరా ॥ పల్లవి ॥

పందె లాడు మనేవు నీపైఁ జేయి వేసితే
మందెమేళమై యుండదా మరి చూచితే
చందముగ వాటు వేసి సారెలు నేఁ దాకించితే
యిందుకు నీపదఁతులు యెంత నిష్ఠూ రనరా ॥ యేల ॥

తమ్ములము జూజానకు తగ నొడ్డు వెట్టేవు
యెమ్మె లాడే ననలా యిందరు నన్ను
నెమ్మది నే గెలిచాట నీపైనే మోపితేను
కమ్మరసవతులెల్ల కదుఖాఁగ యనరా ॥ యేల ॥

గుబ్బలు నీ సారె లంటాఁ గూడి పట్టేవా నంటే
వుబ్బరిక త్తె యనుచు నుప్పటించరా
యెబ్బిదేల శ్రీవేంకటేశ యలమేల్మంగను
అబ్బురాన నన్నేలితి వతిజాణ ననరా. ॥ యేల ॥ 399

దేసాళం

మూసీ మంతనము వద్దా ముగుద యీ జవరాలు
నేసవెట్టి యింత కాకు సేతు రటవయ్యా ॥ పల్లవి ॥

పరాకు సేసుకొని పదఁతి వూరకుండినా
అరుదుగాఁ బచ్చిమాట లానతిచ్చేవు
శిరసు వంచుక లోలో సిగ్గులు వడఁగా నీవు
సరిఁ జన్నులపై కొంగు జార దీసేవు ॥ మూసి ॥

గుట్టుతోడఁ దాను నీ కొలువులు సేయఁగానే
గట్టి కొప్పువుంట లింటఁగడు వేసేవు
యెట్టనెదుటనే వుండి యెఱుఁగమి సేసుకొంటే
తట్టుపుణుఁగెల్లాఁ బూసి తమకించేవు ॥ మూసి ॥

నెపములు వెట్టుకొని నెలఁతలతో నవ్వితే
చపలతఁ గెమ్మోవి చవిగొనేవు
యిపుడే శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
రపముగఁ గూడి కడు రవ్వసేసేవు. ॥ మూసి ॥ 400

వరాళి

వల పౌకచోట నుండ వట్టి బయ లీఁద నేల
బలిమిని మాతో నేల పదరేవు నీవూ ॥ పల్లవి ॥
కలికి నీ దేవులు గడియ వెట్టు మంటేను
చెలిమికత్తెల నేల చేయి వట్టేవు
అలుక దేరిచి యాపె నటు వేఁడుకొంట గాక
పిలిచి మాతో నేల పెనఁగేవు నీవూ ॥ వలపౌక ॥
యేకతాన నుండ నాకె యింటిలోని కేఁగితేను
వాకిటిదాని కొ ప్పేల వంచేవు
ఆకెకే ప్రియాలు చెప్పి అంపి రప్పించుకోరాదా
దాకొని మమ్మేటికిఁ దడవేవు నీవు ॥ వలపౌక ॥
కూడ నీవు రాఁగా నాపెతోడు చెలుల రమ్మంటే
నూడిగపువారి నేల వొడివట్టేవు
యీడ నలమేల్మంగను యేలి శ్రీవేంకటేశ్వర
జోడైతిరి మ మ్మేమి చూచేవు నీవూ. ॥ వలపౌక ॥ 401

శంకరాభరణం

మొక్కరో పరుషలు మోహనమూర్తికి
వెక్కసమగు శ్రీవేంకటపతికి ॥ పల్లవి ॥
హరిరథ మదే ముందరి నొగ లవిగో
గరుడధ్వజ మదే ఘంట లవే
సరిఁ దిరిగేటి కాంచనచక్రము లవే
తిరువీధుల నేతెంచేఁ గనరో ॥ మొక్కరో ॥

తేరుపడగ లవే తెల్లగొడుగు లవే
తోరణంబు లవే సారథి వాఁడే
ధీరతఁ గట్టిన దివ్యహయము లవే
మేరువువలెనే మెరసీ నదివో ॥ మొక్కరో ॥

పసిఁడికుండ యదే పట్టుకుచ్చు లవే
వెస నడుమవాఁడే శ్రీవేంకటేశుఁడు
యెసగి యురమునను యిదే యలమేల్మంగ
వసుధపెండ్లితేరు వచ్చీ నిదివో. ॥ మొక్కరో ॥ 402

478-వ ఱేకు శంకరాభరణం

[1]యెడమాటల పను లిఁక నేలా
[2]చిదిముడి నవ్వులఁ జిమ్మీ వలపు ॥ పల్లవి ॥

మనసులోని తన మర్మపు తలఁపులు
కనుఁగొనఁ దెలిపేఁ గామిని
తనువునఁ గలిగిన తమకము లన్నియు
వినయములోననే వివరించీని ॥ యెడమాటలు ॥

చొక్కమైన తన చుట్టరికంబులు
మొక్కులలోనే ముంచీని
వెక్కసంపుఁ దనవేడుక లెల్లను
జక్కవచన్నుల సరిఁ జూపీని ॥ యెడమాటలు ॥

కైకొను నీరతిఁ గలనేటి కాంక్షలు
చేకానుకలనే చెప్పీని
జోక శ్రీవేంకటేశుఁ డలమేల్మంగ
నీకాఁగిటిలో నెరపీని. ॥ యెడమాటలు ॥ 403

కన్నడగౌళ

యీకె విలాసము చూచి యింతట మన్నించవద్దా
జోకలైన వలపు లెచ్చు నున్నవో కాకా ॥ పల్లవి ॥

1. తే. పా. — మాంట, 2. తే. పా. — చిదుముడి.

కొసరి కొసరి నిన్నుఁ గొనచూపులనుఁ జూచి
అసురుసురై నీకుఁ బ్రియము చెప్పిని
ముసుఁగిడుకొని నీ ముందర నదిగో యింతి
వసివాడు మోముతో నీవద్ద బాయకున్నది ॥ యీకె ॥

పొలసి పొలసి నీతోఁ బోరచి పొందులు చూపి
తలఁపించీ సారె నీకుఁ దన మోహము
నిలువు నివ్వెరగుతో నిలుచున్న దదివో
వులివచ్చి విరహాన నోలలాడుచున్నది ॥ యీకె ॥

తగిలి తగిలి నీపైఁ దలఁబాలు చల్లి చల్లి
మొగము చూచి నీకు మొక్కి మొక్కిని
జిగి నలమేల్మంగ శ్రీవేంకటేశ్వర యీకె
సొగిసి నీ రతులలోఁ జొక్కుచుఁ దా నున్నది. ॥ యీకె ॥ 404

నాదరామక్రియ

నీ తలఁ పెట్టున్నదో నే మెఱఁగము
యీ తలవాకిట నుండే విదే యేమో కాని ॥ పల్లవి ॥

సతులు విభునిమీఁద సణఁగులు రాలుతురు
మతకము వెట్టుకొని మాటాడుదురు
కతకారితనముల కాఁకలు నేతురు
పతి యందు కెగ్గుపట్టఁ బాడిగాదు గాని ॥ నీతల ॥

పొట్టఁబొరుగుననుండి బొమ్మల జంకింతురు
గుట్టుతోడ నూరకైనాఁ గొసరుదురు
చిట్టకపు వనితలు చెనకి పెనఁగుదురు
అట్టె మగని కొఁగా దనఁగాదు గాని ॥ నీతల ॥

అచ్చమైన దేవుళ్ళు ఆసపడి కూడుదురు
తచ్చి తచ్చి రతులకుఁ దమకింతురు
హెచ్చి శ్రీవేంకటేశ ని న్నెనసె నలమేల్మంగ
మచ్చికైన విభుఁడవు మానరాదు గాని. ॥ నీతల ॥ 405

నీలాంబరి

ప్రియముతోడుత నిన్నుఁ బిలువ నంపెను మమ్ము
రయమున నీకనైనా రావయ్య మావెంటను ॥ పల్లవి ॥

మచ్చిక నీ వాడిన మాటలు దలఁచుకొని
ఇచ్చల నెదురుచూచు నింతి నీకును
పచ్చదోరణాలు గట్టి పండుగనాటి వలెనే
విచ్చేతు వంటా నీకు విం దాయిత్తపెట్టెను ॥ ప్రియము ॥

తెలివ తన వరుసదినము దలఁచుకొని
గుఱిగాఁ బాన్పువఱచుకొని వున్నది
మెఱసి పెండ్లికివలె మేలుకట్లు గట్టించి
పిఱిగొన ముత్యాలపేఁట పట్టు వెట్టెను ॥ ప్రియము ॥

కోరి నీవు గూడేటికూటమి దలఁచుకొని
గారవపు సింగారానఁ గై సేసెను
యీరీతి శ్రీవేంకటేశ యెనసితి వీకె నిట్టె
మేరతో నలమేల్మంగ మెద యెక్కి నిపుడూ. ॥ప్రియము॥ 406

ముఖారి

చెలులాల యిఁక మీకుఁ జెప్పే దేమే
తలపోఁతలకు నెల్ల వలపే మూలమే ॥ పల్లవి ॥

కన్నులఁ జూచినచూపు కాంక్షలకు మూలము
సన్నలు సరసాన రేఁచఁగ మూలము
విన్న వినుకులు కడు విరహానకు మూలము
విన్నపములకు నెల్ల విభుఁడే మూలము ॥ చెలులాల ॥

సంతోషముల కెల్ల జవ్వనమే మూలము
చింతల కెల్లాఁ జెక్కుచేయి మూలము
చెంతనున్న సిగ్గులకు చిరునవ్వులే మూలము
మంతనపు కోరికెకు మనసే మూలమే ॥ చెలులాల ॥

పెనఁగులాటలకును ప్రియములే మూలము
నను పులకుఁ బాయని నంటు మూలము
యెనసి శ్రీవేంకటేశుఁడే నలమేలుమంగను
తనివోని రతులకు తమకమే మూలమే. ॥ చెలులాల ॥ 407

గౌళ

యెంత చెలుబడో కాని ఇదివో తాను
కాంతుఁడు తనమాటకుఁ గా దనేనా నేను ॥ పల్లవి ॥

సన్నల చాయలవాఁడు సందుకొని వచ్చె నేఁడు
చన్నులు వట్టేఁ జూడవే జాజరకాఁడు
యెన్నెసి నవ్వులు నవ్వీ నెంతైనాఁ బోనీఁడు
కన్నెలఁ గంటేఁ జాలు కాతరీఁడు ॥ యెంత ॥

తనతో నలుగలేదు తానే తీసె వాదు
పొనుఁగ నిఁక నేఁటికే పొద్దు వోదు
చెనకె నూరకే నన్ను చెప్పితే నెంత లేదు
వనితలతోఁ బోర వరుసగాదు ॥ యెంత ॥

కందువతోఁ గాఁగిలించి కడు గురుతులు నించి
యిందరిలో నా గుణాలు యెంచి యెంచి
మందలించి నన్ను నేలె మక్కువ నాపైఁ బెంచి
అందపు శ్రీవేంకటేశుఁ డతివల మించి. ॥ యెంత ॥ 408

479-వ రేకు దేవగాంధారి

నావంకఁ గడమ లేదు నాఁడు నేఁడు
భావించితే నీతో నేను పంతమాడే దాననా ॥ పల్లవి ॥

కొత్తలు నేర్చుకొంటివి కొంగువట్టి పెనఁగేవు
చిత్తము వచ్చినట్టెల్లాఁ జేయవయ్యా
బొత్తుగా నీ వాపెచేత బుద్ధులు వినఁగాఁ గాక
హత్తి నీతో నేఁ దొల్లి అలిగితినా ॥ నావంక ॥

సంకె లేదేమిటా నీకు సారె నొడఁబరచేవు
అంకెకు వచ్చినట్టల్లా నానతీవయ్యా
లంకెయై నీ వాపెవలలఁ జిక్కఁగాఁ గాక
మంకుఁదనాన నే నీతో మారుకొనఁగలనా ॥ నావంక ॥

మేను ముట్టి నాతో నీవు మేలము లాడవచ్చేవు
నానావిధాల నీవు నవ్వవయ్యా
మోనాన నన్నేలి యాపెమోము చూడఁగాఁ గాక
ఆనుక శ్రీవేంకటేశ అవుఁగా దనేనా. ॥ నావంక ॥ 409

నారాయణి

మే లెఱిఁగి జవరాలి మెచ్చవద్దా
జాలిఁబడి నీ వేల జంకించేవయ్యా ॥ పల్లవి ॥

చెక్కుల నీ చెమటలు చేతఁ దుడిచితేను
చక్కని రమణి నేల సాదించేవయ్యా
నెక్కొని పీడియున్న నీ తురుము ముడిచితే
నిక్కవలు మోవఁగా నేల తిట్టేవయ్యా ॥ మేలె ॥

ప్రేమతోడ నీకు దప్పికిఁ బన్నీ రిచ్చితేను
కోమలపు సతి నేల గుంపించేవయ్యా
నీమేని కలపు దీర నిండా గందము పూసితే
ఆముక సిగ్గున నేల అదలించేవయ్యా ॥ మేలె ॥

పైకొన్న నీ నిద్దురకుఁ బానుపు వరచితేను
శ్రీకాంతచన్ను లేల పిసికేవయ్యా
యీకడ శ్రీవేంకటేశ యీకె నిట్టే కూడితివి
జోకైన రతుల నెంత చొక్కించేవయ్యా. ॥ మేలె ॥ 410

కన్నడబంగాళం

యెదమాట లేక నేల యెనసినపనులకు
గుడిగొన్న మీలోనికోరికె పీదేరెనూ ॥ పల్లవి ॥

వాలికమోము వంచి వనిత నీకు మొక్కఁగా
కేల నెత్తి నీ విట్టే కాఁగిట నించేవూ
మేలువారే మీ రిద్దరు మేను మేను సోఁకెఁ గాన
తాలిమితో మీలోని తలఁపు లీడేరెను ॥ యెద ॥

తేనె గారేమోవి యెత్తి తెఱవ మాఁటాడితేను
అనుక తమ్మల మిడి యాదరించేవూ
వూనిన జాణలే మీరు వొకరొకరిఁ జూచితే
పూనుకొన్న మీతొల్లిటి పొందు లీడేరెను ॥ యెద ॥

చిగురుఁజేతులు చాఁచి చెలి నీపాదా లొత్తితే
వొగిఁ జన్ను లంట రతి నోల లార్చేవూ
తగు నాకెకు నీకీ చేఁతలు శ్రీవేంకటేశ్వర
అగపడ్డ మీరతుల యాఁకట లీడేరెనూ. ॥ యెద ॥ 411

అమరసింధు

యేమిటికే చెలులాల యెవ్వరి నేమనేనే
నా మగఁడే దయనేసి నన్ను నేలీఁ గాక ॥ పల్లవి ॥

చిత్తజుని దూర నేల చిలుకలఁ దిట్ట నేల
యిత్తల నామనసే యింత సేయఁగా
కొత్తచంద్రుఁ దేమి సేసు కోవిల కేడ నేరమి
హత్తిన నా కోరికలే ఆరడి సేయఁగను ॥ యేమి ॥

చల్లగాలి ననే దేమి చందనముతోఁ [1]బనేమి
పల్లదపు నా వలపే పరచఁగాను
చిల్లరవిరులు మేలే చెఱకువిల్లు మంచిదే
వెల్లివిరై నాయాసలే వెనుకొనఁగాను ॥ యేమి ॥

మెఱుఁగుతోఁ బోరవద్దు మేఘము జంకించవద్దు
చిఱుత నా జవ్వనమే చిమ్మిరేఁచఁ గా
యెఱిఁగి శ్రీవేంకటేశుఁ డింతలోనే వచ్చి కూడె
మఱి చింత లేదు నా జన్మ మీడేరఁగాను. ॥ యేమి ॥ 412

1. తే. పా.—బగేమి

రామక్రియ

ఆడవే వొకమాట ఆయములు గరఁగఁగ
చూడవే శిరసెత్తి చూప నేల సిగ్గులూ ॥ పల్లవి ॥

విలువునఁ దొలఁకేవి నిండు మదనకళలు
పలుకులఁ గురిసేవి పచ్చితేనెలు
నెలవుల వడిసేవి చిఱునవ్వువెన్నెలలు
చెలియ నీ కెవ్వ రీడే సింగారవతివి ॥ ఆడ ॥

కన్నులను మలసేవి కాఱుమెఱుఁగు మించులు
చన్నులఁ దొట్టుకొన్నవి జవ్వనములు
నెన్నుదుట మురిసేవి నెఱినీలపురంగులు
కన్నియ నీ కెవ్వ రీడే కడు మోహనాంగివి ॥ ఆడ ॥

తొడలఁ బెనఁగొనేవి తోరంపు మెఱుఁగులు
అడుగుల నున్నది సోయగపు టీవి
కడఁగి శ్రీవేంకటేశుకాంత ననుచే మేలు
పడఁతి నీ కెవ్వ రీడే బహువిలాసినివి. ॥ ఆడ ॥ 413

సాళంగం

చెప్పఁ గొత్తలై వున్నవి చెంది నీ మైగురుతులు
చొప్పు లెత్తఁగా నీ మనసున నెట్లుండునో ॥ పల్లవి ॥

వెన్నెలబాయిట నీవు వేఁగినంత నుండఁగానో
సన్నపుఁ జంద్రులు నీమై జాజుకొనేను
పన్నీరు దప్పికి నీవు పలుమారుఁ గొనఁగానో
చిన్నిచెమట చెక్కులఁ జిందఁగఁ దొడఁగెను ॥ చెప్ప ॥

పలుమారు వనములోఁ బాయక వుండఁగానో
చిలుకవొట్లు మోవిఁ జెలరేఁగెను
అల గాలిమండపమునందు నిద్దిరించగానో
పొలసి నిట్టూరుపుల బుసకొట్టె విపుడు ॥ చెప్ప ॥

గరిడిసాములు నీవు గనముగఁ జేయఁగానో
కురులు చెదరి కడుఁ గొప్ప వీడెను
యిరవై శ్రీవేంకటేశ యీడ నన్నుఁ గూడితివి
కరుణ నన్నేలఁగానో కళ లెల్లా నిండెనూ. ॥ చెప్ప ॥ 414

480-వ రేకు ఆహిరి

నాకు మీ నేరుపు చూచి నవ్వు వచ్చీని
చేకొని మీ కిద్దరికిఁ జెల్లుబ డౌనయ్యా ॥ పల్లవి ॥

పందెమాడి నీతోను పడఁతి చేయి వేసితే
అంది చిక్కించుకొనేవు అట్టే నీవూ
విందువెట్టే నని చెలి వేఁడుకొన్నా మానవు
కందువకు రమ్మనేవు కడు జాణవయ్యా ॥ నాకు ॥

కానుకగా నిమ్మపండ్లు కాంత నీకుఁ జూపితేను
ఆనుక చన్ను లందుక అట్టే తీసేవు
పూని నీకు మొక్కినాను పోనియ్యక పెనఁగుతా
తేనెమోవి యిమ్మనేవు దేవరవయ్యా ॥ నాకు ॥

కదిసి వీడె మిచ్చితే కడుఁ దమకముతోడ
అదనఁ గౌఁగిట నించే వంతలోననే
యిదివో శ్రీవేఁకటేశ యెనసినాఁ దనియవు
పదిమారులుఁ గూడేవు పంతగాఁడవయ్యా. ॥ నాకు ॥ 415

కాంబోది

ఇంక నేలే నిష్టూరాలు యింటికి వచ్చె నాతఁడు
కంకణము గట్టుకొని కలయుట గాకా ॥ పల్లవి ॥

పువ్వులవేసినవారిఁ బూఁచికాయల వేతురా
నివ్వటిల్లఁ గప్రమైనా నించుట గాక
నవ్వినవిభుని నీవు నాఁటఁ జూచి జంకింతురా
చివ్వనఁ బై వలపులు చిలుకుట గాక ॥ ఇంక ॥

కిన్నెర మీటఁగాను గిడిబిళ్ళు వాయింతురా
పన్ని నీవు సుతి గూడి పాడుటగాక
చన్ను లాతఁ డంటఁగాను సణఁగులు రాలుతురా
సన్నలనే సరసాలు చల్లుట గాకా ॥ ఇంక ॥

తీపులు పైఁ జల్లఁగాను వేఁపచేఁదు వోదురా
యేపునఁ బంచదారైనా నిచ్చుట గాక
పైపైఁ గూడే శ్రీ వేంకటపతి నలయింతురా
చూపట్టురతుల నిట్టే చొక్కింతురు గాకా. ॥ ఇంక ॥ 416

పాడి

అతఁడెక్కడ నున్నాఁడో అతివలు నా కెఱిఁగించరే
రతి కెక్కెను నా తమకము రాతిటనుండియును ॥ పల్లవి ॥

తలఁచిన నూరక మదిలో దైవారీఁ దలపోఁతలు
పలికెదనంటే మానమే పరగీఁ బెదవులను
నిలిచెదనంటేఁ దొట్టీ నివ్వెరగులు నిలువుననే
చెలులాలా నా విరహము చెప్ప నలవిగాదే ॥ అత ॥

చూచిన నాతనిరూపే సుడిసీ దిక్కుల నెల్లను
కాచుక వున్నవి కాంక్షలు కన్నుల మీఁదటను
లాచీనిదివో పతి మేలపుమాటలు విన వీనులు
యాచందపు నా మోహం బెన్నఁ గొలఁది గాదే ॥ అత ॥

తడవిన నాతనిపేరే తగిలీ నాలికెమీఁదను
పిడిచిన గారీ చెమటలు పిచ్చిలిచెక్కులను
తడయక శ్రీవేంకటేశుఁడు తా నిటు విచ్చేసి కూడెను
యెడయక సంతోషము నా కింతం తనరాదే. ॥ అత ॥ 417

మాళవిగౌళ

యెక్కడౌతా నెఱఁగవు యిదివో నీ వైతేను
చక్కదిద్దుకొనవమ్మ సమరతి చిహ్నాలు ॥ పల్లవి ॥

సరులు చన్నులమీఁదఁ జల్లువెద లాడఁగాను
విరులు కొప్పుననుండి వెస రాలఁగా
వొరసి నీ పతివద్దనుండి నీవు రాఁగాను
తరుణులు నిన్నుఁజూచి తమలో నవ్వేరు ॥ యెక్క ॥

చెక్కులవెంటాను పెంజెమటలు గారఁగాను
ముక్కున నిట్టూర్పులు ముంచఁగాను
నెక్కొన రతి నోలాడీ నీడ చూచుకొనఁగాను
చక్కఁ జూచి సతులెల్లా సన్న సేసుకొనేరు ॥ యెక్క ॥

కన్నులను చెంగావి కడుఁ దలుకొత్తఁగాను
పన్నుగఁ గళలు మోముపైఁ దేరఁగా
యిన్నిటా శ్రీవేంకటేశు నెనసి నీ వుండఁగాను
కన్నె లెల్లాఁ జూచి నీ గతు లాడుకొనేరు. ॥ యెక్క ॥ 418

సామంతం

అది నీపట్టపుదేవు లడిగితేఁ జెప్పితిమి
యెదుట నేల దాఁచేవు [1] యెఱఁగిన పనికి ॥ పల్లవి ॥

వాలారుగోళ్ళ సోఁక వనితా నీవు సంగడిఁ
గేలుఁగేలుఁ బెనచుక కేరి నవ్వరా
మేలిమిపొదరింటిలో మీ రిద్దరు నల్లప్పుడు
తాలిమితోడ నేకతము లాడుకొనరా ॥ అది ॥

అక్కజపుఁ దమితోడ నాపే నీవుఁ జెలరేఁగి
చెక్కుఁ జెక్కుఁ జేర్చి వావి చెప్పుకొనరా
మొక్కలానఁ జీఁకటిమూఁకమాఁకులలోన
అక్కరతో సరసము లాడుకొంటా నుండరా ॥ అది ॥

[2] చిడిముడి నొందొరులు చిగురుఁబానుపుమీఁద
తొడఁ దొడ నంటఁ గాలు దొక్కుకొనరా
కడు నేఁ డీకెఁ గూడితి గాక శ్రీవేంకటేశ్వర
యెదయక తొల్లి సేఁతలెల్లాఁ జేసుకొనరా. ॥ అది ॥ 419

---

1. తే. పా. — యెరింగిన, 2. తే. పా. — చిదుముడి.

పాడి

ఇంతివూడిగపువార మెంతైనా గద్దు పని
అంత [1]కలిగితే నీవే ఆడకు రావయ్యా ॥ పల్లవి ॥

వెలఁదిమాటలు నీకు విన్నపము సేసితిమి
అలరి మఱచుమాట లానతీవయ్యా
నెలకొని వాకిటనే నిలుచున్నది మారాక
తలఁచి తడ వైతేను తానే వచ్చునేమో ॥ ఇంతి ॥

అంది నీ కిచ్చితి మిప్పు డాకె వంపినలేకలు
అందులోనే వున్నవి ఆపను లెల్లా
అందలము వట్టు మనే నప్పుడే తమకించీ
ముందుగాఁ జెప్పవలె నీ మోహము లాపెకును ॥ ఇంతి ॥

కానికె నీ కిచ్చితిమి కంటిమి నీపాదాలు
తానూ వచ్చెను నీముందరికిఁ జెలి
ఆనుక శ్రీవేంకటేశ ఆపే నీవూఁ గూడితిరి
పూని వచ్చిన మాసేవ పొందుగా నీడేరెనూ. ॥ ఇంతి ॥ 420

481-వ రేకు భవుళి

మొగమోట లేక యెంత మోవనాదేవయ్య
మగువబీరము నీకు మంచిది గాదా ॥ పల్లవి ॥

చెలికత్తెయైనది చేయి వట్టి తీసితేను
బలిమి చూపె నందురా పంతగాఁడవు
మొలకచన్నులఁ గొంత మొనలు దాఁకించితేను
కలికితనాల దిది గబ్బి యందురా ॥ మొగ ॥

బత్తిగలది గొంత పకపక నవ్వితేను
హత్తి మందెమేళ మెంత అందురా నీవు
కొత్తగొత్త [2]మాటలను కూరిమి గొసరితేను
తత్తరపు కతకారితనము లందురా ॥ మొగ ॥

---

1. తే. పా. – కలితే, 2. తే. పా. – మాంటలగు.

పట్టపుదేవులై నది పైకొని కౌఁగిలించితే
గట్టువా యందురా కాంతలలోను
అట్టే శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
చుట్టమై నిన్నుఁగూడె జూటరి దందురా ॥ మొగ ॥ 421

సామంతం

ఆఁటది గూళయైతే నం దేమున్నది
చీటికి మాటికి నింత సిగ్గులు విడుతురా ॥ పల్లవి ॥

సవతినంటా నాతో సణఁగులు చల్లి చల్లి
తివురుచు వచ్చి యేల తెర దీశేవే
పవళించివున్నవాఁడు పానుపుపై రమణుఁడు
వివర మెఱఁగ కేల వేగిరించేవే ॥ ఆఁట ॥

వరుస నా దెంటా నీవు వట్టి రొద లెల్లాఁ జేసి
పరగ నేల మంచముపైఁ గూచుండేవే
నిరతిరతి నలసి నిద్దిరింపుచున్నవాఁడు
వెర వెఱఁగక యేల వేగిరించేవే ॥ ఆఁట ॥

అంతలో నా యీడుదాన నంటా లోను చొచ్చి వచ్చి
కాంతుని నీ వేఁటికిఁ గౌఁగిలించేవే
చెంత మేలుకొని నన్ను శ్రీవెంకటేశుఁడు గూడె
వింతదానవై యేల వేగిరించేవే. ॥ ఆఁట ॥ 422

లలిత

ఆతఁడే యెఱుఁగును అన్నిపనులు
నీతి యెంచితే తన నెలఁత నే ననవే ॥ పల్లవి ॥

మలసి యాడఁ జొచ్చితే మాట లెన్నైనాఁ గలవు
తలఁచితే నెన్ని లేవు తలపోఁతలు
నెలకొన్న దెఱఁగవా నీరుకొలఁది తామర
చెలియరో నే నేమని చెప్పేనే నీకూ ॥ ఆత ॥

మునుకొని నవ్వితేను మొగమెల్లా నవ్వులే
కనుఁగొంటే నిండుకొనుఁ గనుచూపులు
పెనఁగ నేఁటికే నీవు పిండెంతే నిప్పటి
దినదినము నెంతని తెలిపేనే నీకు ॥ ఆత ॥

కడు నెంత వెరిగినా కౌఁగిటిలోనే చన్నులు
బడివాయకుండితేను పాయదు తమి
అదరి శ్రీవేంకటేశుఁ డంతలోనే నన్నేలె యీ
యెడఁ బైఁడెంతే తూని కేమనెనే నీకూ. ॥ ఆత ॥ 423

భైరవి

నెలఁత నిన్నుఁ జూచితే నిలువు నూరు వండీని
యెలమి నీ పుణ్య మిఁక నెంతనఁగ వచ్చునే ॥ పల్లవి ॥

చిత్త మెల్లఁ జిగిరించె చింత లెల్ల నొగిరించె
బత్తితోడ నింటికి నీ పతి రాఁగాను
హత్తిన తురుము వీడె నంగజముద్రలు గూడె
ఇత్తల నీవు సేసిన దెంత భాగ్యమే ॥ నెలఁత ॥

నెలవి నవ్వులు దేరె చెమటలు దైవారె
మలసి యాతఁడు నీతో మాటలాడఁగా
కళలు మోమున మించె కరఁగులు గానిపించె
యెలమి నీ నోమిననో మే మని చెప్పేమే ॥ నెలఁత ॥

చేతికిఁ గౌఁగిలి చిక్కె చెక్కులఁ బులక లెక్కె
యీతల శ్రీవేంకటేశుఁ డెనయఁగాను
ఆతని కిదే తావు అలమేల్మంగవు నీవు
నీ తపము నే మెట్టు వర్ణించఁ గలమే. ॥ నెలఁత ॥ 424

సామంతం

కా దనేపాటిదాననా ఘనుఁడు తనమాటకు
ఆదరించితేఁ దన అంకెలో నుండేనే ॥ పల్లవి ॥

చెంరేఁగి రమణునిచిత్తము వట్టుటగాక
చలపాదితన మేల సకియకును
చెలులాల న న్నేల చేరి వొడఁబరచేరే
యెలమిఁ దా విచ్చేసితే నెదుట మొక్కనే ॥ కాద ॥

ఇయ్యకొని పతితోడ నిచ్చకమాడుట గాక
గయ్యాళితన మేలే కామినికి
చెయ్యిఁ జెక్కుఁ బట్టి యెంత చేకొని వేఁడుకొనేరే
చయ్యనఁ దా మటాడితే సమ్మతించి వినేనే ॥ కాద ॥

ఇక్కువ శ్రీ వేంకటేశుఁ దేలితేఁ గూడుట గాక
తక్కరితనము లేలే తరుణికిని
గక్కన నే నలమేల్మంగను పెనఁగెద రేలే
అక్కన నన్ను నిలిపె నన్నిటా మెచ్చేనే. ॥ కాద ॥ 425

వరాళి

యేల బయ లీఁడించేరే యింతులాల
మేలిమి బత్తి [1]గలిగితే మీ రాతనిఁ దేరే ॥ పల్లవి ॥

తప్పక చూచినాను తనివోని యాసలు
వొప్పుగ నెడమాటల నూరడిలీనా
ముప్పిరి నెడ [2]మాటల ముంచుకొన్న వేడుక
చప్పు డాలించినంతలోఁ జాలఁబోయీనా ॥ యేల ॥

సరసము లాడినాను జడియని వలపులు
తెరమాఁటు సన్నలనుఁ దీర్చవచ్చీనా
నిరతపుసన్నల నిండుకొన్నకోరికెలు
గరిమ నవ్వినంతనే కాఁక వాపీనా ॥ యేల ॥

కాయముఁ గాయముఁ గూడి కదివోని తమకము
చేయెత్తి సేసవెట్టితే సెలవయ్యీనా
యీయెడ శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
చాయకు వచ్చి న న్నేలె జంట వాసీనా. ॥ యేల ॥ 426

1. తే. పా. – గలితే, 2. తే. పా. – మాంటల.

482-వ రేకు నాగవరాళి

విన్నవించి రమ్మనెను వెలఁది నీతో మమ్మ
 వున్న దదే సిగ్గుతో నీవొద్దనే సుమ్మీ ॥ పల్లవి ॥

చక్కఁబొట్టు వెట్టుకొని సుదతి నీ పాదాలకు
 మొక్కి యంటించెను తనముద్రగాను
 నిక్కముగఁ జూచుకో నీవు దనవాఁడవని
 యిక్కువగానుఁ బెట్టిన ఇదె గుఱి సుమ్మీ ॥ విన్న ॥

కొప్పువిరులు రాలఁగ కొమ్మ నీతోడఁ బెనఁగి
 చొప్పువేసె నీవు దనసొమ్ముగాను
 ముప్పిరి నెంచుకో నిన్ను ముందే తాఁ గైకొంటినని
 చెప్పిచూపి పెట్టిన లచ్చెనలు సుమ్మీ ॥ విన్న ॥

అలమేలుమంగ నీ యక్కుమీఁద నేపొద్దు
 నెలకొనీఁ దన కదే నెలవు గాను
 యెలమి శ్రీవేంకటేశ యీకె నీ మేనికి
 సలిగెతో వలపులశాసనము సుమ్మీ. ॥ విన్న ॥ 427

శంకరాభరణం

నెలఁతకు నేపొద్దూ నీమీఁదిదే పరాకు
 అలరి తడవుసేయక ఇట్టే రావయ్యా ॥ పల్లవి ॥

సారె మా విన్నపా లెల్లాఁ జన విచ్చి వింటివి
 నీరువలెఁ గరఁగెను నీ చిత్తము
 తారుకాణ చూచుకో తరుణివలపు లిఁక
 చేరి మారుమా టేమని చెప్పుదుమయ్యా ॥ నెల ॥

పడఁతి యంపిననిమ్మపండు చే నందుకొంటివి
 వుడివోని సంతోసాన నుప్పొంగితివి
 బడి నాపెతో నాడినపలుకులు దలఁచుకో
 తడవి నీ కాపెపై తలఁ పెట్టిదయ్యా ॥ నెల ॥

నెమ్మది మావెంటనే నీవు విచ్చేసి మా
యమ్మపాన్పునఁ గూచుండీ అమరితివి
యిమ్ముల నలమేల్మంగ యీకె శ్రీవేంకటేశ్వర
సమ్మతిలఁ గూదితివి జాణ వౌదు వయ్యా. ॥ నెల ॥ 428

హిజ్జిజి

యిదివో మా విన్నపము ఇంతిభాగ్య మిటమీఁద
గుదిగొన్న వేడుకలు కుప్పవడీని ॥ పల్లవి ॥

కొత్తకొత్త సిగ్గులతో కోమలి నీకు మోహించి
చిత్తములోనిమాటలు చెప్పఁజాలదు
ముత్తరపుఁదమకము ముంచుకోఁగా నీ మేన
వొత్తుదై చెమట లెల్ల వూరఁ జొచ్చె నిపుడు ॥ యిది ॥

వుడివోనియానోదము లుమ్మగిలఁగా లోలో
తడఁబాటువిరహము దాఁచఁ జాలదు
బెడిదపుఁగోరికలు పెనఁగొనఁగా నిట్టే
కడలేనిపులకలు కడు నుప్పతిల్లెను ॥ యిది ॥

నెలవిఁ జేరు నవ్వులు చిందఁగా నిన్నుఁ గూడి
అలమేలుమంగ పాయఁగఁ జాలదు
యెలమి శ్రీవేంకటేశ యీకె మన్నించఁగాను
తలపోఁత కళలతో దైవారులు వారీని. ॥ యిది ॥ 429

నారాయణి

శిర నెత్తి చూడవయ్యా సిగ్గువడకా
పెరుగఁగా మీఁద మీఁదఁ బేరీఁ జుమ్మీ వలపు ॥ పల్లవి ॥

గుబ్బలపైగందము గొప్ప వుంటనేసి యింతి
వుబ్బుచు నిన్ను వేయఁగా నూరకుందేవు
గబ్బితనమున నాపె కమ్మటి నిమ్మపంటను
గొబ్బున వేయఁగా నీకొప్పు దాఁకె నదివో ॥ శిర ॥

కొప్పులోనితామెరఁ గొని నిన్ను వేయఁగాను
ఒప్పుగా మాటలాడ కూర కుండేవు
కప్పురపు లప్ప నిట్టె కాంత నీపై మీఁటఁగాను
చిప్పిలుఁజెమటతోడిచెక్కు దాకె నిదివో ॥ శిర ॥

నిగ్గునఁ జెలి సురటి నీకుఁ జూపి వీయఁగాను
ఒగ్గుచు నంమకొనక వూరకుండేవు
అగ్గమై శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
దగ్గరి కూడఁగాఁ గళ దాఁకె నీకు నిదివో. ॥ శిర ॥ 430

దేశాక్షి

యెంత గట్టువాయ యిది యేడ గలిగె నీకు
యింతి యెందుండి వచ్చెను యెవ్వతెయ్యా ॥ పల్లవి ॥

నెలఁత సారె సారెకు నీపాదాలు పిసుకుతా
సలిగెలు చూపీని సవతులకు
పిలువని పేరటము పెందలకాదే వచ్చి
కొలువులు సేసితనగుఱు [1] తెఱఁగించీని ॥ యెంత ॥

వట్టాడిగాలు సేసి నీవద్దనే కాచుకుండి
చుట్టరికాలు చెప్పీని సుదతులతో
చుట్టి చుట్టి నీ మొగముచూచి తానే నవ్వుతాను
యెట్టనెదుటనే వుండి యెమ్మెలు చూపీని ॥ యెంత ॥

విరులు నీకు ముడిచి విన్నపాలు సేసుకొంటా
దొరతనములు చూపీఁదొయ్యలులకూ
వురాన నలమేల్మంగ వుండఁగా శ్రీవేంకటేశ
తెరవేసి పీడె మిచ్చి తేలించీ మాటలను. ॥ యెంత ॥ 431

భైరవి

చూడరే వో చెలులాల సుద్దు లేమి చెప్పీఁ దాను
వేడుకఁ దనచేఁతలు వెల్లా విరులాయను ॥ పల్లవి ॥

1. తే. పా.—తెరిoగించ్చీని.

వెలయ సారెఁ దనకు విన్నపము సేసే దేమే
తలఁపులోపలి మాట తా [1]నెఱుఁగును
చలములు తనతోనే సాదించేదాన నటే
కలువపూవులవేటు కమ్మెఁ జంటిమీఁదను ॥ చూడ ॥

తగిలి తనతో నేను తారుకాణించే దేమే
నగవు తనవెలవి నానుచున్నది
పగటునఁ దనతోను పంతమాడేదాననటే
బిగువుఁ గౌఁగిట మోవి పిప్పిగట్టె నిపుడు ॥ చూడ ॥

సొలసి సొలసి తన్ను సూటిగాఁ జూచే దేమే
పులకలు తనమేనఁ బొదిగొనేను
యెలమి శ్రీవేంకటేశుఁ దే నలమేలుమంగను
మలసి వలపులను మరిగించె నన్నునూ. ॥ చూడ ॥ 432

483-వ రేకు మంగళకౌశిక

చెప్పినట్టు సేసేఁగాక చేపట్టి పెనఁగ నేల
కప్పుర మిచ్చేవు నాకు కానీ లేవయ్యా ॥ పల్లవి ॥

సలిగెలు చూపేవారు సణఁగులు చల్లేవారు
చెలిమి సేసేనతులు శేనాశేన
నిలిచి నాతో నవ్వేవు నే నేమి బాఁతి నీకు
వెలయ నా చెక్కునొక్కి వేఁడుకో నేలయ్యా ॥ చెప్పి ॥

తప్పక చూచేటివారు తమి నీకు రేఁచేవారు
కొప్పు దువ్వేటికాంతలు కోటానఁగోటి
నెప్పునఁ జన్ను లంటేవు నీ సరిదాననా నేను
ఇప్పుడే మందెమేళాలు యేల మరసేవయ్యా ॥ చెప్పి ॥

గద్దించి కూడేవారు కానుక లిచ్చేవారు
వొద్ద నుండేచెలులు తండోపతండాలు
అద్దుక శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
పెద్దగాఁ గూడితి వింత ప్రియపడ నేలయ్యా. ॥ చెప్పి ॥ 433

---

1. తే. పా. — నెరుంగును.

శ్రీరాగం

చెప్పవే నా కాసుద్ది చెవులార వినేఁగాని
కప్పుదేరి నీ మోవి కడు నందమైనది ॥ పల్లవి ॥

జోఁలునఁ జెమట గారీ చొక్కపుగుబ్బలవెంట
జాఱీని పీఁపుమీఁద చక్కనికొప్పు
మీఱీఁ గళలు నేఁడు మిక్కిలి నీ మొగమున
ఆఱడి నీ వేఁటి కింత యలసి *వున్నదానవే ॥ చెప్ప ॥

అడుగులు దడఁబడీ నందమైన నడపుల
[1]చిడిముడి వదలీ ముంజేతిగాజులు
తొడిఁబడ నొసలికస్తూరిబొట్టు చెదరీని
వెడవెడగా నేఁడు వింతమై *వున్నదానవే ॥ చెప్ప ॥

కమ్మి చెంపలఁ బూసినగందపుబేట్లు రాలీ
వుమ్మగిలుఁ బులకలు వుప్పతిల్లీని
నెమ్మి శ్రీవేంకటేశుఁడు నీ వలమేలుమంగవు
దొమ్మిఁ గూడితిరో మీరు దొరసివున్నారు. ॥ చెప్ప ॥ 434

ఆహిరి

యివి యేసుద్దులు మరి యేమడిగే విఁక మమ్ము
తివిరి చూతువుగా నీ దిష్టము రారాదా ॥ పల్లవి ॥

వుమ్మగిలు జవ్వనమే వుప్పతిల్లీ ఇరువంకా
కొమ్మకుఁ బెరిగి పెద్ద కొండ లాయను
పమ్మినతమకములు పట్టరాక పిరుదులై
దిమ్మలు రేఁగి యిసుకదిబ్బ లాయను ॥ యివి ॥

తలపోఁత లన్నియును తలనీలాలై నించి
చెలిఁ గప్పుకొని పెనుఁజీఁక టాయను
వలపులు పిక్కటిల్లి వాడిగోళ్ళై కొనసాగి
ములుకులై చిన్నిమల్లెమొగ్గ లాయను . ॥ యివి ॥

---

* తే. పా. – వుండ్డానవే, 1. తే. పా. – చిడుముడి.

నెఱి శ్రీవేంకటేశుఁడ నీవు గూడఁగా మనసు
 కఱఁ గెలమేల్మంగకుఁ గళ లాయను
 జఱసి రతిపరవశములు మోవిమీఁది
 గుఱుతులై రత్నాలకుప్ప లాయను. ॥ యివి ॥ 435

శ్రీరాగం

తడఁబడీ మీ సొమ్ములు తారుమారై యిద్దరికీ
 అడియాలా లివి చూచి అరుదయ్యీ మాకు ॥ పల్లవి ॥

[1] మెలఁతగుబ్బలమీఁద మించె నీలాలహారము
 తలకొని నీ వెప్పుడూ ధరించే దిదా
 వెలలేని మాణికాల వింతయైనవుంగరము
 అల నీవేల నున్నది ఆపె నీకొసగెనా ॥ తడ ॥

మగువపాదమున బొమ్మలపెండె మున్నది
 నిగనిగమనీ నదే నీ విచ్చినదా
 మొగపుల బాహుపురి ముంజేత నీకున్నది
 అగపడీ గుఱుతుగా నాపె నీకుఁ బెట్టెనా ॥ తడ ॥

అలమేల్మంగకు నీకు నమరెను మొలనూళ్ళు
 మలసి మీరిద్దరును మార్చుకొంటిరా
 యెలమి శ్రీవేంకటేశ యీ చొప్పులు నేఁగంటి
 బలిమి నాకెకు నీకుఁ బాయరానిపొందులా. ॥ తడ ॥ 436

భైరవి

పట్టపుదేవులవు బలిమిగలదానవు
 నెట్టుకొన్నరతుల నీ నేర్పు చూపరాదా ॥ పల్లవి ॥

సిగ్గులు వడ నేఁటికే చిఱునవ్వు లేఁటికే
 వొగ్గి నీ విభుఁడు నిన్ను నొడివట్టితే
 నిగ్గుల గరఁగే వేమే నివ్వెరగు వడే వేమే
 వెగ్గళించి నిన్నితఁడు వేఁడుకోఁగాను ॥ పట్ట ॥

---

1. తే. పా. – మెఱత.

కొచ్చి చూడ నేఁటికే గునియఁగ నేఁటికే
కుచ్చి రమణుఁడు నీ కొంగు వట్టితే
ముచ్చట మఱచితవే మోసము వట్టితివవే
మచ్చిక నాతఁడు నీతో మాటలాడఁగాను ॥ పట్ట ॥

వావిరిఁ గొంక నేఁటికే వలపు దాఁచ నేఁటికే
శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జేరి కూడఁగా
నీ వలమేల్మంగ వెంతే నేఁటి సంతోసము లెంతే
చేవ దే రేతఁడు నిన్నుఁ జిమ్మి రేఁచఁగాను. ॥ పట్ట ॥ 437

ముఖారి

చెప్పరే మీరైనా బుద్ధి చెలువునికి
ఇప్పు డెంతబుజ్జగించీ నెరవులదానన ॥ పల్లవి ॥

సూటిపడఁ దా నెన్ని సుద్దులు చెప్పినాను
మాటల నే నూఁకొనేనా మందెమేళాన
చోటిచ్చి తనవద్దఁ గూచుండుమని పెనఁగిని
సాటి కియ్యకొనఁగ నే సరిదానన ॥ చెప్ప ॥

పూనిపట్టి తా నిట్టే పూవులచెం డియ్యవచ్చి
కానుక లందుకొనేనా కడు గర్వాన
తానే నా మొగ మెత్తి తనమోము చూడుమనీ
అనుకొని నాఁటఁ జూడనంత దిట్టదానన ॥ చెప్ప ॥

ఆముకొని తా నెంత ఆయములంటినాను
సాము దనతోఁ జేసీనా సరి పంతాన
యీమేర శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
ప్రేమ నేలెనే మొక్కి పిల్వ వింతదానన. ॥ చెప్ప ॥ 438

484-వ రేకు పాడి

యెంతని చెప్పఁగ వచ్చు నింతి నీపైకూరిమి
వింతలాయ మాకు నెట్టివేడుకో నీమీఁదను ॥ పల్లవి ॥

గుబ్బలఁ బూసిన యట్టికుంకుమ నీ మేన నంట
నబ్బురానఁ గొప్పు దువ్వీ నంగన నీకు
వుబ్బున నీవు గోర నూఁదినది నెఱఁగదు
పబ్బినది యెటువంటిపరాకో నీమీఁదను ॥ యెంత ॥

కడుఁ జెక్కులజవ్వాది గరఁగి నీపైఁ జింద
[1]చిడిముడితో నిన్ను సింగారించీని
బెదఁగుఁజన్నులు నీవు పిసికినా నెఱఁగదు
యెదయని పరవశ మెంతో నీమీఁదను ॥ యెంత ॥

తురుము విరులు నీపైఁ దొరుగ నలమేల్మంగ
సిరుల నిన్ను నలమి శ్రీవేంకటేశ
పిరిగొనఁ గౌఁగిట బిగించినా [2]నెఱఁగదు
సురతాన నెటువలెఁ జొక్కెనో నీమీఁదను. ॥ యెంత ॥ 439

ఆహిరి

తగిలి పాయుటకంటే దవ్వుల నుండుటే మేలు
అగపడ్డ మోహము లాపలేని వారికి ॥ పల్లవి ॥

కూడిమాడి పొందుసేసి కొసరఁగవచ్చుఁగాని
పీడువడ్డ విరహాన వేఁగరాదు
వేడుకఁ దప్పక చూచి వెలయఁగవచ్చుఁగాని
వోడక రెప్ప మూసితే నోరువరాదు ॥ తగిలి ॥

గరిమ మొదల బిగ్గిఁ గౌఁగిలించవచ్చుఁగాని
వరుస వెనక మరి వదలరాదు
సరసపుమాటలు సారె నాడవచ్చుఁగాని
మరిగినమీఁద మఱవఁగరాదు ॥ తగిలి ॥

కలసి మెలసి యట్టె కడు నవ్వవచ్చుఁగాని
తలపునఁ గలమేలు దాఁచఁగరాదు
అలమేలుమంగపతియైన శ్రీవేంకటేశుఁడు
యెలమి ని న్నేలె నిఁక నింతం తనరాదు. ॥ తగిలి ॥ 440

---

1. తే. పా. — చిడుముడితో, 2. తే. పా. — నెరంగదు.

భవుళి

నీ దేవులగుణము నీవే యెఱుఁగుదువు
పోదితో నిప్పుడే వారి బుజ్జగించుకొనుమీ ॥ పల్లవి ॥

కాంతవూడిగపువారిఁ గైకొనక నీ వుండితే
నంతయు వారు చెప్పఁగా నాకె ని స్నేమనునో
చెంత నున్నచెలులము చేరి నీకుఁ జెప్పితిమి
వింతగా మీఁదటి యెత్తు విచారించుకొనుమీ ॥ నీదే ॥

లలనకడవారిని లాలించకుండితే వారు
కలవి లేనివి నంటే కలికిచిత్త మెట్టో
తెలిసినవారము తలఁపించితిమి నీకు
యెలమిఁ దగవు నీవే యెంచుకొనుమీ ॥ నీవే ॥

అలమేలుమంగ దూతికల మన్నించకుండితే
చల మెక్కించితే నింతిచంద మేరీ తౌనో
యెలమి శ్రీవేంకటేశ యీకె నీవుఁ గూడితివి
లలి నెచ్చరించితిమి చెలిమే నెరపుమీ. ॥ నీవే ॥ 441

రామక్రియ

మా [1] మాట వినఁగదవే మంకు లేఁటికే
కామునమ్ములకు గుఱిగా నిలువ వసమా ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి వేఁడుకొని చేయి చేతఁ బట్టుకొని
మక్కువ చల్లిఁ బతితో మాటలాడవే
లక్కవంటిది మనసు లాలించీ నాతఁడు నిన్ను
గక్కన నింతటనైనా గరఁగఁగవలదా ॥ మామా ॥

వొడివట్టి పెనఁగుతా నొడఁబరచుకొంటాను
తొడరేటి నీ మగనితోడ నగవే
విడువరాదు వలపు పీడె మిచ్చీ నాతఁడు
అడియాలమై చేవట్టి ఆదరించవలదా ॥ మామా ॥

1. తే. పా. – మాంట.

వావులు నీకుఁ జెప్పి వడి సరసము లాడీ
శ్రీవేంకటేశుని రతిఁ జెందఁ గదవే
దేవి వలమేల్మంగవు తేరి కూడె నిన్నితఁడు
తావుకొనఁ జేరె నిట్టే తగ మెచ్చవలదా. ॥ మామా ॥ 442

శంకరాభరణం

మట్టుతో నుండుటే మేలు మగువలకు
యిట్టె విభునితోడ నిచ్చకమే యాడవే ॥ పల్లవి ॥

కూరిమిగల పతిని కొసరఁగఁ బోదురా
సారమైన వల పెల్లాఁ జప్పఁజేతురా
గారవపుఁ జుట్టముతోఁ గడఁగి పెనఁగుదురా
కారుకమ్మె సరసాలు కరకరి సేతురా ॥ మట్టు ॥

మరిగిన చెలికానిమనసు సోదింతురా
గరిమల వేడుకలు కాకుసేతురా
యెరవులేనిచోట యెగ్గులు వట్టుదురా
నిరతపుపొందులలో నెరు సేరఁ బోదురా ॥ మట్టు ॥

శ్రీవేంకటేశ్వరుఁ గూడి చెక్కులు నొక్కుదురా
భావిం చలమేల్మంగవు పదరుదురా
వేవేలు రతులలో వెస నలయింతురా
చేవ దేర నవ్వు నవ్వి సిగ్గులు వడుదురా. ॥ మట్టు ॥ 443

నాదరామక్రియ

యీ రమణిచెలువము యేమని పొగడవచ్చు
తేరకొన విభునికి దినబోగా లాయను ॥ పల్లవి ॥

సరవి నింతిముఖచంద్రోదయమై యుండఁగా
గరిమ నవ్వువెన్నెల గాయఁగాను
సొరిది మోవికెంపులే చుక్కలు గాయఁగాను
యిరవై వొకవంక నిదే రేతి రాయను ॥ యీర ॥

సుదతివజ్రాలబొట్టు సూర్యోదయమై వుండఁగా
యెదుటఁ గనుమెఱుఁగు లెండ గాయఁగా
వుదు టుంగరకమలా లున్నతిఁ జెలఁగఁగాను
అదనఁ బట్టపగ లాయ నొకవంకను ॥ యీర ॥

[1]మెలఁత నెఱిఁదురుము మేఘోదయమై వుండఁగా
నెలమిఁ జెమటవాన లెసఁగఁగాను
అలమేలుమంగ యీకె ఆతఁడు శ్రీవేంకటేశుఁ
డిలపైఁ గూడఁగా సొమ్ములీపెవంక నాయను. ॥ యీర ॥ 444

485-వ తేకు సౌరాష్ట్రం

యేమి చెప్పేరే బుద్ధు లెందాఁకా నాకు
కామించి యాతఁడు రాఁగాఁ గాదనేనా నేనూ ॥ పల్లవి ॥

చుట్టరికమే [2]కలిగితే సుద్దు లెల్లా నింపు తాను
వెట్టికే మాటలాడితే వేసట వుట్టు
గుట్టుతోడి చిరునవ్వు గుణానకుఁ దేవచ్చు
బట్టబయలు నవ్వితే బాఁతి గాదు ॥ యేమి ॥

ఆసలు గలిగితేనే అంటుకొను వేడుకలు
బేసబెల్లి (?) వేడుకలఁ బ్రియము లేదు
వాసితోడి సిగ్గులు వన్నె కెక్కు నన్నిటాను
పూసగొండి (?) సిగ్గులైతేఁ బోది సేయరాదు ॥ యేమి ॥

సంతోసమైనప్పుడు సమ్మతౌను మొక్కులు
పంతముతోడి మొక్కులు పనికిరావు
ఇంతలో శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
వింతలుగా నన్నుఁ గూడె వెసఁ బాయ నోపను. ॥ యేమె ॥ 445

గౌళ

చెలుల కెల్లా నీవునేసిన వుపకారము
మలసి యాపెకౌఁగిలి మఱవకుమీ ॥ పల్లవి ॥

---

1. తే. పా.— మెలఁత, 2. తే. పా.—కలితే.

వేడుక నీ కత లెల్లా వీనులపండుగ గాను
ఆడుకోఁగా వింటిమి నే మందరిచేత
జోడుగా నొక్కతెను మెచ్చుగఁ దెచ్చుకొంటివట
పాడి దప్పక నీ వాకెఁ బాలించుమీ ॥ చెలుల ॥

కమ్మటి నీ చేఁతలు కన్నులపండుగ గాను
పమ్మి కనుఁగొంటిమి నీ పానుపుమీఁద
కొమ్మ యొకతె వున్నది క్రొత్తపెండ్లికూఁతురట
నమ్మి కిచ్చినట్లే మన్నన సేలుమీ ॥ చెలుల ॥

నెలకొన్న నీరతులు నిచ్చ పండుగలు గాను
తలఁచి మెచ్చితిమి నీ తనువు సోఁకి
అలమేల్మంగ నొక్కతె నక్కునఁ గట్టుకొంటివి
ఇల శ్రీవేంకటేశ్వర యీడేర్చుమీ. ॥ చెలుల ॥ 446

దేశాక్షి

నేఁ దన్నిటా జాణఁడవై నీవు నన్నుఁ గలసేవు
వేఁడుకొనేము పదారువేలకు మగఁడవా ॥ పల్లవి ॥

చెక్కులు నొక్కితే నీ నెలవులఁ బాలు చిందీ
చక్కని రేపల్లె పాలచాడే (?) దొంగవా
మొక్కి ముద్దికుకొంటే మోవి నావులు వచ్చీని
గుక్కక నీవు దొల్లి గొల్లమందవాఁడవా ॥ నేఁద ॥

వెసమాట లాడించితే వెన్నముద్దలే రాలీని
పొసఁగ గోపికలతో పొందువాఁడవా
పిసికితే నవ్వులఁ బేరి పెరుగులై
దొసఁగుల కపటపు దొడ్డివాఁడవా ॥ నేఁద ॥

కలిసితే మంచి తావి కౌఁగిటను జిడ్డు దేరీ
పెలుచుపనులఁ గాచే పెండ్లికొడుక
అలమేలుమంగపతివై శ్రీవేంకటాద్రి
నిలిచితి వేలఁ గొండ నీ వెత్తిన వాఁడవా. ॥ నేఁద ॥ 447

### ముఖారి

యెంత కుచ్చితురాలంటా నేల నన్ను దూరేవు నీ
చెంత నాకె వుండఁగాను సిగ్గుపడవలదా ॥ పల్లవి ॥

ఆకె నీవు నేకతము లాడుకొంటా నుండఁగాను
వాకిటను నిలుచుండవద్దా నాకు
చేకొని మీలో మీరు చేసన్నలు సేసుకోఁగా
దాకొని పరాకు సేయఁ దగవు గాదా ॥ యెంత ॥

చాయల నాకె నీవు సారె మొగాలు చూడఁగా
చేయి మాఁటువెట్టుకోను చెల్లదా నాకు
పాయక మీ రిద్దరును పచ్చడము గప్పుకోఁగా
యీయెడ నే జూజమాడే దితవే కాదా ॥ యెంత ॥

అలమేలుమంగ వురమందు నీకు నుండఁగాను
తలవంచుకొని మొక్కవలెఁగా నాకు
యెలమి శ్రీవేంకటేశ యేలితిరి మీరిద్దరు
వెలయ మిమ్ముఁ గొలువ వేడుకే కాదా. ॥ యెంత ॥ 448

### ఆహిరి

నీ సుద్దు లెల్లా విని నీకె మనసు పెట్టీ
ఆసపడి వున్నది నీ వాకెఁ జేకొనవయ్యా ॥ పల్లవి ॥

చందమామవంటిమోము చక్కఁదనములపోగు
కుందనఁపువంటిమేను కోమలపుదీ
అందపు నీలాలగని అతివకు పెనుఁగొప్పు
పొంద నీకే తగు నొక్క పొలఁతి వున్నదయ్యా ॥ నీసుద్దు ॥

కొండలవంటిచన్నులు గుటిమైన బటువులు
అండనే [1] సింహపునడు మతి సన్నము
గుండుఁ దీగెలే చేతులు కొనబైన (?) సోగలు
నిండుజవ్వని వున్నది నీకే తగునయ్యా ॥ నీసుద్దు ॥

1. తే. పా. – సింహ్వపు.

వలయపు బండికండ్లువంటి [1] పిఱుఁదు ఘనము
జలజపుఁ బాదములు సైకమైనవి
యెలమి శ్రీవేంకటేశ యెనసి నీ వురముపై
అలమేల్మంగ నీ కున్న దాపె తగునయ్యా. ॥ నీసుద్దు ॥ 449

సామంతం

ఇన్నిటాఁ దా నాయకుఁడు ఇల్లాలి నేను
కన్నులఁ జూడఁ జూడఁగా గనమే వేడుకలు ॥ పల్లవి ॥

చొప్పుగా నన్ను మన్నించే దొక్కటే గుఱుతు గాక
చెప్పితే నా విన్నపాలు శేనాశేన
అప్పుడు దాఁ జేపట్టిన దదియే యెన్నిక గాక
చొప్పుగా నే నాసపడఁ జో టెంతైనాఁ గలదు ॥ ఇన్నిటా ॥

వసమై తా నాయింటికి వచ్చుటే యెక్కుడు గాక
కొసరే నంటేఁ జేఁతలు కోటానఁగోటి
యెసగి తా నాతో నవ్వే దిదే సంతోసము గాక
పొసఁగె నా తమకము పూఁటపూఁట కెక్కుడు ॥ ఇన్నిటా ॥

కలిసివుండేటి తనకాఁగిలే సతము గాక
వెలసి నా సిగ్గులైతే వేయి వేలు
యిలఁ దా శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
వలెనని న న్నేలఁగాఁ జెలిమి యీడేరెను. ॥ ఇన్నిటా ॥ 450

486-వ రేకు ఛాయానాట

యేల సారె గరిసించే వింతిని నీవు
తాలిమి నీ తగవులు తగ నీ వెఱుఁగవా ॥ పల్లవి ॥

చలపట్టరాదుగాని సతులకు నీ మీఁద
వలపులఁ గొసరఁగ వచ్చు నెంతైనా
అలుగఁగరాదుగాని ఆసపడి నీతోను
సొలసి మచ్చికలెల్లాఁ జూపఁగవచ్చును ॥ యేల ॥

1. తే. పా. — పిఱుందు.

బిగియఁగరాదుగాని పెనఁగి పెనఁగి నీకు
మొగము చూపి చూపి మొక్కవచ్చును
జగడించరాదుగాని చనవు మెఱసి నీతో
నగి సరసములాడి నంటు చూపవచ్చును ॥ యేల ॥

పంతమాడరాదుగాని భావ [1]మెఱిఁగి నిన్ను
చెంతల గుబ్బల నొత్తి చెందవచ్చును
యింతటా శ్రీవేంకటేశ యీకె యలమేలుమంగ
సంతసానఁ గూడి మోవి చవి చూడవచ్చును. ॥ యేల ॥ 451

కేదారగౌళ

యిందరముఁ జెప్పఁగాను యేల సిగ్గులు వడేవే
విందువలె మోవి ఇచ్చి వీడె మియ్యరాదా ॥ పల్లవి ॥

చెక్కనఁ జే యేఁటికి చిరుజెమట లేఁటికి
పెక్కుమారులు నీ పతి పిలువఁగాను
ముక్కుమీఁదివే లేఁటికే ముసిముసి నవ్వేఁటికే
పక్కనఁ దెరలో నుండే పాదా లొత్తరాదా ॥ యిందర ॥

కన్నుల నవ్వ నేఁటికే కంబము మా టేఁటికే
పన్ని యాతఁడు నిన్నుఁ దప్పక చూడఁగా
చన్నులు మూయ నేఁటికే సన్నలు సేయ నేఁటికే
మన్నించిన కొలఁది నే మాటలాడరాదా ॥ యిందర ॥

తలవంచుకో నేఁటికే తమక మాప నేఁటికే
చెలరేఁగి ని న్నాతఁడు చెనకఁగాను
అలమేల్మంగవు నీవు ఆతఁడు శ్రీవేంకటేశుఁ
డలమి ని న్నేలె నిఁక నల పార్చరాదా ॥ యిందర ॥ 452

లలిత

కడు సిగ్గులు వడితే కలసే లా గెట్లానే
[2]చిడిముడి నెన్నాళ్ళైనాఁ జిన్నదానవా ॥ పల్లవి ॥

1. తే. పా.—మెరింగి, 2. తే. పా.—చిడుముడి.

కాంతుఁడు నీతోఁ దానే కదిసి మాటాడఁగాను
మంతనమాడే వేమే మాతో నీవు
చింత నాతఁడే నీపైఁ జిమ్ముఁజూపులు చిమ్మఁగా
యింతలో మా మోము చూచే విది యేమే నీవు ॥ కదు ॥

పలుమారు నీ విభుఁడు పకపక నవ్వఁగాను
నెలవుల నవ్వే వేలే చేరి మాతోను
బలిమి నాతఁడు నీ పయ్యదకొం గంటితేను
యిల మా యండకు వచ్చే వేఁటిదే నీవు ॥ కదు ॥

శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జెంది సొమ్ము లిచ్చితేను
యీవల మా కిచ్చేవు యిదేమే నేఁడు
నీ వలిమేలుమంగవు ని న్నేలె నాతఁడింతలో
యేవల మ మ్మేలితివి యే మనేమే నేము. ॥ కదు ॥ 453

అమరసింధు

యేమయ్యా నీ సుద్దు లాకె [1]యెఱిఁగె నంటానో
యేమగువవద్దికైనా నేఁగఁ దలఁచితివో ॥ పల్లవి ॥

చివ్వన నీతో నాపె చిరునవ్వు నవ్వితేను
పువ్వులఁగొని వేసేవు పూఁచి నీవు
ఇవ్వల నప్పటి నిన్ను నింటికిఁ బిలిచితేను
కువ్వలు వడఁగ నాపె కోక వట్టి తీసేవు ॥ యేమయ్యా ॥

తేరకొన ని న్నాపె దిష్టించి చూచితేను
బోరన జంకించేవు బొమ్మల నీవు
నేరుపుతో నప్పటిని నీకు విందు చెప్పితేను
నోరిలోఁ దమ్ముల మిడి నొక్కేవు చెక్కులు ॥ యేమయ్యా ॥

వుండుండి శ్రీవేంకటేశ వుర మాపె యెక్కితేను
నిందు నివ్వెఱఁగుతోడ నిలుచుండేవు
అండనే యలమేల్మంగ అట్టె చన్నుల నొత్తితే
కొండ లంటా మెచ్చి మెచ్చి గోర నూఁదేవూ. ॥యేమయ్యా॥ 454

1. తే. పా. – యెరింగె.

## శ్రీరాగం

తీపులోఁ గారము లేల తెలుపరే విభునికి
యేపునఁ జనవు లిచ్చి యేలుకొనుఁ గాకా ॥ పల్లవి ॥

కప్పురాన వేసేవాఁడు కాఁక లేల రేఁచీనే
దప్పిదేర మోవి యిచ్చి తనుపుఁ గాక
చప్పుడుగా నవ్వేవాఁడు జాగ లేల సేసీనే
చిప్పిలఁ గౌఁగిట నించి చెలఁగించుఁ గాకా ॥ తీపులో ॥

సేసలుచల్లేవాఁడు సిగ్గు లేల పుట్టించీనే
ఆస దీర రతుల నోలార్చుఁ గాక
దాసితోఁ బెండ్లాడేవాఁడు వట్టి తరితీపు లేల
మూసినముత్తెమైనా మోము చూచుఁ గాక ॥ తీపులో ॥

గంధము పూసినవాఁడు కడు నెలయించ నేలే
అంది నా గుబ్బల నురమంటించుఁ గాక
యిందె శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
పొందె నిఁకఁ బంతా లేలే భోగించుఁ గాక. ॥ తీపులో ॥ 455

## లలిత

ఆకెతోమారు వసంతమాడుదువు రావయ్య
యీకడ నాకడఁ జూచే మెవ్వ రిందు బలువో ॥ పల్లవి ॥

కన్నుల చూపుల నింతి కలువరేకులు చల్లి
సన్నలనే కప్రాలు సారెఁ జల్లీని
చన్నుల మెఱుఁగులను సరిఁ గుంకుమలు చల్లి
ఇన్నిటా వసంతమాడీ నిదివో నీ మీఁదను ॥ ఆకెతో ॥

వేడుకనవ్వు లనే వెన్నెల వెల్లాఁజల్లి
వాడికమాట లనే వలపు చల్లి
కూడేటికోరికెలను కుచ్చు ముత్తెములు చల్లి
యీడుగా వసంత మాడీ నిదివో నీ మీఁదను ॥ ఆకెతో ॥

సమరతి నిట్టూర్పుల జాజరగాలి చల్లి
చెమటఁ బన్నీరు మచ్చికఁ జల్లీని
అమరే శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
హిమపువసంతమాడీ నిదివో నీమీఁదను. ॥ ఆకెతో ॥ 456

487-వ రేకు గంభీరనాట

తా నాడినసరసము తనకు వెగ్గళ మైతే
నే నేమి సేతునే యాల నెపాలు వేసీనే ॥ పల్లవి ॥

మొనలైన నా చన్నుల మొలకలు నాఁటె నంటా
కొనచూపులఁ దా నెంత కొచ్చి చూచీనే
పెనఁగఁగా నా జడ ముప్పిరిఁ జుట్టుకొనె నంటా
వొనరఁగఁ దా నేల వురము దట్టీనే ॥ తానాడి ॥

చెవిలోని నా పుణుఁగు చెక్కులపైఁ గారె నంటా
తివురుచుఁ దా నేల తిద్ద వచ్చీనే
యివల మోవులు సోఁకి యెంగిలాయ నంటాను
జవళి బొమ్మల నేల జంకించీనే ॥ తానాడి ॥

కలసి కౌఁగిలించఁగా గాజు లొత్తె నంటాను
చలపట్టి తా నేల సాదించీనే
యెలమి శ్రీవేంకటేశుఁ డే నలమేలుమంగను
లలి నేలె నన్ను నెంత లాలించీనే. ॥ తానాడి ॥ 457

సింధురామక్రియ

యివిగో మా విన్నపము లిచ్చగించి వినవమ్మ
యివల నాయకుఁడ నీ కిదే తగవయ్యా ॥ పల్లవి ॥

పన్నుకొన్న వినయాలు పడఁతులవి
మన్నించే నేరుపులు మగవానివి
సన్నల విలాసాలు సతులవి
యెన్నికైన చిఱునవ్వు లెప్పుడూఁ బ్రియునివి ॥ యివిగో ॥

ఆసపడి కొసరేవి అంగనలవి
రాసికెక్కఁ జెల్లించేవి రమణునివి
వాసులును వంతులును వనితలవి
వేసరని వోరుపులు విభునివి ॥ యివిగో ॥

మంతనాలుఁ బంతనాలు మానినులవి
పొంత సిగ్గు లుడిపేవి పురుషునివి
యింతలో శ్రీవేంకటేశుఁ దేలే నలమేల్మంగవు
సంతతపు మెచ్చు నీది సరస మాతనిది. ॥ యివిగో ॥ 458

మాళవిగౌళ

కన్నెపడుచవు గాన కత లేమీ నెఱుఁగవు
మిన్నక నామాట వింటే మేలయ్యీ నీకు ॥ పల్లవి ॥

వేడుకతో విభునికి వీడె మిచ్చి రమ్మంటేను
యీడనే సిగ్గువడే విదేమే నీవు
చూడవే యాతఁ డంపెను సొమ్ములు నీ కంటేను
యేదో పరాకు సేసే విదేమే నీవు ॥ కన్నె ॥

కొలువై యున్నాఁ డాతఁడు గోడ నిక్కి చూడుమంటే
సెలవుల నవ్వేవు చెల్లఁబో నీవు
తలుపు మాఁటుకు వచ్చె దగ్గరి మాటాడు మంటే
చెలి యండనే వుండేవు చెల్లఁబో నీవు ॥ కన్నె ॥

పరపుపైఁ బవళించె పాదాలు నీ వొత్తుమంటే
అరిదిఁ దొడ డిగ్గవు అవునే నీవు
సరి నలమేల్మంగవు సరుగ శ్రీవేంకటేశు
నరసి నేఁడు గూడితి వవునే నీవూ. ॥ కన్నె ॥ 459

శుద్ధవసంతం

యేమాయ నిందుకు మీ రిద్దరును జాణలే
ప్రేమతో నెచ్చుకుందులఁ బెనఁగ నేమిటికే ॥ పల్లవి ॥

మన సెనసినవారు మందెమేళాన నుందురు
చనవు గలుగువారు సాదింతురు
తనివి చాలనివారు తగిలి పై కొందురు
యెనలేని నీ చేతల కెగ్గుపట్టఁ దగదు ॥ యేమాయె ॥

సమ్మతించువారు మీఱి సరసములాడుదురు
నమ్మికైనవా రెంతైనా నవ్వుదురు
యెమ్మెలు లేనివారు యేమైనా నడుగుదురు
ఇమ్మల నిందుకుఁ గాను యెగ్గుపట్టఁ దగదు ॥ యేమాయె ॥

కలసి వుండినవారు కొఁగిట బిగింతురు
వలచినవారు గర్వాన మెత్తురు
చెలి యలమేలుమంగ శ్రీవేఁకటేశుఁడవు
యెలమిఁ గూడితి రిఁక నెగ్గుపట్టఁ దగదు. ॥ యేమాయ ॥ 460

కురంజి

అంగన ని న్నడిగి రమ్మనె నీ మాట
సంగతిగ మరుమాట సరి నానతీవయ్యా ॥ పల్లవి ॥

చెలులచే నింతి నీకు చెప్పిపంపిన మాటలు
తలఁచుకొన్నాఁడవా దయతో నీవు
తొలుతఁ గాను కంపిన దొడ్డపూవులబంతి
లలిమించిన పరిమళము గొంటివా. ॥ అంగన ॥

చాయల నాసతో నాపె సారెఁ జూచినచూపులు
ఆయములు గరఁచైనా అంటుకొనెనా
చే యెత్తి సిగ్గుతోడ చేరి మొక్కిన మొక్కులు
ఆయనా నీకు శలవు అందరిలోనా ॥ అంగన ॥

బెరసి తెరమాటునఁ బెట్టిన నీపై నేసలు
శిరసుపై నిండెనా చిందెనా నీపై
అరుదై శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
గరిమనిన్నుఁగూడి గద్దెపైఁగూచున్నది. ॥ అంగన ॥ 461

భైరవి

కన్నులఁ జూచితేనే కడు దయవుట్టె నాకు
చిన్ని నవ్వు నవ్వకురే సిగ్గువడు నేమో ॥ పల్లవి ॥

గందవొడి చల్లరే కడుఁ జెమటలు గారీ
యెందుండి వచ్చినాఁడో యీడకుఁ దానూ
కందువఁ బన్నీ రియ్యరే కడు దప్పిగొన్నాఁడు
అందుక యేమేమి పను లలయఁజేసినాఁడో ॥ కన్నుల ॥

కొప్పు చక్కఁబెట్టరే కురులు చెదరినవి
చిప్పిలఁగ సాములు సేసినాఁ దేమో
వొప్పుగఁ బాన్పు వెయ్యరే రెప్పలను నిద్ర దేరీ
తప్పక జాగరాలు తా నెంత సేసినాఁడో ॥ కన్నుల ॥

పిలిచి పీడె మియ్యరే పిప్పిగట్టెఁ బెదవులు
చెలులకుఁ గత లెంత చెప్పినాఁడో
అలమేల్మంగను నేను అట్టె తా శ్రీవేంకటేశుఁ
డెలమి న న్నేలె నిట్టే యెందరి నేలినాఁడో. ॥ కన్నుల ॥ 462

488-వ రేకు సాళంగనాట

మనసు పట్టఁగరాదు మాని వూరకుండరాదు
యెనలేని తలపోఁత లెంత సేసీనే ॥ పల్లవి ॥

అప్పుడు విభుఁడు నాతో నానతిచ్చినమాటలు
చెప్పఁగ సిగ్గయ్యీని చెలి నీతోను
కుప్పలుఁ దెప్పలునై గుబ్బతిల్లీ మతిలోన
యెప్పుడుగానీ రాఁడో యేమి సేతునే ॥ మనసు ॥

చేపట్టి తా నేకతానఁ జేసినచేఁతలు నీకు
చూపితేఁ బరవశాలుచుట్టుకొనీని
దాఁపురాలై మేనిమీఁద దాయక పాయకున్నవి
యేపునఁ దా నెందున్నాఁడో యేమి సేతునే ॥ మనసు ॥

యీకడ శ్రీవేంకటేశుఁ డిటు న న్నేలినందుకు
నాకు నీ మోము చూచితే నవ్వువచ్చీని
మేకొని వేడుక లలమేలుమంగను నేను
యేకమాయ మోహములు యేమి సేతునే. ॥ మనసు ॥ 463

ధవళ

యిందుకు నవ్వకుమీ యిట్టె నీ మంచితనము
పొందుగా నీ కీరితిగాఁ బొగడితి నేను ॥ పల్లవి ॥

ఇంతులముందర నెల్లా నెమ్మె లెల్లాఁ జెప్పుకొంటి
కాంతుఁడవు నీవు నాకుఁ గల వంటాను
పంతాన మురిపెమునఁ బైపైనే మెరసితి
చెంతల నన్ను సింగారించితి వంటాను ॥ యిందు ॥

చొక్కి నీవు నాకిచ్చినసొమ్ము లెల్లాఁ జూపితి
చిక్కి నేఁడు నాకు మోహించితి వంటాను
నిక్కపు గర్వము లెల్లా నెరపితి సభలోన
వుక్కున నామాటలోనే వుండుదు వంటాను ॥ యిందు ॥

పైకొని చెలులచేత పాటలు పాడించుకొంటి
చేకొని పట్టపుదేవిఁ జేసితి వంటా
యీకడ శ్రీవేంకటేశ యే నలమేలుమంగను
నాకు నీడు లేరంటి నన్నే చూతు వంటాను. ॥ యిందు ॥ 464

పాడి

చూత మిఁకఁ దనలాగు చూపీ నీకు వట్టి సిగ్గు
చేతికి లోఁ జేసుక చెనకఁగ రాదా ॥ పల్లవి ॥

చెలియ సిగ్గులతోడఁ జిత్తరువు [1]వ్రాసి కొంకి
నిలిచి తను దిట్టించీ నీవు చూడఁగా
వులివచ్చి మాటలాడీ వొడివట్టి తియ్యరాదా
చెలరేఁగి యప్పు డేమి సేసీనో కాని ॥ చూత ॥

1. తే. పా. – వాసి.

కోమలి పరాకు సేసుకొని చెలితో మాటాడీ
వేమారు నీవు దన్ను వేఁడుకోఁగాను
చేముంచి చన్నులమీఁదఁ జేయి చాఁచఁగా రాదా
దీమస మెంత గద్దో తేలుతుము గాని ॥ చూత ॥

నెలఁత వొయ్యారముతో నిమ్మవం దెగరవేసీ
లలి నీవు తమి రేఁచి లాలించఁగా
అలర శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
కలసితి వేమి నేర్పు గైకొనీనో కాని. ॥ చూత ॥ 465

కాంబోది

పొందైన నీ వలపులు పులిసీ నటే
యిందరిలో నిన్ను నేలీ యేల వేగిరించేవే ॥ పల్లవి ॥

చెక్కు లిట్టే నొక్కినాఁడు నెలవుల నవ్వినాఁడు
మొక్కు లియ్యకొనెఁగదే మొగఁడు
కక్కసించ నేమిటికే కాఁగిలించుకొనీఁ గాక
యెక్కువ తక్కువలకు నేల వేగిరించేవే ॥ పొందై ॥

నీదిక్కు చూచినాఁడు నీతో మాటలాడినాఁడు
పాదుకొని నిమ్మపండు పై వేసినాఁడు
గోదిల నీ కిపు దేలే కోరిక చెల్లించీఁగాక
యీదెప నింతటిలోన నేల వేగిరించేవే ॥ పొందై ॥

పాను పెక్కించుకొన్నాఁడు పాదాలు పైఁ జాఁచినాఁడు
చే నంటి నీ కుచములు చెనకెఁగదే
పూని శ్రీవేంకటేశుఁడు పొంచి యింకాఁ గూడీఁగాక
యీనెలవుననే వుండి యేల వేగిరించేవే. ॥ పొందై ॥ 466

ఆహిరి

యేమయ్య ప్రియము చెప్పే వెంతేసి నాకు
నీ మతిలోదానఁ గాక నీకు వింతదానవా ॥ పల్లవి ॥

నేరుపుతోడ నాతో నీవు మాటలాడఁగాను
గారవించి వినేఁ గాక కా దనేనా
సారె సారె నీవు నాకు చనవు లొసఁగఁగాను
కోరి సంతోసించేఁ గాక కోపగించేనా ॥ యేమ ॥

చేయి చాఁచి నీ వప్పటి చెనకఁగ రాఁగాను
కాయము నీ కొగ్గేఁ గాక కా దనేనా
ఆయములు మోవ నీవు అట్టె నాతో నవ్వఁగాను
చాయలో మెలఁగేఁ గాక సాదించేనా ॥ యేమ ॥

అందము [1]లెఱిఁగి నీవు అంతలోనే కూడఁగాను
కందువలు మెచ్చేఁ గాక కా దనేనా
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
పొందులు నెరపేఁ గాక పోల దనేనా. ॥ యేమ ॥ 467

శంకరాభరణం

యింత చాలదా తనకు నింతులతోడిచలము
వింత సేయకు మనుచు వేఁడుకొంటేఁ గదవే ॥ పల్లవి ॥

నన్ను నేల చెనకీని నాతో నేల పెనఁగీని
మొన్ననే తనకు నేను మొక్కితిఁ గదే
సన్న లేల సేసీని జారుఁబయ్య దే లంటీని
యెన్నికతోఁ బంతా లెల్లా నిచ్చితిఁ గదే ॥ యింత ॥

చొప్పు లేల యెత్తీని సొమ్ము లెన్ని యిచ్చీని
అప్పుడే తనకు నేనూఁ జెప్పితిఁ గదే
కొప్పేల దువ్వీని గో రేల సోఁకించీని
చిప్పిల నూడిగా లెల్లాఁ జేసితిఁ గదే ॥ యింత ॥

పెదవు లేల మోపీని ప్రియ మెంత చెప్పీని
యిదివో కొఁగిలించితి నిట్టె కదే
యెదుట శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్ను నేలె
సదరాన నేమి నవ్వి సతి నైతిఁ గదవే. ॥ యింత ॥ 468

1. తే. పా.— లెరింగి.

489-వ రేకు భైరవి

అలిగితి నంటా నేల అట్టె నన్ను వేఁడుకొని
తలఁచే నా తలఁపులు తా [1]నెఱుఁగఁడా ॥ పల్లవి ॥

సతివద్దనుండఁగాను చాయసేసుకొంటిఁ గాక
రతికిఁ దాఁ బిలువఁగ రాకుండుదునా
కతలు చెప్పుకోఁగాను కడ నిలుచుంటిఁ గాక
తతి నూడిగాలకు దగ్గరక వుందునా ॥ అలి ॥

తెర వేసుకుండఁగా సందేహమున నుంటిఁ గాక
అరసి తా వీడె మీఁగా నంచ కుందునా
విరుల వేట్లాడఁగా వింతలు చూచితిఁ గాక
గరిమఁ దా వలె నంటే కౌఁగిలించకుందునా ॥ అలి ॥

వేడుకకాఁడై వుండఁగా వేళ దెలిసితి గాక
కూడి పాదా లొత్తుమంటేఁ గొంకివుందునా
యీడనే శ్రీవేంకటేశుఁ డింతలోఁ దా నన్నునేలే
వాడిక దా నడపితే వడి మెచ్చకుందునా. ॥ అలి ॥ 469

పాడి

మేలు మేలు యింమ కిట్టే మెచ్చితి నేను
వాలుకచూపుల నిన్ను వంచెఁగా విభుఁడ ॥ పల్లవి ॥

మందెమేళమైనఁ గాని మగువ నీతొడ యెక్కి
కందువైన మాటలాడీఁగా విభుఁడ
సంవడి లోనైనాఁ గానీ చవులుగ మోవి ఇచ్చి
చెంది నీకు సంతోసము చేసీఁగా విభుఁడ ॥ మేలు ॥

వెక్కసమైనాఁ గానీ వేడుక నీకుఁ బుట్టించి
గక్కన నీతో నవ్వెఁగా విభుఁడ
మొక్కళమైనాఁ గానీ మోహము నీపైఁ జల్లి
అక్కరతో సరసము లాడేఁగా విభుఁడ ॥ మేలు ॥

---

1. తే. పా. — తానెరంగదా.

చుట్టరికమైనాఁ గానీ సొలసి సొలసి నిన్ను
గట్టి గుబ్బలను వొత్తెఁగా విభుఁడ
ఇట్టి శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
దట్టముగా తానూఁ గూడి తనిపెఁగా విభుఁడా. ॥ మేలు ॥ 470

హిందోళం

వలసినప్పుడు నీవే వచ్చేవు గానీ
మలసి యందాఁకా నిది [1]మఱవకుంతు మనే ॥ పల్లవి ॥

వెలఁది నీ కొకమాట విన్నవించి రమ్మనె
తలఁపులోపలనుండి దాఁగకు మని
తెలిపి రమ్మనె మరిఁ దేటతెల్లమిగాను
చలము లందులో మరీ సాదించకు మనుచు ॥ వలసి ॥

యిక్కువ నింకా నొక [2]పెఱిఁగించి రమ్మనె
అక్కడనే సరసమూ నాడుమనీ
మొక్కి [3]యెఱుకగా కొంగు ముడివేసి రమ్మనె
గక్కన మనోరథాలఁ గౌఁగిలించు మనుచు ॥ వలసి ॥

యెదుటఁ దారుకాణగా నెచ్చరించి రమ్మనే
యెదలో నైనా రతుల నెనయు మనీ
అదన శ్రీవేంకటేశ అంతలో వచ్చికూడితి
విదివో తనతో నీ విరవైతి వనుచూ. ॥ వలసి ॥ 471

దేసాళం

పోఁక వెట్టినప్పుడే పొందుగ నే నాల నైతి
సోఁ కోరిచి వుండితేనే చుట్ట మయ్యాఁ గాక ॥ పల్లవి ॥

యేమి సేసినాఁ దన కెదురాడేదాననా
మోముచూచి చేతు లెత్తి మొక్కీఁగాక
వాములైనవలపులు వడివెట్టవచ్చునా
ప్రేమముతో తానే వచ్చి పెండ్లాడీఁగాక ॥ పోఁక ॥

---

1. తే. పా.—మరవకుండు, 2. తే. పా.—పెరింగించి, 3. తే. పా.—యెరుకగా

యెవ్వతెఁ దెచ్చుకొనినా యెగ్గుపట్టేదాననా
నవ్వుతా నెదమాటలు నడపీఁగాక
జవ్వనము తనసొమ్ము జల్లిఁబట్టవచ్చునా
చివ్వనఁ దానే నాపై సేసవెట్టీఁగాక ॥ పోఁక ॥

యెప్పుడు దా విచ్చేసినా యేడనుంటి వనేనా
వొప్పి కౌఁగిలించి యిట్టె వొనరేఁగాక
నెప్పున శ్రీవేంకటనిలయుఁడు నన్నుఁ గూడె
కప్పి తానే కంకణము గట్టీఁగాకా. ॥ పోఁక ॥ 472

శ్రీరాగం

నెలఁతసొబగు లివి నీ సొమ్ము
కలసి మెలసి యిటు గైకొనవయ్యా ॥ పల్లవి ॥

వేమరు నవ్వులవెన్నెల గాసీ
రామకడకు నిటు రావయ్యా
దోమటిపలుకుల దొరిగీఁ దేనెలు
ఆమనికాలము అవధరించవయ్యా ॥ నెలఁత ॥

వలపులచెమటలవానలు గురిసీ
సొలవక యీకెనుఁ జూడవయ్యా
పెలుచుఁగుచంబుల పిందెలు వొడమెను
అలరిన కానుక లందుకోవయ్యా ॥ నెలఁత ॥

గములై మెయి మరుకళలు దొలఁకీ
తమితోఁ గౌఁగిటఁ దగులవయ్యా
జమళి శ్రీవేంకటేశ్వర సతిఁ గూడితి
వమరె నీకు మే లవునయ్యా. ॥ నెలఁత ॥ 473

తెలుఁగుఁగాంబోది

అతఁడు మగఁడు నీకు నతివవు నీ వైతి
చేతికి లోనై వుండితేఁ జిత్తము వచ్చుఁగాక ॥ పల్లవి ॥

సరసము లాడితేనే చవులు వొడముఁగాక
విరసము లాడితేను వెగటు గాదా
మరిగి పొందుసేసితే మనసు గరఁగుఁగాక
వెరవు లే కలిగితే వెక్కసమై యుండదా ॥ అత ॥

నసుపులు చూపితేనే నగవులు వచ్చుఁగాక
పెనపులఁ బట్టితేను ప్రియము లవునా
మనవులు చెప్పితేనే మచ్చికలు రేఁగుఁగాక
అనువుకు మాటాడితే నందము లవునా ॥ అత ॥

సంతములై కూడితేనే సమ్మతౌఁగాక మనసు
పంతము లాడితేను పను లింపౌనా
యింతలో శ్రీవేంకటేశుఁ డెనసె నన్నుఁ దానే
సంతోసా లిటువంటివి సంగతులే కావా. ॥ అత ॥ 474

490-వ రేకు సామంతం

అడుగరే చెలులాల ఆతనినే యీ మాట
యెడయని విన్నపము లివి నావి యనరే ॥ పల్లవి ॥

వినయముగలిగిన వెలఁది పొందులు చవి
మనసునమ్మినయట్టి మాటలు చవి
తనివోనివలపుల తలపోఁతలు చవి
పెనగొన్న కౌఁగిటిలో బిగువు చవి ॥ అడుగరే ॥

మచ్చికలు సలిపేటి మంతనంబులు చవి
ఇచ్చకమునడపేటి యింపులు చవి
విచ్చనవిడైన వేడుక చేఁతలు చవి
కొచ్చి కొచ్చి కొసరేటి కూరిమి చవి ॥ అడుగరే ॥

మొక్కుచు సారెకుఁ జూచే ముచ్చటచూపులు చవి
చొక్కేటి రతివేళల సుద్దులు చవి
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
దక్కిన తమకముల తరితీపులు చవి. ॥ అడుగరే ॥ 475

కుంతలవరాళి

కూడిమాడి పతివద్దఁ గూచుండవే
జీడివంటిది వలపు సిగ్గు లింక నేలే ॥ పల్లవి ॥

మనసు రేఁచఁగవచ్చు మక్కువ లణఁచ రాదు
కనుఁగొన దొరకొంటే కాంక్ష దీరదు
తనువు సోఁకించవచ్చు తమి మాన్ప పసగాదు
చెనకి విభునితోఁడ సిగ్గు లింక నేలే ॥ కూడిమాడి ॥

వేమరు నవ్వఁగవచ్చు విరహము పట్టరాదు
ప్రేమము చల్లితే నాస పిరి తియ్యదు
ఆముకోఁ గదిసి మరి దీమసము పనిలేదు
చేముంచెఁ బను లెల్లాను సిగ్గు లింక నేలే ॥ కూడిమాడి ॥

సరసములాడవచ్చు చవులు విడువరాదు
మరిగిన మీఁదట మఱఁగు లేదు
వరుసతో శ్రీవేంకటేశ్వరుఁడు నిన్నుఁ గూడె
సిరులఁ బెండ్లాడితివి సిగ్గు లింక నేలే. ॥ కూడిమాడి ॥ 476

ఆహిరి

తరితీపు లివి వినఁ దమకించీ నా మనసు
సరుస నాకు మీరు సంతోసము సేయరే ॥ పల్లవి ॥

యేమని చెప్పెంపునొకో యింతితోడ నా విభుఁడు
నా మాట లెల్ల విని నవ్వునొకో
కామించి నే నంపిన కాని కందుకొనునొకో
చేముంచి యీ విచారము చెప్పరే వోచెలులు ॥ తరి ॥

వెలయ నీపాటికి విన్నపము లందునొకో
తలఁపులోపల దయ దలఁచునొకో
చెలరేఁగి యిప్పుడే సింగారించుకొనునొకో
యెలమి నూహించి నాతో నెంచరే యీ యెన్నికా ॥ తరి ॥

వడిగాఁ బల్లకీ యెక్కి వాకిటికి వచ్చునాకో
తడవి ఇంటిలోఁ దొల్లి తా నున్నాఁడాకో
యెడయక శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గూడె
అడరి యీతనిసుద్దు లబ్బురాలు గదవే. ॥ తరి ॥ 477

నాదరామక్రియ

మనసూ నిలుపరాదు మగనిఁ దడవరాదు
యెనలేని నా మోహాన కేమి సేతునే ॥ పల్లవి ॥

విన్నపాలు సేసితేను వేసరించి నటు లయ్యా
కన్నులఁ జూచితేను కాఁక రేఁచినటు లయ్యా
చన్నుల నే నూదితేను సాదించినటు లయ్యా
యెన్నికె లిట్టివి నే నేమి సేతునే ॥ మనసూ ॥

కొలువులు సేసితేను కొసరినటుల నయ్యా
పలికితే పలపులు పచారించినటు లయ్యా
నెలవుల నవ్వితేను సిగ్గుపరచి న ట్లయ్యా
యెలమి నా మొగమోట కేమి సేతునే ॥ మనసూ ॥

చేరి పాదాలొత్తితేను చెనకినటుల నయ్యా
మేరతోఁ గాఁగిలించితే మీఱి పెనఁగిన ట్లయ్యా
గారవిం చింతలో శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గూడె
యీరీతి నా వేడుకల కేమి సేతునే ॥ మనసూ ॥ 478

ఆహిరి

నన్నుఁ జూచి కాతరాన నవ్వులు వచ్చీఁ గాక
వున్నతి నాపె వచ్చితే నొల్ల కెట్లా నుండెనే ॥ పల్లవి ॥

తప్ప కాపె రూ పేపొద్దూ తనలోనే గుబ్బతిలు
చెప్పి పంపినమాటలఁ జిల్లులౌ గుండె
చొప్పుల మైగురుతులు చూచుకొంటే నీరౌ మతి
యిప్పు డాపెఁ గూడక తా నె ట్టోరువఁగలఁడే ॥ నన్ను ॥

మరిగి నాపెయెదుట మలసితేఁ జిమ్మి రేఁగు
తిరిగి చూచితేఁ దరితీపు పుట్టును
తొరలఁగ సొలసితే తూరిపారు (?) మర్మములు
యిరవైన యాపెఁ బాసి యెట్టోరువఁగలఁదే ॥ నన్ను ॥

తనమొగ మాపె యైతే తమకము లుప్పతిల్లు
ననుపుల నవ్వు గంటే నాము లెక్కను
యెనసి శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్ను మెచ్చి
యెనలేని యాపెను తా నెట్టు మానఁగలఁదే. ॥ నన్ను ॥ 479

పాడి

వలపు పైకొనరైతే వడి మొగచాటు గాదా
లలనల సిగ్గు లేల లంకెఁ బెట్టే వయ్యా ॥ పల్లవి ॥

చిప్పిల నాపెతొడపై శిరసు మోవఁ బండుండి
అప్పటి నాతో నవ్వే వౌనయ్యా
కొప్పు నీ కాపె దువ్వఁగా కొంగు పట్టుకున్నాఁడవు
యిప్పుడు నీ యాసోద మేమి చెప్పేమయ్యా ॥ వలపు ॥

పొదిగొన నీవాపె బుజముపైఁ జేయి వేసి
యెదుట నా మోము చూచే విదేమయ్యా
వుదుటుగుబ్బల నాపె వొత్తఁగా కాలు దొక్కే
వదన నీవేదు కేమని చెప్పేమయ్యా ॥ వలపు ॥

పొందు లాపెతోఁ జేసి పోరచితనాన నాపై
నంది పచ్చడము గప్పే వౌనయ్యా
ముందే యాకెఁ గూడితివి మొఱఁగి శ్రీవేంకటేశ
చెందితివి న న్నీకడ చెల్లుఁ జెల్లు నయ్యా. ॥ వలపు ॥ 480

491-వ రేకు కొండమలహరి

ఇంతి నేల వుప్పతించే వెంత కాతర మనుచు
చెంత నీపెమోహము నీ సంతోసమే కాదా ॥ పల్లవి ॥

మొక్కలానఁ జింతతోడ మూసినరెప్పల చూపు
గక్కన నిన్నుఁ గంటే కాఁడి పారదా
అక్కరతో నిన్నాళ్ళు నాపుకొనున్నవలపు
వెక్కసమై నీమీఁద వెల్లిగొనదా ॥ ఇంతి ॥

వొగ్గి నీకుఁగా లోలో నుమ్మగిలిన మాటలు
దగ్గర నీవు వచ్చితే తగులుకోవా
సిగ్గులతో నల్లంతఁ జిముడుచున్న మనసు
బెగ్గిల నిన్నుఁ గొఁగిట బిగియించఁ జెల్లదా ॥ ఇంతి ॥

వుప్పతిల్లి మేనిమీఁద నుడివోసి తమకము
చొప్పగు నీ రతులో సుడిగొనదా
యిప్పుడే శ్రీ వేంకటేశ యీకె నేలితివి గాక
తొప్పఁదోగిన చెమట దొమ్మి నోలలార్చదా. ॥ ఇంతి ॥ 481

పూర్వగౌళ

యెంత పని గలదో యేమొనో నీ కాపె
వింతగా నప్పటి నుండేవేళ చూచుకొన్నది ॥ పల్లవి ॥

మానినితో నీ విప్పుడు మరి యేకత మాడఁగా
కానిక దెచ్చి యొకతె గాచుకున్నది
పానుపుపై మీ రిద్దరుఁ బవ్వళించి వుండఁగాను
పానిపట్టె నీ పదాలు పాడుకొంటా నున్నది ॥ యెంత ॥

తేరకొన మీ రిద్దరుఁ దెర వేసుకుండఁగాను
నీ రాక గోరుకొని నిలుచున్నది
మేరతోడ మీలోన మీరు వీడే లందుకోఁగా
చేరి నీకు మొక్కే నంటాఁ జేతులెత్తుకున్నది ॥ యెంత ॥

అంగవించి మీరు రతి నలయుచుండఁగాను
తొంగి చూపుల వాకిటఁ దొట్టుకున్నది
సంగతిగ శ్రీవేంకటేశ్వర నీ వింతలో వచ్చి
సంగడిఁ దన్ను నేలితే సన్న సేయుచున్నది. ॥ యెంత ॥ 482

వరాళి

వాడిఁ బెట్టుకొనరాదా వువిద నేపొద్దు నీవు
కడు నేల లోఁగేవు కా దనేనా నేను ॥ పల్లవి ॥

జలజాక్షి నీతో సరసములాడి తనివోదు
తళుకుఁ జూపులఁ జూచి తనివోదు
కొలువులోపల నిన్నుఁ గొసరియుఁ దనివోదు
యెలమి నీమీఁద నీకె * కెంత మోహమో ॥ వాడి ॥

పనివడి చేయి వేసి పందే లాడి తనివోదు
తనలో నిన్ను భావించి తనివోదు
చెనకుచు నూడిగాలు చేసి చేసి తనివోదు
యెనసి నీమీఁద నీకె * కెంత మోహమో ॥ వాడి ॥

మచ్చికలు చూపి నీతో మాటలాడి తనివోదు
తచ్చి నెలవుల నవ్వి తనివోదు
అచ్చమై శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
హెచ్చి యీకె నిన్నుఁ గూడె నెంత మోహమో. ॥ వాడి ॥ 483

ద్రావిడభైరవి

యెవ్వరు ని న్నొద్దనేరు యేల నీకు వెఱపు
యివ్వలిమోమై నీవు యీకెఁ జూడరాదా ॥ పల్లవి ॥

చెక్కిటిచేత నున్నవి చెలియకు సిగ్గులు
చక్కనిమోమునఁ దేరీ సారె నిగ్గులు
పిక్కటిల్లు నవ్వులనే పెట్టెముగ్గులు
యెక్కడ పరాకు నీకు యీకెఁ జూడరాదా ॥ యెవ్వరు ॥

సొరిదిఁగన్నుల నవే చూపుల చిలుకులు
పరగీ చిగురుమోవిపైఁ బలుకులు
సిరుల దంతముల మించీఁ దళుకులు
యెరవుసేయక యిట్టె యీకెఁ జూడరాదా ॥ యెవ్వరు ॥

---

* తే. పా. — యెంత.

సాలెవలిపె పయ్యద చన్నులమీఁది [1]మఱుఁగు
చాలుకొన్న మెయిఁజెమట జాలు కరఁగు
యేలితివి శ్రీవేంకటేశ యిన్నిటాను నీవు
యీ లీలనే మన్నించి యీకెఁ జూడరాదా. ॥ యెవ్వరు ॥ 484

## సౌరాష్ట్రం

మఱవకు నీ గుణము మనసులోదాన నేను
యెఱఁగె లోక మెల్లా న న్నేలితి వంటాను ॥ పల్లవి ॥

విన్నపము సేసితిఁగా వింటివిగా నా మాట
నిన్ను నే మనఁగలను నీ చిత్తము
యెన్నిక సేసుకొంటివి యింతగా మన్నించితివి
పన్నుకొన్న నీ కరుణే పదివేలు నాకు ॥ మఱవకు ॥

కానుక నీ కిచ్చితిఁగా కంటివిగా నీవు నన్ను
నే నెంతదాన నీకు నీ చిత్తము
కానిమ్మని కైకొంటివి కంకణము గట్టితివి
నీ నవ్వుల సరసమే నిధానము నాకు ॥ మఱవకు ॥

కమ్మటి మొక్కితిఁగా కౌఁగిలించుకొంటివిగా
నెమ్మదినుండే నేను నీ చిత్తము
సమ్మతించి శ్రీవేంకటేశ్వర నన్నుఁ గూడితివి
పమ్మిన నీ వూడిగమే భాగ్యమెల్లా నాకు. ॥ మఱవకు ॥ 485

## శ్రీరాగం

యేమని విన్నవించేము యింతి మోహము నీమీఁద
ఆమని వేడుకలై అంటుకొనఁ జొచ్చెను ॥ పల్లవి ॥

తలఁపులోపలి సిగ్గు దాఁచుకొనఁ జోటు లేక
సెలవుల నవ్వులై చిందఁ జొచ్చెను
వలపులు మూసిపెట్ట వసముగాక యవే
వులివచ్చి పలుకులై వుప్పొంగఁ జొచ్చెను ॥ యేమని ॥

---

1. తే. పా. — మరంగు.

యెన్నరాని యడియాస లిముడుకోఁ జోటు లేక
కన్నుఁగొనచూపులై కమ్మఁ జొచ్చెను
అన్నిటాను తమకము లణఁచఁగఁ జోటు లేక
వున్నతపుఁ జెమటలై వూరఁ జొచ్చెను ॥ యేమని ॥
కలసిన సంతోసము కట్టిపెట్టఁ జోటు లేక
నిలిచి మోముకళలై నిండఁ జొచ్చెను
యెలమి శ్రీవేంకటేశ యింతిఁ గూడినరతులు
తలకొన్న సరసమై దైవారఁ జొచ్చెనూ. ॥ యేమని ॥ 486

492-వ రేకు ముఖారి

మాకేమి చూపేవు మగువచేఁత లెల్లా
నీకు నితవై తేఁ జాలు నేర్పునయ్యా కతలు ॥ పల్లవి ॥
చనవు గలదు గాన సంగడిఁ గూచున్నది
మనసు దెలుసుఁ గాన మాట లాడీని
ననిచిన లేమ గాన నవ్వులు నవ్వీ నీతో
చెనకి యేమి సేసినాఁ జెల్లునయ్యా ఆపెకు ॥ మాకేమి ॥
తగులమైనది గాన తరితీపు సేసీని
బిగియ నోపుఁ గాన పెనఁగీ నీతో
మొగమిచ్చలాఁడి గాన మోహములు చల్లీని
జిగి ని న్నెంత మీఱినాఁ జెల్లునయ్యా ఆపెకు ॥ మాకేమి ॥
కందువ లెఱుఁగుఁ గాన కౌఁగిలించుకొనె నిన్ను
మందెమేళము గనక మలసీ నీతో
అందపు శ్రీవేంకటేశ అలమేల్మంగను నేను
చెందితి నిన్నుఁ బెండ్లాడఁ జెల్లునయ్యా ఆపెకు. ॥మాకేమి॥ 487

సాళంగనాట

తానే నాకు రమణుఁడు తనకు నే దేవులను
పూని యెగ్గు పట్టవద్దు పొద్దున రమ్మనరే ॥ పల్లవి ॥

చలపట్టవద్దు గాని చనవు చేసుకొని
చెలు లెంత గొసరినాఁ జెల్లు ననరే
అలుగఁగవద్దు గాని ఆసపడ్డవారలు
చెలఁగి యేమి సేసినాఁ జెల్లు ననరే ॥ తానే ॥

పంతమాడవద్దు గాని భావించి వలపుల
చింతతో జంకించినానుఁ జెల్లు ననరే
వింత సేయవద్దు గాని వేడుకతోఁ గొనగోర
చెంతల నెంత వొత్తినాఁ జెల్లు ననరే ॥ తానే ॥

బిగియఁగవద్దు గాని పెనఁగి కూడే వేళ
జిగి నెంత మీఱినానుఁ జెల్లు ననరే
నగి శ్రీవేంకటేశుఁడు నన్ను నిటు వచ్చి కూడె
చిగురుమోవి యడుగఁ జెల్లు ననరే. ॥ తానే ॥ 488

మాళవిగౌళ

వినే మానతియ్యవయ్య వేడుక లయ్యీ మాకు
పెనఁగొనెనో వావులు ప్రియముతో మీకు ॥ పల్లవి ॥

కందువ నీమొగమునఁ గళలు దేరీ నేఁడు
అందెనో మాటపలుకు లాపెకు నీకు
చిందువందు లైనవి జిగిగొని తురుములు
పొందు లొకరొకరికి పొసఁగెనో తొలుతే ॥ వినే ॥

చాయలు సన్నలు మీకు సరి వచ్చి వున్నది
ఆయనో పెండ్లిసోబన మప్పుడే మీకు
దాయక పాయక లోలోఁ దగిలి నవ్వుకొనేరు
చేయి మీఁదై మీలో మీకు సిగ్గు లెల్లాఁ దేరెనో ॥ వినే ॥

చెలపచెమటలతో చిమ్మి రేఁగి వున్నవారు
అలనెనో మీతనువు లట్టె రతుల
యెలమి శ్రీవేంకటేశ యింతలో న న్నేలితివి
తలఁచుక వుంటిరో యీ తగవులు మీరు. ॥ వినే ॥ 489

నాదరామక్రియ

యేఁటికి దాచేవో కాక ఇపుడు నా యెదుటను
పాటించి నీ కాపె సేసేబత్తి నీ వెఱఁగవా ॥ పల్లవి ॥

పువ్వులను నిన్ను వేసి పొందు లెల్లా నెచ్చరించి
నవ్విన దెఱఁగవా నాతి నీతోను
వువ్విళ్ళూర మోవి చూపి వుపచరించి సన్నలఁ
బవ్వళించేయిల్లు చూపేభావ మ దెఱఁగవా ॥ యేఁటికి ॥

యిక్కువగా నెలఁ గిచ్చి యెఱుకలు సేసి యట్టె
నిక్కిచూచె నెఱఁగవా నెలఁత నిన్ను
అక్కరఁ గొలువు సేసి అందరిలో నీ పాదము
తొక్కిన దెఱఁగవా తొలుతనే నీవు ॥ యేఁటికి ॥

పెదవిపై మాటలాడి ప్రియములు నీకుఁ జెప్పి
కదిసిన దెఱఁగవా కాంత నిన్నును
అదన శ్రీవేంకటేశ అప్పుడే న న్నేలితివి
యిదె నీకు దేవులాయ యీపెను నెఱఁగవా. ॥ యేఁటికి ॥ 490

కేదారగౌళ

చిత్తానఁ గలఁగకుమీ చెప్పితి మిప్పుడే నీకు
పొత్తులవారము సుమీ పొలఁతికి నీకును ॥ పల్లవి ॥

చెలికత్తెలకునైనా చెలువుని దూరవచ్చు
బలిమి నాయకురాలిఁ బాసి వుండితే
తెలిపి బుద్దులు చెప్పే తీరుకునుఁ దేవచ్చు
వలచినదానికి వస గా కుండితేను ॥ చిత్తాన ॥

పొరుగువారికినైనా పొందులు సేయఁగవచ్చు
పురుషుఁడు కాంత నేఁపులఁ బెట్టితే
సరుసకుఁ దోడి తెచ్చి సమకూరుచనూ వచ్చు
సిరుల నవ్వులిమోమై సిగ్గువడితేను ॥ చిత్తాన ॥

దండనున్నవారికైనాఁ దగవులు చెప్పవచ్చు
కొండవంటి నీ వాపెఁ గూడ కుండితే
నిండుక శ్రీ వేంకటేశ నేఁ డింతి నేలితి విట్టె
మెండుగా నవ్వఁగవచ్చు మీరిట్లా నుంటేను. ॥ చిత్తాన ॥ 491

ఆహిరి

ఇన్నియుఁ దెలియఁ జెప్పే నేమంటా నుందువో నీవు
తిన్నని తమితో నీకె తిమురుతా నున్నది ॥ పల్లవి ॥
తప్పక చూచి చెలి తలవంచుకొనెఁ గాని
దప్పిదేర నీరూపు తలపోయుచున్నది
చిప్పిల నూరక నీతో సిగ్గున నున్నది గాని
కప్పురమువలె లోలోఁ గరఁగుతా నున్నది ॥ ఇన్ని ॥
నెమ్మి నొక్కమాటే యాడె నీతో మరి మానెఁ గాని
కొమ్మ భావములో నిన్నుఁ గొసరుతా నున్నది
నిమ్మపండు గాను కిచ్చి నిలుచుకున్నది గాని
ముమ్మారు మతిలోనే మొక్కుతా నీ కున్నది ॥ ఇన్ని ॥
పక్కన నీతో నవ్వి భ్రమసి వున్నది గాని
చిక్కించు కాతుమ నిన్నుఁ జెనకుతా నున్నది
యిక్కువ శ్రీవేంకటేశ యెనసితి విట్టె నీవు
గక్కన బిగ్గి నిన్నుఁ గౌఁగిలించుకున్నది. ॥ ఇన్ని ॥ 492

493-వ రేకు తెలుఁగుఁ గాంబోది

పతిమీఁద నింత యేల పంతములు నెరపేవు
యితవుగా నెప్పుడును ఇచ్చకమే మేలు ॥ పల్లవి ॥
మొక్కలాన బొమ్మలు ముడివెట్టుకోకువే
చక్కని నీ మోమునకు సాజమే మేలు
వెక్కసానఁ బెదవులు విరిచి మాటాడకువే
చెక్కులదాఁకాఁ బారే చిఱునవ్వే మేలు ॥ పతి ॥

మంచి నీ కరములను [1]మఱుఁగు వెట్టుకోకువే
చుంచుల నీ మెయికళలు చూపేదే మేలు
అంచెల నీ గుబ్బలఁ బయ్యద బిగించుకోకువే
వంచననేయక [2]వెలయించేదే మేలు ॥ పతి ॥

మొల్లలతోడి తురుము ముసుఁగులో దాఁచకువే
మెల్లనే సింగారాల మించుటే మేలు
ఇల్లిదె శ్రీవేంకటేశుఁ డింతలోనే నిన్నుఁ గూడె
వెల్లివిరై వలపులు చల్లేదే మేలు. ॥ పతి ॥ 493

## పాడి

వూరకున్నదాని నేల వుడికించేవు
కోరిక నీకుఁ [3]గలిగితే కూడి యేలవయ్యా ॥ పల్లవి ॥

చెలి నీ చేఁతలు విని చింతతోడ నుండఁగాను
యెలమిఁబువ్వుల వేసే వి దేమయ్యా
చలివాసి నీ సుద్దులు సకులతోఁ జెప్పఁగాను
చిలుకునఁ బయ్యదదీసే విదేమయ్యా ॥ వూర ॥

సుదతి నీ చిన్నలు చూచి తలవంచుకోఁగా
యెదుట నొట్లు వెట్టే వి దేమయ్యా
వెదకి నీ గుణాలకు వెరగంది వుండఁగాను
చెదరఁ దీసి కొప్పు చెనకే వి దేమయ్యా ॥ వూర ॥

కాంత నీవు వేఁడుకొంటే కడు సిగ్గుతో నుండఁగా
యెంత బలిమిఁ బెనఁగే వేమయ్యా
యింతలోనె శ్రీవేంకటేశ యీకెఁ గూడితివి
వింత సతిఁ దడవేవు వేరే ఇ దేమయ్యా. ॥ వూర ॥ 494

## రామక్రియ

చెలికత్తెలునుఁ దాను చేర వచ్చె నీకడకు
పిలిపించితివో తానే ప్రియమున వచ్చెనో ॥ పల్లవి ॥

---

1. తే. పా. – మఱంగు, 2. తే. పా. – వెలఇంచేదే, 3. తే. పా. – గలితే.

కనకపుమెట్టెలు కఱుంగని వాఁగఁగాను
వనితె నీకెదురుగా వచ్చీ నెవ్వతో
మినుకులపట్టుచీర మేలుముసుఁగు వెట్టుక
కనుచూపు దవ్వులనే కానవచ్చీ నదివో ॥ చెలి ॥

ముత్తేలకంకణాలు మొరమొర వాఁగఁగాను
యెత్తి చేతులను మొక్కీ నెవ్వతో నీకు
కొత్తజవ్వాదివాసన కొలువులో నెల్లా నిండ
హత్తి నీయందకు వచ్చీ నల్లంత నదివో ॥ చెలి ॥

కట్టినగింజెపుఁజీర గళబెళ మనఁగాను
యిట్టె వచ్చి కానుక నీ కిచ్చీ నెవ్వతో
గుట్టున శ్రీవేంకటేశ కూడితి వీకెను నాకుఁ
జుట్టమై నీరతిఁ గూర్చి చొక్కఁజేసీ నిదివో. ॥ చెలి ॥ 495

దేవగాంధారి

యెందాకా మొగమోట మీతనితోడ
చెంది యాకె వలపెల్లాఁ జెప్పరే విభునికి ॥ పల్లవి ॥

తలకొన్నతలపోఁత తతిగొన్న బయలింత
వలరా జీపెకుఁ దొల్లి వ్రాసిన వ్రాఁత
చెలువుఁడు రాఁడాయ జిగివెన్నెల వేఁడాయ
చెలఁగి యీమాటలే చెప్పరే విభునికి ॥ యెందాకా ॥

యెదురుచూచేచూపు యెడలేని తరితీపు
యిదే జవ్వనమే నేసె నింత రారాఁపు
యెదిగెఁ జనుఁగొండలు యేఁచె విరహ పెండలు
చెదరక యీమాటలే చెప్పరే విభునికి ॥ యెందాకా ॥

మోవికిఁ దేనెలు విందు ముచ్చట కిదే సందు
శ్రీవేంకటేశుఁ డీపెతోఁ జేసెఁ బొందు
వావు లిద్దరికిఁ గూడె వలరాచబల మోడె
చేవమీర నీమాటలే చెప్పరే విభునికి. ॥ యెందాకా ॥ 496

గంభీరనాట

వట్టి గజరుల (?) నెంత వలపులఁ బొరలేరు
అట్టె పెండ్లాడరాదా అనుమాన మేఁటికి ॥ పల్లవి ॥

నిక్కమువలెనే నీతో నిట్టూర్పు రేఁగఁగాను
గక్కనఁ దా నేమి చెప్పీఁ గతలు ఆపె
అక్కరతో మొగ మెత్తి యడియాసలతోనే
వెక్కసముగా నెందాఁకా వినేవు నీవూ ॥ వట్టి ॥

సిగ్గులెల్ల నటువెట్టి చెమటలు గారఁగాను
దగ్గ రేమి చూపీఁ జిత్తరువు నీకు
అగ్గమై శిర సెత్తుక ఆయము గరఁగుకొంటా
యె గ్గెఱుఁగ కాకె దిక్కే యెంత చూచేవు ॥ వట్టి ॥

కుమ్మరింపు నవ్వులతోఁ గొప్పు గొంత జారఁగాను
నెమ్మి జూజాలాడ నేమి నేరిపీ నీకు
యిమ్మల శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
అమ్మరో యేమి నేరిచే వాపెచేత నీవు. ॥ వట్టి ॥ 497

దేశాక్షి

నీ విఁకఁ దప్పించుకొంటే నేఁడు మానునా
వేవేలైనా నీకు వేసరఁగ వచ్చునా ॥ పల్లవి ॥

హత్తి మా విన్నపము లవధరించఁగ రాదా
చిత్తము వచ్చినటులఁ జేసేవు గాకా
బత్తి సేసి రిద్దరును పదఁతులు నీమీఁద
యిత్తల నిన్ను దూరితే నేల లోఁగే విందుకూ ॥ నీవిఁక ॥

తప్పక నీవిద్దరిని తగవు లడుగరాదా
అప్పటికి నన్ని పనులయ్యీఁ గాకా
యెప్పుడు నీకుఁ గానె యిద్దరూఁ దమకించేరు
తప్పించుక నీ వేల దాఁగీ విందులకూ ॥ నీవిఁక ॥

కందువ నీ విద్దరినిఁ గౌఁగిలింపించఁగ రాదా
అందపురతులు నీకు నబ్బీఁ గాకా
పొందిరి శ్రీవేంకటేశ పొత్తుల మగఁడ నిన్ను
సంపడించే రంటా నేల జడిసే విందులకూ. ॥ నీవిఁక ॥ 498

494-వ రేకు కన్నడగౌళ

చెలియరో నీవేమీఁ జింతించకువే
పలుకుఁ బంతాల నీకుఁ బంపు సేయించేనే ॥ పల్లవి ॥

తేరకొన నాతఁడు నాదిక్కు చూచితేఁ జాలు
తారుకాణ నొక్కమాటే దక్కఁగొనేనే
వూరకే పెదవు లెత్తి వొగ్గి మాటాడితేఁ జాలు
దూరు గాకుండా వెంటఁ దోడి తెచ్చేనే ॥ చెలియ ॥

సేసేటి నావిన్నపాలు చెవులు సోఁకితేఁ జాలు
ఆసల నిన్నుఁ బెండ్లాడేయట్టు సేసేనే
వేసరక యేకాంతాన వేళ యిచ్చితేఁ జాలు
నీసొమ్ముగా నాతని నేఁడే కావించేనే ॥ చెలియ ॥

ననిచి నీ చెలి నని నాతో నవ్వితేఁ జాలు
మనసు నీపాలు సేసి మరిగించేనే
యెనసి శ్రీవేంకటేశుఁ డింతలోనె వచ్చి నిన్ను
చనవిచ్చి పాయకుండా జంటసేసేనే. ॥ చెలియ ॥ 499

మంగళకౌశిక

కడు మొగమోటదాన గట్టిగాఁ దెలిసితివా
[1]చిడిముడి వినయమే సేయవలె నాకు ॥ పల్లవి ॥

చెప్పిన నీమాటలు చెలియరో నే వింటి
వొప్పెనా రమణుఁడు నీ వొడఁబాటులు
చిప్పిల నే నాఁటదాన సి గ్గవును పతివద్ద
అప్పుడు మీఱితే నేమి ననరాదు నాకు ॥ కడు ॥

1. వే. పా. – చిడుముడి.

నీ వేమి సేయు మనినా నే నిట్టె సమ్మతించితి
ఆవల నాతని కింపులై వుండునా
వేవేలైనా నిల్లాలికి వెరగవును తనవద్ద
ఆవేళఁ దా నెట్టుండినా ననరాదు నాకు ॥ కదు ॥
చేరి కూడుమనఁగాను శ్రీవేంకటేశుఁ గూడితి
యీరీతి నాతని కోర్కి యీడేర్చితివా
సారె సారె దేవులను సంతోసము నా కేది
ఆరితేరెఁ బను లిఁక ననరాదు నాకు. ॥ కదు ॥ 500

శుద్ధదేశి

వలచితి నంటా నాడి వట్టి సట లాతనితో
తెలిపి చెప్పఁగఁ బోయె తెలి విది యేఁటిదే ॥ పల్లవి ॥
యే యెడా మనసులలో నెరవు లేకుంట గాక
చేయి వట్టి పెనఁగేటి చెలి మేఁటిదే
చాయలా సన్నలనే చవులు గొనుట గాక
ఆయ మెఱుఁగ కప్పణ లడిగేటి దేఁటిదే ॥ వలచితి ॥
కన్నుచూపులనే చూచి కళలు రేఁగుట గాక
విన్నపాలు సేయఁబోయే వేకు కేఁటిదే
చన్నుల గుఱుతులకే సంతోసించుకొంట గాక
అన్నిటాఁ గొసరఁబోయే ఆసోదా లేఁటివే ॥ వలచితి ॥
సురతపు సుద్దులనే చొక్కుచు నుండుటగాక
సరసము లాడేటి జాగు లేఁటివే
యిరవై శ్రీ వేంకటేశుఁ డిదెవో నన్నుఁగూడె
తరుణిరో తమలోని తగులము లేఁటివే. ॥ వలచితి ॥ 501

నాగవరాళి

దవ్వుల కాఁకల నేల తడఁబడేవు
యివ్వల నాపెఁ గూడఁగా నేలనే మానేము ॥ పల్లవి ॥

కలువకన్నుల నాపె గక్కున నిన్నుఁ జూచితే
వలరాజుబాణా లంటా వసివాదేవు
వలపింత గలిగితే వద్దికిఁ బిలుచుకొని
కలయఁగా వద్దనేమా కడనుండి నేము ॥ దవ్వుల ॥

అంది వెన్నెల నవ్వుల అల్లంతఁ జల్లితే
చందమామ గుటుక లంటా జాలి గొనేవు
పొందు నీకు వేడుకై తే పొలఁతికి నుంకు విచ్చి
కందువఁ బెండ్లాడఁగాను కా దనేమా నేము ॥ దవ్వుల ॥

మసురుఁదేనె పలుకు మోవి నాపె చిలికితే
వసంతునివిందు లంటా వడిఁ గోరేవు
యెసగి శ్రీవేంకటేశ యిందాఁకా నన్నేలితివి
కొస రింతిఁ దెచ్చుకోఁగా కొత్తనేమా నేము. ॥ దవ్వుల ॥ 502

## శంకరాభరణం

తగుఁ దగు నీకూ నీకు దక్కెఁ జవ్వనఫలము
అగపడ్డ సంతోస మేమని చెప్పే మిపుడూ ॥ పల్లవి ॥

సేయఁగఁ జేయఁగ నిక్కెఁ జెలిమి
పాయనీదు తమకపు బలిమి
కాయపుఁ జక్కఁదనాల కలిమీ
ఆయాలు సోఁకిన మి మ్మేమని చెప్పే మిపుడూ ॥ తగు ॥

వడిగొనె మీయిద్దరి వలపు
తడఁబడీ మీలో మీతలఁపు
పెడరేఁచీఁ బెదవుల పిలుపు
అడరె మీసొబగు లేమని చెప్పే మిపుడూ ॥ తగు ॥

ననిచిన మీరతుల ననుపు
పొనగొన్న కౌఁగిళ్ళపెనపు
మొనసె శ్రీవేంకటేశ మునుపు
అనువాయ మీచేఁత లేమని చెప్పే మిపుడూ. ॥ తగు ॥ 503

ఛాయానాట

రమ్మనవే యిఁక నేల రారాఁపులు
నమ్మి యిచ్చకమాడేదే నాకు మంచి దనవే ॥ పల్లవి ॥

చెల్లుబడిగల తాను సేసినదే చేఁత గాక
మల్లాడి కొసరఁగ మరి యేఁటికే
బల్లిదుఁడు తనతోనేఁ బట్టి పెనఁగే నంటే
యెల్ల చందాలా నేఁడు యీడువచ్చె నటవే ॥ రమ్మ ॥

విచ్చనవిడైనవాని వేడుక లీదేరుఁ గాక
మచ్చరాన నొఁ గా దని మాన్ప నేఁటికే
తచ్చనకాఁడు తన్నుఁ దగవులఁ బెట్టే నంటే
యిచ్చటఁ దనముందర నెంతదాననే ॥ రమ్మ ॥

కడు జాణయినవాని గతులు మంచివి గాక
కొడిమె లెంచి మారుకొన నేఁటికే
యెడయక శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
బడిబడి నుందుఁ గాక పాయఁగల నటవే. ॥ రమ్మ ॥ 504

495-వ రేకు మేఘరంజి

ఆతని చిత్తము మఱి యట్టే నాభాగ్యము
నాతులాల పతికి విన్నప మిట్టే సేయరే ॥ పల్లవి ॥

చిగురుమోవి మీఁదఁ జిప్పిలఁగాఁ దేనెలు
వొగరు మాటలాడ నొనగూడునా
మొగమోటములు నాకు ముంచుకోఁగాఁ బతితోను
తగవు లుపచరించఁ దలకూడునా ॥ ఆతని ॥

కన్నుల నాతనిఁ జూచే కాంక్షలు నిండుండఁగాను
సన్న బొమ్మజంకెనలు సమకూడునా
చిన్ని నెలవుల నాకు చిఱునవ్వులు రాఁగాను
కన్నెనైన నాకు నలుకలు నేఁడు దగునా ॥ ఆతని ॥

పక్కనఁ జన్నులమీఁది పయ్యద జారఁగాను
   యెక్కడ లేని సిగ్గు లిఁక వచ్చునా
   గక్కనను శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గూడె
   తక్కించి తప్పు లెంచఁ దలకూడునా. ॥ ఆతని ॥ 505

బౌళి

అందరికిఁ గల చాలే ఆఁడువారైనవారికి
   కందువల ముందరెత్తు [1]కనుఁగొనరే ॥ పల్లవి ॥

చెలులాల మీతోను చెప్పే నంటే సిగ్గయీ
   తలఁపులో నాఁపరావు తమకములు
   వలరాజుబలములు వారించ పసగావు
   తెలుసుకోరే మీరు తెగని నాకోరిక ॥ అందరికి ॥

చేరి మీమోము చూచితే సెలవుల నవ్వు వచ్చీ
   వూరకుండితే నిట్టూర్పు లుమ్మగిలీని
   నీరువంటిది వయసు నిప్పువంటిది వలపు
   తారుకాణించఁగ రాదు తలఁచుకోరే ॥ అందరికి ॥

యెట్టని మీ రడిగితేఁ దొట్టీ నాలోని గుట్టు
   పట్టరావు వేడుక లుపచరించక
   యిట్టే శ్రీవేంకటేశుఁ డింతలోనే నన్నుఁ గూడె
   చుట్టరిక మిఁక మీరే చూచుకొనరే. ॥ అందరికి ॥ 506

బలహంస

యెక్కడ దిష్టి దాఁకునో యిందుకే చింతించి నీకు
   గక్కన నేడ తొడసు గలిగెనో తాను ॥ పల్లవి ॥

మగిడి మగిడి చూచి మతి నీరూపు భావించి
   చిగిరింపుఁ గోరికలఁ జెలఁగీ నింతి
   జిగి నిట్టూర్పులతోడ చెమటలు గారఁగాను
   తగిలీ నీ వెంటవెంటఁ దా నెవ్వతో యీపె ॥ యెక్కడ ॥

---

1. తే. పా — కనుకొనరే.

అట్టె నీతో మాటలాడి నాయాలు గరఁగుకొంటా
యెట్టనెదురు కట్టున నేఁకరీ నీకె
నట్టనడుమ నూరకే నవ్వులు నవ్వుకొంటాను
చుట్టి చుట్టి యాసలతో జొబ్బిలీఁ దా నిదివో ॥ యెక్కడ ॥
కోరి నీకు బాగా లిచ్చి కొంగు దాఁకించుకొంటాను
మేర మీఱి చన్ను లొత్తి మేను చొక్కని
యీరీతి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కూరిమి గొనరీఁ దాను గొబ్బున నింకాను. ॥ యెక్కడ ॥ 507

రీతిగౌళ

యెవ్వరు మించినా వారే యెక్కు డందురు లోకులు
యివ్వల మీ ఇద్దరిలో నెక్కుడాయఁ జెలియా ॥ పల్లవి ॥
చే యెత్తి పెండ్లికూఁతురు నేస నీకుఁ బెట్టఁగాను
సోయగపుఁ జూపులఁ జూచేవు నీవు
దోయిలించి ముత్యాలు తొలుతే పోయఁగ వద్దా
పాయపుటింతికిఁ గిందుపడ నీకు నేఁటికే ॥ యెవ్వరు ॥
తెర యెత్తి నీ మోము దిష్టించి యాపె చూడఁగా
సరుగఁ జన్నులకుఁ జేయి చాఁచేవు నీవు
పరగ శిరసుమీఁద బాసికము కట్టరాదా
తరుణిమాటకు లోనై తగులైతి విపుడు ॥ యెవ్వరు ॥
కోరి యాపె నిన్ను నిట్టె కూడి కెంగేలు పట్టఁగా
గారబానఁ గంకణము కట్టేవు నీవు
యీరీతి శ్రీవేంకటేశ ఇక్కువ లంటఁగ రాదా
వోరిచి రొమ్మునఁ బెట్టుకుండ నిట్టే వలసె. ॥ యెవ్వరు ॥ 508

నాట

వింటిమి ఇవీఁ గొన్ని వింతలు నేఁడు
ఇంటిలోనే వుంటిమి నే మెఱుఁగ మీ సుద్దులు ॥ పల్లవి ॥

అద్దమరేతిరికాడ నట్టే తలుపు దొబ్బక
వొద్దఁ గూచుండె నట వేరొకతె వచ్చి
నిద్దిరించఁగా మెల్లనే నీపాదాలపైఁ జేయి వేసి
గుద్దితే లేచితి వట గురుతౌనా విభుఁడ ॥ వింటిమి ॥

వేళగానివేళ వచ్చి వెస నిచ్చకము సేసి
మేలమాడె నట యీ మేకులకును
చాలుకో నీజోలితోడ జాగరాలు సేయించఁగ
ఆలించుక వుంటి వట అవునా నీవు ॥ వింటిమి ॥

వాకిటివా రాపొద్దు వద్దనఁగాఁ గడు మించి
నీకు వచ్చి మొక్కె నట నేరుపుతోడ
యీకడ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
లోకములోఁ దమ కెల్ల లోనయ్యేటి వాఁడవా. ॥ వింటిమి ॥ 509

సామంతం

నే నేమనే నీతో నీచిత్త మింతే కాక
ఔనయ్య నిన్ను నొఁ గా దన నెంతదానను ॥ పల్లవి ॥

యెట్టి నేరుపరినైన యెంత నీవు మన్నించిన
నెట్టుకొని మాటలాడ నే నెంతదాన
చుట్టమ నే నైనా సులభుఁడవు నీ వైనా
నట్టనడిమికివచ్చి నవ్వ నెంతదానను ॥ నేనే ॥

చక్కనిదాన నైనాను జవ్వని నే నైనాను
నిక్కి నిన్ను నాఁటఁ జూడ నే నెంతదాన
అక్కరతో వలచినా నాసతో నే మెరసిన
మొక్కు టింతే కాక గోరు మోప నెంతదాననూ ॥ నేనే ॥

కడుజాణనైనాను కౌఁగిట నీవు గూడిన
నిడివి సరసమాడ నే నెంతదాన
యెడయక శ్రీవేంకటేశ నన్ను నేలితివి
కడలేక నిన్ను నేఁ బొగడ నెంతదాననూ. ॥ నేనే ॥ 510

496-వ రేకు రామక్రియ

యిందుకంటె నున్న దదే యెంచఁగ మూలధనము
కందువ తలపోఁతలే కడుమూలధనము ॥ పల్లవి ॥

వనితకుఁ బతిమీఁదివలపే మూలధనము
మునుకొన్న తమకమే మూలధనము
కనుఁగొనే నెమ్మోముకళలే మూలధనము
వినయపుఁజేఁతలే వెసమూలధనము ॥ యిందు ॥

నేసవెట్టి పెండ్లాడినసిగ్గులే మూలధనము
మోసులైన పులకలే మూలధనము
ఆసపడి చూచే చూపే అన్నిటా మూలధనము
రాసికెక్క చిఱునవ్వే రతిమూలధనము ॥ యిందు ॥

కప్పుకొన్న వేడుకల కౌఁగిలే మూలధనము
ముప్పిరి మోవితేనెలే మూలధనము
యిప్పుడే శ్రీవేంకటేశుఁ డింతలోనే చెలిఁ గూడె
చెప్పరాని భోగములే జిగిమూలధనము. ॥ యిందు ॥ 511

మధ్యమావతి

అందుకేమే మంచిమాట లాడితేను దోసమా
యిందరిలోపల నన్ను నేలేవాఁడు గాఁడా ॥ పల్లవి ॥

ఇట్టు నట్టు వేఁడుక న న్నేల వాదఁబరచేరే
వట్టిమాట లిడ నేల వచ్చీఁగా తాను
చుట్టమైన దాన నేను సూడువట్టేనా తన్ను
గట్టిగా నాపాలిటఁ గలఁడుగా తాను ॥ అందు ॥

పొద్దున నాతని కిట్టే బోనము సేయు మనేరు
వద్దనేనా అందుకేమి వచ్చీఁగా తాను
కొద్ది మీఱ వీడె మంపె కొమ్మని చేతికిచ్చేరు
పెద్దరిక మింత సేసి పెనఁగీఁగా తాను ॥ అందు ॥

అన్నిటా నలుక దీర్చి ఆనవెట్టించుకొంటిరి
వన్నెల నాకౌఁగిటికి వచ్చీఁగా తాను
యెన్నఁగ శ్రీవేంకటేశుఁ డింతలోనే వచ్చి కూడె
నిన్ననే మెచ్చితి నింత నేర్చుఁగా తాను. ॥ అందు ॥ 512

వరాళి

కొమ్మసింగారము లివి కొలఁది వెట్టఁగ రావు
పమ్మిన యీసొబగులు భావించరే చెలులు ॥ పల్లవి ॥
చెలియ పెద్దతురుము చీఁకట్లు గాయఁగాను
యెలమి మోముకళలు యెండ గాయఁగా
బలిసి రాతిరియుఁ బగలు వెనకముందై
కలయ కొక్కట మించీఁ గంటిరటే చెలులు ॥ కొమ్మ ॥
పొందుగ నీకెచన్నులు పొడవులై పెరుగఁగా
నందమై నెన్నడుము బయలై వుండఁగా
ఇందునే కొండలు మిన్నుఁ గిందుమీఁదై యెక్కచోనే
చెంది వున్న వివివో చూచితిరటే చెలులు ॥ కొమ్మ ॥
శ్రీవేంకటేశువీఁపునఁ జేతు లీకెవి గప్పఁగా
యీవల నీతనిచేతు లీకెఁ గప్పఁగా
ఆవలఁ గొమ్మలుఁ దీగె ననలుఁ గొనలు నల్లి
చేవ దేరీని తిలకించితిరటే చెలులూ. ॥ కొమ్మ ॥ 513

భైరవి

అగడేల సేసేవు ఆకె నింత
తగిలి పొందులు సేసి దయఁ జూడరాదా ॥ పల్లవి ॥
చన్నులపై నునుఁగొంగు జాఱీ నది నెఱుఁగదు
నిన్నుఁ జూచే పరాకున నెలఁతా
విన్నపము సేసీఁ గొప్పువీడినది నెఱుఁగదు
కన్నెను లాలనసేసి కౌఁగిలించరాదా ॥ అగ ॥

చెక్కుమీఁది చెమటలు చిందేది నెఱుఁగదు
వెక్కసమై నీకు మొక్కేవేడుకలను
అక్కరతోఁ దనమేని అలపూ నెఱుఁగదు
మక్కువ నీపె నింతట మన్నించరాదా ॥ అగ ॥

కందువతోఁ గంకణాలు గల్లరనే దెఱుఁగదు
అంది నిన్ను రతిఁ గూడే యడియాసల
అందపు శ్రీవేంకటేశ అలమేలుమంగ యీకె
చెందీ నిన్నీజవరాలు చిత్తగించరాదా. ॥ అగ ॥ 514

కొండమలహరి

రమ్మనవే వద్దనేనా రతివేళకు విభుని
కుమ్మరించితే నాసలు కుప్పవడీనా ॥ పల్లవి ॥

పూవువంటిదాన నేను పుప్పొడివంటివలపు
తావి గొంటా నుండుఁగాక తన కేమే
చేవవంటిదీ వావి చిగురువంటిదీ తమి
వేవేలై పెరుగుఁగాక విసుగనేలే ॥ రమ్మ ॥

పండువంటిదీ మోవి పలుకు తేనెవంటిదీ
వుండుఁగాక చవిగొంటా నుపమ లేలే
కొండవంటిదీ వేడుక కోరికె మొలువంటిదీ
నిండుకొని కప్పుఁగాక నేరము లేలే ॥ రమ్మ ॥

గనివంటిదీ కౌఁగిలి కళవంటిదీ వయసు
యెనయుచు నుండుఁగాక యెరవు లేలే
నను శ్రీవేంకటేశుఁడు నాఁడే పెండ్లాడెఁ దాను
నని చెలమేల్మంగను నవ్వ నింత యేలే. ॥ రమ్మ ॥ 515

సామంతం

అటు గనకనేఁ దన్ను నౌఁ గా దనఁగలనా
నటనఁ దన కరుణే నాకు వలెఁ గాకా ॥ పల్లవి ॥

దొంతులైన మోహములు తోదోపు లాడఁగాను
పంతము లాడవచ్చునా పడఁతులకు
మంతనాన నాతఁడు మన్నించి చేయి వట్టితే
వింతలుగా మొక్కితేనే వేడుకలౌఁ గాక ॥ అటు ॥

వెనుకొనీ మనసే వేడుకలు రేచఁగాను
పెనఁగులాడవచ్చునా ప్రియురాండ్లకు
ననుపున నాతఁడు నాతోడ నవ్వితేను
వినయానఁ దనబుద్ధి వినవలేఁ గాక ॥ అటు ॥

కగ్గు లేక యాదరించి కౌఁగిలించుకొనఁగాను
సిగ్గులు వడవచ్చునా చెలులకును
అగ్గమై శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
యెగ్గు లేక నన్నుఁ గూడె నిరవైతిఁ గాకా. ॥ అటు ॥ 516

497-వ రేకు కాంబోది

యిందరిలోనా నిన్ను నింతగా మన్నించెను
చెంది మిక్కిలి నీవు సేసినదే భాగ్యమే ॥ పల్లవి ॥

నెపమునఁ దేరకొని నిన్నుఁ జూచె నాతఁడు
తపము ఫలించెఁగా తరుణి నీకు
కృపతోడ నప్పటిని కేలు నీమీఁద వేసె
యిపుడే నీ కోరికలు యీడేరెఁ గదవే ॥ యింద ॥

చెంత నీచే నూడిగము సేయించుకొనె నేఁడు
పంత మెల్ల దక్కెఁగా పడఁతి నీకు
సంతోసానఁ దమ్ములము చనవున నొసఁగెను
చింతించిన నిధానము సిద్ధించెఁ గదవే ॥ యింద ॥

చెలఁగి నీయింటికి శ్రీవేంకటేశుఁడు వచ్చె
వలపెల్ల దక్కెఁగా వనిత నీకు
అలమేలుమంగవు ని న్నక్కుమీఁద నుంచుకొనె
తలఁచినతలఁపులు దైవారెఁ గదవే. ॥ యింద ॥ 517

రామక్రియ

పెక్కుసతులఁ బెండ్లాడి బెరసినవాఁడు తాను
వెక్కసము లెంతైనా వేసరకు మనవే ॥ పల్లవి ॥

మొలచిన తమకము మోసులువారకుండునా
కలసినవావులు కడ నుండునా
నలిరేఁగి సారె సారె నవ్వితిఁ దనతో నేను
వెలలేని వెన్నైనా వేసరకు మనవే ॥ పెక్కు ॥

చిగిరించిన వలపుచెట్టు కట్టు కుండునా
తగులైన పొందులు దాఁచవచ్చునా
అగపడి సరసము లాడితిఁ దనతో నేను
వెగటెంతైనా నాయ వేసరకు మనవే ॥ పెక్కు ॥

గుదిగొన్న ననుపులు కుప్పలు గాకుండునా
చెదర నీమోవితీపు చెప్పవచ్చునా
అదన శ్రీవేంకటేశుఁ డలమేల్మంగను నేను
వెదకివచ్చి నన్నేలె వేసరకు మనవే. ॥ పెక్కు ॥ 518

మాళవిగౌళ

యిప్పు డొక్కటైతిరా యిద్దరు మీరు
అప్పసము గోర నొత్తె నని యంటి వపుడూ ॥ పల్లవి ॥

చెక్కు నొక్కి నీతోను చెలియ విన్నవించీని
యిక్కువతో వింటివా యిన్నియు నీవు
లక్కవంటి నీ మనసు లలిఁ గరఁగెనా నేఁడు
అక్కరతోఁ దిట్టెనంటా నంటివి నీ వాపెను ॥ యిప్పు ॥

చెమ్మఁజెమట దుడిచి చేరి నిన్ను వేఁడుకొని
సమ్మతేయనా నీకు సతిప్రియాలు
వుమ్మడి సంతోసములోనఁ గూడెనా మతి
బొమ్మల జంకించెనంటాఁ బొరలితి వచటా ॥ యిప్పు ॥

అలమేలుమంగ నిన్ను నదివో కౌఁగిలించీని
చెలఁగి కూడితివా శ్రీవేంకటేశ
తలపోఁత లిద్దరికీ తారుకాణ లాయనా
కిలకిల నవ్వేనంటా ఁగెరలుతా నుంటివి. ॥ యిప్పు ॥ 519

ఆహిరి

యెంత లేదు నాయాసోద మెంచి నీతోఁ జెప్పేనంటే
యింతటి చనవు నాకు నిచ్చితివిగా ॥ పల్లవి ॥
తలఁచితే నీరూపు తావుకొనె నాలోన
కులుకు నాచూపులకు గుఱి యైతివి
పిలిచేనంటే నీపేరు పెదవులపై నున్నది
యెలమి నీవుపకార మింత చాలదా ॥ యెంత ॥
చేరి పాదాలొత్తేనంటే చేతిలో నున్నాఁడవు
నేరిచి సరసమాడ నీవు గలవు
గారవించి నీవు నాకుఁ గడుఁ జుట్టమ వైతివి
యీరీతి నెంచితే గుణా లెన్నైనాఁ గలవూ ॥ యెంత ॥
పొసఁగి నావీనులకు పొందైనకత వైతివి
వెస నామోవితేనెకు విందవైతివి
పసగ శ్రీవేంకటేశ బడి నలమేల్మంగను
యెనసి కూడితి విదె యెన్నికాయ నాకూ. ॥ యెంత ॥ 520

నాదరామక్రియ

పడఁతుల జాడ లివి పతియెదుట
అడఁచుకోరాదు నీవే ఆదరించవయ్యా ॥ పల్లవి ॥
మనసులోపలిచింత మాటలలోఁ గొంత చూపు
కొనచూపులలోనఁ గొంత చూపును
తనరి పెదవిపై దప్పులై కొంత చూపు
వెనుకొని మొగమున వెల్లివిరై తోఁచును ॥ పడ ॥

తాపపుమేనికాఁకలు తమకమై కొంత చూపు
కోపవు జంకెనలై కొంత చూపును
యేపునఁ జెక్కిటిచేతి యెన్నికలై కొంత చూపు
కాఁపుర మంతటిమీఁదఁ గలదెంతాఁ జూపును ॥ దప ॥

పట్టరానిమోహము బలుసిగ్గై కొంత చూపు
గుట్టుతోడి యదియాసై కొంత చూపును
యిట్టే శ్రీవేంకటేశ యీకె నీవు గూడితివి
నెట్టుకొన్న వేడుకలై నెమ్మి నింతా నిండును. ॥ పద ॥ 521

మనోహరి

నేరుతువే యిటువంటి నెరజాణతనములు
కోరికె లింకా నెంత కుప్పళించేవే ॥ పల్లవి ॥

చెప్పిననీమాటలు చెలువుఁడు వినేఁ గదే
కొప్పు జారఁగా నెంత కొసరేవే
ముప్పిరి నీరాకకు ముచ్చటలూ నాడుఁగదే
రెప్ప లెత్తి చూచి యేమి రేఁచేవే వలపు ॥ నేరు ॥

సన్నల నీమోము చూచి సమ్మతిగ నవ్వేఁగదే
చన్ను లదరఁగా నేల జంకించేవే
పన్ని నీతొడలమీఁదఁ బాదములు చాఁచెఁ గదే
కన్ను లా ర్చేఁటికిఁ దమకము వుట్టించేవే ॥ నేరు ॥

కమ్మర నీసేవలకు కౌఁగిలించుకొనెఁ గదే
చెమ్మఁజెమటల నెట్టు సిగ్గువడేవే
యిమ్ముల శ్రీవేంకటేశుఁ డిరవుగా నిన్ను నేలే
బొమ్మజంకెనల నెంత పొందు చూపేవే. ॥ నేరు ॥ 522

498-వ రేకు వరాళి

యింతి నీ చుట్టరికము లెటువంటివి
సంతోసము లిద్దరికి సరివచ్చెను ॥ పల్లవి ॥

కలువరేకులవంటి కన్నుల నింతిఁ జూడఁగా
చెలిమోముఁ జందురుఁడు చెంగలించెను
వలపుల మచ్చికల వసంతము చల్లఁగాను
కులుకుఁ జన్నుల పూవుగుత్తులు సొం పెక్కెను ॥ యింతి ॥

అరిది పలుకుఁదేనె లట్టె నీవు గురియఁగా
నిరతిఁ గొప్పుతేఁటులు నిండుకొనెను
వెరవుతోఁ జిఱునవ్వువెన్నెలలు వూయఁగాను
విరహపుమబ్బు వాసి వేడుకలు రేఁగెను ॥ యింతి ॥

మితిమీఱి నీ విపుడు మేఘమవై వాలఁగాను
అతివ కౌఁగిట మెఱుఁగై మెరిసెను
ఇతవై శ్రీవేంకటేశ యీకె నిట్టె పెండ్లాడఁగా
చతురత నీపె నేసలు నించెను ॥ యింతి ॥ 523

దేశాక్షి

నీ వెఱఁగనిపనులు నేము విన్నవించేమా
దేవులు నీకు మొక్కీని తిలకించవయ్యా ॥ పల్లవి ॥

వొక్కొకవేళ సతులు వూరకే కోపించుకొన్నా
అక్కరతో నవ్వుదురు అంతలోననే
యెక్కువైన మగవాని కెగ్గులుగఁ బట్టరాదు
చెక్కునొక్కి చనవుః చెల్లించవలెను ॥ నీవెఱ ॥

నెట్టుకొని వొకవేళ నిష్ఠూరము లాడినాను
అట్టె ప్రియము చెప్పుదు రంతలోననే
చుట్టమైన నాయకుఁడు సూడుఁబాడు నెంచరాదు
జట్టిగొని సరసమే జరపఁగవలెను ॥ నీవెఱ ॥

బలిమితో నొకవేళ పంతములు చూపినాను
అలుక దేరి కూడుదు రంతలోననే
యెలమి శ్రీవేంకటేశ ఇఁక నేమి ననరాదు
కలసి యేలితి వి ట్టె కరుణించవలెను. ॥ నీవెఱ ॥ 524

పాడి

మున్నే పులుకడిగిన ముత్తెమువంటి వాని
చన్నులపై కస్తూరేల సారె నంటించేవే ॥ పల్లవి ॥

సన్నలనే మోవిచూపి చవు లూరక కొనేవు
యెన్నికైనపతి నెంగి లేల సేసేవే
కన్నులకాటుకచూపు కప్పే వాతని మీఁద
మన్నించే యాతనిమేను మైలేల సేసేవే ॥ మున్నే ॥

పుక్కిటితమ్మలముతోఁ బొంచి యేకాంతా లాడేవు
తక్కక నోరి [1]ఆవేల తాఁకించేవే
పక్కన నాతనిపాదపద్మాలు నెత్తిఁ బెట్టుక
మొక్కేవు నీతల నేల ముడిచివేసేవే ॥ మున్నే ॥

అచ్చపు శ్రీవేంకటేశు నలమి కౌఁగిటఁ బట్టి
కొచ్చి కూడే వేల అలుకుడు సేసేవే
నిచ్చలు నన్నేలినాఁడు నీవూ గోరఁ జెనకేవు
అచ్చలాన నిఁక నేల అంటుపరచేవే. ॥ మున్నే ॥ 525

వరాళి

వెలలేని వలపుల వెనకముం దెంచుకోవు
చెలు లెమ్మె లేదనైనాఁ జెప్పుకొందురు సుమ్మీ ॥ పల్లవి ॥

సందడి నాపెతో నీవు సారె సారె నవ్వేవు
మందెమేళ మయ్యీఁ జుమ్మీ మగవాఁడవు
కందువ నాపెవద్దఁ గదిసి కూచుండేవు
అంది కొప్పువిరులు పై నట్టే రాలీఁ జుమ్మీ ॥ వెలలేని ॥

చెక్కు నొక్కి యాపె నిట్టె చేరి వేఁడుకొనేవు
మొక్కితి వనేరు సుమ్మీ మొగవాఁడవు
పిక్కటిల్లుఁ జనుఁగవ ప్రియముతోఁ బట్టేవు
చిక్కనిచెమటలు నీచేత నంటీఁ జుమ్మీ ॥ వెలలేని ॥

---

1. ఆవేలము = తమ్మ.

తగిలి యాపె కౌఁగిట తనియ వెంతైనాను
మొగచాటయ్యీఁ జుమ్మీ మొగవాఁడవు
నిగిడి శ్రీవేంకటేశ నేఁ డిట్టె న న్నేలితివి
పగటున నాపెపొందు పచ్చిదేరీఁ జుమ్మీ. ॥ వెలలేని ॥ 526

సాళంగనాట

సముఖా అవధారు సర్వేశ రాఘవేంద్ర
అమరులు వా రివో చిత్తావధానా ॥ పల్లవి ॥

రాముఁడు గొలువున్నాఁడు రాజులాల కొలువుఁడు
వామదేవ సేవించు వసిష్ఠకను
సామజములవా రవో జవనాశ్వములవార
మీమీ పౌఁజులతో నిరుమేలా నిలువరో ॥ సముఖా ॥

భరత గొడుగువట్టు బాగాలిమ్ము శత్రుఘ్న
సరుస లక్ష్మణుఁడ వింజాము రిడుము
సొరిది నిలుచుండుడు సుగ్రీవాంగదులాల
వెరపుతో విభీషణ విన్నపాలు సేయవో ॥ సముఖా ॥

వానరులాల మొక్కుఁడు వాయుజ పాదము లొత్తు
నానాదేశాధీశులాల కానుక లిండు
పూని శ్రీవేంకటాద్రిపైఁ బొంచి సీతాసమేతుఁడై
శ్రీనిధియై వరా లిచ్చీ చేకొనరో ప్రజలు. ॥ సముఖా ॥ 527

పాడి

ఆనలునుఁ బెట్టుదుగా అప్పటి నందుకుఁ దోడు
కానీ లేరా దానిపైనే కన్ను లెట్టఁ జేయరా ॥ పల్లవి ॥

అంటినవి నీ వురమునందు నెవ్వతెవో కాని
జంటల వత్రువలైన చన్నులగురుతులు
కంటకా లాడిన నన్ను కల్లఁ జేయ వత్తువుగా
వెంటనే నీవల పదే వెలివేసెఁ గదరా ॥ ఆనలు ॥

అలరె నీ వీఁపునను అవి యెవ్వతెవో కాని
కళుకు వ్రాసినయట్టి కంకణాల వొత్తులు
బలిమి సాదువలెనే పంతమాడ వత్తువుగా
యెలమి నిన్నట్టె రూధి కెక్కించెఁ గదరా . ॥ అనలు ॥
యిదె నీ చెక్కుల జారె నెవ్వతె చెవిదో కాని
సదరపు బొొప్లే జవ్వాది కరఁగులు
కదిసి శ్రీవేంకటేశ కౌఁగిట నీవు గూడఁగా
యెదుట నన్నట్టే అది యెంతసేసీఁ జూడరా. ॥ అనలు ॥ 528

499-వ ఱేకు శ్రీరాగం

చేరువ జాణతనాలు చెప్పరమ్మా
అరితేరినపనులు అవి చెప్పరమ్మా ॥ పల్లవి ॥
మెలుపున రమణుఁడు మెల్లనే మాటాడితేను
చెలి యాల నవ్వు నవ్వె చెప్పరమ్మా
సొలపున నప్పటి నీ సురటి విసరుకొంటే
అలరి వెంగె మే లాడె నది చెప్పరమ్మా ॥ చేరువ ॥
సారెకుఁ బువ్వులబంతి సరసుఁడు మూకొనఁగ
చేరి సతి యాల మెచ్చెఁ జెప్పరమ్మా
నేరుపున నంతలోనె నెత్తమాడ రాఁగాను
అరసి మొక్కులు మొక్కె నది చెప్పరమ్మా ॥ చేరువ ॥
పక్కన శ్రీవేంకటాద్రిపతి గౌఁగిలించుకొంటే
చెక్కుచే యిడ నే లింతి చెప్పరమ్మా
తక్క అప్పుడే రతిఁ దలపోసుకొంటేను
అక్కరతోఁ బొగడీని అది చెప్పరమ్మా. ॥ చేరువ ॥ 529

బౌళిరామక్రియ

ఇద్దరు నొక్కటే యెప్పుడును
బుద్దులు చెప్పరే పొలఁతుకలూ ॥ పల్లవి ॥

చలమున నూరకే సాదించీఁ జెలి
తలఁపు దెలియకే తనపతిని
కలి ముదిసి మేడిదె గాక తొలుతనె
కలఁక దేరుచరే కామినులు ॥ ఇద్దరు ॥

విచ్చనవిడిగా వెంగెము లాడి
గచ్చుల యలుకల కాంతునిని
హెచ్చి గోరి రేక యేరుగా నెపుడే
మచ్చిక సేయరే మానినులు ॥ ఇద్దరు ॥

పనివడి కూడుచుఁ బంతము లాడి
ఘనుఁడగు శ్రీవేంకటవిభుని
ననలే విరులై నాఁటక మునుపనె
పెనఁగి మొక్కించరే ప్రియసఖులు. ॥ ఇద్దరు ॥ 530

కేదారగౌళ

ఇంత కాతరిఁద వౌట యెఱుఁగమయ్య
మంతు కెక్కితి విన్నిటా మంచివాఁడవయ్యా ॥ పల్లవి ॥

తరుణికి నీకునుఁ దగవులు చెప్పరాఁగ
గరిమెఁ బోరు గాపెనుఁ గౌఁగిలించేవు
సొరిదిఁ జూచేవారికిఁ జూడ మెచ్చేవానివలె
మరిగించి మొఱఁగేవు మాయకాడవయ్యా ॥ ఇంత ॥

సంగడి మీ యిద్దరికి సాకిరులు చెప్పఁగాను
చెంగటనున్న యాపెపై సేస వెట్టేవూ
సంగతిగా దీవించి యక్షత లిడేవానివలె
అంగముగాఁ దక్కించేవు అవును జాణవయ్యా ॥ ఇంత ॥

శ్రీవేంకటేశ మీలో సిగ్గులు దేరుచ రాఁగా
వావి చెప్పి చుట్టపాపెమోవి యానేవు
కావించి మొకమిచ్చి యేకాంతమాడేవానివలె
యీవల నన్నుఁ గూడితి వేమి చెప్పేదయ్యా. ॥ ఇంత ॥ 531

సౌరాష్ట్రం

నీవంటివారమే కామా నే మెల్లాను
పూవువలె ముడుచుక భోగించేమటే ॥ పల్లవి ॥

వాసులకే పెనఁగేవు వంతులకు వచ్చేవు
వీసమంత పనికైనా వేగిరానను
సేసవెట్టిన సతులు చేరి కొలిచే రింతే
పూసవలెఁ గట్టుకొని భోగించేరటే ॥ నీవంటి ॥

పంతములే చూపేవు బత్తులకే లానేవు
అంతలోనే తమకాన ఆసతోడను
మంతనపు చెలు లెల్ల మచ్చికలు సేసి రింతే
బొంతవలెఁ జుట్టుక భోగించేరటే ॥ నీవంటి ॥

కన్నులనే యాఁకరేవు కాఁగిటనే కూడేవు
సన్నల శ్రీవేంకటేశుఁ జలముసను
వన్నెలతో మే మెల్లా వరుసఁ గూడితి మింతే
పున్నమవెన్నెలవలె భోగించేరటే. ॥ నీవంటి ॥ 532

తెలుఁగుఁగాంబోది

వినఁగదవే మా విన్నపము
గొనకొని యిద్దరూఁ గూడితి రిపుడూ ॥ పల్లవి ॥

చలములు గడకును సాదించఁగా
వలపు లెన్నటికే వనితా
అలుకల మోనము ల వే పెంచఁగ
పలుకుల యమృతము పనిగొను టెపుడే ॥ విన ॥

[1]కలికితనమే కడు నెరపఁగా
సరస మెన్నటికే సకియా
మఱిగినచోటనే మంకు చూపఁగా
మురిపెము తనెదుట ముంచుట యెపుడే ॥ విన ॥

1. తే. పా. — కరికరి.

వాటపు సిగ్గులే వడిగాఁ గొనఁగా
కూట మెన్నటికే కోమలి
యీటున శ్రీవేంకటేశు నెనసితివి
మేటి గుఱుతులను మెఱయుట యెపుడే. ॥ విన ॥ 533

కన్నడగౌళ

యేల పెంచేవు చలము లెందాఁకాను
వేళ గాచు కున్నాఁడు విన్నవించఁ గదవే ॥ పల్లవి ॥

నవ్వినమాటకుఁ గాను నాతి నీ పతని నింత
రవ్వలు సేతు రటవే రచ్చలోననూ
పువ్వులు చేతి కిచ్చేవు పుప్పొడి నీమీఁదఁ జల్లె
మవ్వపు నీపతితోడ మంచిమాట లాడవే ॥ యేల ॥

సరసమాడినందుకే చెండిపెట్టి యతనితో
జరసి జంకింతురటే సముకాననూ
గరిమ నిన్నుఁ బొగడి గందము మైనిండాఁ బూసె
బెరసి యాతని కింకాఁ బ్రియములు చెప్పవే ॥ యేల ॥

కూరిమిఁ గూడినందుకే కోరి శ్రీవేంకటేశ్వరు
నా రీతి నాడుదురటే అంతరంగాన
హారము నీ మెడఁ బెట్టె నాకు మడిచి నీ కిచ్చె
గారవిం చితని నిట్టే కందువఁ బాయకువే. ॥ యేల ॥ 534

500-వ రేకు నాగవరాళి

యెటువలెఁ జేసినాను యిన్నియు నమరును
సట లొద్దనరే తాను సరసుఁ డిన్నిటను ॥ పల్లవి ॥

తగ వెఱిఁగినవాఁడు తనకు బుద్ధి చెప్పేమా
మగువల మింతే మేము మ మ్మడిగిన
యెగసక్కెలకుఁ దాను యేమేమి సేసినాను
తగు నవరే దొరతన మెల్లఁ దనదే ॥ యెటువలె ॥

సత్తువలఁ దా నెక్కుడు సాములు నేము నేర్చేమా
కొత్తపెండ్లికూఁతులము కొచ్చి చూచినా
బిత్తరపువాఁడు తాను బిరు దెంత నెఱపినా
చిత్తముకొల దనరే చేఁతలు నేరుచును ॥ యెటువలె ॥

అన్నిటా దేవుఁడు తాను అయములు నేమంటేమా
కన్నెలము నేము తన్నుఁ గరఁగించేమా
సన్న లేల సేసెనే తా జాణ శ్రీవేంకటేశుఁడు
మన్నించుమనవే తాను [1] మతకారి వాఁడు. ॥ యెటువలె ॥ 535

## శోకవరాళి

మొగములు చూడక ముచ్చ టేల పాయును
యెగసక్కెలకు నీవు యేమి సేసే వీడనూ ॥ పల్లవి ॥

పంతపుమాటల దాపె పాయపుమదము దాపె
ఇంతులమాటల కెల్ల నియ్య కొనీనా
చెంతల నీవే విచ్చేసి చెక్కు నొక్కి బుజ్జగించు
· యెంతపని గద్దు నీకు యేమి సేసే వీడనూ ॥ మొగ ॥

పట్టపుదేవులాపె బలువైనదొర యాపె
యిట్టి కానికెల కెల్ల నియ్యకొనీనా
జట్టిగా నీ వండనుండి చనవిచ్చి కౌఁగిలించు
ఇట్టు నట్టుఁ బరాకుల నేమి సేసే వీడనూ ॥ మొగ ॥

వలపుగలిగినాపె వడిఁ దమకపుటాపె
యెలమి లేక లంపితే నియ్యకొనీనా
కలిసితివి శ్రీవేంకటేశ దినము రమ్మ
యెలయింపు నవ్వులతో నేమి సేసే వీడనూ. ॥ మొగ ॥ 536

## పాడి

కందువకు రావయ్య కలయవయ్యా
సందడిసే పొద్దులు జరపఁగఁ దగునా ॥ పల్లవి ॥

---

1. మతకరి=మాయావి.

చాయలాను సన్నలాను సతి నిన్నుఁ గొసరఁగ
నీయంత నీవే కరుణించ వలదా
నాయము లే లడిగేవు నాలి యేల సేసేవు
పాయపువారి నింత పరచఁగఁ దగునా ॥ కందువ ॥

ఆసలాను వాసులాను అతివ వేఁడుకోఁగాను
సేస వెట్టి చెప్పినట్టు సేయఁగ వద్దా
మూసి యేల నవ్వేవు మొఱఁగు లేల చూపేవు
వేసరనివారిని విసిగించఁ దగునా ॥ కందువ ॥

సిగ్గులాను చేఁతలాను చెలి నీకు మొక్కఁగాను
నిగ్గులఁ గూడితివి మన్నించఁగ వద్దా
అగ్గమై శ్రీవేంకటేశ అలయి కేల నించేవు
వొగ్గి పెండ్లాడినవారి నొరయఁగఁ దగునా. ॥ కందువ ॥ 537

మనోహరి

మా మాట వినవే మగువా
చేముంచి చెనకితేను చిగిరించుఁ గోరికె ॥ పల్లవి ॥

మొక్కలపుమాట లేలే మోహించిన పతితోడ
చిక్కనిప్రియములే చెప్పరాదా
లక్కవంటిది మనసు లావులకోలఁది రాదు
యెక్కుడు చెలము లైతే యెంతైనాఁ గరఁగదు ॥ మామాట ॥

బొమ్మల జంకించ సేలే పొందైనవానితోడ
నమ్మిక చేసన్న చూపి నవ్వరాదా
సొమ్మువంటిది వలపు చూచితే విడువరాదు
యెమ్మెలకుఁ బెట్టుకొంటి నెంతైనాఁ దనియదు ॥ మామాట ॥

సిగ్గులు వడఁగ సేలే శ్రీవేంకటేశ్వరుతో
వెగ్గలించి కూడితివి వీడె మీరాదా
ముగ్గువంటిది వయసు మొఱఁగి దాఁచరాదు
యెగ్గు లేక వెదకితే నెంతైనాఁ గలదు. ॥ మామాట ॥ 538

శ్రీరాగం

ఇక్కడను వింతవారు యెవ్వ రున్నారు
గక్కనను మన్నించఁగదవయ్యయింతిని ॥ పల్లవి ॥

తేనెలవంటిమాటలు తెరమఱఁగు సిగ్గులు
కానుకవట్టీ నీకుఁ గలికి
మైనమువంటిది నీ మన సందుకెల్లాఁ దగు
కానిమ్మని పిలుచుకోఁ గదవయ్య వద్దికి ॥ ఇక్కడ ॥

కప్పురమువంటినవ్వు కాతరపుఁదమకము
కుప్పళించీ నీపయిఁ గోమలి
వుప్పువంటిది నీ వల పూరఁబెట్టితేఁ జవౌ
చిప్పిలఁ గాఁగిటఁ జేర్చి చెప్పవయ్య ప్రియమూ ॥ ఇక్కడ ॥

పాలువంటి చూపులును పానుపుపైసరసాలు
మేలుచూపి నిన్నుఁ గూడె మెలఁతా
ఔలే చెఱకువంటిది అన్నిటి కోపు నీరతి
యీలీల శ్రీవేంకటేశ యేలవయ్య రాజ్యమూ. ॥ ఇక్కడ ॥ 539

ప్రతాపనాట

మగనాండ్లము మమ్మ మన్నించవయ్య
అగడుసేయకువయ్య అప్పటిని మొక్కేము ॥ పల్లవి ॥

దొడ్డేఁడు పసులఁ గాచి దొరవు నేఁ డైతివి
జడ్డుగొల్లెతలఁ బొంది జాణ వైతివి
జిడ్డంటీ నీ మే నెల్ల చీరలు మా కియ్యవయ్య
వొడ్డారపు శ్రీకృష్ణుఁడని వొంటి చేత మొక్కేము ॥ మగ ॥

పాలు వెన్నలు మెసఁగి పాయపువాఁడ వైతివి
రోలఁ గట్టించుక తొల్లె రూడి కెక్కితి
వోల నీపైఁ బడె మా వొడ్డాణా లీఁగదవయ్య
గేలిసేఁతల కృష్ణుఁడ కిందుపడి మొక్కేము ॥ మగ ॥

వోవల వలపు చల్లి వూరబావ వైతివి
కావించి మమ్ము నేలి మగఁడ వైతివి
పూవులదండలు మావి పోఁడిమితో నియ్యవయ్య
శ్రీవేంకటాద్రికృష్ణుఁడ సిగ్గుతోడ మొక్కేమూ ॥ మగ ॥ 540

## సూచిక ౧

# సంకీర్తన రాగముల అకారాది సూచిక


| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
|---|---|
| అమరసింధు | 205, 293, 327, 412, 454. |
| ఆందోళి | 229, 388. |
| ఆరభి .... | 186, 303. |
| ఆహిరి .... | 22, 80, 117, 130, 155, 172, 201, 249, 296, 341, 348, 375, 376, 382, 415 435, 440, 449, 467, 477, 479· 492 520. |
| ఆహిరినాట | 208. |
| కన్నడగౌళ .... | 94, 100, 190, 222, 264, 309, 363, 404, 499. |
| కన్నడబంగాళం | 411, 534. |
| కాంబోది .... | 21, 91, 149, 263, 280, 320, 355, 416, 466, 517. |
| కుంతలవరాళి | 162, 202, 236, 287, 301, 476. |
| కురంజి | 160, 284, 370, 461. |
| కేదారగౌళ | 43, 143, 198, 260, 294, 316, 343, 396, 452, 491, 531. |
| కొండమలహరి .... | 96, 203, 481, 515. |
| కోకిలపంచమం | 188. |
| గంభీరనాట | 213, 239, 292, 457, 497. |
| గుండక్రియ | 16. 29, 33, 38, 138. |

| రాగములు | | సంకీర్తనలు సంఖ్యలు |
|---|---|---|
| గుజ్జరి | | 124, 274, 306. |
| గుమ్మకాంబోది | .... | 335. |
| గౌళ | | 9, 63, 75, 147, 285, 373, 408, 446. |
| ఛాయానాట | | 152, 451, 504, |
| తెలుఁగుఁగాంబోది | .... | 183, 192, 273, 312, 357, 394, 474, 493. 533. |
| తోడి | .... | 165 |
| దేవగాంధారి | .... | 51, 109, 112, 211, 275, 409, 496. |
| దేసాళం | .... | 8, 41, 46, 53, 121, 156, 253, 282, 334, 387, 400, 472. |
| దేసాక్షి | .... | 54, 87, 127, 151, 164, 251, 431, 447, 498, 524. |
| ద్రావిడభైరవి | | 191, 245, 484, |
| ధన్నాసి | .... | 1, 78, 89, 159, 163, 195, 262, 350, 398. |
| నట్టనారాయణి | .... | 161, 315, 399. |
| నాగగాంధారి | .... | 212, 286. |
| నాగవరాళి | .... | 10, 166, 215, 365, 427, 502, 535. |
| నాట | | 234, 509. |
| నాదరామక్రియ | .... | 90, 101, 150, 218, 228, 259, 288, 311, 336, 366, 368, 378, 405, 444, 478, 490, 521. |
| నారణి | | 146, 182. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
| --- | --- |
| నారాయణి | 207, 272, 278, 410, 430. |
| నీలాంబరం | 126, 176, 406. |
| పళపంజరం | 184, 241. |
| పాడి | 12, 32, 48, 62, 68, 93, 113, 122, 237 248, 266, 291. 329, 345, 358, 372, 393, 417, 420, 439, 465, 470, 480, 494, 525, 528, 537. |
| పిసాళం | 55. |
| పూరిధి | 185, 332. |
| పూర్వగౌళ | 167, 298, 482. |
| ప్రతాపనాట | 196, 314, 383, 540. |
| బంగాళం | 189. |
| బళహంస | 173, 175, 210, 295, 369, 507. |
| బౌళి, భౌళి, భవుళి | 2, 6, 24, 26, 49, 50, 74, 153, 267, 297, 340, 384, 395, 421, 441, 464, 506. |
| బౌళిరామక్రియ | 322, 530. |
| భూపాలం | 111, 145, 194, 277, 304. |
| భైరవి | 13, 72, 108, 129, 141, 171, 204, 233, 276, 281, 317, 319, 324, 353, 389, 424, 432, 437, 462, 469, 514. |
| మంగళకౌశిక | 56, 97, 136, 181, 231, 240, 433, 500. |
| మధ్యమావతి | 31, 79, 103, 144, 154, 180, 235, 386, 512. |

| రాగములు | సంకీర్తన సంఖ్యలు |
| --- | --- |
| మనోహరి (రం) | 170, 333, 522, 538. |
| మలహరి | 128, 200. |
| మాళవశ్రీ | 199, 244, 283. |
| మాళవిగౌళ | 58, 82, 102, 216, 220, 230, 261, 331, 418, 459, 489, 519. |
| ముఖారి | 25, 47, 67, 88, 104, 125, 132, 158, 232, 247, 310, 328, 354, 360, 367, 392, 407, 438, 448, 487. |
| మేఘరంజి | 505. |
| మేచబౌళి | 99, 133, 227, 248. |
| రామక్రియ | 37, 83, 95, 98, 114, 258, 271, 307, 339, 344, 364, 379, 413, 442, 495. 511, 518. |
| రాయగౌళ | 177. |
| రీతిగౌళ | 18, 44, 120, 269, 302, 508. |
| లలిత | 17, 34, 69, 81, 123, 139, 169, 225, 256, 338, 362, 423, 453, 456. |
| వరాళి | 92, 110, 255, 279, 356, 381, 401, 426, 483, 513, 523, 526. |
| వసంతవరాళి | 321. |
| వేళావళి | 374. |
| శంకరాభరణం | 15, 28, 30, 57, 66, 107 148 223, 246, 265, 300, 352, 377, 380, 402, 403, 428, 443, 468, 503. |
| శుద్ధదేశి | 219, 257, 305, 323, 397, 501. |

| రాగములు | | సంకీర్తన సంఖ్యలు |
|---|---|---|
| శుద్ధవసంతం | .... | 11, 19, 115, 119 174, 252, 289, 385, 460. |
| శ్రీరాగం | | 7, 20, 36, 65, 86. 106, 131, 157, 179, 209, 238, 254, 270, 318, 347, 434, 436, 455, 473, 486, 529, 539. |
| సామంతం | .... | 3, 5, 14, 23, 35, 40, 45, 71, 73, 116, 135, 142, 197, 250, 299, 308, 337, 346, 391, 419, 422, 425, 450, 475, 510, 516. |
| సామరాగం | | 214. |
| సామవరాళి | | 187, 330. |
| సావేరి | | 168, 325. |
| సాళంగం | .... | 4, 42, 52, 59, 64, 349, 390, 414. |
| సాళంగనాట | | 61, 76, 84, 85, 105, 137, 178, 217 221, 313, 351, 371, 463, 488, 527. |
| సింధురామక్రియ | .... | 193, 226, 268, 359, 458. |
| సౌరాష్ట్రం | | 39, 77, 134, 224, 445, 485 532. |
| శోకవరాళి | .... | 290, 536. |
| హిందోళం | | 326, 471. |
| హిందోళవసంతం | | 27, 60, 206, 243. |
| హిజ్జిజి | | 70, 118, 140, 342, 361, 429. |

★

## సంకీర్తనల అకారాది సూచిక


| సంకీర్తన మొదలు | రాగము | కీర్తన సంఖ్య. |
|---|---|---|
| అంగన నిన్నడిగి రమ్మనె .... | కురంజి .... | 461 |
| అంతే పో తనపొందు .... | సాళంగనాట .... | 217 |
| అందరికిఁ గల చాలే | బౌళి .... | 506 |
| అందరివంటిదాననా .... | శ్రీరాగం | 238 |
| అందుకు నే వద్దనేనా | సాళంగం | 59 |
| అందుకేమే మంచిమాట | మధ్యమావతి .... | 512 |
| అందుకే మొక్కేనేను .... | హిజ్జిజి | 118 |
| అందుకే విచారించే .... | సామరాగం | 214 |
| అందుకే వో చెలియా .... | ఛాయానాట .... | 152 |
| అగడేల సేసేవు | భైరవి .... | 514 |
| అటుగనకనేఁ దన్ను .... | సామంతం .... | 516 |
| అటుగాన పతియద .... | భైరవి .... | 317 |
| అటువంటి గుణాలదె .... | ధన్నాసి | 159 |
| అటువంటి వాఁడ .... | సామంతం .... | 35 |
| అట్టె తానెంతవాఁడైనా .... | ముఖారి .... | 354 |
| అడుగఁగ సిగ్గయ్యీ .... | నాదరామక్రియ | 150 |
| అడుగరే చెలులాల | సామంతం | 475 |
| అడుగరే మీరయిన | కన్నడగౌళ | 264 |
| అడుగరే యీసుద్ది | మనోహరం .... | 170 |
| అతడెక్కడ నున్నాఁడో | పాడి | 417 |
| అతని నిక్కడికే .... | సామంతం | 5 |
| అతివపాలిటే .... | తెలుఁగుఁ గాంబోది .... | 273 |
| అతివలూరకుండరే .... | దేవగాంధారి .... | 112 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| అది నీ పట్టపు | సామంతం | 419 |
| అన్నిటా నేరుపరి | మాళవిగౌళ | 261 |
| అన్నిటా సంతోసమె | బౌళిరామక్రియ | 322 |
| అన్నియుఁగనేఁగాక | దేసాళం | 46 |
| అప్పటి నన్ను నేనే | కుంతలవరాళి | 236 |
| అరయ నాపెపై నీకు | నారాయణి | 272 |
| అలిగితినంటానేల | భైరవి | 469 |
| అల్లంతనుండేమాట | వరాళి | 381 |
| అవధారు చిత్తగించు | సామంతం | 299 |
| అవునయ్య మంచివాఁడవు | ధన్నాసి | 398 |
| అవ్వలిమోమేలయ్యే | ఆహిరినాట | 208 |
| ఆఁటదిగూళయైతే | సామంతం | 422 |
| ఆఁటదై పుట్టినందు | కురంజి | 284 |
| ఆకెకు నీకుఁదెలుసు | రామక్రియ | 271 |
| ఆకెతోమారు వసంత | లలిత | 456 |
| ఆడవే వొకమాట | రామక్రియ | 413 |
| ఆతఁడు తానే మన్నించి | మంగళకౌశిక | 181 |
| ఆతఁడు మగఁడు నీకు | తెలుఁగుఁ గాంబోది | 474 |
| ఆతఁడెంత నేనెంత | కేదారగౌళ | 316 |
| ఆతఁడే ఎఱుఁగును | లలిత | 423 |
| ఆతనికన్నియు | వేళావళి | 274 |
| ఆతని చిత్తము మరి | మేఘరంజి | 505 |
| ఆతనితో నీమాటే | పాడి | 32 |
| ఆతని నడిగిరారె | మంగళకౌశిక | 231 |
| ఆతని నే నెఱుఁగుదు | సాళంగనాట | 105 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఆతనినే రమ్మనరే | ముఖారి | 125 |
| ఆనతీవయ్య | శంకరాభరణం | 352 |
| ఆనలునుఁ బెట్టుదుగా | పాడి | 528 |
| ఆనలు వెట్టకు నన్ను | సాళంగం | 64 |
| ఆనలేల పెట్టుకొనేవు | సామంతం | 3 |
| ఆపెతో నిన్నియు | హిందోళవసంతం | 60 |
| ఇంకనేలే నిష్ఠూరాలు | కాంబోది | 416 |
| ఇంత కాతరిదవౌట | కేదారగౌళ | 531 |
| ఇంతగుట్టు సేసుకొని | హిజ్జిజి | 361 |
| ఇంతినేల వుప్పతించేవు | కౌండమలహరి | 481 |
| ఇంతియేమి సేసీనంటా | తెలుఁగుఁగాంబోది | 183 |
| ఇంతివూడిగపువార | పాడి | 420 |
| ఇంతులు పొందైన | భైరవి | 204 |
| ఇందుకంటి నిప్పుడె | పాడి | 12 |
| ఇక్కడను వింతవారు | శ్రీరాగం | 539 |
| ఇటువంటివాఁడు తాను | శుద్ధదేశి | 219 |
| ఇదెవో నా గుణము | శంకరాభరణం | 265 |
| ఇద్దరు నొక్కటే | బౌళిరామక్రియ | 530 |
| ఇన్నిటాఁదా నాయ | సామంతం | 450 |
| ఇన్నియుఁ దెలియఁజెప్ప | ఆహిరి | 492 |
| ఎట్టివేసాలు సేయఁగ | మాళవిగౌళ | 331 |
| ఎన్నెన్ని గుణాలఇంతు | పాడి | 393 |
| ఏమిసేతు నీమీఁద | శ్రీరాగం | 7 |
| ఔఁగాదనవచ్చునా | సామంతం | 337 |
| ఔనయ్య మంచివాఁడ | లలిత | 362 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| ఔనే మంచివారే మీరు .... | మధ్యమావతి .... | 103 |
| ఔనో కాదో యీమాట .... | శ్రీరాగం .... | 131 |
| కంటి నీ గుణములిట్టే .... | కొండమలహరి | 96 |
| కంటి నీ వుపాయ .... | మాళవశ్రీ | 244 |
| కంటి మిట్టె నీ వొంపులు | శుద్ధవసంతం .... | 119 |
| కందువకు రావయ్య .... | పాడి .... | 537 |
| కందువ రేపల్లెలోనే | నాదరామక్రియ .... | 90 |
| కడుమొగమోటదాన | మంగళకౌశిక | 500 |
| కడుసిగ్గులుపడితే | లలిత .... | 453 |
| కన్నులఁ జూచితేనే | భైరవి .... | 462 |
| కన్నులపండుగలాయ | కేదారగౌళ .... | 396 |
| కన్నులు చల్లఁగానేము | సాళంగనాట | 313 |
| కన్నెపడుచవుగాన .... | మాళవిగౌళ | 459 |
| కన్నెముద్దరాలు .... | పూరిబి .... | 332 |
| కాంతపైనెపుడు .... | ముఖారి | 104 |
| కాంత పొరుగు పోరచి | సావేరి .... | 325 |
| కాంతలాలచూడరే .... | కాంభోది | 149 |
| కాచుకున్నారు .... | ముఖారి | 158 |
| కాదనేపాటిదాననా .... | సామంతం .... | 425 |
| కానీలే అందుకేమీ .... | శంకరాభరణం .... | 15 |
| కామినులకెపుడును .... | కన్నడగౌళ | 100 |
| కూడిమాడి పతివద్ద | కుంతలవరాళి .... | 476 |
| కొచ్చినేఁ బైకొనేనంటే | బౌళి | 297 |
| కొమ్మ నిన్నుఁ బొగడె | మాళవిగౌళ | 82 |
| కొమ్మసింగారము లివి .... | వరాళి .... | 513 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| కోరిక లీదేరె నింకా | పాడి | 329 |
| కోరోకోరో రారో | సాళంగనాట | 61 |
| గోవిందుఁడీ బాలుఁడు | సాళంగనాట | 137 |
| చంచలగుణము నాది | రామక్రియ | 37 |
| చక్కఁజూడరాదా ఇంతి | రామక్రియ | 344 |
| చాలుఁజాలు నీఁకను | గుండక్రియ | 16 |
| చిత్తగించవయ్య యీ | శంకరాభరణం | 380 |
| చిత్తము నొచ్చేవుసుమీ | బౌళి | 2 |
| చిత్తానఁ గలఁకుమీ | కేదారగౌళ | 491 |
| చుట్టరికేలుండఁగాను | భవుళి | 395 |
| చూచిచూచి సంతోసింతు | లలిత | 123 |
| చూచినవారెల్ల నన్నే | శుద్ధవసంతం | 19 |
| చూచినారు దయపుట్టి | ధన్నాసి | 78 |
| చూడ నీకెట్టున్నదో | కాంబోది | 320 |
| చూడరే ఓ చెలులాల | భైరవి | 432 |
| చూతమిఁకఁ దనలాగు | పాడి | 465 |
| చెప్పఁగఁ జాలర సిగ్గు | శంకరాభరణం | 57 |
| చెప్పఁ గొత్తలైవున్నవి | సాళంగం | 414 |
| చెప్పరాని మోహపు చెలివి | ఆహిరి | 172 |
| చెప్పరే మీరైనా బుద్ధి | ముఖారి | 438 |
| చెప్పరే యీతగవు | శంకరాభరణం | 66 |
| చెప్పవమ్మ నిన్నుఁజూచి | భైరవి | 389 |
| చెప్పవే నాకా సుద్ది | శ్రీరాగం | 434 |
| చెప్పిచూపరాదు తన | వరాళి | 255 |
| చెప్పితినేఁదొలుతనే | ఆహిరి | 375 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| చెప్పితిమిప్పుదే ఆకె | మాళవశ్రీ | .... 283 |
| చెప్పినట్టల్లా మరి | తోడి | .... 165 |
| చెప్పినట్టు సేసేఁగాక | .. మంగళకౌశిక | 433 |
| చెప్పినట్లానె సేసి | .... నారాయణి | .... 207 |
| చెప్పినంటా సేసేవుండి | .... ధన్నాసి | .... 163 |
| చెలికత్తెలునుఁదానుచేర | .... రామక్రియ | 495 |
| చెలియభావము | నాగగాంధారి | .... 286 |
| చెలియరో నీవేమిఁ | కన్నడగౌళ | .... 499 |
| చెలియరో నీవేల | హిందోళం | .... 326 |
| చెలియరో యీతఁడిన్ని | .... వరాళి | 92 |
| చెలుల కెల్ల నీవు సేసిన | గౌళ | .... 446 |
| చెలులమింతే నేము | పాడి | 345 |
| చెలులలో నేను | శంకరాభరణం | 107 |
| చెలులాల యిందుకే | మధ్యమావతి | 144 |
| చెలులాలయిఁక దన | మలహరి | .... 200 |
| చెలులాలయిఁక మీకు | ముఖారి | .... 407 |
| చెలులాల యిదెవో | .... భూపాళం | .... 111 |
| చెలులాల యీ కన్నెకు | .... హిందోళవసంతం | 243 |
| చెలులాల రమణుఁడు | .... గుండక్రియ | .... 138 |
| చెల్లునయ్యా నీవు సేసే | సింధురామక్రియ | .... 226 |
| చేముట్టఁజుమ్మీ | కేదారగౌళ | 43 |
| చేరినీవు చెప్పినట్లు | .... నారణి | .... 182 |
| చేరిపెనఁగఁగఁ బోతే | .... రీతిగౌళ | .... 269 |
| చేరి మమ్మఁజూచి | తెలుఁగుఁగాంబోది | 357 |
| చేరువజాణతనాలు | .... శ్రీరాగం | .... 529 |
| చేసిననేరమినీతో | .... సాళంగం | 42 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| తగవరినన్నిటా | సామంతం | 135 |
| తగిలిపాయుటకంటె | ఆహిరి | 440 |
| తగుఁదగు నీకూనీకు | శంకరాభరణం | 503 |
| తగులాయఁ బొందులు | నాదరామక్రియ | 288 |
| తడఁబడీ మీ సొమ్ములు | శ్రీరాగం | 436 |
| తడఁబడే నామది | కురంజి | 370 |
| తనకు నాకును జంట | సాళంగం | 349 |
| తనకై తే నవ్వులు | దేసాక్షి | 251 |
| తనచిత్తము వచ్చితే | సావేరి | 168 |
| తనచిత్త మెట్టుండునో | దేసాక్షి | 164 |
| తనచిత్తమే యెఱుఁగు | ధన్నాసి | 262 |
| తనమేలే నామేలు | నాదరామక్రియ | 378 |
| తనివిలేదు నాకై తే | కేదారగౌళ | 198 |
| తన్నుఁబాసి నే నెట్లా | భైరవి | 233 |
| తరితీపులివి వినఁ | ఆహిరి | 477 |
| తలవాతిపనులెల్ల | మనోహరి | 333 |
| తలపించ కిఁక నది | దేసాళం | 8 |
| తలపోఁతలనే నాకు | ధవళ | 340 |
| తలపోఁతలే గనము | నాదరామక్రియ | 336 |
| తలపోసి తలపోసి | ఆహిరి | 155 |
| తానాకుఁ జేసినమేలు | రామక్రియ | 114 |
| తానాడిన సరసము | గంభీరనాట | 457 |
| తానెంత నేనెంత | లలిత | 225 |
| తానే నాకు రమణుఁడు | సాళంగనాట | 488 |
| తానేలవసివాడీ | భైరవి | 353 |
| తానేవచ్చీగాని | శంకరాభరణం | 148 |

| సంకీర్తనలు మొదలు | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| తామే యెఱుఁగుదురు | | రీతిగౌళ | | 120 |
| తామసించఁ బనిలేదు | .... | బలహంస | .... | 210 |
| తీపులోఁగారము | | శ్రీరాగం | .... | 455 |
| తెలుసుకొమ్మనవే | ... | నాగవరాళి | | 215 |
| దగ్గరి నీ వున్నప్పుడే | .... | రీతిగౌళ | ... | 44 |
| దవ్వుల కాఁకలనేల | ... | నాగవరాళి | ... | 502 |
| దేవకామినులాడరో | ... | సాళంగం | ... | 4 |
| ననుపులేని చనవు | ... | భవుళి | | 50 |
| నన్నుఁజూచి కాతరాన | ... | ఆహిరి | | 479 |
| నన్ను మన్నించుమనవే | ... | నాట | ... | 234 |
| నన్ను మన్నించె నాతఁడు | .... | తెలుఁగుఁ గాంబోది | ... | 312 |
| నాకుఁ జెప్పకోరాదు | ... | భూపాళం | ... | 194 |
| నాకు మీనేరుపు | | ఆహిరి | ... | 415 |
| నాకు మొకమోడి యాకె | .... | గౌళ | | 373 |
| నానావిధాల తనునే | | మాళవశ్రీ | .... | 199 |
| నాపై బత్తిగలవంటా | | శుద్ధదేశి | ... | 397 |
| నా భాగ్యమిది యని | | మధ్యమావతి | ... | 235 |
| నా రమణుఁని జూడరే | | కేదారగౌళ | ... | 143 |
| నాలోని వేడుకలు | ... | భైరవి | .... | 141 |
| నావంక గడమలేదు | .... | దేవగాంధారి | | 409 |
| నిన్నుఁజూచి చెలులకు | ... | మంగళకౌశిక | .... | 136 |
| నీకంటె నాపె మేలు | .... | బౌళి | | 6 |
| నీకు నింపైనవారినే | ... | ఆరభి | .... | 303 |
| నీకును నివియే నేరుపులు | .... | సామంతం | | 71 |
| నీకెప్పుడు చూచినాను | | మధ్యమావతి | .... | 154 |
| నీ కొకరైన నేరమి | ... | కన్నడగౌళ | .... | 222 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| నీ చిత్తము కొలఁది | శ్రీరాగం | 36 |
| నీ చిత్తము వచ్చితిని .... | దేసాళం .... | 282 |
| నీ చిత్త మెట్టుండినా .... | శ్రీరాగం | 20 |
| నీ చిత్త మెట్టున్నదో నేనెఱుఁగ | కేదారగౌళ | 260 |
| నీ చిత్త మెట్టున్నదో నేమేమీ | ధన్నాసి | 350 |
| నీ తలఁపెట్టున్నదో .... | నాదరామక్రియ .... | 405 |
| నీ దిక్కే తప్పకచూచీ | బౌళి | 153 |
| నీ దేవుల గుణము నీవే | భవుళి | 441 |
| నీ మనసెట్టుదెలుసు .... | సాళంగనాట | 85 |
| నీ మహిమవల్లనే | ఆహిరి .... | 117 |
| నీయంత నీ వెఱుఁగవు .... | శుద్ధవసంతం | 11 |
| నీ యిచ్చమెలఁగేనంటా ... | శుద్ధదేశి ... | 257 |
| నీ యిచ్చరాజవు ... | నాదరామక్రియ ... | 368 |
| నీరువట్టుగొన్నచోట ... | పాడి ... | 242 |
| నీరుకొలఁది తామెర ... | నాదరామక్రియ ... | 228 |
| నీ వంటివారమే కామా ... | సౌరాష్ట్రం ... | 532 |
| నీవిఁకఁ దప్పించుకొంటే ... | దేసాక్షి ... | 498 |
| నీవెంత సేసినాను ... | పాడి ... | 48 |
| నీవెట్టు సేసినాఁజేయి ... | ధన్నాసి ... | 195 |
| నీవెట్టుసేసినా నీ కీరితే ... | మలహరి ... | 128 |
| నీ వెఱుఁగని పనులు నేము ... | దేసాక్షి ... | 524 |
| నీవేపాటి మన్నించినా .... | నట్టనారాయణి | 315 |
| నీవేమిసేతువయ్య | సాళంగం | 52 |
| నీవేమి సేతువు నన్ను .... | సింధురామక్రియ .... | 193 |
| నీసుద్దులెల్లా .... | ఆహిరి .... | 449 |
| నెఱజాణలైనవారి | హిందోళవసంతం .... | 206 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| నెఱజాణ విభుఁడవు .... | హిజ్జిజి | 140 |
| నెలఁతకు నే పొద్దూ | శంకరాభరణం | 428 |
| నెలఁత నిన్నుఁ జూచితే | భైరవి .... | 424 |
| నెలఁతసొబగు లివి | శ్రీరాగం .... | 473 |
| నేఁడన్నిటా జాణఁడవై | దేసాక్షి | 447 |
| నేననఁగా నెంతదాన | సౌరాష్ట్రం | 224 |
| నేనీకు వేరుగాను | దేసాళం | 253 |
| నే నున్నదాన నని .... | దేసాక్షి | 54 |
| నే నెంత తమకించినా | నాదరామక్రియ .... | 259 |
| నే నెంత దానను నీవె | సామంతం | 73 |
| నేనే నీవై వుండఁగాను .... | సాళంగనాట | 351 |
| నేనే ప్రియము చెప్పి | హిజ్జిజి | 70 |
| నేనే భాగ్యమంతురాల | శ్రీరాగం .... | 318 |
| నేనేమని విన్నవించే | ధన్నాసి | 89 |
| నేనేమనే నీతో | సామంతం .... | 510 |
| నేర మెన్నఁడునులేదు .... | మంగళకౌశిక | 97 |
| నేరుతువే యిటువంటి | మనోహరి | 522 |
| పంతము లాఁడ జెల్లదు .... | సామంతం .... | 250 |
| పచ్చి చిగురువంటిది | వరాళి .... | 356 |
| పట్టపుదేవులవు | భైరవి | 437 |
| పడఁతిభారమునీదే .... | పాడి | 93 |
| పడఁతుల జాడలివి .... | నాదరామక్రియ .... | 521 |
| పతికి విన్నవించరే .... | నారణి | 146 |
| పతిమీఁద నింతయేల | తెలుఁగుఁగాంబోది | 493 |
| పతివద్ద నెటువలెఁ బండీ .... | కాంబోది .... | 355 |
| పదివేలు మొక్కులు .... | బౌళి | 74 |

| సంకీర్తనలు మొదలు | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| పరమపురుషుడు | .... | లలిత | | 17 |
| పిన్నదానవైతే నేమి | | ముఖారి | | 392 |
| ప్రియము తోడుత నిన్ను | | నీలాంబరి | .... | 406 |
| పురాణపురుషుఁడు | | ప్రతాపనాట | .... | 383 |
| పెక్కుసతులఁ బెండ్లాడి | .... | రామక్రియ | .... | 518 |
| పేరటాండ్లు సోబాన | .... | లలిత | | 81 |
| పొంచి నీ వే లాతనికి | .... | అమరసింధు | | 327 |
| పొందైన నీవలపులు | .... | కాంబోది | .... | 466 |
| పోఁకవెట్టి నప్పుడే | .... | దేసాళం | .... | 472 |
| బడలి వున్నది మోము | | దేవగాంధారి | | 51 |
| బతుకు మనవే యింకా | .... | భవుళి | | 24 |
| బలుములు చూపఁగఁబని | | శంకరాభరణం | | 28 |
| మగఁడు తన్నొల్లకుంటే | .... | ముఖారి | .... | 328 |
| మగనాండ్లము మమ్మ | .... | ప్రతాపనాట | .... | 540 |
| మట్టుతోనుండుటే మేలు | | శంకరాభరణం | .... | 443 |
| మనసుపట్టఁగరాదు | | సాళంగనాట | .... | 463 |
| మనసులోఁ దనమేలు | | దేసాక్షి | | 127 |
| మనసూ నిలుపరాదు | .... | నాదరామక్రియ | .... | 478 |
| మరిగిమూసిదాఁచ | | పిసాళం | | 55 |
| మరుఁడు సేసిన మాయ | .... | కుంతలవరాళి | .... | 162 |
| మఱచివుండఁగరాదు | .... | ఆహిరి | .... | 341 |
| మఱచితేనే మాయ | .... | సామంతం | | 197 |
| మఱవకు నీగుణము | .... | సౌరాష్ట్రం | .... | 485 |
| మఱవకువయ్యి నీవు | ... | నాగవరాళి | ... | 10 |
| మఱి యేల దాఁచేవూ | ... | లలిత | ... | 69 |
| మాకుఁ దెలియవు మీ | ... | సింధురామక్రియ | ... | 359 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| మాకేమి చూపేవు | ముఖారి | 487 |
| మానలేను నీ పొందు | కన్నడగౌళ | 363 |
| మా మాట నమ్మదు నీ | శుద్ధదేశి | 305 |
| మా మాట వినఁగదవే | రామక్రియ | 442 |
| మా మాట వినవే మగువా | మనోహరి | 538 |
| మిక్కిలి జాణవౌదువు | ముఖారి | 88 |
| మిక్కిలి తా నధికుఁడు | మాళవిగౌళ | 230 |
| మీకెంత వేడుకలైన | దేసాళం | 387 |
| ముక్కుమీఁది వేలితోడ | లలిత | 338 |
| మున్నే పులుకడిగిన | పాడి | 525 |
| మూసిన ముత్యమువలె | గౌళ | 9 |
| మూసీ మంతనమువద్దా | దేసాళం | 400 |
| మేలయ్య మన్నించితివి | రామక్రియ | 83 |
| మేలు మేలు యిందుకిట్టే | పాడి | 470 |
| మేలు మేలు యిదేబుద్ధి | పళవంజరం | 184 |
| మేలెఱఁగి జవరాలి | నారాయణి | 410 |
| మేలే నీ నేరుపులు | నీలాంబరం | 176 |
| మేలే పతి నిన్నిటా | మేఁచబౌళి | 99 |
| మొక్కరో పరుషలు | శంకరాభరణం | 402 |
| మొక్కితినని చెప్పరే | గుండక్రియ | 33 |
| మొగములు చూడక | శోకవరాళి | 536 |
| మొగమోటలేక ఎంత | భవుళి | 421 |
| మోదలనేఁటికే | శ్రీరాగం | 65 |
| యింక నేఁటి నేరములు | బళహంస | 175 |
| యింకనేల మా విన్నపాలు | దేసాళం | 41 |
| యింకనేలే వెఱపు | నాదరామక్రియ | 311 |

| సంకీర్తనల మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| యింకనైన రావే యిదే .... | సింధురామక్రియ .... | 268 |
| యింకాఁ జిన్నకూఁతురా | దేసాళం | 53 |
| యింకా నేల పరాకులు | పూర్వగౌళ | 298 |
| యింటికి విచ్చేయవయ్య | మధ్యమావతి | 31 |
| యింతకంటె సుద్దులు | కోకిలపంచమం | 188 |
| యింతకంటే నేమి .... | దేసాళం | 156 |
| యింతచాలదా తనకు .... | శంకరాభరణం .... | 468 |
| యింత నీ వుపకారము | శుద్ధవసంతం | 115 |
| యింతవలపించు | కన్నడగౌళ | 94 |
| యింతితో నలుగకు | సామంతం .... | 346 |
| యింతి నీ చుట్టరికము .... | వరాళి | 523 |
| యింతులు నోఁచిననోమో .... | మధ్యమావతి .... | 180 |
| యింతేసి కోపను నేను | దేసాళం | 334 |
| యిందరముఁ జెప్పఁగాను | కేదారగౌళ .... | 452 |
| యిందరికిఁ గలుగునా .... | భూపాళం | 145 |
| యిందరిలోనా నిన్ను | కాంబోది .... | 517 |
| యిందుకంటె నున్నదదె .... | రామక్రియ | 511 |
| యిందుకు నవ్వకుమీ .... | ధవళి .... | 464 |
| యిందుకు నీ చిత్తము .... | నాదరామక్రియ .... | 218 |
| యిందుముఖిఁ గరుణించు .... | భైరవి | 72 |
| యిట్టి భాగ్యముగంటిమి .... | సాళంగనాట .... | 76 |
| యిట్టి సింగారము .... | మాళవిగౌళ .... | 216 |
| యిట్టుండవలదా యెన్ని | కాంబోది .... | 91 |
| యితర సతుల మరి | ప్రతాపనాట | 196 |
| యిది నాకుఁ బదివేలు | భైరవి .... | 108 |
| యిది యేమయ్యా నీవు | శుద్ధదేశి .... | 323 |

| సంకీర్తనలు మొదలు | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| యిదివో కామినిభావ | .... | శోకవరాళి | .... | 290 |
| యిదివో నావలపే | .... | ఆందోళి | .... | 229 |
| యిదివో నీ కతాననే | .... | గౌళ | .... | 285 |
| యిదివో నీ తోడి పొందు | .... | ముఖారి | .... | 132 |
| యిదివో మా విన్నపము | .... | హిజ్జిజి | | 429 |
| యిదెవోనా నోముఫల | .... | శ్రీరాగం | .... | 270 |
| యిద్దరిభావాలు | .... | శంకరాభరణం | .... | 300 |
| యిద్దరి మేలూగంటి | .... | మేఁచబౌళి | | 227 |
| యిద్దరూ నిద్దరే | ... | సాళంగనాట | | 221 |
| యిన్నాళ్ళు నెఱుఁగమైతి | | కుంతలవరాళి | | 301 |
| యిన్నిటా మన్నించితివి | .... | మధ్యమావతి | .... | 79 |
| యిన్ని నేరుపుల యాకె | .... | సాళంగనాట | | 178 |
| యిన్ని విన్నపములు | | సౌరాష్ట్రం | | 134 |
| యిప్పుడువచ్చితివి | .... | భైరవి | | 281 |
| యిప్పుడే నేనే మన్న | | పాడి | | 62 |
| యిప్పుడే విచ్చేసితివిఁక | .... | సామంతం | | 40 |
| యిప్పుడొక్కటైతిరా | .... | మాళవిగౌళ | .... | 519 |
| యిరుమొనసూదియాయ | .... | లలిత | .... | 256 |
| యివిగో మావిన్నపములు | .... | సింధురామక్రియ | .... | 458 |
| యివియే సుద్దులు | .... | ఆహిరి | | 435 |
| యీకె విలాసముచూచి | .... | కన్నడగౌళ | .... | 404 |
| యీడగుఁ బెడ్లి యిద్దరి | | గుండక్రియ | .... | 38 |
| యీతఁడు దయగలఁడు | | సౌరాష్ట్రం | | 77 |
| యీపాటికి పాటియేరా | .... | భవుళి | | 26 |
| యీ రమణి చెలువము | | నాదరామక్రియ | .... | 444 |
| యీ సతికి నీకే తగు | .... | అమరసింధు | .... | 205 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| యెంచకు నా నేరమి | మేఁచభవుళి | 133 |
| యెంచుకొంటే నిన్ను నన్ను | పాడి | 291 |
| యెంత ఆసోదమో | సామంతం | 116 |
| యెంతకాతరపుదని | గౌళ | 75 |
| యెంత కుచ్చితురాలంటా | ముఖారి | 448 |
| యెంత గట్టువాయ యిది | దేసాక్షి | 431 |
| యెంత చెల్లుబడోకాని | గౌళ | 408 |
| యెంతటినేరుపరివి | పూర్వగౌళ | 167 |
| యెంతజాణతనము | గుజ్జరి | 124 |
| యెంత జాణరోయీ | సామంతం | 45 |
| యెంత తమకెనని | రామక్రియ | 95 |
| యెంతని కొనియాడే | మంగళకౌశిక | 240 |
| యెంతని చెప్పఁగవచ్చు | పాడి | 439 |
| యెంతని చెప్పే నేను | కుంతలవరాళి | 287 |
| యెంత నే నెఱుఁగకున్నా | శ్రీరాగం | 179 |
| యెంతపనిగలదో | పూర్వగౌళ | 482 |
| యెంతభాగ్యవంతుఁడ | నీలాంబరం | 126 |
| యెంత మన్నించేవు | నాగగాంధారి | 212 |
| యెంత లేదు నాయా | ఆహిరి | 520 |
| యెంత వొడఁ బరచీని | వసంతవరాళి | 321 |
| యెంతైన నేను నీ | గుండక్రియ | 29 |
| యెంతైనాఁ దనివోవ | బలహంస | 173 |
| యెంతైనా నా వోజ | బౌళి | 49 |
| యెందరిఁదాఁ బెండ్లాడి | శంకరాభరణం | 246 |
| యెందాకా మొగమోటమి | దేవగాంధారి | 496 |
| యెందాకా సిగ్గువడే | రాయగౌళ | 177 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| యెందుకైన వత్తువు | మాళవిగౌళ | 58 |
| యెందూఁ దప్పించుకో | కాంబోది | 263 |
| యెందువోయీ నీ | రామక్రియ | 364 |
| యెక్కడ దిష్టి దాఁకునో | బలహంస | 507 |
| యెక్కడనైనాఁజేయి | ధన్నాసి | 1 |
| యెక్కడ పరాకు నీకు నిందు | రామక్రియ | 379 |
| యెక్కడ పరాకు నీకు నెందు | దేవగాంధారి | 275 |
| యెక్కడ వొయ్యేము | మంగళకౌశిక | 56 |
| యెక్కడి కెక్కడ వలపె | రామక్రియ | 307 |
| యెక్కడే తా నెఱుఁగవు | మాళవిగౌళ | 418 |
| యెగ్గుపట్టేవు సుమ్మీ | భైరవి | 276 |
| యెగ్గో తప్పో యెఱుఁగ | గుమ్మకాంబోది | 335 |
| యెచ్చరిక దేవ నీకు | రామక్రియ | 98 |
| యెటువంటి యాగడీఁడే | బౌళి | 384 |
| యెటువంటి వేడుకలో | బలహంస | 369 |
| యెటువలెఁ జేసినాను | నాగవరాళి | 535 |
| యెట్టుండినా నీవే | శంకరాభరణం | 30 |
| యెట్టున్నదో నా భాగ్య | తెలుఁగుఁగాంబోది | 391 |
| యెట్టు మఱవఁగవచ్చు | భూపాళం | 304 |
| యెట్టునేసినాఁ జేయనీ ఇఁక | బౌళి | 267 |
| యెట్టునేసినాఁ జేయనీ యింక | ఆహిరి | 249 |
| యెట్టునేసినాఁ జేయి | కన్నడగౌళ | 190 |
| యెట్టైనా నాయఁగాగ | భైరవి | 129 |
| యెడమాటల పనులిఁక | శంకరాభరణం | 403 |
| యెడమాటలాడించే | ద్రావిడభైరవి | 245 |
| యెడమాటలిఁక నేల | కన్నడబంగాళం | 411 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| యెదమాటలెందాఁక .... | సామవరాళి .... | 330 |
| యెన్ని నేరుచుకొన్నాఁడే .... | లలిత .... | 139 |
| యెప్పుడూ నన్నింతటాను | కేదారగౌళ .... | 294 |
| యెప్పుడోఁ దనకు నాకు .... | ముఖారి .... | 232 |
| యెరవులే కిద్దరమూ | మేఁచబౌళి .... | 248 |
| యెరవు సేసుక .... | సామంతం | 23 |
| యెఱపరికము లేల | సౌరాష్ట్రం .... | 39 |
| యెఱిఁగించరే పతికి .... | దేవగాంధారి | 109 |
| యెఱుఁగ కడిగితేను .... | రామక్రియ .... | 339 |
| యెఱుఁగడా తానేమైనా | భూపాళం .... | 277 |
| యెఱుఁగనా తనసుద్దు | పాడి | 68 |
| యెఱుఁగనా నేనేమైనా .... | భైరవి .... | 319 |
| యెఱుఁగమి సేసుకొన | ముఖారి .... | 310 |
| యెఱుఁగునో యెఱ .... | పూరిభి .... | 185 |
| యెఱుక సేసుకొందురా .... | సాళంగనాట .... | 371 |
| యెవ్వరికిఁ గలుగునేఁడీ | దేసాక్షి .... | 151 |
| యెవ్వరిఁబోలుదునేనీ .... | దేసాక్షి | 87 |
| యెవ్వరివాఁడ వౌతా .... | కొండమలహరి .... | 203 |
| యెవ్వరు నిన్నొద్దనేరు .... | ద్రావిడభైరవి .... | 484 |
| యెవ్వరు ముంచినా వారే | రీతిగౌళ | 508 |
| యెవ్వరే నీకు సరి .... | సామంతం .... | 142 |
| యేఁటికయ్యా నీవు .... | నారాయణి .... | 278 |
| యేఁటికి దాచేవో .... | నాదరామక్రియ | 490 |
| యేఁటికి దూరేవిటు .... | ఆహిరి | 376 |
| యేదకేద నాగుణ | ద్రావిడభైరవి .... | 191 |
| యేది నీ జాణతన .... | ముఖారి .... | 47 |

| సంకీర్తనలు మొదలు | | రాగము | | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|---|---|
| యేమని చెప్పుదునే | | గంభీరనాట | .... | 213 |
| యేమని పొగడవచ్చు | .... | మాళవిగౌళ | .... | 102 |
| యేమని పొగడుదునే | .... | ఆహిరి | .... | 296 |
| యేమని విన్నవించె నీ | | భైరవి | | 13 |
| యేమని విన్నవించేను | | సామంతం | | 308 |
| యేమని విన్నవించేనే | .... | గుజ్జరి | .... | 274 |
| యేమని విన్నవించేము | .... | శ్రీరాగం | | 486 |
| యేమనున్నదో నీచిత్త | | కాంబోది | | 21 |
| యేమయ్య ప్రియము | | ఆహిరి | | 467 |
| యేమయ్యా ఆపెమీఁద | .... | ఆరభి | | 186 |
| యేమయ్యా నా మనసు | | ఆహిరి | | 201 |
| యేమయ్యా నీకు నాకు | .... | గంభీరనాట | .... | 292 |
| యేమయ్యా నీ సుద్దు | .... | అమరసింధు | | 454 |
| యేమయ్యా యేనుగ | .... | పాడి | .... | 122 |
| యేమయ్యా వట్టి కత | .... | మధ్యమావతి | .... | 386 |
| యేమాయనిందుకు | | శుద్ధవసంతం | .... | 460 |
| యేమిగొసరేమయ్యా | .... | కుంతలవరాళి | .... | 202 |
| యేమి చెప్పేమయ్యా | .... | కాంబోది | | 280 |
| యేమి చెప్పేరే బుద్ధులు | .... | సౌరాష్ట్రం | .... | 445 |
| యేమిటికే చెలులాల | .... | అమరసింధు | | 412 |
| యేమి విన్నపము సేసే | | నాగవరాళి | | 166 |
| యేమిసేతు నమ్మలాల | .... | శంకరాభరణం | .... | 223 |
| యేమిసేతు నా తమక | .... | అమరసింధు | | 293 |
| యేమీ వూరకుండే | | ముఖారి | .... | 247 |
| యేమే మీ నేరుపెల్ల | | ముఖారి | | 25 |
| యేమైనా నిన్ననేనా | .... | దేసాళం | | 121 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| యేల తప్పించుకొనేవు .... | ఆహిరి | 80 |
| యేల నన్నుఁ బొగడీని .... | శ్రీరాగం .... | 254 |
| యేల నీవు వెరచేవు | సామంతం | 14 |
| యేల పెంచేవు చెలము .... | కన్నడగౌళ .... | 534 |
| యేల బయలీఁడించేరే | వరాళి .... | 426 |
| యేల బూటకాలు సేసీ | ముఖారి | 367 |
| యేలమమ్ముఁరట్టు .... | నట్టనారాయణి | 399 |
| యేల మమ్ము రేఁచేవు .... | రీతిగౌళ .... | 302 |
| యేల మమ్ము వేఁడు .... | దేవగాంధారి .... | 211 |
| యేల మాతో నీడు | ఆందోళి .... | 388 |
| యేల మూసీ మంతనాలు .... | ఆహిరి .... | 382 |
| యేల రట్టు సేసుకొనే .... | ముఖారి | 67 |
| యేల వొట్టు వెట్టేవు | నాదరామక్రియ .... | 366 |
| యేల సారె గరిసించేవు | ఛాయానాట .... | 451 |
| యేలినవాఁడు తాను .... | పాడి .... | 113 |
| యేలే నాకు వేగిరము | హిందోళవసంతం | 27 |
| యేలే పొగిలేవే | ఆహిరి .... | 130 |
| రంటికి నొక్కచేమాట .... | గౌళ | 63 |
| రతిరాజ గురుఁడవు .... | శ్రీరాగం | 106 |
| రతిరాజ జనకవో | నాదరామక్రియ | 101 |
| రమ్మనవే వద్దనేనా | కొండమలహరి .... | 515 |
| రమ్మనవే యిఁకనేల | ఛాయానాట .... | 504 |
| రావేవో చెలియా .... | గుజ్జరి | 306 |
| రావయ్యా నా వద్దకి | హిజ్జిజి .... | 342 |
| రావయ్యా మన వలపు | కేదారగౌళ .... | 343 |
| వట్టి గజరుల నెంత ... | గంభీరనాట .... | 497 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
|---|---|---|
| వట్టి పరాకు సేయఁగ .... | పాడి .... | 266 |
| వనితలకుఁ బతికి .... | బలహంస | 295 |
| వనితలు నీకే వలచు .... | శ్రీరాగం .... | 86 |
| వరుసతో రమణుని | శుద్ధవసంతం .... | 174 |
| వలచితినంటా నాడి .... | శుద్ధదేశి .... | 501 |
| వలచిన యంగనల .... | గంభీరనాట .... | 239 |
| వలపుపై కొసరైతే | పాడి | 480 |
| వలపుల సొలపుల ... | శుద్ధవసంతం ... | 385 |
| వలపెల్లా రాసివడే ... | భైరవి ... | 324 |
| వలపొకచోటనుండ ... | వరాళి ... | 401 |
| వలసినప్పుడు నీవే ... | హిందోళం ... | 471 |
| వారిఁజూచె దానివలపే ... | శంకరాభరణం ... | 377 |
| వాసితోనుండుచే మేలు ... | సామంతం ... | 391 |
| వింటిమి ఇవిఁగొన్ని ... | నాట ... | 509 |
| విచారించవద్దు మరి ... | పళవంజరం ... | 241 |
| వినఁగలవే మా విన్న ... | తెలుఁగుఁగాంబోది ... | 533 |
| వినవేడుకయ్యీ నాకు | భైరవి ... | 171 |
| వినే మానతీయవయ్యే | మాళవిగౌళ .... | 489 |
| విన్నవించరే యీ మాట | వరాళి .... | 279 |
| విన్నవించి రమ్మనెను .... | నాగవరాళి .... | 427 |
| విభుఁడు వద్ద నున్నాఁడు .... | లలిత | 169 |
| విరహముమీఁదనే .... | శ్రీరాగం | 347 |
| విరహమేడదే నాకు .... | శ్రీరాగం | 157 |
| విరహాన నుండినాను | తెలుఁగుఁగాంబోది .... | 192 |
| విసిగేవుసుమ్మీ నీవు | లలిత | 34 |
| వుత్తమనాయకుఁడవు .... | బంగాళం .... | 189 |

| సంకీర్తనలు మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య. |
| --- | --- | --- |
| వుప్పతిల్లి జవ్వనము | శ్రీరాగం | 209 |
| వూరకుండ నేఁటికే | .... ముఖారి | 360 |
| వూరకున్నదానినేల | .... పాడి | 494 |
| వూరకే దక్కుఁదువా | శుద్ధవసంతం | .... 289 |
| వూరకే దక్కుఁనటవే | .... శుద్ధవసంతం | 252 |
| వెఱవకువయ్యా నిన్ను | రీతిగౌళ | 18 |
| వెలలేని గొల్లెతలె | సామవరాళి | 187 |
| వెలలేని వలపుల | .... వరాళి | .... 526 |
| వేఁడుకోఁగాఁ దనమాట | .... పాడి | .... 358 |
| వేగినంతా నిన్ను నేల | .... ఆహిరి | 22 |
| వేగిరించకురే వో | .... పాడి | 237 |
| వేగిరించి యాతనికి | ఆహిరి | .... 348 |
| వేడుకగలవారికి | .... సాళంగం | 390 |
| వేడుకతోనుండుఁగాని | .... వరాళి | .... 110 |
| వేవేలకు నే నిన్ను | రామక్రియ | .... 258 |
| వేవేలు సతులుగల | నాగవరాళి | 365 |
| వేసరించేదానఁగాను | .... గౌళ | 147 |
| వాక్కుఁగరిడీలోనే | ప్రతాపనాట | ... 314 |
| వాడిఁబెట్టుకొనరాదా | వరాళి | 483 |
| వోజ తప్పకుండావలె | .... నట్టనారాయణి | 161 |
| శిరసెత్తిచూడవయ్యా | .... నారాయణి | .... 430 |
| సంతోసాన నుండరో | .... సాళంగనాట | 84 |
| సందుసుడి వనితవు | కురంజి | 160 |
| సతిచేఁతలకు నన్ను | పాడి | .... 372 |
| సముఖా అవధారు | .... సాళంగనాట | .... 527 |
| సెలవి నవ్వులతోడ | కన్నడగౌళ | 309 |
| సేయఁగల చేఁతలు | మాళవిగౌళ | 220 |


తిరుమల తిరుపతి దేవస్థానము ముద్రణాలయము, తిరుపతి. పు. 300 — 24–2–64.